# క్రాంతి

సి.పి.ఐ (మావోయిస్టు) ఎ.పి, ఎస్.టి, ఎ.ఒ.బి కమిటీల అధికార పత్రిక

సంపుటి : 32    సంచిక : 3    మే - జూన్ 2008    వెల: ఐదు రూపాయలు


లోపలి పేజీల్లో...


అటవీ హక్కుల చట్టం....8
ఝార్ఖండ్ మహిళా ప్రతిఘటన....12
అధిక ధరలు, ద్రవ్యోల్బణం....14
ఒ.బి.సి. రిజర్వేషన్లు....18
పోరాటాలు-ప్రతిఘటన....23
నేపాల్ పరిణామాలపై....మధ్య పేజీ
అమరుల జీవిత చరిత్రలు....37
టిబెట్ సమస్యపై....52
టి.ఆర్.ఎస్. ఓటమి....53


# భారత విప్లవోద్యమంలో ఆరిపోని స్ఫూర్తి దీపిక

# కామ్రేడ్ అనురాధా గాంధీ

భారత విప్లవోద్యమంలో, ప్రత్యేకించి భారత విప్లవ మహిళా ఉద్యమంలో ఏప్రిల్ 12, 2008 అనేది ఒకానొక దుఃఖదాయకమైన రోజు. యావత్ విప్లవోద్యమం గర్వించతగిన నాయకురాలైన కామ్రేడ్ అనురాధా గాంధీ (జానకి, నర్మద, వర్ష, రమ) అమరత్వం చెందిన రోజది. అమరత్వం చెందేనాటికి మావోయిస్టు పార్టీ అత్యున్నత కమిటీ అయిన కేంద్ర కమిటీలో ఆమె సభ్యురాలిగా వుండడమనేది యావత్ ఉద్యమానికి గౌరవప్రదమైన, స్ఫూర్తిదాయకమైన, గర్వకారణమైన విషయం. ఉద్యమమే వూపిరిగా జీవించి అందులో భాగంగానే ప్రాణాంతకమైన సెరిబ్రల్ మలేరియా బారిన పడి కనుమూసిన ఈ గొప్ప నాయకురాలికి యావత్ పార్టీ, పి.ఎల్.జి.ఎ., ప్రజాసంఘాల సభ్యులూ, విప్లవ ప్రజలందరూ వినమ్రంగా జోహార్లర్పిస్తున్నారు. ఆమె ఆశయాన్ని తుదకంటా కొనసాగిస్తామని ప్రతిన బూనుతున్నారు.



కామ్రేడ్ అనురాధ గురించి చెప్పుకోవడమంటే, చరిత్ర పుటలను తిరిగేయడం. ఆమె గురించి తెలుచుకోవడమంటే, వుద్యమ పరిమళపు గుభాలింపును ఆస్వాదించడం. ఆమె గురించి తెల్సుకోవడమంటే, విజ్ఞానపు గనిని అలుపెరగకుండా తవ్వుకోవడం. ఆమెను అర్థం చేసుకోవడమంటే జీవితానికి నిజమైన నిర్వచనాన్ని తెల్సుకోవడం. ఆమె స్ఫూర్తిని ఎత్తిపట్టడమంటే హిమ శిఖరాలమీద ఎర్రజెండాను ఆవిష్కరించడం.

## ప్రగతిశీల కుటుంబ నేపథ్యం

ఉద్యమంతో పెనవేసుకొని తన జీవితాన్ని అర్థవంతం చేసుకున్న కామ్రేడ్ అనురాధ 1954, మార్చి 28న ముంబయ్‌లో పుట్టింది. ఆమె తల్లి క్రియాశీలక సామాజిక కార్యకర్త కాగా తండ్రి ముంబయ్ హైకోర్ట్‌లో పేరుమోసిన న్యాయవాది. వాళ్లిద్దరూ ఒకప్పుడు సి.పి.ఐ.లో పని చేశారు. కామ్రేడ్ అనురాధకు ఒక తమ్ముడున్నాడు. కుటుంబానికి వున్న సామాజిక, రాజకీయ నేపథ్యం వల్ల ఆమె హేతుబద్ధ ప్రగతిశీల, స్వేచ్ఛాయుత భావనల మధ్య పెరిగింది.

తమ ఇంటికి దగ్గరలో వున్న జె.బి.పెటీ స్కూల్లో ఆమె చదువుకుంది. మొదటి నుండీ చదువులో చురుగ్గా రాణించింది.

చదువుకే పరిమితం కాకుండా పాఠశాలలో జరిగే అనేక సాంస్కృతిక కార్యకలాపాల్లో ఆమె చురుగ్గా పాల్గొనేది. ఆమెకిష్టమైన హిందూస్తానీ శాస్త్రీయ నృత్యాన్ని కూడా నేర్చుకుంది.

## విద్యార్థి ఉద్యమ కెరటం

1971లో కామ్రేడ్ అనురాధ ఎలిఫిన్‌స్టన్ కాలేజీలో చేరింది. ఆ సమయంలోనే ఆమెకు విప్లవ రాజకీయాలు పరిచయమయ్యాయి. మొదటి నుండీ సామాజిక స్పృహ కల్గివున్న ఈమె, ఆ రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా పురోగమిస్తున్న కమ్యూనిస్టు వుద్యమాల పట్ల అత్యంత సహజంగా ఆకర్షితురాలైంది. వియత్నాం విప్లవోద్యమానికి మద్దతుగా కొనసాగిన అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేక వుద్యమం, మావో నాయకత్వంలో జరిగిన గొప్ప సాంస్కృతిక విప్లవం, విశేషించి వసంత కాలపు మేఘ గర్జనగా పేరు పొందిన నక్సల్బరీ రైతాంగ పోరాటం ఎందరో మేధావులను, విద్యార్థులను ప్రభావితం చేసినట్టుగా కామ్రేడ్ అనురాధను కూడా ప్రభావితం చేశాయి. ప్రపంచ విప్లవాల గురించీ, సాంస్కృతికోద్యమం గురించి ఆనాడు విస్తృతంగా వచ్చిన సాహిత్యం కూడా ఆమెను ఉత్తేజపరిచింది. 1971లో దేశవ్యాప్తంగా సంభవించిన ఘోరమైన కరువు మూలంగా దిగజారిన పేద ప్రజల జీవన పరిస్థితులు ఆమెను కదిలించివేసినయ్.

అలా విప్లవోద్యమం పట్ల ఆకర్షితురాలైన ఆమె త్వరగానే విప్లవ విద్యార్థి ఉద్యమ నాయకురాలైంది. నిరంతరం ఉత్సాహంగా, చొరవగా వుండే కామ్రేడ్ అనురాధ విద్యార్థులతో సులభంగా కలిసిపోయేది. వారిని విప్లవ విద్యార్థి రాజకీయాల వైపుకు ఆకర్షింప చేసేది. ఆమె ద్వారా ప్రభావితం అయిన విద్యార్థులే ఎమర్జెన్సీ తర్వాత రోజుల్లో విద్యార్థి ప్రగతి సంగటన్‌ను ఏర్పాటు చేశారు. ఈ సంఘం బలమైన విద్యార్థి సంఘంగా వేళ్లూనుకుంది.

ఇలా ఉద్యమ కెరటంగా పోటెత్తుతూనే చదువులోనూ చురుగ్గా వుండి, సోషియాలజీలో ఎం.ఎ. చేసి, ఆ తర్వాత ఎం.ఫిల్. చేసింది.

లీగల్‌గా ఉన్నకాలంలో స్నేహితులూ, సన్నిహితులూ ఆమెను ప్రేమగా 'అనూ' అని పిలిచేవారు. తన స్వచ్ఛమైన స్నేహపూరిత స్వభావం వల్ల రాజకీయ విశ్వాసాలతో సంబంధం లేకుండా ఆమె ఎందరో విద్యార్థులకు ఆత్మీయురాలైంది. చురుకైన మేధస్సు వల్ల మరెందరికో అభిమానురాలయింది. భిన్నమైన దారిని ఎన్నుకున్నప్పటికీ తమ 'అను' ప్రియమైన జ్ఞాపకాలను ఇప్పటికీ వాళ్లు మదిలో దాచుకున్నారు.

## ఉద్యమమే జీవితమై...

చదువు ముగించుకున్న తర్వాత కళాశాల అధ్యాపకురాలిగా ఉద్యోగంలో చేరింది. మొదట విల్‌సన్ కళాశాలలోనూ, ఆ తర్వాత జున్ జున్‌వాల కళాశాలలోనూ పని చేసింది. ప్రతిభ గల విద్యార్థిగా పేరు తెచ్చుకున్నట్టుగానే, ప్రతిభగల అధ్యాపకురాలుగానూ పేరు పొందింది. ఏ కర్తవ్యం చేపట్టినా పట్టుదలగా పూర్తి చేసే ఆమె స్వభావం వల్ల విద్యార్థులకు ఒక్క పాఠం కూడా వదలకుండా చెప్పేది. తన కర్తవ్య దీక్షా, బోధనా సామర్థ్యం, స్నేహ స్వభావం వల్ల విద్యార్థులకు అభిమాన పాత్రురాలైంది.

ఈ అధ్యాపక జీవితం ఆమె ఉద్యమ జీవితాన్ని ఎంత మాత్రమూ కుదించలేదు. ఎమర్జెన్సీ తదనంతర కాలంలో రాజకీయ ఖైదీలను విడిపించడానికి ఆమె దేశవ్యాప్త పౌరహక్కుల ఉద్యమంలో పాల్గొంది. అలా ముంబయిలో సి.పి.డి.ఆర్. వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైంది. ఎమెర్జెన్సీ కాలంలో తప్పుడు కేసుల్లో ఇరికించబడ్డ మావోయిస్టులూ, మరికొందరూ కలిసి విశాల వేదికగా ఏర్పడ్డ దేశవ్యాప్త పౌరహక్కుల ఉద్యమంలో మావోయిస్టు వక్తగా గుర్తింపు పొందింది. అలా ఒక ప్రజా నాయకురాలిగా, పేరు పొందిన పౌరహక్కుల కార్యకర్తగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది.

1977 నవంబర్‌లో తోటి కామ్రేడ్‌తో ఆమెకు వివాహం అయింది. అయితే విప్లవ జీవితానికి ఆటంకం కాకుండా వుండడం కోసం పిల్లల్ని కనాలనే కోరికను చంపుకుంది. తన వ్యక్తిగత జీవితం రాజకీయ జీవితానికి ఎటువంటి ఆటంకం కానీయలేదు. కుటుంబం, ఆరోగ్యం వంటివేవీ పట్టించుకోకుండా విప్లవానికే ఆమె జీవితాన్ని అంకితం చేసింది.

ఆమె మహారాష్ట్రలో సి.పి.ఐ.(ఎం.ఎల్)కు వ్యవస్థాపక సభ్యురాలు. 1980ల మొదట్లో సి.పి.ఐ (ఎం.ఎల్) (పీపుల్స్‌వార్) ఏర్పడి ఆంధ్రప్రదేశ్ విప్లవోద్యమం దండకారణ్యంకు విస్తరించడంలో భాగంగా గడ్‌చిరోలి జిల్లాకూ విస్తరించింది. దానితో ముంబయ్ నుండి విదర్భకు కార్యకలాపాలు విస్తరించాల్సిన అవసరాన్ని పార్టీ గుర్తించింది. అలా విస్తరింపచేయడంలో భాగంగా కామ్రేడ్ అనురాధ ముంబయినీ, తన ఉద్యోగాన్నీ వదిలేసుకొని నాగ్‌పూర్‌కు వెళ్లింది. మంచి అధ్యాపకురాలిగా ఆమెకున్న గుర్తింపు వల్ల నాగ్‌పూర్ యూనివర్సిటీలో పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు సోషియాలజీ బోధించే అధ్యాపకురాలిగా ఉద్యోగం సంపాదించుకుంది. విదర్భలో ప్రధానంగా ట్రేడ్ యూనియన్ రంగంలోనూ, దళితుల్లోనూ తన కార్యకలాపాలను కేంద్రీకరించింది. అలా అక్కడ విప్లవ కార్యక్రమాలకు పునాది వేసిన వారిలో ఒకరిగా నిలిచింది.

ట్రేడ్ యూనియన్‌లో ప్రధానంగా నిర్మాణ రంగంలోని

కార్మికులలో పనిచేసిన కామ్రేడ్ అనురాధ ఎన్నో మిలిటెంట్ పోరాటాలను నడిపింది. నాగ్‌పూర్‌కు 30 కి.మీ.ల దూరంలో వున్న కాపర్ కేడా థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం పనిలో వున్న అయిదువేల మంది కార్మికులు చేసిన సుదీర్ఘ సమ్మె వీటిల్లో పేరు పొందింది. పోలీసులు కాల్పులు జరిపి, కర్ఫ్యూ విధించి ఈ సమ్మెను అణచివేశారు. నాగ్‌పూర్‌లో ఇంటి పని వాళ్లను ఆర్గనైజ్ చేసింది. హింగ్నా (నాగ్‌పూర్) ఎం.ఐ.డి.సి. కంపెనీలోకి కార్మికులనూ, రైల్వే కార్మికులనూ, బండారా బీడీ కార్మికులనూ, నాగ్‌పూర్ నుండి 15 కి.మీ.ల దూరంలోనున్న కాంప్టే మరమగ్గాల కార్మికులనూ, ఇతర అసంఘటిత కార్మికులనూ ఆర్గనైజ్ చేసింది. తర్వాత బొగ్గు గని కార్మికులలో, నిర్మాణ రంగంలోని కార్మికులలో పని చేయడానికి చంద్రపూర్‌కు వెళ్లింది. అసంఘటిత కార్మికులలో ఎక్కువ మందికి ప్రాథమికమైన ట్రేడ్ యూనియన్ హక్కులు కూడా వుండవు, వీళ్లను అన్ని సాంప్రదాయ ట్రేడ్ యూనియన్స్ నిర్లక్ష్యం చేశాయి. ఐక్య కార్యకలాపాలు చేపట్టడానికి నాగ్‌పూర్‌లోనే కాకుండా, చంద్రపూర్, అమరావతి, జబల్‌పూర్, యవత్‌మాల్ మొదలగు ప్రాంతాలలోని అభ్యుదయ ట్రేడ్ యూనియన్ నాయకులతో సంబంధాలను పెంపొందించుకుంది. ఈ పోరాటాల్లో పాల్గొంటూ ఆమె అనేకసార్లు అరెస్టు అయి కొన్ని రోజులు నాగపూర్ జైల్లో వుంది. ఉద్యోగం చేస్తున్నా కూడా రీజియన్‌లో ప్రఖ్యాత విప్లవ కార్మిక సంఘ నాయకురాలిగా ఎదిగింది.

కార్మిక నేతగానే కాకుండా విదర్భలో దళిత, మహిళా వుద్యమాల్లో కూడా కీలకమైన పాత్రను పోషించింది.

నాగ్‌పూర్‌లో అనేక గమనించదగిన సంఘటనలలో ఆమె ముందు భాగాన వుండింది. విదర్భ ప్రజల చైతన్యంపై చెరిగిపోని విప్లవ ప్రభావాన్ని వేసినటువంటి ముఖ్యమైన రెండు వుదాహరణలను మనం ఇక్కడ చెప్పుకుందాం. మొదటిది 1984 నాటి కమలాపూర్ కాన్ఫరెన్స్, రెండవది 1992లో గద్దర్ నేతృత్వంలో నిర్వహించతలపెట్టిన జె.ఎన్.ఎం. కార్యక్రమం. అప్పుడప్పుడే వేళ్లూనుకుంటున్న నక్సలైట్ వుద్యమం గడ్‌చిరోలిలోని దట్టమైన అడవిలో కమలాపూర్ కాన్ఫరెన్స్ నిర్వహించతలపెట్టింది. రైతాంగ గెరిల్లా దళాలు అడవి ప్రాంతంలో పెద్ద ఎత్తున ప్రజల్ని సమీకరించగా, కామ్రేడ్ అనురాధ విదర్భ ప్రాంతం మొత్తంలో పెద్ద క్యాంపెయిన్ చేపట్టి ప్రజలను సమీకరించింది. పోలీసులు కాన్ఫరెన్సు జరగకుండా నిర్దాక్షిణ్యంగా అణచివేసినా, వందల, వేల మంది ప్రజలు దట్టమైన అడవిలోని చిన్న గ్రామమైన కమలాపూర్‌కు తరలివెళ్లారు. కమలాపూర్ విప్లవ సందేశం నెలల తరబడి ఆ ప్రాంతమంతా మారుమోగింది. నాగ్‌పూర్‌లో నిర్వహించ తలపెట్టిన గద్దర్ సభ కూడా పోలీసు దాడి ద్వారా నిర్దాక్షిణ్యంగా అణచివేయబడినప్పటికీ ప్రజలపై మరింత గొప్ప ప్రభావాన్ని వేసింది. సభ నడిపించుకోవడానికి హైకోర్టు నుండి అనుమతి వున్నప్పటికీ పోలీసులు ఆ ప్రాంతాన్ని దిగ్బంధం చేసినప్పుడు రోడ్డు మీద కాలేజీ ఆవరణ బయట తిరిగి సమీకృతం అవుతున్న ప్రజల్ని వుద్దేశించి అక్కడ నిలిపి వుంచిన మోటర్ సైకిల్‌పై నిలబడి ప్రసంగించిన అనురాధ రూపాన్ని ప్రజలు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. వేలాది పోలీసులు హాల్‌ను ముట్టడించినా, అక్కడికి వచ్చే అన్ని దారులను మూసివేసినా విలేకరులు, లెక్చరర్లు, రచయితలు, లాయర్లు, వివిధ డిపార్టుమెంట్లకు చెందిన సీనియర్ సభ్యులతో సహా పెద్ద ఎత్తున ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. గద్దర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగానే హాజరైన అందరిమీద పోలీసులు లాఠీఛార్జీ చేశారు. పోలీసులు ఈ కార్యక్రమం జరగకుండా ఆపినప్పటికీ రెండు నెలల వరకూ ఈ వార్త పేపర్లలో ప్రముఖంగా వచ్చింది. ఈ రెండు ఘటనలు కూడా విదర్భ వ్యాపితంగా విప్లవ భావాలు వ్యాపించడానికి ఎంతో దోహదపడ్డాయి. ఈ రెండు కార్యక్రమాలను కామ్రేడ్ అనురాధయే రూపొందించింది.

విదర్భ ప్రాంతంలో ఆమె వున్న ఒకటిన్నర దశాబ్ద కాలంలో విప్లవ రాజకీయాలను అక్కడ ప్రారంభించడం ద్వారా, ఆమె ఆ ప్రాంతంపై అద్భుతమైన ప్రభావాన్ని వేసింది. ఆమె ఒక్కతే కాకుండా మిగతా వాళ్లను కూడా కలుపుకుని విప్లవకర ఉద్యమాన్నీ, దళిత ప్రజానీకంలో విప్లవోద్యమాన్ని నిర్మించడమే కాకుండా, విప్లవ విద్యార్థి వుద్యమాన్ని నిర్మించడంలోనూ, విశాల సంఖ్యలో వున్న మేధావులను - సీనియర్ ప్రొఫెసర్లు, విలేకర్లు, ప్రఖ్యాత నాటక రచయితలు, ప్రముఖ లాయర్లను విప్లవోద్యమం వైపు ఆకర్షించడానికి దోహదపడింది.

1983లో ఏర్పాటయిన ఎ.ఐ.ఎల్.ఆర్.సి (అఖిల భారత విప్లవ సాంస్కృతిక సంస్థ) నిర్మాణంలో కూడా కామ్రేడ్ అనురాధ పాత్ర వుంది. 1985లో ధన్‌బాద్ దగ్గర సింద్రిలో జరిగిన ఎ.ఐ.ఎల్.ఆర్.సి. మహాసభలో కె.వి.ఆర్., గద్దర్, వి.వి.లతోపాటు ఈమె కూడా ఒక ప్రముఖ వక్త. ఆ కాన్ఫరెన్స్, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రభావితమై, విప్లవోద్యమంలోకి వచ్చిన బీహార్, ఝార్ఖండ్ కామ్రేడ్స్ చాలా మంది (ఇప్పుడు నాయకత్వంలోకి కూడా వచ్చిన కొంతమంది కామ్రేడ్స్) ఈ రోజుకూ కామ్రేడ్ అనురాధను ప్రేమగా గుర్తు చేసుకుంటారు.

ఇలా రాష్ట్ర సరిహద్దులను చెరిపేస్తూ, దేశవ్యాప్తంగా కూడా ఒక ప్రజా నాయకురాలిగా గుర్తింపు పొందుతున్న కామ్రేడ్

అనురాధ సహజంగానే పాలకవర్గాలకు కంట్లో నలుసైంది. ఆమెపై నిర్బంధం పెరిగింది. దానితో పార్టీ పిలుపుమేరకు 1994 నుండి ఆమె రహస్య జీవితం ప్రారంభించింది. రహస్య జీవితంలోని అన్ని ఇబ్బందులనూ చైతన్యవంతంగా ఎదుర్కొంటూ తన కార్యకలాపాలను చురుగ్గా కొనసాగించింది.

## దళిత పోరాట కేతనమై...

కామ్రేడ్ అనురాధ విప్లవోద్యమ కృషిలో విశేషంగా చెప్పుకోవాల్సిన వాటిలో ఆమె చేసిన దళితోద్యమ కృషి ఒకటి. ముంబయిలో దళిత పాంథర్ ఉద్యమం వెల్లువెత్తుతున్న కాలంలో ఆమె విప్లవోద్యమంలోకి అడుగుపెట్టింది. ఈ వుద్యమాన్ని అణచడం కోసం పోలీసులు, శివసేన గూండాలు పెద్ద ఎత్తున ఊచకోతకు పాల్పడ్డారు. దళిత పాంథర్లు వీరోచితంగా ప్రతిఘటించారు. దాడులు, ప్రతిదాడులతో ముంబయిలోని వర్లీ ప్రాంతం యుద్ధ రంగంగా మారింది. ఆ సమయంలో కామ్రేడ్ అనురాధ మాయానగర్ అనే దళితులు వుండే ఒక మురికివాడలో పని చేస్తుండేది. మాయానగర్ దళితులు వీరోచితంగా ప్రతిఘటించారు. వాళ్లు మాల్టోవ్ కాక్‌టైల్స్‌ను ఉపయోగించడం నేర్చుకున్నారు. పోలీసులు, శివసేన గూండాలు మాయానగర్‌పై దాడికి వచ్చిన ప్రతిసారీ, వాళ్లే దెబ్బలు తిని, తిరిగి పోయేవారు. పోలీసుల దాడి నుండి రక్షణ పొందడం కోసం పొరుగున వున్న మురికివాడల నుండి సైతం దళితులు వచ్చి, మాయానగర్‌లో ఆశ్రయం పొందేవారంటే అక్కడి ప్రతిఘటన ఎంత శక్తివంతమైనదో ఊహించవచ్చు. ఈ ప్రతిఘటనను నిర్మించడంలో కామ్రేడ్ అనురాధ తగిన పాత్రను పోషించింది. అప్పటికి దళిత సమస్యపై లోతైన అవగాహన లేనప్పటికీ దళితుల పక్షాన నిలబడి చురుకైన పాత్రను పోషించింది. దళిత సమస్యపై ఆమెకు ఇదే మొదటి కార్యాచరణ.

నాగ్‌పూర్‌కు వెళ్లిన తర్వాత కూడా, కుల అణచివేతకు వ్యతిరేకంగా దళితులను సంఘటితం చేయడంలో ఆమె చురుకైన పాత్ర వహించింది. నాగ్‌పూర్ వెళ్లిన కొద్ది సంవత్సరాల తర్వాత ఆమె మహారాష్ట్రలో దళిత రాజకీయాలకు గుండెకాయ వంటిదైన ఇండోరా బస్తీకి తన నివాసాన్ని మార్చింది. దళితుల మధ్య జీవిస్తూ, వారిని సంఘటితం చేస్తూ, ఒక దశాబ్దకాలం మొత్తం అక్కడ వుండింది. ఈ కాలం దళిత ఉద్యమాన్ని సజీవంగా అవగాహన చేసుకోవడానికి ఆమెకు ఎంతగానో ఉపకరించింది. దళిత అణచివేత, కుల వివక్ష సమస్యలను ముందుగా పట్టించుకున్న మార్క్సిస్టు విప్లవకారులలో ఈమె ఒకరు. కామ్రేడ్ అనురాధ కుల సమస్యపై అంబేద్కర్ తదితరుల సామాజిక రచనలు చాలానే అధ్యయనం చేసింది. సాంప్రదాయ మార్క్సిస్టుల్లా కాకుండా ఆమె దళితులతో పూర్తిగా పెనవేసుకుపోయింది. చాలా మంది దళిత నాయకులకు ఇది బలమైన ప్రాంతం అయినప్పటికీ, దళిత రాజకీయాలకు రగులుతున్న కేంద్రం అయినప్పటికీ పెద్దమొత్తంలో యువత త్వరగా నక్సలైట్ల పట్ల ఆకర్షితులయ్యారు. ఆమె కృషి వలన ఏర్పడిన సాంస్కృతిక బృందాలు ఆర్గనైజేషన్‌పై అద్భుతమైన ప్రభావాన్ని వేశాయి. దళిత వుద్యమంలో మావోయిస్టుల ప్రతినిధిగా ఆమె ఎదిగింది. విదర్భలో చాలా దళిత సభలలో ఒక ప్రముఖ వక్తయింది. దళిత నాయకులు తీవ్రంగా వ్యతిరేకించినా, అంబేద్కర్‌ను దళితుల సమస్యలను, కుల అణచివేతను లోతుగా అధ్యయనం చేయడం ద్వారా యువత ఇచ్చిన విస్తృతమైన మద్దతుతో తను అక్కడ నిలబడగలిగింది. ముంబయిలోని మాయానగర్ దళిత వాడలో పని చేస్తున్నప్పటి నుండే, ఆమె దళిత సమస్యపై అధ్యయనాన్ని ప్రారంభించింది. ఇండోరా బస్తీలో పని చేస్తున్నప్పుడు ఆమె అధ్యయనం మరింత లోతులకు వెళ్లింది.

సామాజిక శాస్త్ర అధ్యాపకురాలు కావడం వలన ఆమె దళిత సమస్యపై సామాజిక శాస్త్ర రచనలనూ, అంబేద్కర్ రచనలనూ అధ్యయనం చేసింది. దళిత పాంథర్స్ వుద్యమం, ఆ తర్వాత పరిణామాల నేపథ్యంలో దళిత సమస్యపై మహారాష్ట్రలో ఒక విస్తృతమైన చర్చ మొదలైంది. మేధావులు, వామపక్షీయులు, మార్క్సిస్టులు దళిత సమస్యపై తమ తమ వైఖరిని స్పష్టం చేసుకోవాల్సి వచ్చింది. ఈ చర్చను ప్రారంభించింది కామ్రేడ్ అనురాధనే. ఈ ప్రక్రియలో భాగంగానే భారతదేశంలో దళిత సమస్యపై మార్క్సిస్టు దృక్పథం అభివృద్ధి చెందింది. ఈ విస్తృత చర్చ 1980ల చివర్లో 'సత్తైశోదక్ మార్క్స్‌వాద్' అనే మరాఠీ పత్రికలో కా. అనురాధ రాసిన సుదీర్ఘ వ్యాసంతో ఒక ముగింపుకు వచ్చింది. ఈ వ్యాసం మరింత సంస్కరించబడి అంబేద్కర్‌పై విశ్లేషణతో 1994లో చిత్తు ముసాయిదాగా అభివృద్ధి చెందింది. దీనిపై ఆధారపడే సి.పి.ఐ (ఎం.ఎల్) (పీపుల్స్‌వార్) కుల సమస్యపై డాక్యుమెంటును తెచ్చింది.

దళిత, కుల సమస్యపై ఇంగ్లీషు, మరాఠీ భాషలల్లో వచ్చిన అనేక పోస్ట్‌మోడర్నిస్టు ధోరణులను, తప్పుడు మార్క్సిస్టు వ్యాఖ్యలనూ ఖండిస్తూ, దళిత సమస్యను వర్గ దృష్టితో విశ్లేషిస్తూ ఆమె ఒక పుస్తకం కూడా రాసింది.

## దండకారణ్య పోరుతో మమేకమై

రహస్య జీవితంలోకి వచ్చిన తర్వాత పార్టీ పిలుపునందుకొని కామ్రేడ్ అనురాధ ఎటువంటి తటపటాయింపు లేకుండా 1995

తర్వాత కాలంలో బస్తర్‌లో అడుగుపెట్టింది. దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీ సభ్యురాలిగా అక్కడ ఆమె మూడు సంవత్సరాలు పని చేసింది. ఈ కాలంలో ఆమె ఆదివాసీ ప్రజలతో, కామ్రేడ్లతో మమేకమయింది. వారి ప్రేమనూ, అభిమానాన్ని చూరగొన్నది. వారి భాష అయిన గోండీని నేర్చుకుంది. బస్తర్ ఆదివాసీ పోరాటాల గురించీ, వారి జీవితాలను గురించీ లోతుగా అధ్యయనం చేసింది.

ఈ కాలంలో తన అత్యధిక సమయాన్ని ఆదివాసీ మహిళల నుండి నాయకత్వంలోకి ఎదుగుతున్న కామ్రేడ్స్ కోసం అధ్యయన తరగతులు నిర్వహించడంలో గడిపింది. మహిళల ఆరోగ్య సమస్యలు, మహిళలపై పీడన, నూతన ప్రజాస్వామిక విప్లవం, సామాజిక జ్ఞానం, ప్రాథమిక మార్క్సిస్టు సూత్రాలు తదితరాలపై అధ్యయన తరగతులు నిర్వహించింది. స్థానిక పార్టీ పత్రికకు అనేక వ్యాసాలు రాయడమేకాక, కరపత్రాలు కూడా రాసింది.



డీకేలో గడిపిన చివరి సమయంలో పశ్చిమ బస్తర్‌లో నేషనల్ పార్క్ ప్రాంతానికి స్వతంత్ర బాధ్యురాలిగా పని చేసింది.

మధ్య తరగతి నగర జీవితం నుండి, సీనియర్ ప్రొఫెసర్ ఉద్యోగం నుండి అదీ నలభై సంవత్సరాలు దాటిన వయసులో అటవీ జీవితంలో అడుగుపెట్టి మిలిటరీ దుస్తులూ, తుపాకీ ధరించి, ఎంతో చురుగ్గా క్యాడర్‌తో, ప్రజలతో కల్సిపోయే 'దీదీ' ప్రతి ఒక్కరికీ వుత్తేజాన్నిచ్చింది.

1997లో సంభవించిన తీవ్ర కరువు సమయంలో ఆమె అక్కడ వుంది. ఈ కరువులో ఇతర ప్రాంతాల్లో వందలాది మంది మృతి చెందారు. తాను వున్న ప్రాంతంలో పార్టీ కరువు దాడులు చేసి ధాన్యాన్ని ప్రజలకు పంచడం ద్వారా నష్టాన్ని తగ్గించగలిగింది. ఈ సమయంలో మలేరియా తీవ్రంగా దాడి చేయడం, ఎండల తీవ్రత మొదలైన కారణాల వల్ల ఆమె ఆరోగ్యం క్షీణించింది. ఈ అననుకూల పరిస్థితుల్లో, ప్రజల కొరకు పని చేయాలనే నిబద్ధత, అద్భుతమైన మనోబలం వల్ల ఆమె అక్కడ కొనసాగగలిగింది.

## పార్టీలో అత్యున్నత స్థాయికి ఎదిగిన తీరు

దండకారణ్యం నుండి తిరిగి వచ్చిన తర్వాత ఆమె మహారాష్ట్ర కమిటీ సభ్యురాలిగా ఎన్నికయింది. కామ్రేడ్ అనురాధ మునుపటి సి.పి.ఐ (ఎం.ఎల్) (పీపుల్స్‌వార్)లో ఈ స్థాయికి ఎన్నికయిన మొదటి మహిళ. ఆ తర్వాత 2001లో జరిగిన పీపుల్స్‌వార్ 9వ కాంగ్రెస్‌కు ప్రతినిధిగా హాజరయింది. ఆ కాంగ్రెస్‌లో ఆమె ప్రత్యామ్నాయ కేంద్ర కమిటీ సభ్యురాలిగా ఎన్నికయింది. పీపుల్స్‌వార్ చరిత్రలో మొదటి ప్రత్యామ్నాయ కేంద్ర కమిటీ సభ్యురాలు కూడా కా. అనురాధే. ఆ తర్వాత 2007లో జరిగిన ఐక్యతా కాంగ్రెస్‌లో ఆమె కేంద్ర కమిటీ సభ్యురాలిగా ఎన్నికయింది. ఆమె ఈ కాంగ్రెస్‌లో సి.సి.లోకి ఎన్నికయిన ఏకైక మహిళ. కేంద్ర కమిటీ సభ్యురాలిగా ఆమె దక్షిణ-పశ్చిమ బ్యూరోలో సభ్యురాలిగా వుండింది.

## భారత విప్లవ మహిళా ఉద్యమ రథ సారధి

నాగ్‌పూర్‌లో వున్నప్పుడే అక్కడ మహిళా వుద్యమానికి బీజాలు వేసిన కామ్రేడ్ అనురాధ, ఆ తర్వాత కాలంలో ఆ వుద్యమాన్ని బలోపేతం చేసి దాన్ని క్రియాశీలకంగా పని చేయించడంలో కీలకపాత్ర పోషించింది. సమాజంలో వున్న పితృస్వామిక బంధనాలను తెంచుకుని పార్టీలోనూ వివిధ విభాగాలలోనూ పని చేస్తున్న ప్రగతిశీల మహిళలందరికీ కామ్రేడ్ అనురాధ ఒక వెలుగు బాటలా నిలిచింది. మహిళా రంగంలో పని చేస్తున్న వారినే కాకుండా, పార్టీలో పని చేస్తున్న మహిళలందరినీ కూడా ఆమె చాలా వుత్తేజపరిచింది. పీపుల్స్‌వార్ ఆధ్వర్యంలో 2001లో జరిగిన 9వ కాంగ్రెస్‌లో మహిళా సమస్యపై లోతైన చర్చ జరిగింది. ఇటువంటి లోతైన చర్చ జరగడానికి కారకులైన ముఖ్యమైన కామ్రేడ్స్‌లో కామ్రేడ్ అనురాధ ఒకరు. ఈ చర్చ ఫలితంగా కేంద్ర స్థాయిలో కేంద్ర మహిళా కోఆర్డినేషన్ కమిటీ(సి.ఎం.సి.సి.)ని ఏర్పాటు చేయాలనే తీర్మానాన్ని హాలు ఆమోదించింది.

అలా పీపుల్స్‌వార్ పార్టీ చరిత్రలో మొదటిసారిగా మహిళా వుద్యమాన్ని నిర్వహించడం కొరకు ఒక దేశవ్యాప్త మహిళా కో ఆర్డినేషన్ కమిటీ ఏర్పడింది. ఈ కమిటీకి నాయకురాలిగా కామ్రేడ్ అనురాధ పని చేసింది. ఈ కాలంలో సిసి నుండి మహిళా రంగానికి బాధ్యత వహించే కామ్రేడ్‌కు ఆమె సహకరించింది. ఐక్యతా కాంగ్రెస్‌లో కేంద్ర కమిటీ సభ్యురాలిగా ఎన్నికయిన తర్వాత దేశవ్యాప్త మహిళా రంగ బాధ్యతను ఆమె స్వతంత్రంగా చేపట్టింది.

2001లో సి.ఎం.సి.సి ఏర్పడగానే చేపట్టిన మొదటి బాధ్యత -

మహిళా సమస్య పట్ల మన దృక్పథం అనే డాక్యుమెంటును సుసంపన్నం చేయడం. దీన్ని పార్టీ మొదట 1996లో విడుదల చేసింది. కామ్రేడ్ అనురాధలోని లోతైన సైద్ధాంతిక పరిజ్ఞానం దీన్ని సుసంపన్నం చేయడంలో తోడ్పడింది. సి.పి.ఐ (మావోయిస్టు) ఏర్పడిన తర్వాత మరి కొద్ది మంది సిసి కామ్రేడ్స్‌తో కల్సి డాక్యుమెంటును సుసంపన్నం చేసే బాధ్యతను చేపట్టింది.

మహిళా సమస్యపై పీపుల్స్‌వార్ పత్రికకు తను ఎన్నో వ్యాసాలు రాసింది. సి.ఎం.సి.సి. సభ్యురాలిగా 2001 నుండి అంతర్‌రాష్ట్రీయ మహిళా దినం సందర్భంగా పార్టీ పిలుపులను రూపొందించింది. ఆమె వ్యాసాలు తెలుగు, హిందీ భాషల్లోకి అనువదించబడి ఆయా రాష్ట్రాల పత్రికల్లో ప్రచురించబడ్డాయి.

2004 ప్రారంభంలో పార్టీలోనూ, సైన్యంలోనూ వున్న మహిళల గురించీ, మహిళా ఉద్యమానికి సంబంధించిన అనుభవాల గురించీ, సమాచారాన్ని పంచుకోవడం కోసం న్యూజిలాండ్ పార్టీ కార్యదర్శితోనూ (మహిళా కామ్రేడ్), ఫిలిప్పైన్స్ మహిళా వుద్యమ నాయకురాలితోనూ జరిగిన చర్చల్లో ఇద్దరు సభ్యుల సి.ఎం.సి.సి. బృందానికి కామ్రేడ్ అనురాధ నాయకత్వం వహించింది. న్యూజిలాండ్ కామ్రేడ్స్‌తో జరిపిన చర్చలపై నాయకత్వం అవగాహన కోసం ఒక పత్రాన్ని తయారుచేసింది.

మహిళా సమస్యను లోతుగా అర్థం చేయించడం కోసం ఆమె వివిధ ప్రాంతాల్లో విస్తృతమైన అధ్యయన తరగతులను బోధించింది, వర్క్‌షాపులనూ నిర్వహించింది. అధ్యయన తరగతుల్లో ఆధునిక పద్ధతులను అభివృద్ధి చేసింది. కఠినమైన భావనలను కూడా సులువైన భాషలో ప్రాథమిక స్థాయిలో వున్న విద్యార్థులకు సైతం అర్థమయ్యేలా చెప్పేది. విద్యార్థుల నుండి ప్రశ్నలను ప్రోత్సహించేది. అమరత్వానికి కొద్ది రోజుల ముందు ఆమె ఝార్ఖండ్ మహిళా వుద్యమానికి సంబంధించిన వర్క్‌షాపును నిర్వహించింది. అక్కడి స్థానిక మహిళా కామ్రేడ్స్‌కు అధ్యయన తరగతులు బోధించి, వారందరినీ ఉత్తేజితులను చేసి ఒక మంచి కామ్రేడ్‌గా, మంచి ఉపాధ్యాయురాలిగా వాళ్ల మనసుల్లో హత్తుకుపోయింది. ఆ ప్రాంతంలోనే ప్రాణాంతకమైన ఫాల్సీపారం మలేరియాకు ఆమె గురవడం ఎంతో విషాదకరం.

## అసాధారణ ప్రతిభతో విశిష్ట వ్యక్తిత్వం

ఒక వెనుకబడిన, భూస్వామ్య, పితృస్వామ్య భావజాల సంకెళ్లతో బంధించబడిన దేశంలో మహిళగా పుట్టిన కామ్రేడ్ అనురాధ ఒక చైతన్య స్రవంతిలా ప్రవహించడం అసాధారణమే కాదు, అద్భుతమైన విషయం కూడా. ఎల్లప్పుడూ చురుగ్గా, స్నేహంగా, స్వార్థరహితమైన స్వభావంతో ఆమె ఎందరినో ప్రభావితం చేసింది. ఆమెది అసాధారణమైన మేధస్సు. ఆ మేధస్సు వలన రాజకీయంగా, సైద్ధాంతికంగా ఉద్యమానికి ఎంతగానో కృషి చేసింది. ముఖ్యంగా కుల సమస్యపై, మహిళా సమస్యపై ఆమె చేసిన సైద్ధాంతిక కృషి గొప్పదీ, చరిత్రలో నిలిచిపోగల్గేది. ఆమె మంచి రచయిత కూడా. మరాఠీ, హిందీ, ఇంగ్లీష్ మూడు భాషల్లోనూ ఆమె క్రమం తప్పకుండా ఉద్యమానికి సంబంధించిన రచనలు చేసేది. ఆమెలోని ఈ సామర్థ్యం వల్ల నాగ్‌పూర్ నుండి వెలువడిన విప్లవ హిందీ పత్రిక 'జనసంగ్రాం' నిర్వహణ వెనుక ప్రముఖ పాత్ర వహించింది. అలాగే 'జాహిర్‌నామా' అనే స్థానిక మరాఠీ పత్రిక ప్రచురణ బాధ్యతను స్వీకరించింది. విప్లవ విద్యార్థి పత్రిక 'కలం'తోనూ ఆమె దగ్గరి సంబంధాన్ని కల్గి వుండేది. ఇంకా మరెన్నో పార్టీ పత్రికలకూ, ప్రగతిశీల పత్రికలకూ ఆమె రక రకాల పేర్లతో విరివిగా రచనలు చేసింది. కామ్రేడ్ చెరబండరాజు కవితా సంపుటిని ఆమె మరాఠీలోకి అనువదించింది కూడా. కామ్రేడ్ అనురాధ శక్తివంతమైన వక్త. అనేక దళిత సభల్లో ఆమె ఒక ప్రముఖ వక్తగా గుర్తింపు పొందింది. అంతేకాదు తన ప్రసంగాల ద్వారా ఎందరో దళితులను ఆమె నక్సల్బరీ రాజకీయాల వైపుకు తీసుకువచ్చింది. ఎ.ఐ.ఎల్.ఆర్.సి. ఏర్పడిన తర్వాత ఆ వేదిక నుండి పలు రాష్ట్రాల్లో ప్రసంగించి వక్తగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. కార్యక్రమాలను రూపొందించడంలో, నిర్వహించడంలో ఆమెకు మంచి సమర్థతలు వుండేవి. ఈ నిర్వహణా సామర్థ్యం వల్లనే 2001లో, 2007లో జరిగిన రెండు కాంగ్రెస్‌ల్లో ఆమె అధ్యక్షవర్గంలో వుండి తన సమర్థతను చాటుకుంది. కామ్రేడ్ అనురాధకు పలు భాషల్లో ప్రావీణ్యం వుండేది. మాతృభాష మరాఠీతో పాటు, హిందీ, ఇంగ్లీష్ భాషలు ధారాళంగా మాట్లాడగల్గేది. గుజరాతీ భాషలోనూ ఆమెకు మంచి పరిజ్ఞానం వుండేది. తెలుగు, కన్నడం, గోండీ భాషలను అర్థం చేసుకోగలిగేది. ఆమె మంచి రాజకీయ ఉపాధ్యాయురాలు కూడా. సులువైన భాషలో కఠినమైన భావనలను లోతుగా అర్థం చేయించగల్గేది. ఇలా ఎంతో మేధస్సు, ఎన్నో నైపుణ్యాలు, సుగుణాలు మేళవించిన అద్భుతమైన వ్యక్తిత్వం ఆమెది.

## ఆమె అస్తమయం చరిత్రలో చోటు చేసుకున్న పెను విషాదం

ఉద్యమం కోసం ప్రతి క్షణం తపించిన, నిరంతరం శ్రమించిన కామ్రేడ్ అనురాధ గత 5 సంవత్సరాల నుండే సిస్టమిక్ సెర్‌లోసిస్ అనే వ్యాధితో బాధపడుతోంది. కానీ ఆ వ్యాధి రెండు సంవత్సరాల క్రితం మాత్రమే గుర్తించబడింది. ఈ వ్యాధితోపాటు ఆమెకు

మరికొన్ని అనారోగ్య సమస్యలు కూడా వుండేవి. అయినప్పటికీ తన చురుకైన కార్యాచరణ ఎన్నడూ మందగించలేదు. అమరత్వానికి కొద్ది రోజుల ముందు, ఆమె మహిళా ఉద్యమ నిర్మాణ కృషిలో భాగంగా ఒక వర్క్‌షాపును నిర్వహించడానికి ఝార్ఖండ్ అటవీ ప్రాంతానికి వెళ్లి వారం రోజులు వుండి తిరిగి వచ్చింది. వచ్చిన తర్వాత ఏప్రిల్ 6న తీవ్రమైన జ్వరానికి గురయింది. రహస్య జీవితంలోని ఇబ్బందుల వలన, సరైన చికిత్సా సౌకర్యం పొందలేకపోయింది. స్థానిక పాథోలజిస్టు రక్త పరీక్ష జరిపి మలేరియా వ్యాధి లేదని చెప్పినందువల్ల, ఒక స్థానిక డాక్టర్ కడుపు నొప్పికి సంబంధించిన వైద్యం చేశాడు. మరోసారి రక్త పరీక్ష జరిపిన తర్వాత 11వ తేదీన ఫాల్సిఫారం మలేరియా అనేది అర్థం అయింది. అయినా ఆ రోజు ఉదయం తను ఆరోగ్యంగా వున్నట్టుగానే కనపడింది. కానీ లోపల ఫాల్సిఫారం మలేరియా క్రిమి తన ఊపిరితిత్తులను, గుండెను, మూత్రపిండాలను నష్టపర్చింది. సిస్టమిక్ సెర్‌లోసిస్ వ్యాధి కారణంగా అవి ముందే బలహీనపడి ఉన్నాయి. ఆమెను వెంటనే హాస్పిటల్‌లో అడ్మిట్ చేసినప్పటికీ ఒక గంటలోనే అవయవాలన్నీ పని చేయడం ఆగిపోయింది. ఆక్సిజన్, లైఫ్‌సపోర్టు పెట్టినప్పటికీ తర్వాత రోజు ఉదయానికి చివరి ఘడియ సమీపించింది. ఆక్సిజన్ పెట్టినప్పుడు తను స్పృహలోనే వుంది. భావాలను లోతుగా వ్యక్తపరిచే మృదువైన కళ్లు తీవ్రమైన నొప్పిలోనూ, మృత్యువు సమీపిస్తున్న విషయం అర్థమైనప్పటికీ బాధను వ్యక్తపరచకుండా ప్రశాంతంగానే వున్నాయి.

అలా భారత విప్లవ చరిత్ర పుటల్లో ఒక మహోన్నత కమ్యూనిస్టు నాయకురాలి అస్తమయపు విషాదం కన్నీటితో లిఖించబడింది. భారత విప్లవాకాశంలో ఎగురుతున్న ఎర్రజెండా కన్నీటితో అవనతమైంది.

సమ సమాజపు కలలెన్నింటినో నింపుకున్న ఆమె కనులు మూతబడ్డాయి. కానీ ఆమె కలలు మాత్రం తప్పక కొనసాగుతాయి, వాస్తవ రూపమూ దాలుస్తాయి. ఆమె శ్వాస ఆగిపోయింది. కానీ ఎన్నో ఉద్యమాలకు ఆమె ఇచ్చిన శ్వాస ఎప్పటికీ ఆగిపోనిది. కామ్రేడ్ అనురాధ భౌతికంగా మాత్రమే మనకు దూరమైంది. తను అందించిన సైద్ధాంతపు వెలుగు, పోరాటపు స్ఫూర్తి రూపంలో నిరంతరం ఆమె మన వెన్నంటే వుంటుంది.

అమర్ రహే కామ్రేడ్ అనురాధ!

కామ్రేడ్ అనురాధ ఆశయాలను కొనసాగిద్దాం!!

★

---

*(17వ పేజీ తరువాయి...)*

వర్గానుకూల ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ, ఆహార ధాన్యాల సట్టా వ్యాపారాన్నీ నిషేధించాలని, ఆహార ధాన్యాలను సక్రమంగా పంపిణీ చేయాలనీ; చవుక ధరల దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువులను ప్రజలకు సరఫరా చేయాలనీ; సబ్సిడీలు, సాంఘీక సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని; పన్నులు ఎగవేసే పెద్ద తలలను శిక్షించాలనీ; పోలీసు, పారా మిలిటరీ, సాయుధ బలగాల వంటి నిర్బంధ రాజ్య యంత్రాంగం మీద పెట్టే వృధా ఖర్చును ఆపి పేద, అనాధ ప్రజల సంక్షేమానికీ మొదలైన వాటి కోసం ఖర్చు చేయాలనీ డిమాండ్ చేస్తూ దేశ ప్రజలంతా సమైక్యంగా మిలిటెంటు పోరాటాలకు సంసిద్ధం కావాలి. అవినీతి వ్యాపారుల అక్రమ నిల్వలను స్వాధీనం చేసుకోవాలి. నల్ల బజారు వ్యాపారుల గోదాములను బద్దలుకొట్టి ప్రజలకు ఆహార ధాన్యాలను, నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలి. అంతిమంగా దోపిడి, పీడనలు లేని నూతన ప్రజాస్వామిక వ్యవస్థలోనే ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల వంటి మహమ్మారులకు సరైన పరిష్కారం లభిస్తుంది. ప్రజలందరికి మౌలిక వసతులు సమకూర్చగల నూతన ప్రజాస్వామిక వ్యవస్థ నిర్మాణం కోసం నేడు దేశంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధంలో ప్రజలంతా భాగస్వాములు కావాలి. ★

---

*కమ్యూనిస్టు పార్టీ మరియు ప్రజాస్వామిక పార్టీలు అన్నీ కూడా చరిత్ర యొక్క ఉత్పత్తులే. చరిత్రలో ఏదైతే ఆవిర్భవిస్తుందో, అది చరిత్రలోకి అదృశ్యమవుతుంది. కాబట్టి, కమ్యూనిస్టు పార్టీ కూడా ఒకరోజు అదృశ్యం అవుతుంది. అదేవిధంగా ప్రజాస్వామిక పార్టీలు కూడా అదృశ్యమవుతాయి. ఈ అదృశ్యమవడం అన్నది అంత విషాదకరమైనదా? నా ఉద్దేశ్యంలో, అది చాలా ఆహ్లాదకరమైనది ఏదో ఒకనాటికి మనం కమ్యూనిస్టు పార్టీని శ్రామికవర్గ నియంతృత్వాన్ని వదిలించుకోగలమన్నది చాలా మంచి విషయమని నేను అనుకుంటున్నాను. వాటి వినాశనాన్ని వేగిరపర్చడమే మన కర్తవ్యం.*

*– మావో*

# పోరాటాల ఫలితంగా వచ్చిన అటవీహక్కుల చట్టం పోరాటాలను పక్కదారి పట్టించడానికే!

'ఆదివాసులు, ఇతర సంప్రదాయక ఆటవీవాసుల (అటవీ హక్కుల పరిరక్షణ) చట్టం - 2006' అమలుకు రంగం సిద్ధమైందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విపరీతంగా ప్రచారం చేస్తున్నాయి. 2006 డిసెంబర్‌లో పార్లమెంటు ఆమోదం పొందిన ఈ చట్టం, 2008 జనవరి నాటికి అమలుకు సిద్ధమైంది.

ఈ చట్టం ప్రకారం 2005 డిసెంబర్ 13 నాటికి ఆదివాసీల ఆక్రమణలో వున్న భూమిపై వారికి హక్కులు సంక్రమిస్తాయి. 49 రకాల కలపేతర అటవీ వుత్పత్తులపై కూడా హక్కులు సంక్రమిస్తాయి. అలాగే మూడు తరాలుగా (దాదాపు 75 సంవత్సరాలుగా) అటవీ ప్రాంతంలో జీవిస్తున్న ఆదివాసేతరులకు కూడా ఈ చట్టం వర్తిస్తుంది.

పైపైన చూస్తే ఇది ఎంతో విప్లవాత్మకమైన చట్టంలాగా తోస్తుంది. ఆశ్చర్యం కూడా కల్గుతుంది. ఎందుకంటే ఇన్నాళ్లూ ఆదివాసీలను ప్రభుత్వాలు ఎలా చూశాయి? దేశంలో మరీ ముఖ్యంగా నూతన ఆర్థిక విధానాలకు ద్వారాలు తెరిచిన తర్వాత ఎలా చూశాయి?

వాళ్ల గడ్డపై వాళ్లనే నేరస్తులుగా చూశారు. పోడు చేస్తే నేరమన్నారు. కాయ తెంపితే నేరమన్నారు. ఆకు ముట్టుకున్నా నేరమన్నారు. పశువులను మేపుకుంటే నేరమన్నారు. చివరకు కోళ్లు తిరిగినా నేరమే అయింది. ఇవన్నీ నేరాలని ప్రభుత్వాలు ఎంత చెప్పినా ఆదివాసీలు ఈ 'నేరాలను' చేస్తూనే వస్తున్నారు. ఎందుకంటే ఈ 'నేరాలను' చెయ్యకపోతే వాళ్లకు బతుకులేదు. అడవితో పెనవేసుకున్న బతుకులు వారివి. వాళ్ల జీవనానికీ, సంస్కృతికీ అడవే ఆధారం.

వాళ్లు బతకాలంటే పోడు చెయ్యాల్సిందే. కాయా దుంపా ఏరుకోవాల్సిందే. చెట్లు కొట్టాల్సిందే. వేట చెయ్యాల్సిందే. ఈ 'నేరాల'ను చేసినందుకు వాళ్లు ఫారెస్టు అధికార్లతో తర తరాలుగా ఎన్నో దెబ్బలు తిన్నారు. ఎన్నో చిత్రహింసలు పొందారు. ఫైన్లు కట్టారు. జైలు శిక్షలూ అనుభవించారు. చివరకు ఫారెస్టు అధికార్ల చేతిలో ప్రాణాలు సైతం కోల్పోయారు.

అసలు అటవీ శాఖ ఏర్పడిందే ఆదివాసుల నుండి అడవిని కాపాడ్డానికి అన్నట్టు ప్రవర్తించింది. అందుకే అడవిని దోచుకునే, సర్వనాశనం చేసే స్మగ్లర్లూ, దొంగలూ, దళారీల పట్ల అదెప్పుడూ వినమ్రంగానే వున్నది.

అలా తమ గడ్డపై తామే దొంగలుగా బతుకుతున్న, పురుగులుగా ఈసడింపుకు గురవుతున్న ఆదివాసీల జీవితం, నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో మరింత దుర్భరమైంది. నూతన ఆర్థిక విధానాలకు సాష్టాంగపడ్డ పాలకవర్గాలు ఆదివాసీ ప్రజలపై అప్రకటిత యుద్ధానికి పాల్పడుతున్నాయని చెప్పవచ్చు.

నూతన ఆర్థిక విధానాలు, బహుళ జాతి కంపెనీలకు దేశంలో ఎక్కడైనా పెట్టుబడులు పెట్టే, ఎక్కడినుంచైనా సంపదను దోచుకునిపోయే హక్కును కట్టబెట్టాయి. ఈ హక్కు ఆదివాసీల జీవించే హక్కుకే గొడ్డలి పెట్టయింది.

ఎందుకంటే బహుళజాతి కంపెనీల డేగ కళ్లు నల్లమల, మన్యం, బస్తర్... ఇలా మరెన్నో అడవులపై పడ్డాయి. ఆ అడవుల గర్భంలో దాగిన ఎన్నో విలువైన, అరుదైన ఖనిజాలపై పడ్డాయి. అందుకే ఈ అడవుల నుండి ఆదివాసులను తరిమెయ్యడాన్ని ప్రభుత్వాలు ఒక ముఖ్యమైన కర్తవ్యంగా పెట్టుకొన్నాయి. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చడంలో భాగంగానే నల్లమల, మన్యం అడవుల్లో గ్రేహౌండ్స్ హత్యాకాండను తీవ్రం చేసింది. వాకపల్లిలో అత్యాచారాలు జరిపించింది. బస్తర్‌లో సల్వాజుడుంను పుట్టించింది.

ఈ నేపథ్యంలో అటవీ హక్కుల చట్టాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ప్రభుత్వం ఇన్నేళ్ల తన తప్పులకు పశ్చాత్తాపం చెంది ఈ చట్టాన్ని తెచ్చిందనుకోగలమా!

ఈ చట్టం ముందు మాటలో, వలసపాలన కాలంలోనే కాకుండా, స్వతంత్ర భారతదేశంలో కూడా ఇన్నాళ్లూ ఆదివాసీలను గుర్తించలేదనీ, ఇన్నాళ్లూ వాళ్లకు అన్యాయం జరిగిందని వాపోయారు. ఇది చదివితే, పాలకులంతా మూకుమ్మడిగా ఏ బోధి వృక్షం కింద తపస్సు చేస్తే కల్గిన జ్ఞానోదయమో ఇది అనిపిస్తుంది. అయితే ఈ మాటల కిందనే అటవీ వాసులు, దీర్ఘకాలంగా కోరుతున్న అటవీ హక్కులను వారికి ఈయవలసిన అవసరం ఏర్పడింది అని కూడా అన్నారు. అసలు విషయం ఇది! ఈ చట్టం చేయవల్సిన ఒక అగత్యం పాలకుల ముందుకొచ్చింది.

ముందే చెప్పుకున్నట్టు పాలకులు మొదటి నుంచీ ఆదివాసీలను దొంగలుగానే చూశారు. అటవీ సంపదకు (తమ

సంపదకు) ఆదివాసీల ఉనికే హానికరం అన్నట్టుగా ప్రవర్తించారు. దీనికి తోడు, పాలకవర్గాలకు వంతలైన కొన్ని పర్యావరణ సంస్థలు కూడా, ఆదివాసీలు అడవిని నరకడం వల్లే పర్యావరణం దెబ్బతింటున్నదనీ, వేటాడం వల్ల వన్య ప్రాణులు అంతరించిపోతున్నాయనీ ప్రచారానికి పూనుకున్నాయి. ఈ ప్రచారం ప్రభావం ఎప్పుడూ అడవులను చూడని, ఆదివాసీ జీవన విధానం తెలియని మేధావి వర్గం మీద బాగానే వుంది.

అయితే ఆదివాసీ ప్రజలు ఈ తీవ్రమైన ప్రతికూల పరిస్థితులకు ఎన్నడూ తలవంచలేదు. తమ హక్కులను కాలరాస్తున్న పాలక వర్గాలతో పోరాడుతూనే వున్నారు. అధికార మార్పిడికి ముందు తెలంగాణాలో నిజాంకు వ్యతిరేకంగా కొమురం భీం పోరాటం, బ్రిటీష్ వాళ్లకు వ్యతిరేకంగా మన్యంలో అల్లూరి పోరాటం, బస్తర్‌లో గుండాధూర్ పోరాటం, ఝార్ఖండ్‌లో బిర్సాముండా పోరాటం... ఇటువంటి మరెన్నో పోరాటాలు తలవంచని ఆదివాసీల వీరత్వానికి చారిత్రక ఆధారాలు. అధికార మార్పిడి తర్వాత సహజంగానే ఆదివాసీలపై దోపిడీ మరింతగా, మరిన్ని రూపాల్లో పెరిగింది. ఈ దోపిడీకి వ్యతిరేకంగా నక్సల్బరీ వెలుగులో మొదట శ్రీకాకుళం ఆదివాసీలు పోరుబాట పట్టారు. ప్రభుత్వం తీవ్రమైన దమనకాండను అమలుచేసి ఆ పోరాటాన్ని అణచివేసింది. అయితే ఆ పోరాటం ద్వారా ఆదివాసీల్లో పెలుబుకుతున్న స్వాతంత్ర్య కాంక్షా, పాలకవర్గాల వ్యతిరేకతా ప్రభుత్వానికి అర్థమైంది. దాన్ని అణచడానికి సాయుధ హింస ఒక్కటే సరిపోదని కూడా దానికి అర్థమయింది. అందుకే అది ఆంధ్రప్రదేశ్‌లో 1/70 అనే చట్టం తెచ్చింది. ఆదివాసీల భూమిని ఆదివాసేతరులు ఆక్రమించుకోవడాన్ని నిరోధించడానికి ఈ చట్టం ఉద్దేశించబడింది. ఇదే కాలంలో ఇతర రాష్ట్రాల్లో కూడా ఇటువంటి చట్టాలు తయారయ్యాయి. అయితే వాటిని చేసింది కంటితుడుపుకే కాబట్టి, నిజంగా అమలు చేసే వుద్దేశ్యం పాలకవర్గాలకు స్వభావరీత్యానే వుండదు కాబట్టి, ఈ చట్టాలన్నీ కాగితాలకే పరిమితమైనాయి. దానితో కొమురం భీం, అల్లూరి, గుండాధూర్, బిర్సాముండా వంటి మరెందరో ప్రారంభించిన పోరాటం నేడు దేశవ్యాప్తంగా ఒక స్పష్టమైన సైద్ధాంతిక వెలుగులో కొనసాగుతోంది. ప్రధానంగా ఈ పోరాటం మావోయిస్టు పార్టీ నాయకత్వంలో 'అడవిపై హక్కు ఆదివాసీలదే' అనే లక్ష్యంతో సాగుతోంది. మావోయిస్టు పార్టీని అణచడానికీ, తద్వారా ఆదివాసీల హక్కులనూ కాలరాయడానికి, పాలకవర్గాలు పాల్పడని హింసా రూపంలేదు. అయినా అవి విజయం సాధించలేదు. నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో ప్రభుత్వాలపై, ఇక్కడి అడవులపై కన్నువేసిన బహుళజాతి కంపెనీ (ఎం.ఎన్.సి.)ల వత్తిడి పెరుగుతుండడంతో, నేడు ఆదివాసీ ప్రాంతాలు యుద్ధ భూములుగా మారాయి. ఈ యుద్ధ భూములను ఎం.ఎన్.సి.లకు అనుకూలంగా మార్చడం, కేవలం నిర్బంధం ద్వారానే సాధ్యం కాదని ప్రభుత్వాలకు ఎప్పుడో అర్థమైన విషయం. అందుకే ఆదివాసీలను పోరు మార్గం నుంచి పక్కదారి పట్టించడానికి ప్రభుత్వం అటవీ హక్కుల చట్టాన్ని ఆయుధంగా ప్రయోగించదల్చుకుంది. అంతేకాదు ఆదివాసీలపై ప్రభుత్వాలు ప్రయోగిస్తోన్న హింస పట్ల ప్రజాస్వామిక వాదుల్లోనూ, ఉదారవాద మేధావుల్లోనూ వ్యతిరేకత వస్తోంది. ఆదివాసీల స్వయం ప్రతిపత్తిని గుర్తించాలనీ, అటవీ హక్కులను కల్పించాలనీ ప్రజాస్వామిక వుద్యమాలు కూడా బాగానే జరుగుతున్నాయి. ఇలా ఈ పోరాటాలన్నింటి వల్ల ప్రభుత్వానికి 'అటవీ హక్కు' చట్టాన్ని తీసుకురావల్సిన అవసరం ఏర్పడింది.

ఇలా ఆదివాసీలను నిజమైన హక్కుల సాధన మార్గం నుండి పక్కదారి పట్టించడం కోసం తెచ్చిన ఈ చట్టాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విపరీతంగా ప్రచారం చేసుకుంటున్నాయి. ఎ.పి.లో రాజశేఖర్ రెడ్డయితే తానే ఈ చట్టాన్ని తెచ్చినంత గొప్పలు పోతున్నాడు. పత్రికలు కూడా తరతరాల ఆదివాసీల కలలు తీరిపోయినట్టుగా రాస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ చట్టంలోని లోపాలను చెప్పుకుందాం.

ఈ చట్టం ఎవరికి వర్తిస్తుంది అనేది స్పష్టంగా లేదు. చట్టం పేరులో షెడ్యూల్డ్ తెగలు అని వున్నప్పటికీ, నిర్వచనాల్లో 'అటవీ నివాస షెడ్యూల్డ్' అనే పదాన్ని వుపయోగించి, నిర్వచించారు. దీని ప్రకారం అడవి లోపల జీవిస్తూ, ఆధారపడిన షెడ్యూల్డ్ తెగలకు ఈ చట్టం వర్తిస్తుంని కొందరు అంటుంటే, అడవి లోపలే కాక అడవి సమీపంలో నివసిస్తూ, అడవిపై ఆధారపడిన షెడ్యూల్డ్ తెగలకూ ఈ చట్టం వర్తిస్తుందని మరి కొందరు అంటున్నారు. ఈ అస్పష్టత వల్ల ఆదివాసీలు కోర్టుల చుట్టూ తిరుగుతూ తమ కాలాన్నీ, డబ్బునూ వృథా చేసుకోవాల్సి వస్తుంది.

49 రకాల మైనర్ అటవీ వుత్పత్తులపై ఆదివాసీల హక్కును గుర్తించిన ఈ చట్టం, ఆదివాసీల వేట హక్కునూ, గృహ అవసరాల కోసం కలప నరికే హక్కునూ గుర్తించలేదు. ఆదివాసీల వినియోగం వల్లనే అడవులూ, వన్యమృగాలు తరిగిపోతున్నాయన్న వాదనకు సాధికారత కల్పించడం ఇది. అంతేకాదు మార్కెట్ కోసం అడవుల్ని నరకడం, జంతువులను వేటాడ్డం మొదలైన తర్వాత అడవుల క్షీణత మొదలైందని విస్మరించడం కూడా ఇది. మార్కెట్ కోసం పెద్ద ఎత్తున అడవిని ధ్వంసం చేసే స్మగ్లర్లకూ, గనులను తవ్వడం ద్వారా పెద్ద ఎత్తున పర్యావరణాన్ని నాశనం

చేస్తోన్న కంపెనీలకు తలవంచుతున్న ప్రభుత్వాలు గృహ వినియోగం కోసం చెట్లు నరకొద్దనీ, జంతువుల్ని వేటాడొద్దనీ ఆదివాసీల మీద ఆంక్షలు పెడ్తూ పర్యావరణ పరిరక్షకుల ఫోజు పెడ్తున్నాయి.

ఈ చట్టం మూడు తరాలుగా అడవుల్లో నివాసముంటున్న ఆదివాసేతరులకు పట్టాలివ్వాలని చెప్తుంది. అడవుల్లో నివాసముంటున్న పేద, మధ్య తరగతి ఆదివాసేతరులకు పట్టాలివ్వడం సరైందే. కానీ ఈ చట్టాన్ని అడ్డుపెట్టుకొని, ఆదివాసేతరులకు పట్టాలు ఇచ్చే పేరుతో, ఎ.పి.లో 1/70 చట్టాన్ని నీరుకార్చే ప్రయత్నం చేస్తుంది. ఆదివాసేతర ధనిక వర్గాలకు కూడా భూములు కట్టబెట్టే ప్రయత్నం చేస్తుంది. ఈ ఉద్దేశ్యంతోనే ఆదివాసేతర కాంట్రాక్టర్లకూ, వ్యాపారులకు అటవీ భూములపై హక్కులు వర్తించకుండా వుండడానికి ఓ క్లాజ్ చేర్చాలనే నిపుణుల సూచనను ప్రభుత్వం తోసిపుచ్చింది.

ఈ చట్టంలోని తీవ్రమైన ఆదివాసీ వ్యతిరేక అంశమేమంటే, ఆదివాసీ స్వయం పాలనాధికారంలో కీలకమైన, గ్రామసభ అధికారాన్ని ఈ చట్టం గుర్తించడం లేదు. ఇప్పటిదాకా ఏ అటవీ వనరులపై ఎవరికి హక్కు వుండాల్నో నిర్ణయించే అధికారం గ్రామసభదే. ఈ గ్రామసభ ఒక గ్రామం పరిధిలోనే ఏర్పడుతుంది. 1996లో వచ్చిన పీసా [ప్రావిన్స్ ఆఫ్‌ది పంచాయత్స్ (ఎక్స్‌టెన్షన్ టుది షెడ్యూల్డ్ ఏరియాస్)] చట్టం కూడా, ఒక గ్రామాన్నే గ్రామసభకు ప్రాతిపదికగా తీసుకోవాలని నొక్కి చెప్పింది. కానీ ప్రస్తుత అటవీ హక్కుల చట్టం గ్రామసభ అంటే పంచాయితీ గ్రామసభగా నిర్వచించింది. అంటే ఒక పంచాయితీలోని 10-12 గ్రామాల పరిధిలో గ్రామసభ ఏర్పడుతుంది. ఇది ఇన్నాళ్ల గ్రామ సభను నిర్వీర్యం చేయడమే. ఎందుకంటే దూరం దూరంగా వుండే 10-12 గ్రామాల పరిధిలో గ్రామసభలు సమావేశం కావడమూ, భావసారూప్యత సాధించడమూ, ఒక నిర్ణయాత్మక పాత్రను వహించడమూ చాలా కష్టంతో కూడుకున్నది. ప్రస్తుతం వున్న పీసా చట్టాన్నీ, గ్రామ సభలను నిర్వీర్యం చేయడానికి ప్రభుత్వం ఒక పథకం ప్రకారమే ప్రయత్నించింది. ఎందుకంటే, పీసా చట్టం అమల్లోకి వచ్చాక, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో భూసేకరణ చట్టం, ఖనిజ వనరుల అభివృద్ధి నియంత్రణ చట్టం, అటవీ సంరక్షణ చట్టం, భారత రిజిస్ట్రేషన్ చట్టం వంటివన్నీ రద్దయినట్టే లెక్క. అన్ని విషయాల్లోనూ నిర్ణయాలు తీసుకునే హక్కు గ్రామసభలకే వుంటాయి. అంటే ఈ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నా, గనులు తవ్వుకోవాలన్నా చట్టం ప్రకారమయితే గ్రామసభలు ఆమోదించాలి. తమకు నష్టదాయకంగా వుండే పరిశ్రమలు, గనులను ఎలాగూ గ్రామసభలు ఆమోదించవు. కానీ చాలా సందర్భాల్లో గ్రామసభలను సంప్రదించకుండానే ప్రభుత్వం పెట్టుబడిదారులను ఆహ్వానిస్తోంది. ఇప్పుడు ఆయింత కాగితాల్లో వున్న అడ్డంకిని కూడా తొలగించాలని చూస్తోంది.

ఇన్ని లొసుగులూ లోపాలతో వున్న ఈ చట్టాన్నయినా అమలు చేయడానికి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నది స్పష్టం. ఎందుకంటే 2005 మేలో బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడ్తే 2006 డిసెంబర్‌లో దాన్ని పార్లమెంట్ ఆమోదించింది. ఆమోదించిన సంవత్సరం తర్వాత అంటే 2008 జనవరి నుండి దీన్ని అమలులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. పార్లమెంటు ఆమోదించిన తర్వాత సంవత్సరం దాకా అమలు చేయకపోవడానికి ప్రభుత్వానికి లోపించింది చిత్తశుద్ధి మాత్రమే. పైగా ఆదివాసీలకు అటవీ హక్కులు ఇవ్వడమంటే తమ సొమ్మేదో పోయినట్టు భావించే ఎం.ఎన్.సి.లకూ, కొన్ని పర్యావరణ సంస్థలకూ కూడా ఈ ఆలస్యంతో సంబంధం వుంది. ఇప్పటికైనా ఇది అమల్లోకి వచ్చిందంటే ఈ సంవత్సరంలో ఎన్నికలు జరుగబోవడమే కారణం.

ఆదివాసీలపై ప్రభుత్వాలకు హఠాత్తుగా పుట్టిన ఈ 'ప్రేమ'ను మరికొంచెం అర్థం చేసుకోవడానికి మరో రెండు విషయాలను కూడా చెప్పుకుందాం. ఆదివాసీలకు హక్కులిచ్చే ప్రదాతలుగా గొప్పలు పోతున్న పాలకులు, ఈ చట్టాన్ని బిల్లు రూపంలో పార్లమెంట్లో ప్రవేశపెట్టిన వెంటనే, బస్తర్ ఆదివాసీలపై సల్వాజుడుం విధ్వంసకాండను ప్రారంభించారు. ఆదివాసీలను తమ గడ్డ నుంచి తరిమి తరిమి కొట్టే ప్రయత్నం చేశారు. నల్లమల అడవుల్లో గ్రేహౌండ్స్ హత్యాకాండను ముమ్మరం చేశారు. అక్కడి చెంచులను అడవి నుంచి తరిమి కొట్టారు. బిల్లు రూపంలో వున్నప్పుడూ, చట్టం అయిన తర్వాతా కూడా మన్యం అడవుల్లో ఆదివాసీలను నిర్వాసితులను చేసే బాక్సైట్ వెలికితీతకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. బాక్సైట్ వ్యతిరేకపోరుపై తీవ్రంగా అణచివేతను కొనసాగిస్తోన్నారు. దాంట్లో భాగంగానే 11 మంది ఆదివాసీ మహిళలను అత్యాచారాలు చేశారు. ఈ చట్టం అమలుకు సిద్ధమైన తర్వాతనే, పోలవరం ప్రాజెక్టుకు వున్న అన్ని అడ్డంకులను, సుప్రీం కోర్టు తన తీర్పు ద్వారా తొలగించేసింది.

ఇక చెప్పుకోవాల్సిన మరొక విషయం, కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ఆమోదించిన కొత్త జాతీయ ఖనిజ విధానం గురించి. రాబోయే ఆరేళ్ల(2008-2014)లో గనుల రంగంలో 5 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను ఆకర్షించడం ఈ కొత్త జాతీయ ఖనిజ విధానపు లక్ష్యం. ఇప్పటి వరకూ కార్పోరేట్ సంస్థలకూ, బహుళజాతి సంస్థలకు నామమాత్రంగా వున్న ఆటంకాలను కూడా

ఈ విధానం ద్వారా తొలగించి సామ్రాజ్యవాద, పెట్టుబడిదారుల దోపిడీకి మరింతగా మార్గం సుగమం చేసింది ప్రభుత్వం.

1980 నాటి అటవీ చట్టం ప్రకారం అడవులను నాశనం చేయకుండా గనుల కంపెనీలు కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖల అనుమతి పొందాల్సి వుండె. అందుకే 1980-1997 మధ్యకాలంలో ఏటా 19 అటవీ అనుమతులు మంజూరయ్యేవి. 1993 జాతీయ విధానం ఫలితంగా 1998-2005 మధ్య కాలంలో, ఈ అనుమతుల సంఖ్య ఏటా 216కు పెరిగింది. 1995-2005 మధ్యకాలంలో 74 వేల హెక్టార్ల అటవీ భూమిని ఖనిజ తవ్వకాల కోసం గనుల కంపెనీలు నాశనం చేశాయి. 1951-1990 మధ్య కాలంలో 25 లక్షల మంది ఆదివాసులు మైనింగ్ ప్రాజెక్టుల కారణంగా నిర్వాసితులయ్యారు. 1991 నుండి ఇప్పటి వరకు మరిన్ని లక్షల మంది ఆదివాసులు నిర్వాసితులయ్యారు. ఈ నిర్వాసితుల సమస్యను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ఆదివాసీ బతుకులను బుగ్గిపాలు చేయడానికే కొత్త జాతీయ విధానాన్ని రూపొందించారు.

ఇలా ఒకవైపు అటవీ హక్కులను కల్పిస్తామంటూ, మరోవైపు ఆదివాసీలను తమ గడ్డ నుంచి తరిమేసే చర్యలను ఎందుకు అమలు చేస్తున్నట్టు? ఈ వైరుధ్యానికి కారణమేంటి అని కొందరికి ఆశ్చర్యం కల్గవచ్చు.

కానీ ఇందులో వైరుధ్యం ఏమీ లేదు. అటవీ చట్టం దృగ్గోచరమైతే, ప్రజలను నిర్వాసితులను చేసే చర్యలు దాని అంతస్సారం.

భూమి సమస్యకూ, రాజ్యాధికారానికీ వున్న సంబంధాన్ని గుర్తించి, రాజ్యాధికార పోరాటంలో భాగంగా భూమి సమస్య పరిష్కారమవుతుందనే చైతన్యంతో నేడు ప్రజలు విప్లవోద్యమంలో చేరి పోరాడుతున్నారు. రాజ్యాధికార పోరాటంతో సంబంధం లేకుండానే కేవలం చట్టాల ద్వారానే భూమి సమస్య పరిష్కారమవుతుందని ప్రజలను భ్రమల్లో ముంచెత్తి పోరాటాల నుండి పక్కదారి పట్టించడం దాని వుద్దేశ్యం. అంతేకాదు ఆదివాసీ, ఆదివాసేతర భూస్వాములకూ పెత్తందారులకూ ఎక్కువ భూములిచ్చి భూస్వామ్య వర్గాన్ని స్థిరీకరించి తమ సామాజిక పునాదిగా దోపిడీ వర్గాలు నిలబెట్టుకుంటాయి. మొత్తంగా ఈ చట్టం ద్వారా ఆదివాసీ ప్రాంతాలను ఆర్థికంగా, రాజకీయంగా, చట్టపరంగా పూర్తిగా అర్ధవలస - అర్ధ భూస్వామ్య వ్యవస్థలో సంలీనం చేయడానికి ప్రభుత్వం పూనుకుంది.

ఇలా ఆదివాసీ ప్రజలను పోరాటాల నుండి పక్కదారి పట్టించడం ద్వారా, ఆదివాసీ ప్రాంతంలో తన దోపిడికి సామాజిక పునాది ఏర్పర్చుకోవడం ద్వారా, ఆదివాసీ ప్రాంతాల్లోని పోరాటాలను చల్లార్చి, బహుళజాతి కంపెనీల, కార్పోరేట్ సంస్థల దోపిడీకి ఆటంకాలను తొలగించి తద్వారా ఆదివాసీ ప్రజలకు తీరని అన్యాయం తలపెట్టడానికి ప్రభుత్వం పూనుకుంది.

కనుక ఈ చట్టం ద్వారా తమ భూమి సమస్య పరిష్కారం కాదని ఆదివాసీ ప్రజానీకం గుర్తించాలి. రాజ్యాధికారంలో భాగస్వామ్యాన్ని పొందడం ద్వారానే తమ అన్ని సమస్యలు పరిష్కారమవుతాయనే చైతన్యంతో ఆ దిశగా మరింతగా పోరాటాల్లో భాగస్వాములు కావాలి.

ఈ చట్టం నేపథ్యంలో విప్లవోద్యమ కర్తవ్యం ఏంటి? విప్లవోద్యమం దేశంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లో అభివృద్ధి చెందివున్న పరిస్థితుల్లో ఈ చట్టం పట్ల అన్ని ప్రాంతాల్లో ఒకే వైఖరిని అవలంభించలేము. కనుక విప్లవోద్యమం గణనీయంగా అభివృద్ధి చెంది, విప్లవ ప్రజా ప్రభుత్వాలు ఏర్పడి వున్నచోట, ప్రభుత్వం ఇచ్చే పట్టాలను వ్యతిరేకించాలి. ప్రజా ప్రభుత్వాలే పట్టాలు ఇవ్వాలి. అయితే మిగితా చోట్ల పట్టాలను వ్యతిరేకించమనే పిలుపును ప్రజలకు ఇవ్వలేం. ప్రజలకు పట్టాల మీద గట్టి నమ్మకముంటుంది. కాబట్టి గెరిల్లా జోన్ ప్రాంతాల్లో పట్టాల పంపిణీలో జరిగే అవకతవకలకు వ్యతిరేకంగా పోరాటాలు చేపట్టాలి. ప్రజల ఆక్రమణలో వున్న భూములన్నింటికీ పట్టాలివ్వాలని డిమాండ్ చేయాలి. ప్రజల అటవీ హక్కును భంగం కల్గించేలా ప్రభుత్వాలు పలు కార్పోరేట్, బహుళజాతి సంస్థలతో చేసుకున్న ఒప్పందాల రద్దు కోసం పోరాడాలి. అనర్హులైన ఆదివాసేతరులకు పట్టాలివ్వకుండా పోరాడాలి. విప్లవోద్యమం చెప్పుకోతగిన స్థాయిలో లేని, అసలేమాత్రమూలేని అటవీ ప్రాంతాల్లో ప్రభుత్వం పట్టాలివ్వడానికి ఎంత మాత్రమూ సిద్ధపడదు. అటువంటి ప్రాంతాల్లో పట్టాల కోసం పోరాడమని ప్రజలకూ, ప్రజాస్వామిక సంఘాలకూ పిలుపునివ్వాలి.

ఈ చట్టంలోని అనుకూల అంశాలు ప్రజా పోరాటాల ఫలితమేనని ప్రచారం చేస్తూ, ఈ చట్టంలోని లొసుగులను, వ్యతిరేక అంశాలను ఎండగట్టాలి. ముఖ్యంగా పీసా చట్టం వంటి వాటిని తుంగలో తొక్కే ప్రయత్నాన్ని వ్యతిరేకించాలి. పీసా చట్టం అమలుతోపాటు జల్, జంగల్, జమీన్‌లపై ఆదివాసీల అధికారం కోసం పోరాడాలి. ★

**అడవి మీద సర్వాధికారాలు ఆదివాసులకే! ఆదివాసీలను నిర్వాసితులను చేసే అన్ని ఒప్పందాలను రద్దు చేసుకోవాలి!!**

# ఝార్ఖండ్‌లో రాజ్యహింసకు వ్యతిరేకంగా కదిలిన మహిళలు

బీహార్-ఝార్ఖండ్‌లలోని విప్లవోద్యమంలో మహిళలు ఒక ముఖ్యమైన పాత్రను వహిస్తున్నారు. విప్లవోద్యమానికి సానుభూతిపరులుగా వుండడం నుంచీ, ప్రజాసంఘాలలో సంఘటితమవ్వడం, వాటికి నాయకత్వం వహించడం, దళాలలో చేరడం, నాయకత్వం వహించడం, దేశవ్యాప్త వుద్యమానికి నాయకత్వం వహించే వున్నతస్థాయి కమిటీల నాయకత్వంలో భాగస్వామ్యం వహించడం వరకూ వివిధ స్థాయిలలో మహిళలు గణనీయమైన పాత్ర వహిస్తున్నారు. విప్లవోద్యమాన్ని అణచివేయడానికి ఇప్పుడు కేంద్రం నేరుగా నాయకత్వం వహించడంతో స్థానిక స్థాయిలోని పోలీసులు కూడా ప్రజలపై తమ దాడులను వుధృతం చేశారు.

బొకారో జిల్లాలోని గ్రామాలపై అనేకసార్లు విప్లవకారులను పట్టుకోవడం కోసం అనే పేరుతో పోలీసులు, వుద్యమానికి సహకారంగా వుంటున్నారని భావించిన కుటుంబాలపై దాడులు చేసి స్త్రీలను వేధించడం ఒక పనిగా పెట్టుకొన్నారు. నవాడీ పోలీసు స్టేషన్‌కు చెందిన స్టేషన్ ఆఫీసర్ ప్రమోద్ సింగ్ ఈ విషయంలో రెండాకులు ఎక్కువే చదివాడు. ఇతను అత్యుత్సాహం ప్రదర్శించి జూన్ 2007లో కొన్ని వరుస దాడులు చేశాడు. 25 జూన్ 2007న తెల్లవారుఝామున మూడు గంటలకు తన సిబ్బందిని తీసుకుని డిగాగఢ్ పంచాయితీలోని బొన్‌కెత్తా గ్రామానికి వెళ్లాడు. మావోయిస్టు పార్టీ దళాలు అక్కడ సంచరిస్తున్నాయని సమాచారం వుందని చెప్పుకుంటూ మొదలు మహిలాల్ వాస్కో ఇంటికి వెళ్లాడు. మహిలాల్‌ను విపరీతంగా కొట్టారు. అతని 18 ఏళ్ల కూతురు ఫూల్‌మునిదేవి కూడా ఇంట్లోనే వుంది. నక్సలైట్ల ఆచూకీ ఆమెకు తెలుసునని తమకు చూపాలని ఆమెని వత్తిడి చేశాడు. తాను వుదయమే ఏడు గంటలకంతా వేరే గ్రామానికి పనికి పోతానని, మళ్లీ సాయంత్రం వరకూ రానని, కాబట్టి ఆ విషయాలు తనకేమీ తెలీదని ఆమె జవాబిచ్చింది. ఈ జవాబు వినగానే ఆమెను పట్టుకొని విపరీతంగా కొట్టడం మొదలుపెట్టాడు. "నేనెవరో తెలుసా? ప్రమోద్ సింగ్‌ని, వాళ్ల ఆచూకీ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారు" అని బెదిరించాడు. తనకేం తెలీదనీ తనని వదిలిపెట్టమని ప్రాధేయపడినా ఫూల్‌మునిని జుట్టుపట్టి రోడ్డు వెంట ఈడ్చుకొంటూ దగ్గరలో వున్న అడవిలోకి తీసుకుపోయాడు. దారంతా ఆమెను బూతులు తిట్టుకుంటూ, రేప్ చేస్తానని బెదిరించాడు. అడవిలోకి వెళ్లాక ఒక పోలీసు, ఆమె చేతులు గట్టిగా పట్టుకోగా ఇంకొకడు ఆమె బట్టలిప్పి, నగ్నంగా చెట్టుకి తలకిందులుగా ఆమె చీరతోనే వేలాడదీసి విపరీతంగా కొట్టారు. తర్వాత ఆమెను చెట్టునించి దింపి కింద పడుకోబెట్టి, ఒకడు కాళ్లు, మరొకడు చేతులు, గట్టిగా పట్టుకొని వుండగా ప్రమోద్‌సింగ్ ఆమెపై అత్యాచారం చేశాడు. సహాయం కోసం ఆమె గట్టిగా అరుస్తుండడంతో నోట్లో గుడ్డలు కుక్కి, ఒకరి తరువాత ఒకరు ఆమెపై అత్యాచారం చేశారు. స్పృహ కోల్పోయిన ఫూల్‌మునిని వదిలి వెళ్లిపోయారు. అదేరోజు చోల్కిదేవి, సీతు ముర్ము, బిర్సా ముర్ములను కూడా విపరీతంగా కొట్టారు.

జూన్ 30వ తేదీన మళ్లీ ఇదే ప్రమోద్‌సింగ్, కోటి గ్రామానికి రాత్రి 8 గంటల ప్రాంతానికి వెళ్లాడు. 39 ఏళ్ల సీతాదేవి తన పిల్లలతో కలిసి భోంచేస్తుండగా వెళ్లి తలుపు కొట్టాడు. ఆమె ఒక్క క్షణం ఆగమని అన్నం తింటున్నామని అనగానే తలుపులు బద్దలు కొట్టుకొని లోపలికి వెళ్లాడు. ఆమె భర్త గురించి వాకబు చేశాడు. అతను పని వెతుక్కుంటూ వేరే రాష్ట్రానికి వెళ్లాడని చెప్పగానే, ఆమెను పట్టుకొని కొట్టాడు. చాలా అసహ్యకరమైన తిట్లు తిట్టాడు. పిల్లలు భయంతో లోపలి గదిలో దాక్కున్నారు. ఆమెను లోపలి గదిలోకి లాక్కువెళ్లి అత్యాచారం చేయబోయాడు. పిల్లలు అదే గదిలో మూలన వుండి చూశారు. తల్లిని రక్షించుకోవడం కోసం ఒక్కసారిగా వాళ్లంతా అతని మీద పడి కొట్టడం మొదలుపెట్టారు. వారిలో సీతాదేవి 16 ఏళ్ల కూతురు చిమియా కుమారి కూడా వుంది. వాడు ఆమెను పట్టుకొని కొట్టి బట్టలు లాగేశాడు. తర్వాత డబ్బులు దాచుకున్న పెట్టెను పగులగొట్టి 2 వేల 500 రూపాయలను కూడా ఎత్తుకుపోయాడు.

తరువాత అక్కడ్నించి టేక్‌లాల్ సింగ్ ఇంటికి వెళ్లాడు. అతను ఇంట్లో లేకపోవడంతో అతని భార్య ప్యారోదేవిని పట్టుకొని కొట్టాడు. ఆమెపై అత్యాచార ప్రయత్నం చేయగా ఆమె బిడ్డ సరితా కుమారి తల్లికి సహాయంగా నిలబడి గట్టిగా ప్రతిఘటించింది. దాంతో వాడు సరితను విపరీతంగా కొట్టాడు. ఇద్దరూ తర్వాత హాస్పటల్లో చేర్పించవలసినంత తీవ్రంగా గాయపడ్డారు. ఆ ఇంట్లోంచి ఒక మొబైల్ ఫోన్, 200 రూపాయలు ఎత్తుకుపోయాడు. మరో ఇంట్లోంచి 600 రూపాయలు ఎత్తుకుపోయాడు. అదే రాత్రి 11.30 గంటలకి జానకీ తురి ఇంటికి వెళ్లి అతనినీ, అతని భార్యనీ కొట్టాడు. గోబిందే తురి ఇంటికి వెళ్లి అతను ఇంట్లో లేకపోవడంతో అతని భార్య సుశీలా దేవిని కొట్టాడు. ఆమెను లోపలి గదిలోకి తోసి చీరలాగేశాడు. ఆమె గట్టిగా అరవడంతో ఆమె మేనకోడలు రేష్మీ కుమారి అతనిని అడ్డుకోవడానికి ప్రయత్నించింది. ఆమెను పట్టుకొని తల గోడకేసి కొట్టాడు.

అక్కడ్నించి భూక్లిదేవి ఇంటికి వెళ్లాడు. ఆమె భర్త నీలకంఠ్ ఇంట్లో లేడు. ఆమె తన చిన్న బిడ్డతో ఇంట్లో నిద్రపోతున్నది. ఆమెను ఏమీ అడక్కుండానే కొట్టడం మొదలుపెట్టాడు. భయపడిపోయిన పాప గట్టిగా ఏడవడం మొదలుపెట్టింది. దాంతో వాడు ఆ పాప నోట్లో లాఠీ పెట్టి, ఏడిస్తే కిరసనాయిలు పోసి ఇద్దరినీ తగలబెట్టేస్తానని బెదిరించాడు. బిక్కచచ్చిపోయిన పాప ఏడవడానిక్కూడా భయపడి స్థాణువులా వుండిపోయింది. అప్పుడు భూక్లిదేవిని నీలకంఠ్ ఎక్కడ? అని అడిగాడు. "ఈ మాట కొట్టక ముందు అడగాల్సింది'' అందామె కోపంగా. ఇక పిచ్చెక్కినట్టుగా ఆమెను స్పృహ తప్పే వరకూ కొట్టాడు. ఆమె కేకలు విని వచ్చిన ఆమె బంధువు బుంది దేవిని కూడా కొట్టాడు.

దాదాపుగా దెబ్బలు తిన్న మహిళలందరూ హాస్పిటల్‌కు వెళ్లాల్సి వచ్చింది. దానికన్నా ఎక్కువగా స్త్రీల పట్ల వాడి ప్రవర్తనకు మహిళలంతా రగిలిపోయారు. ఫూల్‌ముని దాదాపు నెల రోజులు హాస్పిటల్లోనే వుండాల్సి వచ్చింది. ఈ సంఘటనలు జరిగిన తొలి రోజుల్లో అందరూ భయంగా, అసహాయంగా వుండిపోయారు. సంగతి తెలుసుకున్న నారీ ముక్తి సంఘం (ఎన్.ఎం.ఎస్.), ఝూర్ఖండ్ ముక్తి మంచ్, ఝూర్ఖండ్ లిబరేషన్ ఫ్రంట్ (జె.ఎల్.ఎఫ్.), ఆర్.డి.ఎఫ్. కార్యకర్తలు ఈ గ్రామంలో తిరిగి క్యాంపెయిన్ చేశారు. ఇంటింటికీ వెళ్లి ధైర్యం చెప్పారు. కలిసి పోరాడుదామన్నారు.

మావోయిస్టు పార్టీ కూడా బాధిత మహిళలకు తాము అండగా వున్నామని, ప్రమోద్ సింగ్‌కు వ్యతిరేకంగా పోరాడాలనీ, అతనికి శిక్ష తప్పదని ప్రకటనలు ఇచ్చింది. పోస్టర్లు వేసింది. "ఫూల్‌మునీ నీవు వంటరివి కాదు. నీకు అండగా ప్రజా విముక్తి సైన్యం వుంది. ధైర్యంగా పోరాడు'' అన్న పోస్టర్లు అంతటా పడ్డాయి. ఈ వుత్తేజకర వాతావరణంలో జులై 17న పెద్ద ఎత్తున ప్రజలు రోడ్ల మీదకొచ్చి పోలీసుల అత్యాచారాలకు వ్యతిరేకంగా ప్రదర్శన నిర్వహించారు. పార్లమెంటరీ పార్టీలు సైతం కదలక తప్పలేదు. బాధిత మహిళలంతా జరిగిన విషయాలు పూసగుచ్చినట్టు వివరంగా రాసి పత్రికలకి ఇచ్చారు. గవర్నరు దగ్గరికి వెళ్లి నివేదిక ఇచ్చారు. డి.జి.పి.ని కలిశారు. మీడియా కూడా ఫూల్‌ముని చెప్పిన హృదయవిదారక కథనాన్ని ప్రచురించాయి. "గవర్నరుతో విషయం వివరిస్తూ పొగిలి పొగిలి ఏడ్చింది ఫూల్ ముని'', "గుండెలు బద్దలయ్యేలా రోధించింది'' అంటూ చాలా వివరంగా రాసాయి. అంతావిన్న డి.జి.పి. మాత్రం అడవిలో ఎవ్వరూ లేని చోటికి తీసుకుపోయి చేసిన అత్యాచారానికి 'తగిన సాక్ష్యం' వుంటే తప్ప తానేం చేయలేనని ప్రకటించాడు.

ప్రమోద్ సింగ్‌ని రక్షిస్తున్న డి.జి.పి. చర్యలను ఖండిస్తూ, ప్రమోద్ సింగ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ప్రదర్శనకారులు డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ర్యాలీ అయిపోయిన తరువాత సభ జరుపుతుండగా ప్రదర్శనకారుల్లోని ఎన్.ఎం.ఎస్. నాయకురాలు శాంతిని, రైతు సంఘం కార్యకర్త నీకుచంద్‌ని పోలీసులు అరెస్టు చేశారనే సంగతి తెలిసి, ఆగ్రహం చెందిన మహిళలు పోలీసు స్టేషన్‌ను ముట్టడించారు. పోలీసులను ఘెరావ్ చేశారు. తమ కార్యకర్తలను వదలకపోతే వూరుకునేది లేదని చాలా రాత్రి వరకూ స్టేషన్ ముందు బైఠాయించారు. వారికి ఏ హానీ తలపెట్టమని మాట ఇచ్చాకనే ఇళ్లకు వెళ్లారు. చివరకు ఐదు రోజుల తరువాత వారిని విడుదల చేశారు. ప్రమోద్ సింగ్‌ను సస్పెండ్ చేశారు.

ఫూల్‌ముని దేవిని కోర్టుకు రాకుండా చేయాలని ప్రమోద్ సింగ్ తొత్తులు కొందరు ఆమె ఆచూకీ కోసం విశ్వప్రయత్నం చేశారు. కానీ ఫూల్‌మునిని ప్రజలు భద్రంగా తమ రక్షణలో వుంచి కాపాడారు. అంతేకాదు ఇకపై పోలీసులను తమ గ్రామంలో అడుగుపెట్టనివ్వమని గట్టిగా ప్రకటించారు. సంఘటిత శక్తి ఎంత బలమైన రాజ్యాంగాన్నైనా నిలువరించగలదని ఈ మహిళలు నిరూపించారు. ★

*(56వ పేజీ తరువాయి...)*

5న ఉత్తర షెన్సీలోని అన్‌సాయి కౌంటీలో పర్వతాల్లో బొగ్గును తయారుచేస్తూ, హఠాత్తుగా బొగ్గు గుట్ట కూలి పడడం వల్ల మరణించాడు.

2. జుమా చియెన్ క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దానికి చెందిన ప్రఖ్యాత చైనా చిత్రకారుడు. ఆయన "చరిత్ర రికార్డులు'' రచయిత. "ఝెన్-షావో-చింగ్ వుత్తరానికి జవాబు'' అనే రచన నుండి ఈ మాటలను తీసుకోవడం జరిగింది.

3. లీ తింగ్-మింగ్ ఉత్తర షెన్సీ రాష్ట్రానికి చెందిన వివేకవంతుడైన భూస్వామి. అతను ఒకప్పుడు షెన్సీ-కాన్సూ-నింగ్సియా సరిహద్దు ప్రాంత ప్రభుత్వం వైస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యాడు.

4. ఇది షెన్సీ-కాన్సూ-నింగ్సియా సరిహద్దు ప్రాంతం, వుత్తర, మధ్య, దక్షిణ చైనాలోని ఇతర విముక్తి ప్రాంతాలకు చెందిన మొత్తం జనాభా.

# యు.పి.ఎ., గత ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల ఫలితమే ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల!

నిత్యావసర వస్తువులు, ఆహార ధాన్యాల ధరలు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతుండటంతో సామాన్య ప్రజల జీవితాలు తీవ్రమైన ఒడిదుడుకులకు లోనయ్యాయి. ద్రవ్యోల్బణం తగ్గిస్తామని, ధరలు తగ్గిస్తామని యు.పి.ఎ. ప్రభుత్వం ఇచ్చిన హామీల డొల్లతనం బయటపడింది. వారానికి వారం ద్రవ్యోల్బణం పెరుగుతూ హామీలన్నీ ఎన్నికల వాగ్దానాలేనని రుజువు చేసింది. జూన్ మొదటి వారానికి ద్రవ్యోల్బణం 11.05 శాతానికి పెరిగిపోయింది. నాలుగు నెలల క్రితం ప్రమాద సూచికలు వెలువడినపుడు కేంద్ర ప్రభుత్వం ఆదరబాదరాగా కొన్ని నివారణ చర్యలు తీసుకుంది. వంట నూనెలపై సుంకాలు తగ్గించటం; పప్పు ధాన్యాలూ, బాస్మతి బియ్యం ఎగుమతులపై నిషేధం మరో ఏడాది పొడిగించటం; ఉక్కు, సిమెంటు, పాలపొడి మీద వాణిజ్య పన్నులు తగ్గించటం; ధరలు తగ్గించమని ఉత్పత్తిదారులకు, డీలర్లకు విన్నపాలు చేసుకోవటం లాంటి కొన్ని పరిమిత చర్యలు తీసుకుంది. ఇవన్నీ ఎన్నికలను దృష్టిలో వుంచుకొని చేసినవే. చిదంబరం, శరద్‌పవార్‌లు కొద్ది రోజుల్లో ధరలను అదుపుచేస్తామని మార్చిలో ఆడంబరంగా ప్రకటనలు చేశారు. ధరలు ఏమాత్రం తగ్గకపోగా పైపైకి ఎగబాకాయి. ఇకప్పుడు, ద్రవ్యోల్బణం ప్రపంచ వ్యాప్తంగా వుందనీ, భారతదేశంలో కొన్ని చర్యలు తీసుకున్నంత మాత్రాన ధరలు తగ్గవని ప్రధాని మన్మోహన్‌సింగ్ కూనిరాగాలు తీశాడు. ప్రభుత్వం చేపట్టిన అరకొర చర్యలేవీ సమస్యకు పరిష్కారం కాదని రుజువైంది. ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల నిరంతరం పెరుగుతూ సామాన్య ప్రజల నడ్డి విరుస్తూనే వున్నాయి.

37 దేశాలలో ఆహార ధాన్యాల ఉత్పత్తి బాగా పడిపోవడంతో ప్రపంచ వ్యాపితంగా ధరలు పెరిగిపోతున్నాయనే వారు, మన దేశంలో కూడా పెరుగుతున్న 1.44 శాతం జనాభాకు అనుగుణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి లేక సరఫరా తక్కువై, వినియోగం ఎక్కువైన కారణంగా ధరలు పెరుగుతున్నాయని, ఇలా వివిధ కోణాలతో ధరల పెరుగుదలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమర్థించడానికి పడరాని పాట్లు పడుతున్నారు. కాగా, మన్మోహన్ సింగ్, చిదంబరంలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో ఎనభై రూపాయలు కనీస వేతనంగా చెల్లిస్తున్నామని, ఫలితంగా పేదలందరికి ఉపాధి దొరికిందని, వారి కొనుగోలు శక్తి పెరిగిందని, ధరలు పెరగడానికి ఇదొక కారణమని నమ్మబలుకుతున్నారు. చిదంబరం, శరద్‌పవార్‌లు ఆహార ధాన్యాల నిల్వల కొరత లేదనే మాట్లాడుతున్నారు. వాస్తవానికి గత నాలుగు సంవత్సరాల్లో ఆహార ధాన్యం నిల్వలు 60 మిలియన్ టన్నుల నుంచి 15 మిలియన్ టన్నులకు పడిపోయాయి. ఆహార ధాన్యాల మిగులు వున్నప్పుడు మిగులును విడుదల చేసి ధరలు తగ్గించడానికి ఈ ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలేమి లేవు. ఈ రోజున ప్రజలు తమ సంపాదనలో అధిక భాగం తిండి కోసం ఖర్చు పెడుతూ కూడా, అర్ధాకలితో కడుపులు మాడ్చుకుంటుంటే మంత్రులు, రాజకీయ నాయకులు పెరిగిన ధరలను సమర్థించుకోవడానికి రక రకాల వ్యాఖ్యానాలతో ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్నారు.

### అసలు ధరలెందుకు పెరుగుతున్నాయి

ప్రభుత్వాలు అనుసరిస్తున్న సరళీకృత ఆర్థిక విధానాల దుష్ఫలితాలలో భాగమే ధరల పెరుగుదలనేది నిస్సందేహం. ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ, ప్రపంచ వాణిజ్య మండలి, అమెరికా తదితర సామ్రాజ్యవాద దేశాల ఒత్తిడికి తలొగ్గి మన వ్యవసాయ రంగంలో వాణిజ్యపరమైన సంస్కరణలను విచ్చలవిడిగా అమలుచేయటం మూలంగా ఈ దుస్థితి నెలకొన్నది. వీటిని ప్రారంభించిన కాంగ్రెస్ పాలన నుండి, ఎన్.డి.ఎ, మళ్లీ నేడు కాంగ్రెస్ పాలనవరకు ఏ ప్రభుత్వం కూడా వీటి ప్రభావంతో దెబ్బతిన్న దేశీయ వ్యవసాయ రంగానికి చేయూతనివ్వలేదు. నూటికి 70 శాతం మంది వ్యవసాయం మీద అధారపడి జీవించే వ్యవసాయాధారిత దేశంలో వ్యవసాయన్ని అన్ని ప్రభుత్వాలు గొంతునులిమాయి.

ప్రపంచ మార్కెట్‌లో పెట్రోలు, డీజిల్ ధరలు పెరుగుతున్నాయని అందువల్ల నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయంటున్నారు. ప్రపంచ మార్కెట్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గినా భారతదేశంలో మాత్రం దశల వారీగా పెంచుకుంటూపోతూనే వున్నారు. పెట్రోలు, డీజిల్ ధరలు పెరుగుదలతో రవాణా ఛార్జీలు పెరగటం, ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు వగైరా ధరలు పెరిగి దాని ప్రభావం వ్యవసాయ ఉత్పత్తులపై పడుతున్నది. ఇక ఆరుగాలం కష్టపడి పండించిన రైతుకు తీరా పంట చేతికి వచ్చేటప్పటికీ గిట్టుబాటు

ధర లభించదు. ప్రయివేటైజేషన్‌లో భాగంగా ప్రభుత్వాలు ఆహార ధాన్యాల సేకరణను తగ్గించివేశాయి. ప్రభుత్వం ఆలస్యంగా, నామమాత్రంగా మద్దతు ధరలు పెంచి, కట్టుదిట్టంగా దాన్ని అమలు చేయకపోవటం, ప్రయివేట్ వ్యాపారుల కొనుగోళ్లను అరికట్టకపోవడంతో మద్దతు ధర పెంచే నాటికే చిన్న సన్నకారు రైతులు అమ్మేసుకోవటం జరుగుతున్నది. దీంతో పెంచిన మద్దతు ధర రైతాంగానికి దక్కదు. వరి మద్దతు ధర వెయ్యి రూపాయలు చేయాలని పెద్ద ఎత్తున రైతులు ఆందోళనలు జరిపినా ఇంతవరకు సరిగా అమలు కావటంలేదు. ప్రయివేట్ వ్యాపారులకు, నల్ల బజారు వ్యాపారులకు కొమ్ముగాసే ప్రభుత్వం ఒక దురుద్దేశంతో, కుట్రతోనే మద్దతు ధరను స్థంభింపచేయటం, ఆహార ధాన్యాల సేకరణను తగ్గించటం జరుగుతున్నది.

1991లో కాంగ్రెస్ పాలనతో మొదలైన సరళీకృత ఆర్థిక విధానాలు మళ్లీ నేడు కాంగ్రెస్ నాయకత్వంలోని యు.పి.ఎ. పాలనలో తారాస్థాయిని అందుకున్నాయి. స్వేచ్ఛా మార్కెట్ విధానాలకు యు.పి.ఎ. ప్రభుత్వం తలుపులు బార్లా తెరవటంతో రీటైల్ మార్కెట్‌ను విదేశీ, స్వదేశీ కార్పోరేట్ సంస్థలు దురాక్రమణ చేశాయి. చిన్న, మధ్య తరహా కిరాణా షాపుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. లక్షలాది మందికి స్వయం ఉపాధి కల్పిస్తున్న ఈ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టారు. బహుళజాతి సంస్థలైన కార్గిల్, పిల్స్‌బరీ, ఐ.టి.సి., ఆగ్రోటెక్ ఆహార ఉత్పత్తుల రంగాన్ని ఆక్రమించాయి. స్వదేశీ సంస్థలైన బిగ్‌బజార్, స్పెన్సర్, రిలయన్స్, మోర్ లాంటివి పెద్ద పెద్ద నగరాల నుండి, చిన్న పట్టణాల వరకు సూపర్ బజార్ దుకాణాలను ఏర్పాటు చేసి, చిల్లర వ్యాపార రంగాన్ని దెబ్బతీస్తూ అటు రైతులను, ఇటు వినియోగదారులను విచ్చల విడిగా దోపిడీ చేస్తూ అత్యధిక లాభాలు దండుకుంటున్నాయి. ఫార్వర్డ్ ట్రేడింగ్ పేరిట ముందస్తు వ్యాపార లావాదేవీలతో రైతుల నుండి కారుచౌకగా ఆహార ధాన్యాలను కొనుగోలు చేసి, డిమాండుకు సంబంధించి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. వాణిజ్య పరమైన జూదం ఆడుతూ ఇష్టం వచ్చినట్లు ధరలు పెంచి లాభాలమీద లాభాలు గడిస్తున్నారు. నేచర్ ఫ్రెష్, అన్నపూర్ణ బ్రాండ్లతో గోధుమ పిండి, సన్‌ఫ్లవర్ ఆయిల్ మార్కెట్‌ను అమెరికన్ బహుళజాతి సంస్థ కార్గిల్ ఆక్రమించింది. ఇలా ఒక్కొక్క ఉత్పత్తి రంగాన్ని ఒక్కొక్క బహుళజాతి సంస్థలు ఆక్రమించాయి. ఒక్క మాటలో చెప్పాలంటే విత్తనాలు మొదలుకొని ఆహార పదార్థాల వరకు అమ్మకాలు, కొనుగోళ్లపై కార్పోరేటు సంస్థలే పెత్తనం చెలాయిస్తున్నాయి. రైతులకు అతి తక్కువ ధరలు చెల్లించి, ఎక్కువ ధరలకు అమ్మకాలు జరుపుతూ ఈ కార్పోరేట్ సంస్థలు, దళారీ సంస్థలు విపరీతమైన ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నాయి. ధరలను, మార్కెట్‌ను ఇవే నియంత్రిస్తున్నాయనడంలో అతిశయోక్తి లేదు. వీటిపై ప్రభుత్వాలకు ఏమాత్రం నియంత్రణ లేదు. పైపెచ్చు ఈ సంస్థలు ఆహార ధాన్యాలు, పదార్థాలు చెడిపోకుండ నిల్వ చేసుకోవడానికి ప్రభుత్వం వీటికి శీతల గిడ్డంగుల నిర్మాణానికి, రాయితీలు అందజేస్తున్నది. ఈ సంస్థల్ని లాభాలు చేకూర్చడానికి ప్రభుత్వం ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నది.

అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, వాణిజ్య సంస్థల ఒత్తిళ్లకు తలొగ్గి ఎగుమతులు పెంచుకని, విదేశీ కరెన్సీని ఆర్జించే లక్ష్యంతో వాణిజ్య పంటలు పండించాలని ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తున్నది. ఎ.పి.లో అప్పుడు చంద్రబాబు, ఇప్పుడు వై.యస్ ప్రభుత్వాలు రెండూ ధాన్యేతర పంటలు పండించాలని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నాయి. ఈ ఉద్దేశ్యంతోనే కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయి. పళ్లు, కూరగాయలు, పూలు తదితర వుద్యాన ఉత్పత్తులను పెంచడంవైపు తమ భూములను మళ్లించాలని, అందుకు తుంపర సేద్యాన్ని చేపడితే పెద్దయెత్తున సబ్సిడీలు ఇస్తామని బడ్జెట్‌లో అధికంగా కేటాయింపులు చేయటం చూస్తే తిండి గింజల పంట తగ్గించాలని పరోక్షంగా ఒత్తిడి తీసుకుని రావటమే. ఈ విధంగా రైతాంగాన్ని వ్యాపార పంటలవైపు మళ్లించి ఆహార సంక్షోభానికి తెరలేపారు.

సరళీకృత ఆర్థిక విధానాల మోజు బాగా తలకెక్కించుకున్న యు.పి.ఎ. ప్రభుత్వంలో ప్రయివేటు రంగానికి దాసోహం పలికి ప్రత్యేక ఆర్థిక మండలాలకు విచ్చల విడిగా లైసెన్స్‌లు మంజూరు చేస్తూ, అత్యంత విలువైన లక్షలాది ఎకరాల పంట భూములను వాటికి దారాదత్తం చేస్తున్నారు. మరొకవైపు రియల్ ఎస్టేట్ వ్యాపారం ఫలితంగా ఆహార ధాన్యాలు, కూరగాయల ఉత్పత్తి బాగా పడిపోయింది. ఇందుకు హైదరాబాద్ నగరం ప్రబల నిదర్శనం. ఒకనాడు ద్రాక్షపండ్లకు పెట్టింది పేరైన హైదరాబాద్ నగరం చుట్టుపక్కల వున్న ద్రాక్ష తోటలన్నీ ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగం కింద మారిపోయాయి. శంషాబాద్ విమానాశ్రయం వచ్చిన తర్వాత ఆ చుట్టుపక్కల వ్యవసాయ ఉత్పత్తులన్నీ నాశనమైపోయాయి. బెంగాల్‌లో నందిగ్రామ్ అయితేనేమీ, ఎ.పి.లో కాకినాడ, నెల్లూరు అయితేనేమి ఈ సెజ్‌ల ప్రభావం వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెడుతున్నది. దేశవ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో వ్యవసాయం ధ్వంసమై తద్వారా వ్యవసాయం మీద ఆధారపడిన కోట్లాది ప్రజలు రోడ్లమీద పడటం, ఆహార ధాన్యాల ఉత్పత్తి తీవ్రంగా పడిపోవటం జరుగుతున్నది. అయినా పాలక ప్రభుత్వాలు సెజ్‌ల ప్రోత్సాహానికే అమితోత్సాహం చూపుతున్నాయి.

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతుండటంతో, అమెరికా తదితర అభివృద్ధి చెందిన దేశాల్లో పెట్రోలు బంకులవద్ద కార్లు బారులు తీరుతున్నాయి. వాళ్లకు పెట్రోలు, డీజిల్ దాహం హద్దులు మీరడంతో ఆహార ధాన్యాలను బయో డీజిల్‌గా మార్చటం పెద్దయెత్తున జరుగుతున్నది. ప్రపంచ వ్యాపితంగా పెరిగిన మొక్కజొన్న పంటనంతటినీ బయో ఇంధనాల ఉత్పత్తికి మళ్లించారు. 2004-05 మధ్య పెరిగిన 5.1 కోట్ల టన్నుల మొక్కజొన్న ఉత్పత్తిని మొత్తాన్ని అమెరికా ఒక్కటే ఇథనాల్ ఉత్పత్తికి వినియోగించింది. ఒక కారు ట్యాంకును గనక బయో ఇంధనంతో నింపాలంటే ఒక మనిషి ఏడాదిపాటు తినే ఆహారాన్ని వినియోగించాలి. ఈ విధంగా ఆహార ధాన్యాలను బయో ఇంధన వినియోగానికి పెద్ద యెత్తున మళ్లిస్తుండంతో ప్రపంచ వ్యాపితంగా ఆహార సంక్షోభం ఏర్పడుతున్నది. ఈ సంక్షోభంలో కూడా లాభాలు దండుకోవడానికి అమెరికన్ వ్యాపారులు, బహుళజాతి సంస్థలు నిత్యావసర సరుకుల్ని పెద్ద ఎత్తున నిల్వచేసి, అధిక లాభాలు దండుకుంటూ ముందస్తు సరుకులు మార్కెట్‌లో సట్టా వ్యాపారం నడుపుతున్నారు. ప్రపంచ వ్యాపిత ఆహార సంక్షోభానికి కారణం ఇది కాగా, ప్రపంచం దృష్టిని మళ్లించడానికి అమెరికా అధ్యక్షుడు బుష్, అతని సహాయకురాలు కండొలిజా రైస్‌లు "చైనా, భారత్ వంటి దేశాల్లోని ప్రజలు ఎక్కువగా తింటుండటం ప్రపంచ ఆహార సంక్షోభానికి కారణం" అని మతిలేని మాటలు మాట్లాడారు. భారతదేశ జనాభాలో మూడవ వంతు పోషకాహార లోపంతో బాధపడుతూ, జనాభాలో మూడింట రెండు వంతులు దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తుంటే, అమెరికన్లు తిండి ఎక్కువై, ఊబకాయంతో వచ్చే రోగాలను నయం చేసుకోవడానికి 60,000 కోట్ల డాలర్లు ఖర్చు పెడుతున్నారు. సంవత్సరానికి 3 లక్షల మంది అమెరికన్లు అధిక బరువు వల్ల చనిపోతున్నారు. కాగా, చైనా, భారత్ దేశాల్లో ప్రజలు ఎక్కువగా తింటున్నారని ఈ పనికిమాలిన నేతలు సిగ్గులేకుండా చెత్తవాగుడు వాగుతున్నారు. భారతదేశంలోని భూస్వాముల్లా ఈ సామ్రాజ్యవాద తిమింగలాలు తినటానికి తమకొక్కరికే జన్మ హక్కుందని అనుకుంటున్నారు.

ప్రభుత్వరంగ పరిశ్రమలు ధ్వంసమైతే వచ్చే దుష్ఫలితాలను కూడా మనం అనుభవిస్తున్నాం. సిమెంట్, పంచదార, మందుల పరిశ్రమలను ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా ప్రయివేటీకరించింది, లేదా మూసివేసింది. ఈ రంగాలపై ప్రయివేట్ యజమానులు గుత్తాధిపత్యం సాధించారు. ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయించుకుంటూ అధిక లాభాలు గడిస్తూ ప్రజల నడ్డి విరుస్తున్నారు. ధరలను తగ్గించమని ప్రభుత్వాధినేతలు యాజమాన్యాలను ప్రాధేయపడినా ఖాతరు చేయని పరిస్థితి. ప్రభుత్వాల చేతకానితనానికి, లోపభూయిష్టమైన విధానాలకు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే సామాన్య ప్రజలు, ప్రత్యేకించి శ్రామిక ప్రజలు ఆకలి మంటలతో జీవచ్ఛవాల్లా భారంగా జీవితం గడపాల్సి వస్తోంది.

## ఆహార ధాన్యాల సేకరణ, ప్రజా పంపిణీ వ్యవస్థల ధ్వంసం

1991 సరళీకృత ఆర్థిక విధానంలో ప్రధాన అంశం ఉత్పత్తి రంగాల నుంచి ప్రభుత్వం నిష్క్రమించి, మార్కెట్ శక్తులకు వదిలిపెట్టటం - దీన్నే మార్కెటీకరణ అంటారు. అంటే ప్రయివేటీకరణ.

ధరలు పెరిగినపుడు సామాన్య ప్రజలకు తిండి గింజలు అందుబాటులో వుంచటానికి భారత ఆహార సంస్థ (ఎఫ్.సి.ఐ.)ను ఏర్పాటు చేసి ప్రభుత్వమే తిండి గింజలు సేకరించే విధానం చేపట్టింది. 1991 ఆర్థిక సంస్కరణల తర్వాత ప్రభుత్వం దీన్ని మూసేసే చర్యలు చేపట్టింది. తిండి గింజల వ్యాపారాన్ని ప్రయివేటు రంగానికి ధారాదత్తం చేసింది. ఆహార ధాన్యాల సేకరణను వుద్దేశ్యపూర్వకంగానే తగ్గించటంతో ప్రభుత్వం వద్ద నిల్వలు తగ్గి, వ్యాపారుల వద్ద నిల్వలు పెరుగుతాయి. ఆహార ధాన్యాల నిల్వలను తమ గుప్పిట్లో పెట్టుకున్న వ్యాపారులు వాటి ధరలను కూడా పెంచుతారు. లాభాలు చుక్కలు చూస్తాయి. పాలక పార్టీ ఖజానా నిండుతుంది.

ఆహార ధాన్యాల సేకరణ కార్యక్రమాన్ని ప్రభుత్వమే తగ్గించటం గమనించిన ఆహార ధాన్యాల గుత్త అంతర్జాతీయ సంస్థలు భారతదేశం తప్పకుండా తిండి గింజలు దిగుమతి చేసుకోనున్నదని పసిగట్టి, వారి వారి మార్కెట్ ధరలు పెంచటం ప్రారంభించాయి. ఆ విధంగా అంతర్జాతీయంగా తిండి గింజల ధరలు పెరిగాయంటే దీనికి భారత ప్రభుత్వమే కారణం. ఇప్పుడు ధరలు విపరీతంగా పెరిగిపోవడానికి అంతర్జాతీయంగా ధరలు పెరగడమే కారణమంటూ కూనిరాగాలు తీస్తున్న మన్మోహన్ సింగ్ వాస్తవంలో ప్రభుత్వమే కారణమనే విషయాన్ని కప్పిపుచ్చే ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆఖరుకు తిండి గింజలను దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితికి యు.పి.ఎ. ప్రభుత్వం దిగజార్చింది. ఆహారోత్పత్తులను ఎగుమతి చేసే స్థాయి నుండి దేశాన్ని ఆహార ధాన్యాలు దిగుమతి చేసుకోవాల్సిన దుర్గతికి నెట్టింది ఎన్.డి.ఎ., యు.పి.ఎ. ప్రభుత్వాలే.

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులను చౌక ధరలకు పేద, మధ్యతరగతి ప్రజానీకానికి అందించాలనే

విధానాన్ని ప్రభుత్వం గాలికొదిలేసింది. ప్రజా పంపిణీ వ్యవస్థను కుదించివేయడం, నిర్వీర్యం చేయడం, అవినీతికి నిలయంగా మార్చివేయడం, నాసిరకం ఆహార ధాన్యాలను సరఫరా చేయడం, నిత్యావసర వస్తువుల సరఫరా సంఖ్యను తగ్గించివేయడం ద్వారా మౌలిక లక్ష్యాన్నే గొడ్డలిపెట్టుకు గురి చేశారు. ప్రణాళికా సంఘం ప్రకారమే, పేదరికపు రేఖ కింద వున్న వారిలో 57 శాతం మందికి చౌక దుకాణాల ద్వారా తిండి గింజలు అందటం లేదు. ప్రజలకు తిండి గింజలను అందించే ప్రాథమిక బాధ్యతను ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆహార ధాన్యాల సేకరణ ప్రజాపంపిణీ వ్యవస్థలను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా గొంతు పిసికింది. ఇంకేం, స్వేచ్ఛా మార్కెట్‌తో అందివచ్చిన అవకాశాలను బాగా ఉపయోగించుకుని కార్పొరేట్ సంస్థలు బడా వ్యాపారవర్గాలు, దళారీ సంస్థలు విపరీతంగా సంపదను కొల్లగొట్టడానికి పూనుకున్నాయి. ధరల పెరుగుదలతో ఆహార ధాన్యాలు, ఇతర నిత్యావసర వస్తువులు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. పెరిగిన ధరలు పెట్టి కొనుక్కోగలిగిన వారికే తిండి. ఆహార భద్రతకు మునుపెన్నడూ లేనంత ప్రమాదం ముంచుకొస్తోంది.

నల్ల బజారు వ్యాపారాన్ని అరికట్టి, ప్రజా పంపిణీ వ్యవస్థను సరిదిద్దలేని రాష్ట్రంలోని రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం రెండు రూపాయలకు కిలో బియ్యం ఇస్తున్నామని, భవిష్యత్తులో వంట నూనెలు, కంది పప్పు ధరలు తగ్గించి సరఫరా చేస్తామని, దారిద్ర్య రేఖ కింద జీవించే (బి.పి.ఎల్.) నిరుపేదలకు, దారిద్ర్య రేఖపైన జీవించే (ఎ.పి.ఎల్.) పేదలకు, కటిక దారిద్ర్యంతో జీవిస్తున్న వారికి దేశంలోనే అత్యధికంగా అంత్యోదయ పథకం ద్వారా రేషన్ కార్డులు మంజూరు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నది.

## అందరూ దోపిడి దొంగలే

రాబోయే ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టాలనుకుంటున్న యు.పి.ఎ., లేదా మరే పార్టీగానీ ధరల్ని, ద్రవ్యోల్బణాన్ని తగ్గించలేవు. నల్ల ధనాన్ని, అక్రమ వ్యాపారాన్ని, విదేశీ పెట్టుబడి ప్రవాహాన్నీ ప్రత్యేకించి "హాట్ మనీ"ని, ఆహార ధాన్యాల సట్టా వ్యాపారాన్ని, నిత్యావసర వస్తువుల ఎగుమతిని, ఎస్.ఇ.జడ్.లకు పంట భూముల్ని ధారాదత్తం చేయటాన్ని, వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తూ వుండటాన్ని అరికట్టలేని పార్టీ కూడా ధరల పెరుగుదలనూ, ద్రవ్యోల్బణాన్ని అరికట్టలేవు. నేడు దేశంలో అధికారికంగా చెలామణిలో వుండవలసిన కరెన్సీ కంటే మూడు రెట్లు అధికంగా కరెన్సీ చెలామణిలో వుంది. ప్రభుత్వాధికారులు, రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తలు, వాణిజ్యవేత్తలు, అన్నిరకాల వ్యాపారుల దగ్గర చెప్పుకుంటున్న దానికంటే ఎక్కువ డబ్బు మూలుగుతోంది. నల్ల ధనాన్ని కూడబెట్టిన కుబేరులతో చేతులు కలిపి, దేశంలోకి స్వల్పకాలిక విదేశీ పెట్టుబడి ప్రవాహానికి తలుపులు బార్లా తెరిచిన ప్రభుత్వానికి పెరుగుతున్న ధరలను అదుపు చేయటం అసాధ్యం. ఈ ప్రభుత్వం నల్ల బజారు వ్యాపారులు, స్మగ్లర్లు, పన్ను ఎగవేతదారుల, షేరు బ్రోకర్ల, కుంభకోణాల రాయుళ్ల ప్రభుత్వం. ప్రతి ప్రభుత్వ విధానం, నయా ఉదారవాద ప్రమాణాలు బడా పెట్టుబడికి మరింత దోపిడికి సహాయపడేవే. ప్రపంచ బిలియనీర్లతో అనేక మంది బిలియనీర్లకు భారత్ డబ్బాకొట్టేదేననటంలో ఆశ్చర్యంలేదు. అనధికారికంగా ఇది మరిన్ని రెట్లు ఎక్కువే. లెక్కకురాని నల్ల ధనం స్వేచ్ఛగా నిరాటంకంగా సంచరిస్తున్నంత కాలం పెరిగే ధరలు తగ్గే అవకాశమే లేదు. ఒకపక్క ఇవన్నీ కొనసాగే స్థితికి తావిస్తుంటే, దేశ ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యాన్ని అదుపుచేసే రిజర్వ్ బ్యాంకు ప్రమాణాలు నిష్ప్రయోజనాలే.

ధరల్ని అదుపు చేయుటంలో యు.పి.ఎ. ప్రభుత్వం విఫలమైందని ఆర్భాటం చేస్తున్న ప్రతిపక్ష పార్టీలేవీ కూడా నల్ల ధనాన్ని గురించి ఒక్క మాట మాట్లాడడం వలేదు. కారణం, ఈ పార్టీలూ, వాటి నాయకులూ అందరూ లెక్కకురాని నల్ల ధనాన్ని సంచులకొద్దీ పోగేసినవాళ్లే. ప్రతి రాజకీయ నాయకుడూ ఎన్నికల్లో చట్టబద్ధంగా అనుమతించిన దానికంటే అనేక రెట్లు ఖర్చు పెట్టే వాళ్ళేననటంలో ఆశ్చర్యం లేదు. వ్యాపారులూ, పారిశ్రామిక వేత్తలూ ఈ పార్టీల, పార్టీ నాయకుల ఖజానాలను నింపి, ఆ తర్వాత అంతకు పదింతలు దోచుకుంటారు. అందుకే ధరల పెరుగుదల గురించి ఆర్భాటం చేసే ఈ పార్టీ లేవీ ప్రజల్ని వీధుల్లోకి తీసుకొచ్చి నల్లబజారు గోదాముల్ని తెరిపించే మిలిటెంటు పోరాటాలకు సన్నద్ధం చేయవు. అందుకే పేద ప్రజానీకం భయంకర దారిద్ర్యంలో మగ్గుతూ, హృదయ విదారకమైన యాతనలు పడుతుంటే ధనికుల ప్రాంగణాల్లో నల్ల ధనం ఏరులై పారుతోంది. కృత్రిమమైన ధరల పెరుగుదలతో ధనికులు అధికాధిక లాభాలు పొందుతుంటే, ద్రవ్యోల్బణం, ధరల పెరుగుదల భారం పేద ప్రజల మీద పడుతున్నది.

ప్రభుత్వాలు, పార్టీలు ఎన్ని మారినా ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం నివారించే చర్యలేవీ తీసుకోవు. బూటకపు స్వాతంత్ర్యం సాధించిన 60 ఏండ్లల్లో ఏనాడు ధరలు తగ్గింది లేదు. ప్రజలు క్రియాశీల పోరాటాలే దీన్ని సాధించగలవు. సామ్రాజ్యవాద దళారీ నిరంకుశ పెట్టుబడి అనుకూల, ధనిక

*(తరువాయి 7వ పేజీలో...)*

# ఒ.బి.సి.ల సుదీర్ఘ పోరాట ఫలితమే సుప్రీంకోర్టు తీర్పు

# పాలకవర్గాల కొమ్ముగాసే న్యాయస్థానాలు సామాజిక న్యాయాన్ని కల్పించవు

నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ లోతుగా పాతుకుపోయిన భారతదేశంలో అగ్రవర్ణాలవారు అనాదిగా దళిత బహుజనులను అన్ని రంగాల్లోనూ అణచివేస్తున్నారన్నది చారిత్రక వాస్తవం. భూమితో పాటు ఉత్పత్తి కారకాలన్నీ అగ్ర వర్ణాల చేతుల్లో వుండటం అణచివేతకు ప్రధాన కారణం. నిమ్న కులాలలో అవగాహనారాహిత్యం, అవిద్య, అనైక్యతలు కూడా ఈ దోపిడి అంతం కాకపోవడానికి మరో కారణం అవుతున్నది. అయితే భారత గణతంత్ర వ్యవస్థకు రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ ముందు చూపుతో దళిత బహుజన వర్గాల వారికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించి వారి పురోభివృద్ధికి పునాది వేశాడు. కానీ రిజర్వేషన్ల అమలులో రాజకీయ పార్టీలు తమ తమ ఆసక్తుల కనుగుణంగా ప్రవర్తిస్తున్నాయి. రిజర్వేషన్ విషయాన్ని ప్రస్తావించే సమయంలో సాధారణంగా, సహజంగా రెండు విభిన్న వాదాలు తెరపైకొస్తాయి. ఒకటి రిజర్వషన్‌ను సమర్థించే వర్గంకాగా రెండోది వ్యతిరేకించే వర్గం. ఆధునిక కాలంలో రిజర్వేషన్లు పీడిత కులాలు పోరాడి సాధించుకున్న ప్రజాస్వామిక హక్కు అనే విషయాన్ని రెండో వర్గం గ్రహించటం లేదు. రిజర్వేషన్‌ను అనుభవించే క్రమంలో బి.సిలు అనేక పర్యాయాలు అన్యాయానికి గురయ్యారు, అవుతూనే వున్నారు.

ప్రభుత్వ విద్యా సంస్థలతోపాటు అన్ని ప్రయివేట్ విద్యా సంస్థల్లో సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసే అధికారం రాష్ట్రాలకు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం 2006 మే నెలలో 93వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని రూపొందించింది. ఈ విషయంలో శాసన, న్యాయ శాఖల మధ్య కొంత వివాదం తలెత్తింది. అనేక సంపన్న వర్గాలవారు కూడా రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా వుద్యమాలు నిర్వహించారు. ప్రయివేట్, అన్ ఎయిడెడ్ విద్యా సంస్థల్లో రిజర్వేషన్ కల్పించడం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు తీర్పు ఇవ్వడంతో అగ్రవర్ణాలకు కొంత ఊరట కలిగింది. అయితే రిజర్వేషన్లకు వ్యతిరేకంగా 93వ రాజ్యాంగ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటీషన్లు పరిశీలిస్తూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.జి. బాలకృష్ణన్, న్యాయమూర్తులు అరిజిత్ పసాయత్, సి.కె తక్కర్, ఆర్వీ రవీంద్రన్, దల్వీర్ భండారీలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ ధర్మాసనం ఏప్రిల్ 10న ఒ.బి.సి. కోటాకు అనుకూలంగా తీర్పునిచ్చింది. కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే ఐ.ఐ.టి., ఐ.ఐ.ఎం.లు, ఐ.ఐ.ఎం.ఎస్. వంటి వున్నత విద్యా సంస్థల్లో ఇతర వెనుకబడిన తరగతుల వారికి (ఒ.బి.సి) 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో వున్న ఐక్య ప్రగతిశీల కూటమి (యు.పి.ఎ) ప్రభుత్వం చేసిన చట్టం రాజ్యాంగబద్ధమేనని తీర్పు చెప్పడంతో ఒ.బి.సి. రిజర్వేషన్‌పై గత కొంతకాలంగా కొనసాగుతూ వస్తున్న వివాదానికి తెరపడింది.

కేంద్రీయ విద్యా సంస్థల్లో కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో ఒ.బి.సి రిజర్వేషన్లకు సంబంధించిన నేపథ్యాన్ని పరిశీలించినట్లైతే ప్రభుత్వ విద్య, ఉద్యోగ విషయాల్లో ఎస్.సి., ఎస్.టి. రిజర్వేషన్లకు ఉన్నంత స్పష్టమైన విధానాలు ఒ.బి.సి. రిజర్వేషన్ విషయంలో లేవనే చెప్పాలి. 1920 దశకం నుండి బి.సి.లకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించటం జరిగింది. 1953లో కాకాసాహెబ్ కలేల్కర్ అధ్యక్షతన మొదటి బి.సి కమీషన్ వేశారు. ఈ కమీషన్ 1955లో తన నివేదికను సమర్పించినా కేంద్రం బి.సి.లకు సంబంధించి ఎలాంటి చర్య తీసుకోలేదు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి బి.సి. మండల్ అధ్యక్షతన రెండవ జాతీయ బి.సి కమీషన్ 1978లో ఏర్పాటు అయింది. ఎస్.సి, ఎస్.టిలకు వున్న విధంగానే జనాభా ప్రాతిపదికన బి.సిలకు కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో 27 శాతం రిజర్వేషన్ కల్పించాలని పేర్కొంటూ 40 సిఫార్సులతో మండల్ కమీషన్ తన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. అది కూడా అమలు జరగలేదు. 1989లో వి.వి. సింగ్ నేతృత్వంలోని నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం మండల్ కమీషన్ సిఫార్సుల ఆధారంగా కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో, కేంద్రీయ విద్యా సంస్థల్లో బి.బి.సి.లకు 27 శాతం రిజర్వేషన్‌ను అమలుపరచాలని గట్టిగా ప్రయత్నించింది. దీనికి వ్యతిరేకంగా రిజర్వేషన్ వ్యతిరేక అగ్రవర్ణాల వారు దేశవ్యాప్తంగా నిరసనలు రెచ్చగొట్టి, విధ్వంసం సృష్టించారు. దీనికి వెనుక నుండి నడిపించిన నేషనల్ ఫ్రంటు ప్రభుత్వంలోని భాగస్వామ్య పక్షమై బి.జె.పి. ప్రభుత్వాన్ని కూలదోయడానికే ఎసరు పెట్టి బి.సి. రిజర్వేషన్ ఒక కొలిక్కి రానీయకుండ చేసింది. చివరికి ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరుకుంది.

1993లో సుప్రీం కోర్టు సూచనమేరకు భారత ప్రభుత్వం వెనుకబడిన తరగతుల కమీషన్‌ను చట్టబద్ధం చేసింది. కమీషన్ ఏర్పాటైన నాటి నుండి నేటి వరకు దాదాపు ఎనిమిది వందలకుపైగా సలహాలను కేంద్ర ప్రభుత్వానికి అందించింది.

## ఒ.బి.సి.లకు రిజర్వేషన్ల అవసరం

భారత ఆర్థిక సామాజిక నిర్మాణంలో బి.సిలది ఒక ప్రత్యేక పాత్ర. సంప్రదాయ కుల వృత్తుల ఆధారంగా జీవనం సాగిస్తూ భారత ఆర్థిక వ్యవస్థకు బి.సిలు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఇటీవల భారతదేశంలో అమలవుతున్న సరళీకృత ఆర్థిక విధానాలు, ప్రపంచీకరణ, ప్రయివేటీకరణల నేపథ్యంలో అనాదిగా తాము నమ్ముకున్న కుల వృత్తుల నుండి పరాయీకరణ చెందుతూ నిరుద్యోగులు అవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి పునరావాసం కల్పించటంలో వైఫల్యం చెందాయి. విద్య, వైజ్ఞానిక, రాజకీయ రంగాల్లో చాలా వెనుకబాటుకు గురయ్యారు. రాజ్యాధికారానికి ఆమడ దూరంలో నిలబెట్టబడుతున్నారు. భారతదేశ జనాభాలో 52 శాతం వున్న బి.సిలకు చట్ట సభల్లో పది శాతం కూడా ప్రాతినిధ్యం లేదు. కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో గ్రేడ్ -1 బి.సి ఉద్యోగులు రెండు శాతం కూడా లేరు. ఇంతటి వెనుకబాటు కారణంగా బి.సిలు ఆందోళనలు, పోరాటాలు చేపట్టారు. సుదీర్ఘ పోరాటం నేపథ్యంలో బి.సిలకు 27 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం సర్వత్రా చర్చల్లోకి వచ్చింది.

## ఒ.బి.సి. రిజర్వేషన్లు సబబే

1992లో ఇందిరాసహాని కేసులో కేంద్ర ప్రభుత్వ వుద్యోగాల్లో ఒ.బి.సిలకు 27 శాతం రిజర్వేషన్లు సబబేనని, అయితే మొత్తం మీద రిజర్వేషన్లు 50 శాతం మించరాదని సుప్రీం కోర్టు తీర్పునిచ్చింది. ఒ.బి.సిలలో సంపన్న శ్రేణి (క్రిమీలేయర్)ని మినహాయించాలని, పదోన్నతులలో రిజర్వేషన్లు వర్తించవని, బ్యాక్‌లాగ్ ఖాళీలలో ఇవి వర్తిస్తాయని ఈ తీర్పులో పేర్కొంది. విద్య, ఉద్యోగావకాశాల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు వుండరాదనే సుప్రీం కోర్టు తీర్పుకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం 1994లో 76వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చేసిన చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చి న్యాయ సమీక్ష నుండి మినహాయించింది. 2001లో జరిగిన 85వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ఎస్.సి, ఎస్.టిలకు పదోన్నతుల్లో రిజర్వేషన్‌ను కల్పించారు.

2004లో అధికారం చేపట్టిన ఐక్య ప్రగతిశీల కూటమి (యు.పి.ఎ) ప్రభుత్వం ఒ.బి.సి.లకు వర్తించే రిజర్వేషన్‌లను అమలు జరిపింది. మానవ వనరుల శాఖా మంత్రి అర్జున్‌సింగ్ ప్రమేయంతో ఐ.ఐ.టి.లు, ఐ.ఐ.ఎం.ల వంటి కేంద్రీయ విద్యా సంస్థల్లో ఒ.బి.సి.లకు రిజర్వేషన్ కల్పించాలానే ప్రతిపాదన ముందుకొచ్చింది. వీరప్ప మొయిలీ అధ్యక్షతన ఈ రిజర్వేషన్ అమలు విషయంలో ఒక కమిటీ నియమించబడింది. వెరసి కేంద్ర ప్రభుత్వం బి.సిలకు ఇవ్వతలపెట్టిన 27 శాతం రిజర్వేషన్ రాజ్యాంగబద్ధమేనని సుప్రీం కోర్టు ధర్మాసనం ఇటీవల సంచలనాత్మక తీర్పునిచ్చింది. అయితే 'సంపన్న శ్రేణి'ని రిజర్వేషన్ పరిధి నుండి మినహాయించాలని పేర్కొన్నది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు బి.సిల రిజర్వేషన్ నుండి చర్చను సంపన్నశ్రేణి వైపు మరలించింది.

తీర్పు తమకు విజయమని రిజర్వేషన్ వాదులు భావిస్తున్నట్లే, వ్యతిరేకవాదులు సైతం తమ పాక్షిక విజయంగా పరిగణించడం గమనార్హం. మొత్తంగా రిజర్వేషన్లు బడుగు వర్గాలకు వుండరాదనేదే రిజర్వేషన్ వ్యతిరేక, అగ్ర వర్ణాల బలమైన ఆకాంక్ష. అందుకు తగ్గట్లే రిజర్వేషన్ సమస్య రంగం మీదికొచ్చినప్పుడల్లా దీనికి వ్యతిరేకంగా పెద్ద యెత్తున ఆందోళనలు రెచ్చగొడుతున్నారు. సుప్రీం కోర్టులో రక రకాల వాదనలతో ఒ.బి.సి. రిజర్వేషన్లు అమలులోకి రాకుండా అడ్డుకున్నారు. రిజర్వేషన్ వ్యతిరేకవాదులు వెనుకబడిన తరగతులకు కేవలం ప్రాథమిక స్థాయి విద్యలోనే రిజర్వేషన్లు వుండాలనటం వారు కేవలం క్లర్కులుగా, అటెండర్లుగా మాత్రమే జీవించాలన్న అభిప్రాయాన్ని పరోక్షంగా వ్యక్తం చేయటమే. వాస్తవానికి ప్రభుత్వాలకు, రాజకీయ పార్టీలకు, పాలకవర్గాలకు చిత్తశుద్ధి లేకపోవటం, రిజర్వేషన్ల ప్రక్రియను ఎప్పటికైనా ఒక కొలిక్కి తీసుకురావాలనే అభిప్రాయం లేకపోవటం వల్లనే పాలకవర్గాలు చెప్పుకుంటున్న స్వాతంత్ర్యం వచ్చి 60 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ రిజర్వేషన్ల ఫలాలు అందుకోలేని స్థితిలో 80 శాతం బి.సి కులాలు వున్నాయి. 40 కులాలకు ఇప్పటికీ సమాజంలో గౌరవం లేదు. ఆ కులాల నుంచి ఒక్కరైనా ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. ఆఫీసర్ కాలేదు. కనీసం గ్రూపు-1 ఆఫీసర్ కూడా లేరు. స్వాతంత్ర్యానంతరం ఆరు దశాబ్దాల తర్వాత కూడా దళితులపై, వెనుకబడిన తరగతులపై అత్యాచారాలు జరుగుతున్నాయి. రైతులు, చేనేత కార్మికుల ఆత్మహత్యలు, ఆకలి చావులు జరుగుతున్నాయి. పొట్ట చేత పట్టుకుని పెద్ద ఎత్తున కూలీలు వలస వెళుతున్నారు. ప్రపంచంలోని పేదల్లో నాలుగో వంతు భారతదేశంలో వున్నారు. దేశ జనాభాలో 33.5 శాతం మంది రోజుకు 40 రూపాయలకన్నా తక్కువ మొత్తంపై జీవిస్తున్నారు. 5 సంవత్సరాలలోపు పిల్లల్లో 46 శాతం మంది సరైన పోషకాహారం లేక తక్కువ బరువుతో జీవిస్తున్నారు. వీరందరిలో అత్యధికులు దళితులు, వెనుకబడిన వర్గాలవారని వేరే చెప్పనక్కర్లేదు. సామాజిక, విద్యా రంగాల్లో వెనుకబాటుతనానికి కులమే ప్రాతిపదిక అని సుప్రీం కోర్టు కూడా స్పష్టం చేసింది.

అలాగే రాజ్యాంగం కులరహిత, వర్గరహిత సమాజం కావాలని ఆశిస్తోంది. అలాంటప్పుడు కులం ఆధారంగా కోటాలు పెట్టడమేంటి. ఇది చెల్లదు అని కూడా రిజర్వేషన్ వ్యతిరేకులు వాదించారు. రిజర్వషన్లు ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి కాదు. పేదరికం, సామాజిక వెనుకబాటు, ఆర్థిక వెనుకబాటు వంటివన్నీ ప్రాతిపదికగా రాజ్యాంగంలో రిజర్వేషన్లు పొందుపరచటం జరిగింది. దీన్ని పక్కదారి పట్టించి కేవలం ఆర్థిక కోణాన్నే ముందుకు తీసుకువచ్చి రిజర్వేషన్లు వద్దని వాదిస్తున్నారు.

రిజర్వేషన్ల వల్ల ప్రతిభ దెబ్బతింటుందని కూడా రిజర్వేషన్ వ్యతిరేక మేధావులు వాదించారు. సొంత ఇల్లు దశాబ్దాలు గడుస్తున్న చెక్కుచెదరకపోగా, సామాజిక నిర్మాణాలు తరచూ పనులు జరుగుతుండగానే కుప్పకూలుతున్నాయంటే దానికి ఏ రిజర్వేషన్లు కారణమో ఈ మేధావులే చెప్పాలి. వేలాది గొర్రెల్లో తనవేవో అలవోకగా గుర్తించే గొర్రెల కాపరి, వందలాది గుడ్డల్లో ఎవరివి ఏవో తప్పంటూ లేకుండా వేరు చేయగల రజకుల పని, అగ్గిపెట్టెలో ఇమిడేంత వస్త్రాన్ని తయారుచేసే నేతకారుల పని, స్టీలు యుగం, ప్లాస్టిక్ యుగం వచ్చినా ఇప్పటికీ ప్రత్యామ్నాయంలేని కొన్ని అవసరాలకు అందమైన కుండలు తయారు చేసే కుమ్మరి పని, హోరెత్తే అలలపై ప్రాణాలకు తెగించి ఏరుదాటించే పల్లెకారుని పని ఇవన్నీ ప్రతిభకు ప్రతీకలే. అవకాశాలు లేకతప్ప తెలివి ఏ ఒక్కరి సొత్తుకాదని అంబేద్కర్ మొదలు ఎందరో నిరూపించిన దేశంలో కొందరు తమ పాత వాదనల్ని ఔననిపించుకునేందుకు కొత్త దారుల్లో నానా తంటాలు పడుతున్నారు. ప్రతిభతో సీట్లు సాధించుకున్నామని చెప్పుకునే వాళ్లే అవినీతికి పాల్పడి దేశ భవితకు నిలువునా గండి కొడుతున్న తీరు అందరికీ తెలిసినదే. పైగా పచ్చనోట్లు వెదజల్లితే చాలు ఏ డిగ్రీ కావాలంటే అది అంతర్జాతీయ అంగళ్లలో దొరుకుతున్న నేపథ్యంలో అక్కడ ప్రతిభ చిరునామా ఏమయిందో వ్యతిరేకులే జవాబివ్వాలి.

రిజర్వేషన్ పరిధిలోకి వచ్చే కులాల్లో పుడితేచాలు చదువు వున్నా లేకున్నా ఉద్యోగాలు లభిస్తాయనే వ్యతిరేక అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. వున్నత వర్గాలకు చెందిన తప్పుడు సర్టిఫికేట్లతో తమను తాము ఎస్.సి, ఎస్.టిలుగా ప్రకటించుకుని వుద్యోగాలు సంపాదించుకోవటం ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. లాంటి పదవులు, శాసన సభ్యత్వాలు సంపాదించుకోవటం అందరికీ తెలిసిందే. జాతీయ నాలెడ్జ్ కమీషను కూడా ఉన్నత విద్యా సంస్థల్లో బడుగులకు కేటాయింపుల్ని వ్యతిరేకించింది. నాలెడ్జ్ సమాజం ఏర్పాటుకు రిజర్వేషన్లు గండికొడతామని ఈ కమీషన్‌ను అభిప్రాయపడటం కేవలం సమాజాన్ని దగా చేయటమే.

రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనలను వెనుక నుండి నడిపించిన రాజకీయ పార్టీలు సుప్రీం కోర్టు తీర్పు వచ్చిన మరుక్షణం నుంచీ పోటా పోటీన హర్షం వ్యక్తంచేస్తూ ప్రకటనలు గుప్పిస్తున్నాయి. రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టినందుకు ఆ ఘనత తమకు కూడా దక్కుతుందని బి.జె.పి., కమ్యూనిస్టు పార్టీలు చెప్పుకుంటున్నాయి. రాజ్యాంగం అమలులోకి వచ్చి ఆరు దశాబ్దాలు గడుస్తున్నా ప్రజల్లో వెనుకబాటుతనం, పేదరికం ఇంత తీవ్రంగా వుండడానికి కారణం నిజంగా ప్రభుత్వాల, రాజకీయ పార్టీలపై వైఫల్యమే ననటంలో సందేహంలేదు. కనుక రిజర్వేషన్ల గురించి మాట్లాడేవారంతా వెనుకబాటుతనం నిర్మూలనలో తమ వైఫల్యాలను గురించి మాట్లాడేందుకు ఇష్టపడరు.

విచిత్రమేమిటంటే ఈ పార్టీల నేతలు నిసిగ్గుగా ఇంకా గూడాల్లోకి వెళ్లి దళితులతో కలిసి భోజనాలు చేయడం, వారి పిల్లలను అక్కున చేర్చుకోవటం, వారికి హామీలు ఇవ్వడం, వారికడుపు నింపేందుకు సబ్సిడీలు ప్రకటించడం, ప్యాకేజీలు విడుదల చేయడం చేస్తుంటారు. కులాల వారీగా బహిరంగ సభలు నిర్వహించటం, కేంద్ర మంత్రులతో హామీలిప్పించటం, కొత్త కొత్త వర్గాలకు కొత్త కొత్త రంగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని పుంఖాను పుంఖాలుగా వాదిస్తారు. జంతర్‌మంతర్ వద్ద వారి ధర్నాల్లో పాల్గొని ఉపన్యాసాలిస్తుంటారు. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ ఇలాంటి నాటకీయ విన్యాసాలు ఎక్కువవుతుంటాయి. కానీ వాస్తవానికి వారి మౌలిక పరిస్థితుల్లో మార్పులు తెచ్చే చర్యలు చాలా స్వల్పం.

ఒ.బి.సి.ల్లో సంపన్న శ్రేణికి రిజర్వేషన్లు మినహాయించటాన్ని సమర్థించిన వాడూ, మామూలు సమయాల్లో దళితుల గాలి కూడా సోకకుండా తిరిగే రాహుల్ గాంధీ ఎన్నికలు వచ్చేసరికి దళితులతో కలిసిమెలిసి తిరగటం, దళితుల పిల్లల్ని భుజాన ఎక్కించుకుని, వారితో కరచాలనం చేయటం లాంటి ఎన్నికల విన్యాసాలు చేశాడు. ఈ బూటకత్వాన్ని బట్టబయలు చేస్తూ వచ్చిన విమర్శలను కౌంటర్ చేస్తూ రిజర్వేషన్లను పచ్చిగా వ్యతిరేకించి, తెరవెనుక ఆందోళనలు నడిపించిన బి.జె.పి. పార్టీకి అధ్యక్షుడైన రాజ్‌నాథ్ సింగ్ రాహుల్ గాంధీకి అండగా నిలబడి తమ వర్గ స్వభావాన్ని నిరూపించుకున్నాడు.

## సంపన్న శ్రేణి (క్రీమీలేయర్) నిబంధన

కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఐ.ఐ.టి., ఐ.ఐ.ఎం. ఇతర విద్యా సంస్థల్లో ఒ.బి.సి.లకు 27 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టడాన్ని చట్టబద్ధమేనని సుప్రీం కోర్టు ఒకవైపు సమర్థిస్తూ ఇంకొకవైపు సంపన్న శ్రేణి నిబంధన విధించింది.

దీనికి సమర్థింపుగా రిజర్వేషన్ల వల్ల ఆయా కులాలలోని ధనవంతులే బాగుపడుతున్నారని వ్యాఖ్యానించడం వింటున్నాం. ఈ వ్యాఖ్య న్యాయ మూర్తుల నుండి కూడా వింటున్నాం. సామాజిక వ్యాఖ్యాతల నుండి కూడా వింటున్నాం. ఈ విషయంలో ఎవరూ అధ్యయనం చేపట్టిన దాఖలాలులేవు. రిజర్వేషన్లు ఆయా కులాల్లో ఎంత మందికి అందాయన్న సమగ్రమైన పరిశోధన ఏదీ లేదు. న్యాయస్థానాల తీర్పు అటువంటి ఏ పరిశోధననూ ఉటంకించలేదు. మరి ఏ సమాచారం లేకుండా ఈ నిర్ణయానికి ఎట్లా వచ్చారు? ఏ సమాచారం ఆధారంగా ప్రతి ఒ.బి.సి. కులంలోనూ ఒక వున్నత వర్గమే రిజర్వేషన్లు తీసుకుంటున్నదన్న నిర్ణయానికి వచ్చి వారిని తొలగించాలని పట్టుబడుతున్నారు? ఒ.బి.సిలలో ఎస్.సి., ఎస్.టి.లకు దగ్గరగా వున్న కులాలు వున్నాయి. వారు చాలా వెనుకబాటుతో వున్నారు. వీరిలోనూ సంపన్న శ్రేణిని తొలగించవలసిందేనా? ఈ కులాల్లో ఒక ఎమ్మెల్యేగానీ, ఒక ఐ.ఎ.ఎస్. అధికారిగానీ, ఒక జడ్జీ గానీ లేరు. రేపెవరైనా కష్టపడి ఆ హోదాను చేరుకుంటే వారి పిల్లలను వెంటనే రిజర్వేషన్లకు అనర్హులు చేయవలసిందేనా? చాలా ఒ.బి.సి. కులాలలో 'సంపన్న శ్రేణి'ని తొలగించినట్లయితే రిజర్వేషన్ కోటా సహితం నిండకపోవచ్చు. మరీ అట్టడుగు వర్గాలు ఐ.ఐ.టి., ఐ.ఐ.ఎం. లను ఆశించే స్థితిలో వుండరు. గ్రామీణ విద్యార్థులు లక్షల రూపాయలు పెట్టి వెళ్లలేరు. ఉన్నత విద్యా సంస్థల్లో చేరాలన్న అభిలాష, అందుకు పాఠశాలల స్థాయి నుంచి ఒక లక్ష్యంలో శిక్షణ పొందటం బి.సి.లలో ఒక మోస్తరు అభివృద్ధి చెందినవారికే సాధ్యం. సంపన్న శ్రేణి కింద ఈ మాత్రం అభివృద్ధి సాధించిన వారిని కూడా మినహాయిస్తే ఇక మిగిలేది ఎవరు? మరోవైపు 5 శాతం మార్కుల కటాఫ్ (మినహాయింపు) వుంటే బి.సి విద్యార్థులు ఎందరు వీటిల్లో సీట్లు పొందగలరో తీర్పు నిచ్చిన న్యాయమూర్తులకే తెలియాలి. రిజర్వేషన్లలో 'సంపన్న శ్రేణి'ని తొలగిస్తే 27 శాతంలో సగం కూడా భర్తీ కాదు. ఉద్యోగాలయితే ఖాళీగా వుంచి మరుసటి సంవత్సరం మళ్లీ ప్రయత్నించవచ్చును గానీ, విద్యా సంస్థల్లో సీట్లను ఖాళీ వుంచడానికి వీలులేదు. అగ్రకుల సామాజిక వర్గాలకు (ఓపెన్ కాంపిటీషన్) బదలాయించవలసిందే.

ఇంతా చేసి ఉన్నత విద్యా సంస్థల్లో ఈ తీర్పు చలవ వల్ల ఏ మార్పయినా చూడగలమా? రిజర్వేషన్ల లక్ష్యం సామాజిక వర్గాల మధ్య సమానత సాధించడమే తప్ప, సామాజిక వర్గాల లోపల సమానత సాధించడం కాదు. అగ్రకుల సామాజిక వర్గంలోనూ ఇప్పటికే బాగుపడిన వారి పిల్లలే మళ్లీ మళ్లీ ఎంపిక అవుతుంటారు.

సామాజిక వర్గాలను, ప్రత్యేకించి కులాలను నిచ్చెన మెట్లమీద నిలబెట్టి హెచ్చుతగ్గులు నిర్దేశించిన సామాజిక వ్యవస్థను సంస్కరించి అన్ని కులాలకు సమానావకాశాలు కల్పించటం రిజర్వేషన్ల లక్ష్యం. ఆర్థిక ప్రాతిపదికపై సంపన్న శ్రేణిని మినహాయించటం, సాంఘికంగా, విద్యాపరంగా రిజర్వేషన్లు కల్పించే రాజ్యాంగ నియమ నిబంధనలకి విరుద్ధం. రాజ్యాంగానికి, రాజ్యాంగ స్ఫూర్తికి లోబడి తీర్పు నివ్వాల్సిన సుప్రీం కోర్టు రాజ్యాంగానికి అతీతంగా అగ్రకుల ఆధిపత్యాన్ని కాపాడే విధంగా స్వీయాత్మక తీర్పునివ్వడం సక్రమమేనా? సుప్రీం కోర్టు రాజ్యాంగంకన్నా సుప్రీం కాదు. కేంద్ర ప్రభుత్వం ఒ.బి.సిలకు రిజర్వేషన్లు కల్పించటానికి వుద్దేశించిన కోటా చట్టంలో 'సంపన్న శ్రేణి' ప్రస్తావన లేదు. సంపన్న శ్రేణి ప్రస్తావన లేని ఈ చట్టం రాజ్యాంగబద్ధమేనని తీర్పు చెప్పినప్పుడు దాన్ని యధాతథంగా అమలుకానీయకుండా సంపన్న శ్రేణి మెరిక పెట్టడం మూతికి చిక్కం కట్టి మేత వేయటం లాంటిదే. మండల్ తీర్పులో ఆనాడు వుద్యోగ రంగంలో సంపన్న శ్రేణిని మినహాయించటమే తప్పు. ఆ తప్పును ఇప్పుడైనా సరిదిద్దాలే తప్ప మరోసారి అదే తప్పు చేయటం తప్పున్నర తప్పు.

ఉద్దేశ్య పూర్వకంగానే సుప్రీంకోర్టు ఈ తీర్పు వెలువరించిందనేది స్పష్టమవుతున్నది. అగ్రహారాలుగా వున్న వున్నత విద్యా సంస్థలలో ఒ.బి.సిల ప్రవేశానికి మార్గం సుగమం చేసిన మేరకు ఈ తీర్పు హర్షణీయమేగానీ, ఇప్పటికీ పత్రికలలో వచ్చిన వ్యాఖ్యలను బట్టి చూసినా పదిహేనేళ్లుగా రిజర్వేషన్ల విషయంలో న్యాయస్థానాలు వ్యక్తం చేస్తున్న వ్యతిరేక వైఖరినే ఈ తీర్పు మరింత బలపరుస్తున్నట్లు స్పష్టమవుతున్నది. 'సంపన్న శ్రేణి' సూత్రీకరణ ఇప్పటి దాకా వుద్యోగాలకే పరిమితమై వుండగా, దానిని ఇప్పుడు విద్యా సంస్థల్లో సీట్ల రిజర్వేషన్‌కూ వర్తింపజేశారు. 'సంపన్న శ్రేణి'ని గుర్తించడానికి ప్రమాణాలను కూడా తామే శాసన కర్తలయినట్లు ప్రకటించారు.

ఉద్యమాల ద్వారా సాధించుకున్న రిజర్వేషన్లు రాజ్యాంగం అమలు ద్వారా సరళతరం కావాల్సి వుండగా, న్యాయస్థానాలు తమ వ్యతిరేక వైఖరితో ఆ అవకాశాన్ని కుదించివేశాయి. 1976కు

**పత్రికపై మీ విమర్శలూ, అభిప్రాయాలూ, సలహాలూ, సూచనలను ఎప్పటికప్పుడు తెలియజేయండి. అది పత్రిక అభివృద్ధికి దోహదపడుతుందని గుర్తించండి!**

ముందు రిజర్వేషన్లు సమాన అవకాశాలకు విరుద్ధం అంటూ జడ్జీలు సూత్రీకరించారు. 1976లో సమానవకాశాలకు సాధనం అని సుప్రీం కోర్టు గుర్తించింది. న్యాయమూర్తులకు ఇది అర్థం కావడానికి పాతికేళ్లు పట్టింది. అప్పటి నుండి రిజర్వేషన్ల విషయంలో కోర్టు తీర్పులతో కొంత అనుకూల వైఖరి కన్పించినా, 1992లో 'మండల్ కమీషన్' కేసులో ఈ అనుకూల వైఖరిని ఒకవైపు క్రోడీకరించి ఆమోద ముద్ర వేస్తూ, అ తర్వాత వ్యతిరేక పరిణామాలకు బీజం అయిన రెండు సూత్రీకరణలు కూడా చేసింది. అన్ని బి.సి కులాలలోనూ 'సంపన్న శ్రేణి' అనే వున్నత వర్గాన్ని రిజర్వేషన్ల పరిధి నుండి తొలగించాలన్నది ఒకటి. ఒ.బి.సి కులాలను గుర్తించబడానికి బి.సి కమీషన్ నియమించి బహిరంగ విచారణ చేపట్టాలన్నది రెండవది. అప్పటి నుండి గడచిన పదిహేను సంవత్సరాలుగా మళ్లీ వ్యతిరేక వైఖరిగల తీర్పులే వస్తున్నాయి.

'సంపన్న శ్రేణి' విధించడం వెనుక పాలకవర్గాల కుట్ర వుంది. జనరల్ కేటగిరీ వారి సీట్ల సంఖ్య పెంచితే సంపన్న శ్రేణి విధించాల్సిన పనిలేదని సుబ్రహ్మణ్య స్వామి లాంటి వారు చేసిన సూచన కూడా దగాకోరుతనాన్ని బయటపెడుతున్నది. వీరి ప్రేమ బి.సిల మీద కాదు. 15 శాతంగా వున్న అగ్ర కులాలవారు జనరల్ కేటగిరిలో ఇప్పటిదాకా (ఎస్.సి, ఎస్.టిల కోటా పోను) అనుభవిస్తున్న 77.5 శాతం అప్రకటిత రిజర్వేషన్ కోటాలో 50 శాతం పైగా బి.సిలకు జనాభా దామాషాలో వాటా కేటాయిస్తే ధనిక వర్గాల ఆధిపత్యం కుప్పకూలి పోతుంది. వున్నత విద్యా రంగాన్ని అగ్రకులాల అగ్రహారంగా మార్చుకోవటం కుదరదు. అందుకే 'సంపన్న శ్రేణి' పన్నాగం. ఇప్పుడున్న జనరల్ కేటగిరి సీట్ల సంఖ్య తగ్గించకుండానే అదనపు సీట్లు, సౌకర్యాలు ఏమేరకు కల్పిస్తారో ఆమేరకు దశల వారీగా మూడేళ్లలో 27 శాతం ఒ.బి.సి కోటాను పూర్తి చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించటంలోని ఆంతర్యం కూడా అగ్రకులాధిపత్య పరిరక్షణే. ఒ.బి.సి కోటాపై కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన వీరప్ప మొయిలీ కమిటీ 27 శాతంగా అగ్రవర్ణాలకు అధికంగా సీట్లు పెంచి (కోటా ఎంత అమలయితే అంత శాతం, 16 వేల కోట్ల రూపాయలు అగ్రవర్ణాల విద్యార్థులకు కేటాయించటం వలన "కోటా"కు అర్థం లేకుడా పోవటమేగాక అగ్రవర్ణాల అప్రకటిత కోటా 100 శాతానికి పైగా ఐ.ఐ.టి / ఐ.ఐ.ఎం.లలో అమలు కాబోతుండగా ఒ.బి.సిలో మాత్రం గతం కంటే కేవలం 3 శాతం మాత్రమే అధికంగా సీట్లు పొందే అవకాశం వుంది.

మరొకపక్క ప్రభుత్వ సంస్థల్ని నిర్వీర్యం చేస్తూ పాలకులు సర్వం ప్రయివేటుపరం చేస్తుండగా ప్రయివేటు రంగంలోని వుద్యోగాల్లో, విద్యా సంస్థల్లో కూడా రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం వుంది. దీని గురించి న్యాయస్థానాలు ఏమీ మాట్లాడకపోతుండగా, జస్టిన్ భండారే ఎవరూ పిటీషన్ వేయకపోయినా ప్రయివేటు సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయడం, ఆ సంస్థల స్వయం ప్రతిపత్తికి భంగకరమని వ్యాఖ్యానించాడు. దీన్నిబట్టి ప్రయివేటు రంగం జోలికి వెళ్లటం న్యాయస్థానాలకు ఇష్టం లేదనేది స్పష్టం. ప్రభుత్వం వెచ్చిస్తున్న ప్రజాధనంతో మౌలిక వసతులు, రాయితీలు, సబ్సిడీలు పొందుతూ సంపదలన్నింటిపై గుత్యాధిపత్యం వహిస్తున్న ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు లేకుండా సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబాటుకు గురైన వర్గాలకు ఒరిగేదేమీ లేదు. పాలకవర్గాల జేబు సంస్థలైన న్యాయస్థానాలు పాలకవర్గాలకే కొమ్ముగాస్తాయి తప్ప, అణగారిన వర్గాలకు న్యాయం కల్పిస్తాయనుకోవటం ఎండమావిలో నీటి కోసం వెతుక్కోవటమే. కనుక సంపూర్ణ సమానావకాశాల కోసం, సామాజిక న్యాయం కోసం బి.సిలు తమ పోరాటాన్ని సాగించక తప్పదు.

రిజర్వేషన్లు కుల వివక్షను, నిచ్చెన మెట్ల కుల వ్యవస్థను నిర్మూలించగలినవి కావు. వీటితో పీడిత కులాలను ఆర్థికంగా అభివృద్ధి చేయటం కూడా పాక్షికమైనదే. ఆరు దశాబ్దాలుగా రిజర్వేషన్లు అమలవుతున్నా రిజర్వేషన్ల ఫలితాలు ఈ వర్గాలకు దక్కింది నామమాత్రమే. ధనిక వర్గాలు అనేక అడ్డదారుల్లో రిజర్వేషన్లను అనుభవిస్తున్నాయి. దోపిడి వర్గాల చేతుల్లో అధికారం వున్నంత కాలం పీడిత కులాలూ, వర్గాలకు చెందవలసిన అవకాశాలను దోపిడివర్గాలు కాజేస్తాయి తప్ప, వీరికి దక్కనీయవు. ఇక పాలకవర్గాల కొమ్ముగాసే న్యాయస్థానాలు వారి ప్రయోజనాలకు అనుకూలమైన తీర్పులు వెలువరిస్తాయే గానీ, పీడితులకు సామాజిక న్యాయాన్ని కల్పించవు. దోపిడి పాలకవర్గాలను కూలదోసి భూమి, ఆస్తులు, సమస్త సంపదలను సమాజపరం చేసే నూతన ప్రజాస్వామిక వ్యవస్థలోనే ప్రజలందరికీ సమానత్వం, సామాజిక న్యాయం లభిస్తాయి. అందుకు పీడిత కులాలు తమ ప్రజాస్వామిక హక్కుల కోసం సమరశీలంగా పోరాడుతూ నూతన ప్రజాస్వామిక వ్యవస్థ కోసం జరుగుతున్న వర్గ పోరాటంలో భాగస్వాములు కావాల్సిన అవసరం వుంది.

★

**బలిమెల వద్ద గ్రేహౌండ్స్ బలగాలపై సాహసోపేతమైన, వీరోచితమైన, అపూర్వమైన దాడిని విజయవంతం చేసిన పి.ఎల్.జి.ఎ.కు విప్లవ జేజేలు!**

# పోరాటాలూ - ప్రతిఘటన - సభలు

## శ్రీకాకుళం డివిజన్

### కంచాల్ హత్యాకాండకు నిరసనగా రైల్వే స్టేషన్ పేల్చివేత

మార్చి 18న డి.కె.లో జరిగిన కంచాల్ హత్యాకాండకు నిరసనగా శ్రీకాకుళం డివిజన్‌లోని గుమ్మడ రైల్వేస్టేషన్‌ను మార్చి 25న నాగావళి దళం పేల్చి వేసింది. ఈ స్టేషన్, పోలీస్ స్టేషన్‌కు పది నిమిషాల దూరంలోనే వుంటుంది. పైగా ఈ స్టేషన్‌పై గతంలోనూ కొన్ని దాడులు జరిగాయి. కనుక, ఇక్కడ పోలీస్ నిఘా ఎక్కువగా వుంటుంది. అయినప్పటికీ మార్చి 25న రాత్రి 10.30 గంటలకు దళం వెళ్లి సిబ్బందిని బయటకు పంపించి మైన్స్‌తో స్టేషన్ పేల్చివేశారు. దానితో సిగ్నలింగ్ వ్యవస్థతోపాటు మొత్తం ధ్వంసమయింది. సిబ్బందితో ఈ ఘటనను ఎందుకు చేస్తున్నారో గెరిల్లాలు వివరించారు. ఆ తర్వాత కంచాల్ హత్యాకాండకు నిరసనగా, పోలీస్ నిర్బంధానికి నిరసనగా రాసిన పోస్టర్లను అక్కడ వేసి వచ్చారు.

మొత్తం 15 నిమిషాల్లో ఘటనను విజయవంతం చేసి దళం సురక్షితంగా రిట్రీట్ అయింది.

ఈ చర్య ఫలితంగా ఆంధ్రా ఒడిస్సా రాష్ట్రాల మధ్య 15 గంటలపాటు రైళ్ల రాకపోకలు నిలిచిపోయి పోలీసుల దమనకాండ పెద్ద ఎత్తున ప్రచారం అయింది. విజయనగరం జిల్లాలో ఇది మంచి ప్రభావాన్ని వేసింది.

### సారా సమస్య పరిష్కారం

శ్రీకాకుళం డివిజన్‌లోని రాయగడ జిల్లా మొరం పంచాయితీ చాలా వెనుకపడ్డ పంచాయితీ. ఈ పంచాయితిలో ఎక్కువ మంది భూమిలేని ప్రజలు వున్నారు. పేదరికం వల్ల అనేక వ్యాధులబారిన పడి ఎందరో అమాయక గిరిజనులు చనిపోతున్నారు. దీనికి తోడు ఈ పంచాయితీలో సారా వండడం ముమ్మరంగా వుంది. దీనితో ఇక్కడి ఆదివాసీలు సారాకు బానిసలుగా తయారయ్యారు. దీని బారినపడి ఇప్పటి వరకు ఎంతో మంది చనిపోయారు. ఈ మధ్య కాలంలో ఈ సమస్య మరింత ఎక్కువై స్వల్ప కాలంలోనే 15 మంది స్త్రీ, పురుషులు చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న దళం మొరం గ్రామంలో పంచాయితీ నిర్వహించి సారా తాగడం వలన ఎలాంటి అనర్థాలు జరుగుతాయో అక్కడి ప్రజలకు వివరంగా అర్థం చేయించింది. అలాగే ఈ ప్రాంతంలో సారా వండే వారిని, వెంటనే సారా వండడం బంద్ చేయాలని హెచ్చరించింది. సారా వండేవాళ్లందరికీ బంద్ చేయాలని దళం నోటీసులు కూడా పంపింది. దళం ఇచ్చిన చైతన్యంతో ప్రజలు ముందుకు వచ్చి సారా వ్యతిరేక కమిటీలను పెట్టుకుని సమస్యను పరిష్కరించుకున్నారు. ముఖ్యంగా మహిళలు ముందు వరుసలో వున్నారు. ఎంతో కాలం నుండి ఎదురుచూస్తున్న ప్రజలు ఈ సమస్య పరిష్కారంతో చాలా ఉత్సాహవంతులయ్యారు.

### ఉద్యమ వ్యతిరేకులకు భౌతిక శిక్షలు

డివిజన్‌లోని గుమ్మలక్ష్మీపురం మండలం చిన్నగీసాడ పంచాయితీలోని అచ్చిబ గ్రామానికి చెందిన నిమ్మక ముసిరిది పెత్తందారీ కుటుంబం. ఇతనూ, ఇతని తమ్ముడు ప్రజలపై తరచూ దౌర్జన్యాలు చేసేవారు. వీళ్లను వ్యతిరేకించిన వారిని ప్రజల్లో వున్న మూఢ నమ్మకాలను ఆసరా చేసుకొని మంత్రగాళ్లని ముద్రవేసి హత్యలు చేసేవారు. వీళ్ల గ్రామంలోనే కాకుండా చుట్టపక్కల గ్రామాల్లో కూడా దౌర్జన్యాలకూ, హత్యలకు పాల్పడేవారు.

అంతేకాదు వీళ్ళు పోలీసు ఇన్ఫార్మర్లుగా మారి దళాన్ని పట్టిస్తామనీ, లేదా విషం పెట్టి చంపుతామని ఎస్.ఐ., సి.ఐ.లతో ఒప్పందాలు చేసుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారం కనీసం పది సార్లు పోలీసులకు దళ సమాచారం ఇచ్చారు. కానీ ప్రతీసారి ప్రజల సహకారంతో దళం సురక్షితంగా తప్పుకుంది.

వీళ్ల చర్యలతో విసిగిపోయిన ప్రజలు ముసిరిని చంపాలని పార్టీని కోరారు. 2006లో దళం బహిరంగ సభ ఏర్పాటు చేసి పద్ధతులు మార్చుకొమ్మని హెచ్చరించింది. అయినా ఇతని ప్రజా వ్యతిరేక చర్యలు కొనసాగడంతో 2007, సెప్టెంబర్ 13న దళం, మిలీషియా కలిసి ఇతన్ని ఖతం చేశారు. అతని తమ్ముడ్ని వూరు విడిచి వెళ్లాలనీ, ఆక్రమించుకున్న ప్రజల ఆస్తులను తిరిగి ఇచ్చివేయాలనీ, పోలీసులతో సంబంధాలు తెంచుకోవాలని హెచ్చరించారు.

ఈ చర్య ప్రజలల్లో మంచి ప్రభావం వేసింది.

బామిని మండలంలో వేళ్లూనుకున్న పీడిత ప్రజల పోరాటాన్ని అణచడానికి శత్రువు బహుముఖ దాడిని కొనసాగిస్తున్నాడు. అందులో భాగంగా ప్రకాష్ అనే వ్యక్తిని ఇన్‌ఫార్మర్‌గా తయారుచేశారు. ఇంతకు ముందు ప్రకాష్ తమ్ముడు పుణ్యగిరి ప్రజాసంఘంలో పనిచేసి కోవర్టుగా మారి అమరుడు కామ్రేడ్

# ఉత్తేజభరితంగా జరిగిన 'నయాగఢ్' విజయోత్సవ సభ

దక్షిణ బస్తర్ డివిజన్‌లోని పామేడ్ ఏరియాలో కంచాల్ గ్రామానికి దగ్గర్లోని ఒక గ్రామంలో నయాగఢ్ ఆపరేషన్ విజయోత్సవ సభ 2008, జూన్ 4వ తేదీన విజయవంతంగా జరిగింది.

ఈ సభకు పామేడ్ ఏరియాలోని 20 గ్రామాలకు చెందిన 5వేల మంది ప్రజలు హాజరయ్యారు. సభకు ముందురోజే పరిసర గ్రామాల ప్రజలు సభాస్థలి పరిసరాల్లోకి చేరుకున్నారు. సభకోసం హాజరైన ప్రజలు ఉదయం పూట వంటలు చేసుకుని 10 గంటల వరకు సభ కోసం సిద్ధమయ్యారు. ఉదయం 11 గంటలకు అత్యంత వుత్సాహకర వాతావరణంలో విజయోత్సవ సభ ప్రారంభమైంది. సభ ప్రారంభానికి ముందు ప్రజలంతా గుమిగూడి డోళ్ళు, డప్పులతో నృత్యాలు ప్రారంభించారు. ఉదయం 11 గంటలకు దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటి కార్యదర్శి కా.వెంకటేష్ సభ ప్రారంభాన్ని ప్రకటించడంతో సభ ప్రారంభమైంది. సి.ఎన్.ఎం(చేతనా నాట్యమంచ్)కు చెందిన కా. రమేష్ జండా ఎగుర వేశాడు. ఇంటర్నేషనల్ గీతాలాపన తర్వాత నయాగఢ ఆపరేషన్‌లో అసువులు బాసిన కామ్రేడ్లు కమల, రాంబత్తి, ఇక్బాల్, అర్జున్‌ల స్మృత్యర్థం 2 నిమిషాలు మౌనం పాటించి జోహార్లు అర్పించారు. అనంతరం నయాగఢ్ ఆపరేషన్‌లో పాల్గొన్న బలగాలతో పాటు పి.ఎల్.జి.ఎ, ఇతర యూనిట్లకు చెందిన వందలాది ప్రజాసైనికులు కొద్దిసేపు కవాతు నిర్వహించారు. మధ్య మధ్యలో నినాదాలు హోరెత్తాయి. కవాతు తర్వాత శత్రువు నుండి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను ప్రదర్శించారు. సభకు అధ్యక్షత వహించిన దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీ కార్యదర్శి కా.వెంకటేష్ వక్తలను ఒక్కొక్కరిని వేదిక పైకి ఆహ్వానించాడు.

మొదట దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటి సభ్యుడు కా.మదన్ సభనుద్దేశించి ప్రసంగించాడు. భారతదేశంలోనే అతిపెద్ద మిలిటరీ చర్యగా నిలిచిన నయాగఢ్ ఆపరేషన్‌లో పాల్గొని గోసామ పర్వతాల వద్ద పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో అసువులు బాసిన కా.ఇక్బాల్(ఏమ్లు మంగూ) సాహసాన్ని కొనియాడాడు. గ్రామంలో మిలిషియాలో పనిచేసిన కాలం నుండి గోసామ ఎన్‌కౌంటర్లో అసువులుబాసే వరకు శత్రువుతో తలపడిన ప్రతిసారి సాహసోపేతంగా పోరాడిన కా.ఇక్బాల్ గొప్ప సాహసిక యోధుడని, ఆయన బాటలో యువతరం పి.ఎల్.జి.ఎలో రిక్రూటయ్యి పోరాడాలని మదన్ కోరాడు. అనంతరం ఇక్బాల్ అన్న కా.సోముడాల్ మాట్లాడుతూ "నా తమ్ముడు దండకారణ్య ప్రజల విముక్తి కోసం పోరాడాడు, ఆయన ప్రజాయుద్ధంలో పాల్గొని ప్రాణాలర్పించినందుకు గర్వపడుతున్నాం, మా తమ్ముడిలాగా యువతీ యువకులంతా సాహసికంగా పోరాడి పోలీసులను బస్తర్ నుండి తరిమివేయాలి" అంటూ తన ప్రసంగాన్ని ముగించాడు. తర్వాత పామేడ్ ఎల్.ఓ.ఎస్ కమాండర్ కా.ఐతు, ఆర్.పి.సి అధ్యక్షుడు కామ్రేడ్ వుంగాల్ మాట్లాడారు. వారి తర్వాత సి.సి.ఎం కా. నర్సన్న నయాగఢ్ ఆపరేషన్ విజయాన్నీ, దాని ప్రాధాన్యతల్ని వివరించాడు. జాయింట్ ఆపరేషన్స్ పేరుతో బస్తర్‌లో చొరబడుతూ కంచాల లాంటి కోవర్టు ఆపరేషన్స్‌కు పాల్పడుతున్న ఆంధ్రా గ్రేహౌండ్స్ పోలీసులను తరిమి వేయాలనీ, నక్సలైట్ ఉద్యమ నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం మొదలు పెట్టిన దేశవ్యాప్త దాడిలోని పైలట్ ప్రాజెక్టులో భాగంగా దంతేవాడ, బీజాపూర్ జిల్లాల్లో కార్పెట్ సెక్యూరిటీ పద్ధతుల్లో పోలీసు బలగాల్ని మోహరిస్తూ కొనసాగుతున్న దాడిని ఓడించాలని ఆయన పిలుపునిచ్చాడు. తర్వాత నయాగఢ్ ఆపరేషన్‌లో పాల్గొన్న కమాండర్లు కామ్రేడ్స్ మహేష్, సూర్యం, సుగుణలు తమ అనుభవాల్ని వివరించారు. కా.సుగుణ, నయాగఢ్ ఆపరేషన్‌లో మహిళల పాత్ర గురించి మాట్లాడింది. మధ్యలో 3వ కంపెనీ డిప్యూటీ కమాండర్ కా. చందు మాట్లాడాడు. చివరగా ఎస్.జెడ్.సి.ఎమ్ కా.సుజాత మాట్లాడింది. ఆమె నయాగఢ్ విజయాన్ని ఎత్తిపట్టింది. దండకారణ్యంలో ప్రత్యేకించి బస్తర్‌లో కొనసాగుతున్న దాడి తీవ్రతను ప్రజలకు వివరించి దాన్ని ప్రతిఘటించాలని, ఓడించాలని పిలుపునిచ్చింది. ప్రజలు, స్థానిక నిర్మాణాల కామ్రేడ్లు శత్రువు డబ్బులకు ఆశపడకుండా, బెదిరింపులకు లొంగకుండా వుండాలని, కంచాల ద్రోహుల్లాగా కోవర్టులుగా మారవద్దని కోరింది.

మధ్య మధ్యలో సి.ఎన్.ఎం కళాకారులు విప్లవ గీతాలు ఆలపిస్తూ ప్రదర్శనలు యిచ్చారు. మధ్య మధ్యలో "ఆంధ్ర గ్రేహౌండ్స్‌ను తన్ని తరుముదాం!", "కార్పెట్ సెక్యూరిటీ పద్ధతిలో వేస్తున్న క్యాంపులను ధ్వంసం చేద్దాం!", "నయాగఢ్, కంచాల్ అమరవీరులకు జోహార్లు!", "పి.ఎల్.జి.ఎ జిందాబాద్!", "సి.పి.ఐ (మావోయిస్టు) జిందాబాద్!" అనే నినాదాలు మారుమోగాయి. చివరిగా జండా అవనతం తర్వాత గంటసేపు సాంస్కృతిక కార్యక్రమాలు సాగాయి. చివరికి సభ సాంస్కృతిక నృత్యమై ముగిసింది.

రాజన్నను పట్టించాలని ప్రయత్నించిన విషయం, అమరుడు కామ్రేడ్ చంటన్న అరెస్టుకు కారకుడైన విషయం బహిర్గతం కాగానే పుణ్యగిరి పరారీలో అయ్యాడు. అప్పటి నుండి ప్రకాష్ కాంగ్రెస్ నాయకుడిగా, పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తూ పార్టీని నష్టపర్చాలని చూస్తున్నాడు. అతను సమాచారం ఇవ్వడం వల్ల ఎన్నోసార్లు పోలీసులు దళాన్ని సమీపించారు. కానీ పోలీసుల కాల్పుల నుండి దళం త్రుటిలో తప్పుకోగల్గింది. పార్టీకి సహకరిస్తున్న వాళ్ల గురించి పోలీసులకు చెప్పి అరెస్టులు చేయిస్తున్నాడు. కొన్ని గ్రామాలలో యువకులను ఇన్‌ఫార్మర్లుగా తయారు చేశాడు. గతంలో ఇతన్ని దళం హెచ్చరించి వదిలిపెట్టింది. అయినా తన పద్ధతులను మార్చుకోలేదు. కాంగ్రెస్ నాయకుడిగా పంచాయితీలో చెలామణి అవుతూ ప్రజల మధ్య తగాదాలు సృష్టిస్తున్నాడు. బాల్లేరు సెంటర్‌లో ఎస్.టి.డి. బూత్ పెట్టుకుని ఫోన్ ద్వారా పోలీసులకు సమాచారం అందిస్తున్నాడు. ఈ కారణం వల్ల 2008, మార్చి 1న దళం ప్రకాష్‌ను పట్టుకొని విచారించి ఖతం చేసింది.

ఇదే మండలంలో కోశంగూడ గ్రామంలో ఎల్లంగూ, సన్నాయి అనే అన్నదమ్ములు ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరిస్తూ పార్టీ సమాచారాన్ని చేరవేసేవారు. అడవిలో తిరిగి డంపులను వెతికి వూరుకొండల్లో పెట్టిన తూటాల డంపును పోలీసులకు చూపించారు. 2005, సెప్టెంబర్ 23న అదే గ్రామంలో దళం వున్నప్పుడు సమాచారాన్ని ఇవ్వడంతో ఎన్‌కౌంటర్ జరిగింది. దళం ప్రతిఘటిస్తూ రిట్రీట్ అయింది. ఈ సంఘటన తర్వాత దళం వీళ్లను ఎన్నిసార్లు హెచ్చరించినా వీళ్లు వినలేదు. అందువలన 2005లో ప్రజల అభీష్టం మేరకు ఎల్లంగును చంపడం జరిగింది. అన్నను చంపిన కోపంతో తమ్ముడు సన్నాయి మరింత కక్ష పెంచుకున్నాడు. ఏరియాలో వున్న సంఘ నాయకుల పేర్లు చెప్తూ అరెస్టులు చేయిస్తున్నాడు. రాత్రి వేళల్లో ఆంబుష్ కూర్చున్న పోలీసులకు సహకరిస్తున్నాడు. అందువల్ల 2008, ఫిబ్రవరి 29న కొండబారిడి మిలీషియా దళం ఇతన్ని పట్టుకుని, విచారణ చేసి ఖతం చేసింది.

ఇదే డివిజన్‌లోని రాయగడ జిల్లా రేఖబద్ర పంచాయితీ పాండ్రతల గ్రామ సర్పంచ్ అనంత్‌ను 2008, ఏప్రిల్ 28న యాక్షన్ టీం ఖతం చేసింది.

ఇతను గ్రామంలో ఇన్‌ఫార్మర్‌గా వుంటూ రాజకీయాల్లోకి వచ్చాడు. సంఘ నాయకులను అరెస్టులు చేయించేవాడు. దళం ఆ ఏరియాకు వెళ్లిన వెంటనే శత్రువుకు సమాచారం చేరవేసేవాడు. ఏరియాలో కొంత మంది యువకులను హోంగార్డులుగా, ఇన్‌ఫార్మర్లుగా తయారు చేశాడు. వీళ్లు అమ్మాయిలపై అత్యాచారాలకు పాల్పడేవారు. అమ్మాయిల తల్లిదండ్రులు సర్పంచ్ అనంత్ దగ్గరకు వెళ్లి రిపోర్టు చేస్తే పట్టించుకునేవాడు కాదు. పైగా అనంత్‌కూడా అదే గ్రామానికి చెందిన బుడ్డు భార్యను రాజకీయ బలంతో అత్యాచారం చేశాడు. ఈ విషయం పోలీసులకు రిపోర్టు చేసినా ఎవరూ పట్టించుకోకపోగా తిరిగి ప్రజలనే కొట్టారు.

ప్రజలు పోరాటం చేసి ఆక్రమించుకున్న భూములను పోలీసులూ, రాజకీయ నాయకుల అండతో బలంతో లాక్కొని ఈయన సాగు చేస్తున్నాడు. ఇలా అనేక విధాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఆ పంచాయితీ చుట్టుపక్కల పంచాయితీలకు చెందిన కొన్ని గ్రామాలను కలుపుకొని ఈయన ఆధ్వర్యంలో పోలీసులు టోర్నమెంట్స్ పెట్టారు. దీనికి డి.ఐ.జి. వచ్చి బహుమతులు ఇచ్చాడు. ఈ సందర్భంగా పోలీసులు పార్టీకి వ్యతిరేకంగా వుపన్యాసాలిచ్చారు.

ఈ చర్యలకు బదులుగా పార్టీ నిర్ణయం మేరకు యాక్షన్ టీం అనంత్‌ను ఖతం చేసింది.

## మల్కన్‌గిరి డివిజన్

### ఆర్.ఎస్.ఎస్. నేత బి.జె.పి. జిల్లా నాయకుడు మహంతి ఖతం

ఆర్.ఎస్.ఎస్. నేత, బి.జె.పి. జిల్లా వుపాధ్యక్షుడు, న్యాయవాది కూడా అయిన మహంతి మల్కన్‌గిరి జిల్లాలో విప్లవోద్యమానికి వ్యతిరేకి. ఒడిస్సా రాష్ట్రంలో బి.జె.డి., బి.జె.పిల సంకీర్ణ ప్రభుత్వం విప్లవోద్యమాన్ని నిర్మూలించే పథకాన్ని చేపట్టి విస్తృతంగా దాడులు చేస్తూ, బూటకపు ఎదురు కాల్పులకు పాల్పడుతూ, అరెస్టులు, చిత్రహింసలకు పాల్పడుతున్నది. పెరుగుతున్న నిర్బంధానికి పాలక పార్టీలను బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకోవడంలో భాగంగా మహంతిని 2008, మే 25న అతని ఇంటి దగ్గరనే పి.ఎల్.జి.ఎ. ఖతం చేసింది.

మల్కన్‌గిరి జిల్లా విప్లవోద్యమాన్ని దెబ్బతీయడాకి శత్రువు

**పత్రికకు మీ ప్రాంతంలోని పోరాట, ప్రతిఘటన, నిర్బంధ, సభలూ - సమావేశాల నివేదికలు, అమరుల చరిత్రలను ఎప్పటికప్పుడు పంపుతూ వుండండి.**

అనుసరిస్తున్న ఎత్తుగడల్లో ఇన్‌ఫార్మర్ వ్యవస్థను బలోపేతం చేసుకోవడం ఒకటి. దీంట్లో భాగంగా వుంటూ మహంతి కూంబింగ్‌కు వస్తున్న సి.ఆర్.పి.ఎఫ్, ఎస్.ఒ.జి. పోలీసులకు సహకరిస్తూ వారికి సమాచారం ఇస్తూ వారి మెప్పును పొందుతున్నాడు. లాయర్ అవడం వల్ల సంపాదన కోసం పార్టీ సంఘాలలో పని చేస్తున్న వారిపై, ఇతర సానుభూతిపరులపై కేసులు పెట్టిస్తూ, కేసులు సకాలంలో పరిష్కరించకుండా ప్రజలను తన చుట్టూ తిప్పుకుంటూ వేల రూపాయలు తిన్నాడు. ఇలా ప్రజల డబ్బు తిని లక్షలు సంపాదించాడు. ఎం.వి.79 చుట్టు పక్క గ్రామాల్లో క్రిష్టియన్ మతానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ, క్రిష్టియన్ మతంలో చేరవద్దనీ, మతాన్ని విడిచిపెట్టాలని బెదిరిస్తూ ప్రజలపై అనేకసార్లు దాడులు చేయించాడు. దీనితో ప్రజా, క్రిష్టియన్ మత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని పార్టీ హెచ్చరించింది. పోస్టర్లు కూడా వేసింది. ఇంకా పార్టీ సంబంధాల్లోకి ఎవరూ వెళ్లవద్దని సంఘ సభ్యులనూ, గ్రామస్తులను బెదిరించేవాడు. ఇతను ఇద్దరు ఆదివాసీ మహిళలకు అన్యాయం చేశాడు. వాళ్లను నమ్మించి మోసం చేయటంతో స్థానిక ఆదివాసీ ప్రజలు ఇతన్ని అసహ్యించుకున్నారు.

ఇటువంటి దుర్మార్గుడిని పి.ఎల్.జి.ఎ. చంపడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఒకే పోలీస్ బ్యాచ్‌పై రెండుసార్లు గెరిల్లాల కాల్పులు

ఒకే పోలీస్ బ్యాచ్‌పై దళం, జన మిలీషియా కలిసి వెంట వెంటనే, పక్క పక్కనే ఆపర్చునిటీ ఆంబుష్‌లు రెండుసార్లు చేయడంతో పోలీసులు కకావికలై ప్రాణ భయంతో పారిపోయారు.

ఏరియా డామినేషన్‌లో భాగంగా ఎస్.ఒ.జి., గ్రేహౌండ్స్ బలగాలు లోపలికి వచ్చాయి అని మిలీషియా నుండి కబురు రాగానే దళం వెంటనే ఒకచోట ఆపర్చునిటీ ఆంబుష్‌కు కూర్చున్నది.

కలిమెల పోలీస్ స్టేషన్ నుండి కొరుబు వచ్చి ప్లాటూన్ ఫార్మేషన్‌లో వెళ్తున్న ఎస్.ఒ.జి. పోలీసులపై మొదట ప్లటూన్ కామ్రేడ్స్ ఆంబుష్ చేశారు. దీంట్లో ఒక ఎస్.ఒ.జి. పోలీసుకు నడుం విరిగిపోయింది. ఇతన్ని మోటార్ సైకిల్‌పై పంపించి, మిగిలిన పోలీసులు తిరిగి వెళ్తున్నప్పుడు జన మిలీషియా దళం అదే బ్యాచ్ మీద దగ్గరలోనే మళ్లీ కాల్పులు జరపగా మరికొంత మంది పోలీసులకు గాయాలైనాయి. దీనితో గందరగోళానికి గురైన పోలీసులు భయపడి ముగ్గురు నలుగురుగా విడిపోయి కలిమెలకు పారిపోయారు. ఈ ఘటన ప్రజలలో, మిలీషియాలో మంచి ప్రభావాన్ని వేసింది.

## పోలీస్ హెూంగార్డ్ ఖతం

మోటు దళం ఏరియా జిన్నెల్ గ్రామంలో లచ్చాల్ అనే తాగుబోతు, అరాచకుడు, గూండా హెూంగార్డుగా పని చేస్తున్నాడు. ఈ దుర్మార్గుడు గ్రామంలో 7 సంవత్సరాల క్రితం ఇద్దరు మహిళలను అత్యాచారం చేసాడు. ఈ విషయాన్ని గ్రామ ప్రజలు నిలదీసినప్పుడు ప్రజలపైనే దాడి చేశాడు. 2003లో మోటు దళం గ్రామంలో మీటింగ్ చేయడానికి వెళ్లినప్పుడు ఇతనూ, వూరి పెద్దాల్ కల్సి దళం మీద తప్పుడు ఆరోపణలు చేసి దళంపై ప్రజలచే తిరుగుబాటు చేయించారు. 2005లో గ్రామంలో ప్రజల అనుమతి లేకుండా 5 లక్షల రూపాయలతో రోడ్డు వేసి కూలీలకు డబ్బులు ఇవ్వకుండా ఎగ్గొట్టాడు. కూలి డబ్బులు ఇవ్వాలని గ్రామ సంఘం నిలదీసినందుకు ఎం.వి.79 పోలీస్ స్టేషన్లో రిపోర్టు చేసి సంఘం వాళ్లను, ప్రజలను పోలీసు స్టేషన్‌కు పిలిపించి బెదిరించాడు. 2006లో మోటు దళం రోడ్డు కూలీ డబ్బులు ఇవ్వాలని, పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పని చేయవద్దని హెచ్చరించి దేహశుద్ధి చేసి తప్పును ఒప్పించింది. అయినా తన పద్ధతులు మార్చుకోకుండా పోలీసులతో సంబంధాలలో వుంటూ జిన్నెల్ గ్రామవాసి మల్లాల్ బంధువులను చూడటానికి ఎర్రబోరు వెళ్లినపుడు పోలీసులచే అరెస్టు చేయించాడు. బెయిల్‌పై వచ్చిన మల్లాల్‌కు నష్టపరిహారం చెల్లించాలని తాండ్వాయి పంచాయితీ ప్రజానీకం డిమాండ్ చేసినప్పటికీ తాను అరెస్టు చేయించలేదని బుకాయించి, ఎం.వి.79 పోలీసులను పిలిపించి ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురిచేసాడు. ఊరుమ్మడి ఓడను రెండు సంవత్సరాలు తన దగ్గర వుంచుకొని స్వార్థ ప్రయోజనాల కోసం వుపయోగించుకున్నాడు.

2008 ఫిబ్రవరి మాసంలో జిన్నెల్, కొండపాడు గ్రామంలో మోటు దళం సభ జరిపినప్పుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అయితే దళం తృటిలో తప్పుకుంది. ఆ వెంటనే పోలీసులను తీసుకువచ్చి జిన్నెల్ గ్రామవాసులైన రీమాల్, సీతాల్‌ను అరెస్టు చేయించాడు. అలాగే కొండపాడు ముత్తాల్‌ను అరెస్టు చేయించాడు. అంతేకాకుండా తొంకేల్‌లో సభ జరుపుతున్న దళంపై కాల్పులు చేయించింది కూడా ఇతడే. అలాగే ఈ గ్రామంలో నలుగురు ప్రజలను కూడా అరెస్టు చేయించాడు.

ఇటువంటి ప్రజా వ్యతిరేక చర్యల వల్ల ఈ గూండాను 2008, ఏప్రిల్ 5న యాక్షన్ టీం చంపేసింది.

## పోలీసు గూఢచారి ఖతం

కలిమెల ఎల్‌ఓఎస్ దళం ఏరియా పరిధిలోని తెల్లరాయి పంచాయితీ అడవిలో నీటి వాగుల వద్ద అనుమానాస్పద పరిస్థితిలో

తిరుగుతున్న ఒకరిని దళం పట్టుకొని ప్రశ్నించడంతో తను పోలీసునని ఒప్పుకున్నాడు. తనలాంటి వారు మరికొందరు అడవిలో తిరుగుతున్నారని, వాళ్లు చనిపోయినా ప్రభుత్వం 10 లక్షల రూపాయలు వాళ్ల కుటుంబాలకు అందజేస్తుందని చెప్పాడు. దళాల ఆచూకితో పాటుగా నీటి తావులనూ, అడవి దారులను రెక్కీ చేయడానికి పోలీసు యంత్రాంగం ఇటువంటి వారిని పంపుతున్నది. పూర్తిగా విచారించిన తర్వాత దళం ఇతన్ని చంపేసింది.

### పేంట గ్రామ పెద్దాల్ ఖతం

మోటు ఎల్ఓఎస్ దళం ఏరియా పరిధిలోని పూసుం పంచాయితీ పేంట గ్రామ పెద్దాల్ గ్రామ ప్రజలకూ, సంఘానికి వ్యతిరేకంగా వుండి తన పెత్తనానికి వ్యతిరేకంగా నిలబడిన ప్రజల్ని బెదిరించడం పంచాయితీలు చేసి మేకలు, గొడ్లు తినడం చేసేవాడు. ఇతని పెత్తనానికి వ్యతిరేకంగా సంఘం నిలబడి ఎదిరించినప్పుడు సంఘ నాయకుల్ని రకరకాలుగా హింసలకు గురి చేసాడు. రెండుసార్లు దేహశుద్ధి చేసినప్పటికీ తన పద్ధతులు మార్చుకోకుండా పోలీసులతో కలిసి సంఘనాయకుడు బుచ్చాల్‌ను అరెస్టు చేయించాడు. అంతే కాకుండా దళ సభ్యురాలి ఇంటి మీద దాడి చేయించి ఆమె అన్నను అరెస్టు చేయడానికి కుట్రలు పన్నాడు. కానీ అతను తృటిలో తప్పుకున్నాడు. దొరికిన వాళ్ల తండ్రిని పోలీసులు తీవ్ర చిత్రహింసలకు గురిచేసారు. ఇప్పటికీ ఆ దెబ్బల నుండి అతను కోలుకోలేదు. గ్రామంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంస్కరణలలో భాగంగా రోడ్లు, కాలువల కాంట్రాక్టులు తన బంధువులకు ఇప్పించి లాభాలు పొందాడు. వరదబాధితుల కోసం నిర్మించిన ఇండ్లల్లో అవినీతికి పాల్పడినాడు. గ్రామంలోని వుమ్మడి చెరువులోని చేపలను తానే అమ్ముకునేవాడు. గ్రామంలో పార్టీ ప్రజల సంక్షేమం కోసం ధాన్యం మిల్లు పెట్టించాలని ప్రయత్నిస్తే దానికి తీవ్రంగా అడ్డంకులు కల్పిస్తూనే మిల్లును అమ్ముకున్నాడు.

ఇలాంటి ప్రజావ్యతిరేకున్ని 2008, ఏప్రిల్ 7న దళం ఖతం చేసి ప్రజల పీడను వదిలించింది. ★

*(51వ పేజీ తరువాయి...)*

అమరురాలైంది. ఆమె సాహసాన్ని మన గుండెలకద్దుకుందాం. ఆ సాహసానికి మరణం లేదని చాటుదాం.

## కామ్రేడ్ ఇక్బాల్

డి.కె. నుండి ఎ.ఒ.బి.కి ఉద్యమ అవసరాల రీత్యా వచ్చిన కంపెనీలో కా. ఇక్బాల్ పార్టీ సభ్యునిగా పని చేస్తూ, చురుగ్గా వుండేవాడు. ఎ.ఒ.బి.లో ఒక సంవత్సరకాలం పాటు మిలిటరీ చర్యలలో పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను నిర్వర్తించాడు. నయాగఢ్ దాడిలో పాల్గొని తన వంతు బాధ్యతను నెరవేర్చి రిట్రీట్ అయి వస్తున్నప్పుడు గోసామా ప్రాంతంలో, వీరోచితంగా పోరాడుతూ శత్రువును నిలువరిస్తూ కామ్రేడ్ రాంబత్తితో పాటు అమరుడయ్యాడు. కా. ఇక్బాల్ ఆశయాన్ని ఎత్తిపడుదాం. ఆ ఆశయాన్ని కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం.

## కామ్రేడ్ అర్జున్

కుంట బ్లాక్ కిష్టారం ఏరియాలో పేద రైతు కుటుంబంలో కోయ తెగలో పుట్టిన కామ్రేడ్ అర్జున్‌కు తల్లి చనిపోయింది. చిన్నప్పటి నుండీ కష్టపడి పని చేస్తూ బాధ్యతగా వుండేవాడు. జన మిలీషియాలో పని చేస్తూ, కంపెనీలో పార్టీ సభ్యుడిగా ఎదిగాడు. కంపెనీతోపాటు ఎ.ఒ.బి.కి వచ్చి ఒక సంవత్సర కాలం ఎ.ఒ.బి.లో జరిగిన మిలిటరీ చర్యలలో పాల్గొన్నాడు. చాలా వుత్సాహంగా నయాగఢ్ దాడిలో పాల్గొని, దాడిని విజయవంతం చేయడంలో తన వంతు కృషి చేశాడు. దాడిలో సాధించిన తుపాకులను ప్రజాసైన్యానికి అందించటం కోసం అనేక కష్ట నష్టాలను అధిగమిస్తూ డి.కె.కు తిరిగి వెళుతున్న క్రమంలో 2008 మే నెలలో నదిలో ప్రయాణిస్తున్న పడవ మునిగి ప్రమాదవశాత్తు అమరుడైనాడు. అలా ఉద్యమ ప్రవాహానికి తన నవయవ్వనాన్ని అర్పించాడు కామ్రేడ్ అర్జున్. తన నవయవ్వంతో ఉత్తేజితమైన ఉద్యమ ప్రవాహం శత్రు కోటలను ముంచెత్తుతుందని ప్రతిజ్ఞ చేద్దాం. ★

*విప్లవ సంస్థలలో ఉదారవాదం చాలా ప్రమాదకరమైంది. అది తొలచివేసే స్వభావం కలది; ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుంది; సంఘీభావాన్ని పాడు చేస్తుంది; కార్యశూన్యతను ప్రవేశపెడుతుంది; తగాదాలను సృష్టించుతుంది. పకడ్బందీ అయిన నిర్మాణమూ, ఖచ్చితమైన క్రమశిక్షణ విప్లవకారులకు లేకుండా చేస్తుంది; విధానాలు పూర్తిగా అమలు జరగకుండా ఆటంకంగా తయారవుతుంది; పార్టీ నాయకత్వాన గల సంస్థలకు తాను నడుపించు ప్రజలతో సంబంధం లేకుండా దూరం చేస్తుంది. అది అతి తీవ్రమైన తప్పుడు ధోరణి. - మావో*

# నేపాల్ ప్రస్తుత పరిణామాలపై ప్రతినిధి కామ్రేడ్

**ప్రశ్న:** నేపాల్‌లో ఏప్రిల్ 10న రాజ్యాంగ సభకు జరిగిన ఎన్నికల ఫలితాలు మావోయిస్టులకు అనుకూలంగా వచ్చాయి. ఇది నేపాల్ పరిణామాలను నిశితంగా పరిశీలించిన వారు ఊహించినదే. భారతదేశంలోని మీ సి.పి.ఐ (మావోయిస్టు) నేపాల్ ఎన్నికలను ఏవిధంగా చూస్తుంది?

**ఆజాద్:** గత వారం మా పార్టీ తరపున విడుదల చేసిన పత్రికా ప్రకటనలో నేను చెప్పినట్లు, నేపాల్ ఎన్నికల ఫలితాలు పురాతన రాజరికానికి వ్యతిరేకంగా, నేపాల్‌పై భారత ఆధిపత్యానికి, విస్తరణ వేధింపులకు వ్యతిరేకంగా, అమెరికా ఆధిపత్యానికి, పీడనకు వ్యతిరేకంగా, వీటన్నింటిని ఇంత కాలం నేపాల్ ప్రజలపై స్వారీ చేయడానికి అనుమతించిన దళారీ - భూస్వామ్య పార్టీల ద్రోహానికి వ్యతిరేకంగా ప్రజలలో వున్న తీవ్ర ఆగ్రహాన్ని చూపించాయి. ప్రజాస్వామ్యం, భూమి, జీవనాధారం, సామ్రాజ్యవాద, భూస్వామ్య దోపిడీ నుంచి నిజమైన స్వేచ్ఛ కోసం నేపాల్ ప్రజల్లో పెరుగుతున్న ఆకాంక్షలను ఎన్నికల ఫలితాలు ప్రతిఫలించాయి. రాజును, భారత పాలకవర్గాలను సమర్థించిన పార్టీలను, భూస్వామ్య - సామ్రాజ్యవాద పీడనను, నేపాల్‌లో భారత పాలకవర్గాల జోక్యాన్ని దృఢంగా వ్యతిరేకించటానికి ముందుకు రాకుండా వెనుక ముందులైన పార్టీలను చిత్తుగా ఓడించిన విశాల ప్రజానీకం యొక్క ఆకాంక్షల ప్రతిఫలనం ఇది. ప్రత్యక్ష ఎన్నికలు జరిగిన 240 నియోజక వర్గాల్లో రాజు వర్గీయులకు ఒక్క నియోజకవర్గం కూడా దక్కలేదు. ఇక ప్రధాన స్రవంతిగా పిలవబడుతున్న దానికి సంబంధించిన నాయకులైన మాధవ్ కుమార్ నేపాలీ, సుజాత కొయిరాలాలను ప్రజలు పూర్తిగా తిరస్కరించటం పాలకవర్గాలకు పెద్ద దెబ్బనే.

అయితే, ఈ పార్టీలన్నింటికీ ప్రత్యామ్నాయంగా భూస్వామ్య రాచరికాన్ని బహిరంగంగా బహిష్కరించటానికి దృఢంగా కట్టుబడి, గత నేపాల్ పాలకవర్గాలు భారతదేశంతో చేసుకున్న అసమాన ఒప్పందాలన్నింటిని తిరస్కరించి, సమాజంలోని దళితులు, ఆదివాసులు, మైనారిటీలు, మహిళలు మొదలైన పీడిత సెక్షన్లకు ప్రజాస్వామ్యాన్ని, సమానత్వాన్ని హామీనిస్తూ సి.పి.ఎన్ (మావోయిస్టు) ముందుకు రావటంతో ప్రజలంతా మావోయిస్టుల వైపు మొగ్గుచూపారు. మరో మాటలో చెప్పాలంటే, నేపాల్ ప్రజలు వ్యవస్థీకృత రాజరికాన్నీ, భారత విస్తరణవాదాన్నీ, అమెరికా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ నిశ్చయాత్మకంగా ముందుకు వచ్చారు. భూమి, జీవనాధారం, ప్రజాస్వామ్యం కొరకు నేపాలీలలో పెరుగుతున్న ఆకాంక్షలను ఎన్నికల ఫలితాలు ప్రతిఫలించాయి.

మా పార్టీ నేపాల్ ఎన్నికల ఫలితాలను దక్షిణాసియా ప్రజలందరికి సంబంధించిన విశేష ప్రాముఖ్యత కలిగిన అనుకూల పరిణామంగా చూస్తుంది. ఏప్రిల్ 10న జరిగిన రాజ్యాంగ సభ ఎన్నికల సందర్భంగా పురాతన రాజరిక పాలననూ, దళారీ-భూస్వామ్య పార్టీలను పూర్తిగా తిరస్కరిస్తున్నందుకు నేపాల్ ప్రజలకు మేము శుభాకాంక్షలు తెలియజేశాం. ఈ ఫలితాలు నేపాలీ ప్రజల నిజమైన ఆకాంక్షలను స్పష్టంగా చూపటమేగాక, సి.పి.ఎన్ (మావోయిస్టు) భవిష్యత్ కార్యాచరణకు మార్గదర్శకంగా ఉపయోగపడతాయి.

**ప్రశ్న:** నేపాల్ రాజ్యాంగ సభకు జరిగిన ఎన్నికల్లో మావోయిస్టులకు అనుకూలంగా ప్రభావవంతమైన ఫలితాలు రావడానికి కారణాలు ఏమనుకుంటున్నారు?

**ఆజాద్:** మా దృష్టిలో ఆరు ప్రధాన కారణాలున్నాయి. ఒకటి, నేపాల్ ప్రజల మీద రాజు జ్ఞానేంద్ర యొక్క నిరంకుశ, పెత్తందారీ పాలన భరించరానిదిగా వుంది. 20వ శతాబ్దం గడిచి, 21వ శతాబ్దంలో కూడా వ్యవస్థీకృత రాజరికం కొనసాగడం కాల దోషం. వాస్తవానికి, నేపాల్ ప్రజలు కుళ్ళిపోయిన, అభివృద్ధి నిరోధక భూస్వామ్యపాలనను ఇంతకాలం భరించారు. వాళ్ళను కూలదోసే అవకాశం దొరకగానే విసిరి అవతల పారవేశారు. అంతకుముందు జరిగిన ఎన్నికలలో వారికి ఆ అవకాశమే లేదు. కారణం, పార్లమెంటరీ పార్టీలన్నీ రాజుపట్ల విశ్వాసాన్ని కలిగి వుండటమో లేక నామ మాత్రపు వ్యతిరేకతను ప్రదర్శించటమో చేసేవి. సి.పి.ఎన్ (మావోయిస్టు) మాత్రమే రాజరికాన్ని బహిష్కరించాలని మొదటి నుండి దృఢంగా కట్టుబడి వుంది. అలాగే బూర్జువా-భూస్వామ్య పార్టీలకు ప్రత్యామ్నాయంగా ముందుకొచ్చింది.

రెండు, నేపాల్ ప్రజల మీద భారత విస్తరణవాదం యొక్క వేధింపులు, జోక్యం, ఆధిపత్యం చాలా ఎక్కువగా వున్నాయి. నేపాల్‌లో భారత పాలకవర్గాల ప్రయోజనాలను ఈడేర్చే

# సి.పి.ఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ ఆజాద్ ఇంటర్వ్యూ

వాతావరణం వుంది. నేపాల్ పాలకులు భారత ప్రభుత్వంతో 1950లో చేసుకున్న ఇండో - నేపాల్ శాంతి, స్నేహ ఒప్పందం, మహాకాళి ఒప్పందం మొదలైన నష్టదాయకమైన అసమ ఒప్పందాల కింద నేపాల్ ప్రజలు సుదీర్ఘ కాలం నలిగిపోయారు. నేపాల్‌లోని సహజవాయు నిక్షేపాలు, విస్తృత జలవిద్యుత్ వనరులు, అటవీ సంపదలు మొదలైన సహజ వనరుల మీద భారత పాలకులు ఎప్పటి నుంచో కన్నేసి వుంచారు. సామ్రాజ్యవాద దోపిడీ, పీడనలకు తోడు భారత దళారీ నిరంకుశ బూర్జువా వర్గం కూడా స్థానిక పరిశ్రమల, వాణిజ్య అభివృద్ధికి అడ్డంకిగా వుంది. భారత పాలకవర్గాలు నేపాల్ రాజకీయాల్లో ఎప్పుడు జోక్యం చేసుకుంటూనే వున్నారు. వాళ్ళు ఎల్లప్పుడూ రాజరికానికి మద్దతుగా నిలబడ్డారు. ఇటీవల కొద్ది సంవత్సరాలుగా రెండు స్థంభాల సిద్ధాంతంగా పిలిచే రాజుకు మద్దతివ్వటం, అలాగే నేపాలీ కాంగ్రెస్‌కు మద్దతివ్వటం అనే సిద్ధాంతాన్ని చేపట్టారు. నేపాల్‌లో మావోయిస్టు విప్లవకారుల్ని నిరోధించటానికి నేపాల్ రాజు సైన్యానికి (రాయల్ నేపాల్ ఆర్మీ - ఆర్.ఎన్.ఎ.కి) ఆయుధాలు, శిక్షణనిచ్చారు. అన్ని రకాల సహాయాన్నీ అందించారు. ఇటువంటి హేయమైన చర్యలన్నీ భారత ప్రభుత్వం పట్ల నేపాల్ ప్రజల్లో ఆగ్రహాన్ని రగిలించాయి. ఇప్పుడు సి.పి.ఎన్ (మావోయిస్టు) రూపంలో అవకాశం వాళ్ళ ముందుకొచ్చేటప్పటికి సహజంగానే దానికి ఓటు వేశారు. దీన్ని భారత ఆధిపత్యానికి వ్యతిరేకంగా వేసిన ఓటుగానే చూడాలి. ఇతర పార్టీలేవీ కూడా భారత్‌ను ఎదిరించే ధైర్యం చూపలేదు. సి.పి.ఎన్ (మావోయిస్టు) ఒక్కటే స్పష్టంగా భారతదేశంతో చేసుకున్న అసమ ఒప్పందాలన్నింటితో తెగదెంపులు చేసుకుంటానని, అశ్లీల హిందీ సినిమాలను నిషేధిస్తామని, భారత సైన్యంలోకి గుర్ఖాలను రిక్రూట్ చేసుకోవటాన్ని ఆపి, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తానని మొదలైన హామీలిచ్చింది.

మూడు, నేపాల్ ప్రజల మీద అమెరికా సామ్రాజ్యవాద దోపిడి, పీడన, జోక్యం చాలా ఎక్కువగానే వున్నాయి. రాజు జ్ఞానేంద్ర పాలనాకాలమంతటా, ఇంకా ఇప్పటికీ, ఎన్నికల్లో అతడి అనుచర పార్టీలను అవమానకరంగా ఓడించిన తర్వాత కూడా అమెరికా సామ్రాజ్యవాదులు అతడి పక్కన నిలబడి తమ కీలుబొమ్మగా అధికారంలోకి తీసుకురావడానికి, మావోయిస్టుల్ని క్రూరంగా అణచివేయడానికి అన్ని విధాల సహాయం చేస్తున్నారు. సి.పి.ఎన్ (మావోయిస్టు)ను ఉగ్రవాదుల జాబితాలో చేర్చారు. ప్రజలు దీన్ని నేపాల్ వ్యవహారాల్లో దానికి సంబంధంలేని అనవసర జోక్యంగా చూస్తున్నారు. ఇది నేపాల్ ప్రజలకు తీవ్రమైన అవమానం. అపఖ్యాతి రాజుకు మద్దతిచ్చి అమెరికా సామ్రాజ్యవాదులు కూడా మరింత ఆపఖ్యాతి పాలయ్యారు. అమెరికా సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యంలేని వారు కూడా దీన్ని అసహ్యించుకుంటున్నారు. అమెరికా సామ్రాజ్యవాదాన్ని భూస్వామ్య రాజరికాన్ని కాపాడేదిగా చూస్తూ వ్యతిరేకిస్తున్నారు.

నాలుగు, సమాజంలోని దళితులు, ఆదివాసులు, దేశీయ మైనారిటీలు, మహిళలు మొదలైన పీడిత సెక్షన్లన్నింటికీ స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సమానత్వాలను కల్పించి ప్రజాస్వామిక, సమైక్య, లౌకిక నేపాల్‌ను స్థాపిస్తామని సి.పి.ఎన్ (మావోయిస్టు) చేసిన వాగ్దానం గొప్ప ప్రభావాన్ని కలిగించింది. మొట్ట మొదటిసారి ఈ పీడిత సెక్షన్లు ఎన్నికల్లో చెప్పుకోదగినంత ప్రాతినిధ్యం వహించాయి. ఇటువంటి పరిస్థితుల్లో పీడిత ప్రజలు మావోయిస్టులకు మద్దతునిస్తూ ఉత్సాహంగా ముందుకొచ్చారు. మహిళలు పురుషులతో సమానంగా, ఇంకా చెప్పాలంటే కొంత ఎక్కువగానే ముందుకొచ్చారు. నేపాల్ వంటి భూస్వామ్య దేశంలో ఇది ఊహించలేనిది.

ఐదు, మరింత ముఖ్యమైన అంశమేమంటే, మావోయిస్టుల నాయకత్వంలో దశాబ్దకాలం పాటు సాగిన ప్రజాయుద్ధం నేపాల్‌లోని శక్తుల సమగ్ర సంతులనంపై అనుకూల ప్రభావాన్ని కలిగించింది. నేపాల్‌లో మూడువంతుల గ్రామీణ ప్రాంతం మీద మావోయిస్టులు పట్టు సాధించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విప్లవ ప్రజా ప్రభుత్వాల ద్వారా వారు చేపట్టిన సంస్కరణలు ప్రజల్ని వారికి సన్నిహితం చేశాయి. ప్రజాయుద్ధం ప్రజల చైతన్యాన్ని పెంచింది. వారి నిశ్చయాన్ని అధికం చేసింది. ప్రజాస్వామిక ఆకాంక్షలను ప్రేరేపించింది. రాజ్యాంగ సభ కోసం నేపాల్ వ్యాప్తంగా పెరిగిన ప్రజా వుద్యమం, దశాబ్దం కాలం సాగిన ప్రజాయుద్ధ ఫలం. ఇటువంటి సందర్భంలో రాజ్యాంగసభ కోసం పోరాటం అంటూ నాటకాలాడిన అనేక పార్టీలు ప్రజల దృష్టిలో పనికి రానివిగా తేలిపోయాయి.

ప్రజాయుద్ధ ప్రచారాన్ని తక్కువగా అంచనా వేయకూడదు. ఉదాహరణకు, భారతదేశంలోనే చూస్తే, ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ 1957లో రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో తెలంగాణ ప్రాంతంలో అత్యధిక మెజారిటీ (32 సీట్లకు 31 సీట్లు) గెలుచుకుంది. వాస్తవానికి, సి.పి.ఐ తెలంగాణా సాయుధ పోరాటాన్ని విరమించినప్పటికీ, భూస్వామ్య వ్యతిరేక సాయుధ వ్యవసాయ విప్లవ పోరాట ప్రభావం తెలంగాణ ప్రజల మీద ఎంతగానో వుందనేది వాస్తవం.

చివరిగా, తక్కువ ప్రాధాన్యత గల అంశమే అయినప్పటికీ, తప్పనిసరిగా చెప్పవలసిందేమంటే, స్థానిక పెట్టుబడిదారులు, వ్యాపారుల్లోని ఒక సెక్షన్ సాధారణంగా మావోయిస్టులను వ్యతిరేకించినప్పటికీ, వారిని అధికారంలోకి తీసుకురావడం ఒక్కటే నేపాల్‌లో శాంతికి హామీ అని ఆలోచించి మావోయిస్టులకు మద్దతిచ్చారు. స్థానిక పెట్టుబడిదారులు, చిన్న వ్యాపారులు సామ్రాజ్యవాదుల, భారత విస్తరణవాద పెట్టుబడి ఆధిపత్యం, కబంధ హస్తాల నుండి బయటపడి స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎదగాలని, అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఇటువంటి వాతావరణాన్ని దళారీ-భూస్వామ్య పార్టీలేవీ కల్పించలేవని వారికి తెలుసు. మావోయిస్టులతోనే ఇది సాధ్యమని ఆశపెట్టుకున్నారు.

**ప్రశ్న:** ఇప్పుడు అధికారంలోకి వచ్చిన మావోయిస్టులు తాము చేసిన వాగ్దానాల అమలును చేపట్టగలరా?

**ఆజాద్:** దీనికి సమాధానం చెప్పటం చాలా కష్టం. నూతన రాజ్యాంగంలో తమ ప్రధాన సంస్కరణలను చేర్చటానికి రాజ్యాంగ సభలో మూడింట రెండువంతుల మెజారిటీ కావాలి. అయితే సంకీర్ణంలోని శక్తుల ఐక్యతను కాపాడుకోవటం మావోయిస్టుల తక్షణ సమస్య. కానీ మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించాలంటే వారు నేషనల్ కాంగ్రెస్, యు.ఎం.ఎల్ వంటి అభివృద్ధి నిరోధక పార్టీల మీద ఆధారపడాలి. కప్పల తక్కెడ లాంటి శక్తుల కలయికతో వాగ్దానం చేసిన సంస్కరణలను ముందుకు తీసుకుపోవటం సాధ్యం కాదు. సంకీర్ణంలోని ఈ శక్తులు మావోయిస్టుల కార్యక్రమాన్ని ఒక పార్టీగా సమ్మతించవు. సమ్మతించకపోగా, ఎటువంటి మౌలిక మార్పునైనా తమ వర్గ ప్రయోజనాలకు అనుకూలంగా కుదించివేయ ప్రయత్నిస్తాయి.

**విశాల ప్రజానీకాన్ని కఠినమైన వర్గ పోరాటంలోకి మిలిటెంట్‌గా కదిలించకుండా వ్యవస్థను మౌలికంగా పునర్నిర్మించటం సాధ్యం కాదనేది మార్క్సిజం** యొక్క మూల సూత్రం. పైన చెప్పిన పరిస్థితిలో ప్రారంభించిన చర్యల ద్వారా ప్రభుత్వ ఆజ్ఞాపన పత్రాల ద్వారా, చట్టాల ద్వారా వ్యవస్థలో మౌలిక మార్పులు తీసుకురావటం అసాధ్యం. ఎంతో నిఖార్సైన మావోయిస్టులేకాదు, ఏ పార్టీ అధికారంలో వున్నప్పటికీ, చట్టాల్ని చాలా బాగా తయారు చేయవచ్చు. కానీ, వాటిని అమలుచేయటానికి దోపిడీదారులకు, పీడకులకు వ్యతిరేకంగా వర్గ పోరాటాన్ని ముందుకు తీసుకుపోవటానికి ప్రజల్ని కదిలించటం తప్పనిసరి. ఇది జరగకుండా విశాల పీడిత ప్రజానీకం యొక్క విముక్తి అనేది అసాధ్యమైన కర్తవ్యం. సి.పి.ఎన్ (మావోయిస్టు) ఎంతో గొప్పగా వాగ్దానం చేసిన చట్టాలను శాసనబద్ధం చేసినా, ప్రస్తుత సంకీర్ణ స్థితిలో వాటిని అమలుచేయటం దాదాపు అసాధ్యమైన కర్తవ్యం. నిర్దాక్షిణ్యమైన వర్గపోరాటం చేయకుండా ఏ పాలకవర్గమూ అధికారాన్ని అప్పగించదు. అప్పగించకపోగా పీడిత ప్రజలకు వ్యతిరేకంగా ప్రతీఘాతుక విప్లవ కార్యకలాపాలను కూడా చేపడుతుంది. **అందువల్ల ఎన్నికలను అనుసరించి, అధికారం కోసం ఇప్పుడు నిజమైన, కఠినమైన, అత్యంత నిర్దాక్షిణ్యమైన పోరాటం మొదలవుతుంది. అభివృద్ధి నిరోధకులు ప్రతి మార్పునూ ఆమూలాగ్రం (పూర్తిగా) వ్యతిరేకిస్తారు. రాజ్యాంగ సభలో మెజారిటీలేక, రాజ్యాంగంలో ప్రధానమైన మార్పులు తీసుకురావడానికి మావోయిస్టులు అధికారంలేని వాళ్ళవుతారు. అభివృద్ధి నిరోధక శక్తులలోని ఒక సెక్షన్‌తో వాళ్ళు రాజీపడి, సర్దుబాటు చేసుకుని, వర్గ ప్రయోజనాలను ఫణంగా పెట్టడమైనా చేయాలి. లేదా ప్రజల అధికారాన్ని స్థాపించి, నిజమైన ప్రజాస్వామ్యాన్ని అమలుచేసే క్రమంలో సాయుధ తిరుగుబాటుతో సహా అన్ని విధాలుగా పోరాటాన్ని తీవ్రం చేయటమైనా జరగాలి. ఇంతకంటే మరో ప్రత్యామ్నాయం లేదు.**

ఇండోనేషియా, చిలీ, నికరాగువా ఇంకా ఇతర దేశాల్లో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చింది. కానీ ప్రతీఘాతుక కుట్రలతో పాటు కమ్యూనిస్టు విప్లవకారులపై ప్రతీఘాతుక మారణకాండలు జరిపి దోపిడి వర్గాలు కూలదోశాయి. నికరాగువాలో ఎన్నికల ప్రహసనంలో పార్టీని కూల్చారు. ఈ అనుభవాలను వేటినీ మేము మరిచిపోము. ఇప్పుడు చెపుతున్న బహుళ పార్టీ ప్రజాస్వామ్యం నడుస్తున్న సందర్భంగా నికరాగువా అనుభవాన్ని చూడటం అవసరం. నికరాగువాలో శాండినిస్టాలు అధికారంలో వుండి పెద్ద ఎత్తున ప్రజాస్వామిక సంస్కరణలను చేపట్టినప్పటికీ, పటిష్టమైన బలమైన సైన్యం, చేతిలో వున్నప్పటికీ, అమెరికా సామ్రాజ్యవాదులూ, ప్రతీఘాతుక శక్తులు అందరూ కలిసి కుట్రల ద్వారా ఎన్నికల్లో కూలదోశారు. సి.పి.ఎన్ (మావోయిస్టు), నేపాల్ ప్రజలూ ఈ అనుభవాల నుండి నేర్చుకుని ప్రతీఘాతుక శక్తులు వక్రమార్గాల్లో అధికారంలోకి రావడానికి

చేస్తున్న కుట్రలను ఓడించాలి.

**ప్రశ్న:** నేపాల్ భవిష్యత్ చిత్రం ఏవిధంగా వుంటుందని అనుకుంటున్నారు? భారతదేశమూ, అమెరికా సామ్రాజ్యవాదులూ నేపాల్‌లో బయటికొచ్చిన నూతన వాస్తవ పరిస్థితితో సర్దుకుపోయి, మావోయిస్టులకు మద్దతిస్తారా లేక అడ్డంకులు కల్పిస్తారా?

**ఆజాద్:** సామ్రాజ్యవాద అమెరికా, విస్తరణవాద భారత్‌లు నేపాల్‌లో అధికారంలో వున్న మావోయిస్టులతో హాయిగా వుంటారని గానీ, లేక నూతన వాస్తవ పరిస్థితితో సర్దుకు పోతారని గానీ మేము ఆలోచిస్తే, మేము పిచ్చివాళ్ళ స్వర్గంలో వున్నట్లే. దౌత్య సంబంధాలు కొనసాగించటం తప్ప వాళ్ళకు మరో మార్గంలేకపోవటం చేత, తమ ఆజ్ఞలను శిరసావహించకపోతే నూతన ప్రభుత్వానికి ప్రతికూల పరిస్థితుల్ని సృష్టిస్తారు. మావోయిస్టుల్ని కూలదోయడానికి అమెరికా నేపాల్‌లోని తన తొత్తులందరికీ అన్ని రకాల సహాయాన్ని అందిస్తున్నది వాస్తవం. తన పాలనకు అత్యంత విశ్వసనీయుడైన ప్రతినిధి నేపాల్‌లో రాజు అయినందున రాజరికాన్ని సజీవంగా వుంచటానికి అమెరికా తన శాయశక్తులా ప్రయత్నిస్తుంది. ఇక భారతదేశానికి తన తొత్తు జి.పి.కొయిరాల, అతడి నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో అవమానకరంగా ఓటమి పాలవటంతో ముఖం మీద చరిచినట్లైంది. ఎన్.సి పార్టీ భారత్‌తో సాగించిన ద్రోహపూరిత సంబంధాలను నేపాలీ ప్రజలు స్పష్టంగా గ్రహించటంతో, ఆ పార్టీకి చెందిన చాలా మంది ప్రముఖులు చిత్తుగా ఓడిపోయి, ప్రజల ఆగ్రహజ్వాలల్లో తుడిచిపెట్టుకుపోయారు.

అయితేనేమీ, భారతదేశానికి మరో కూటమి దొరికింది. తెరాయ్ ప్రాంతంలో అది రెండు మధేసి పార్టీలకు మద్దతిచ్చింది. భారత్ అండతో అవి చెప్పుకోదగినన్ని సీట్లు గెలుచుకున్నాయి. **నూతన ప్రభుత్వం తాను చెప్పినట్లల్లా వినకపోతే, నేపాల్‌లో అల్లర్లూ, గందరగోళాన్ని సృష్టించడానికి భారత్ మధేసి తురుపు ముక్కను ఉపయోగిస్తుంది. మధేసి స్వయం ప్రతిపత్తి (ఏక్ మధేసి ఏక్ ప్రదేశ్ - ఒకే మధేసి ఒకే ప్రదేశ్) పై మావోయిస్టుల వైఖరేమిటో స్పష్టం చేయాలని ఉపేంద్ర యాదవ్ నాయకత్వంలోని మధేసి జనాధికార ఫోరమ్ (ఎం.జె.ఎఫ్) ఇప్పటికీ డిమాండ్ చేస్తోంది. అంతర్జాతీయ ఐక్యవేదికపైన రిమ్, సీకంపోసాలతో మావోయిస్టులు సంబంధాలు తెంపేసుకోవాలని అడుగుతోంది. అమెరికా, భారత్‌లు రెండూ వివిధ పద్ధతుల్లో నూతన ప్రభుత్వాన్ని తాము చెప్పినట్లల్లా ఆడించడానికి ప్రయత్నిస్తారు.** వుదాహరణకు, పారిశ్రామిక ఉత్పత్తిని స్థంభింపజేసి, వాణిజ్యాన్ని, సరఫరా మార్గాల్ని నిరోధించి ఆపైన ఆహార కొరతను, నిత్యావసర వస్తువుల కొరతను సృష్టించి నేపాల్ ఆర్థిక వ్యవస్థ మీద, నేపాల్ కడుపు మీద దెబ్బకొడుతారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆర్థిక దిగ్బంధనం ద్వారా నేపాల్‌ను పిండేస్తారు. నూతన పాలన చేయిదాటిపోతున్నదనుకుంటే ఈ పని చేస్తారు. అందుకు తగ్గట్లు నేపాల్‌లో పరిస్థితి ఇప్పటికే చాలా సున్నితంగా వుంది. ఖాట్మండులోనే వాహనాలలోడు దింపటానికి పది గంటలు పడుతూ, నిత్యావసర సరుకులన్నింటికీ కొరత ఏర్పడింది. దాని పొరుగునున్న బలమైన దేశాలు ఆర్థిక బెదిరింపుల ద్వారా సామాజిక అశాంతి, మావోయిస్టులకు వ్యతిరేకంగా పెద్ద యెత్తున నిరసనలు పెరగడానికి దారితీసే పరిస్థితులు సృష్టించి సమతౌల్యాన్ని దెబ్బతీస్తాయి. **తీవ్రమైన నిత్యావసరాల కొరత, ధరల పెరుగుదల కలిసి ఇప్పుడే రెక్కలు విప్పుకున్న నూతన పాలనపై ప్రజలు విముఖత చెందటానికి, ప్రజల్లో దాని పలుకుబడి దెబ్బతినటానికి దారితీస్తుంది. ఆ విధంగా, ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిన పార్టీలు తిరిగి బలం పుంజుకోవటానికి ఇది అవకాశమిస్తుంది. మావోయిస్టులు ఎన్నికల్లో గొప్ప విజయాన్ని సాధించినప్పటికీ, ఆవిధంగా నేపాల్‌లో పరిస్థితి చాలా సున్నితంగా, అస్థిరతతో వుంది.** కామ్రేడ్స్ ప్రచండ, భట్టారాయ్‌లకు ఇది బాగా తెలుసు. అందుకే భారత సహకారం కోసం విజ్ఞప్తి చేస్తున్నారు. భారత సహకారం లేకపోతే నేపాల్‌లో నిలదొక్కుకోలేం అని మాట్లాడుతున్నారు. పొరుగునున్న బలమైన దేశాలైన భారత, చైనాల మధ్య అడకత్తెరలో పోకచెక్కలా నలుగుతున్న చిన్న దేశం నేపాల్. అంతేగాక, పరిపాలనను తీవ్రమైన కష్టాల్లోకి నెట్టటం అమెరికా సామ్రాజ్యవాదుల లక్ష్యం అనేది వాస్తవం. కనుక, **ఈ శక్తులన్నింటినీ సమతుల్యం చేసి, భూసంస్కరణలు, స్వదేశీ పారిశ్రామికీకరణ ద్వారా నూతన ప్రజాస్వామిక ఆర్థిక వ్యవస్థ వైపు తమ ప్రజా ఎజెండాను ముందుకు తీసుకుపోవటమనే మావోయిస్టులు చేపట్టిన కర్తవ్యం అత్యంత కష్టభూయిష్టమైనది.**

**ప్రశ్న:** అంటే మావోయిస్టుల ఎన్నికల విజయమూ, పార్లమెంటరీ పద్ధతుల్లో రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవటమూ వ్యర్థ ప్రయత్నమనీ, సామాజిక వ్యవస్థలో ఇది మౌలికమైన మార్పును తీసుకురాదనేనా మీ అర్థం?

**ఆజాద్:** ఖచ్చితంగా అదేనని నేనటంలేదు. నిజంగానే వాళ్ళకు రాజ్యాధికారం మీద పట్టువుంటే, అది సుదీర్ఘకాల విప్లవ యుద్ధంలో సాధించుకున్న విజయాలను కాపాడుకునే అవకాశాన్ని మావోయిస్టులకు ఇస్తుంది. దాని ప్రభావంతో సామాజిక వ్యవస్థలో

మౌలికమైన మార్పును తీసుకురావడం సాధ్యమవుతుంది. కానీ ప్రస్తుత స్థితిలో మావోయిస్టుల చేతిలోని రాజ్యాధికారం ద్వారా దాన్ని సాధించటం కష్టం. సాయుధ విప్లవం ద్వారా కమ్యూనిస్టు విప్లవకారులు అధికారాన్ని స్వాధీనం చేసుకున్న చైనా విప్లవం వంటి సాంప్రదాయక విప్లవాల్లో కూడా ప్రభుత్వ యంత్రాంగంలోని తమ స్థానాల స్వభావం చేత నూతన వర్గం తలెత్తే ప్రమాదం వుందని మావో హెచ్చరించాడు. మావో అనంతరం రాజ్య యంత్రాంగం విశాల ప్రజానీకం మీద పీడన అణచివేతలు సాగించే యంత్రాంగంగా భ్రష్టు పట్టిపోయింది. ఈ అనుభవం నుంచి ప్రభుత్వంలోని, పార్టీలోని పెత్తందారులు సాగించే అన్నిరకాల దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజలు తిరగబడేందుకు వారిని కూడగట్టి, కదిలించటంపై పార్టీ కేంద్రీకరించాలనే గుణపాఠాన్ని కమ్యూనిస్టులుగా మనం నేర్చుకోవాలి.

అభివృద్ధి నిరోధక పాలకవర్గాల్లోని ఒక సెక్షన్‌తో పొత్తుకూడి మావోయిస్టులు అధికారంలోకి వచ్చిన నేపాల్‌లో అన్నిరకాల దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా ప్రజల్ని కూడగట్టి వర్గపోరాటాన్ని కొనసాగించటం మావోయిస్టుల ముందున్న మరింత తక్షణ కర్తవ్యం. ఇందులో యువ కమ్యూనిస్టు సంఘం శ్లాఘనీయమైన కృషి చేస్తున్నందుకు ఇతర పార్టీలు భయపడి, ద్వేషిస్తున్నాయి. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, జీవనాధారాల కోసం ప్రజలు జరిపే పోరాటానికి సహాయంగా మావోయిస్టులు ప్రభుత్వం మీద తమకున్న సాపేక్ష (పాక్షిక) అదుపును సాధ్యమైనంత ఎక్కువ కాలం ఉపయోగించుకోవాలి. **ప్రభుత్వం తన చేతనైనంత సహాయం చేయటం కోసం వర్గపోరాటాన్ని కొనసాగించటం ద్వారా ప్రాథమికమైన మార్పు జరుగుతుంది.**

**ప్రశ్న:** ఇతరులు అనేక మందితో పాటు సి.పి.ఐ (ఎం)కు చెందిన సీతారాం ఏచూరి భారతదేశంలో మావోయిస్టులు నేపాల్ అనుభవాల నుంచి నేర్చుకుని, పార్లమెంటరీ పంథాలో అధికారాన్ని సాధించుకోవాలన్నాడు. దీని గురించి మీ పార్టీ ఏమంటుంది?

**ఆజాద్:** ఏచూరి ఒక్కడేనా? మావోయిస్టు ఉద్యమం బలంగా వున్న ఝార్ఖండ్, ఎ.పి, ఇంకా ఇతర రాష్ట్రాల డి.జి.పీలు ముందే మాట్లాడారు. విప్లవకారుల్ని కిరాతకంగా హత్యలు చేయటంలో పేరుపొందిన నరహంతకుడు వరంగల్ ఎస్.పి. సజ్జనార్ రెండు రోజుల క్రితం ఇదే మాట మాట్లాడాడు. ఇక రివిజనిస్టులు మన దేశంలో ముందు నుంచీ పార్లమెంటులో పాల్గొంటున్నారని అభివృద్ధి నిరోధక పాలకవర్గ పార్టీల నాయకులు పదే పదే ఊదరగొడుతున్నారు. రా (ఆర్.డబ్ల్యు.ఎ) మాజీ అధిపతి ధోరాకన్ లాంటి కొందరు నేపాల్‌లో మావోయిస్టుల విజయం భారతదేశంలోని మావోయిస్టుల మీద స్పష్టమైన ప్రభావాన్ని వేస్తుందని మాట్లాడారు.

మొదట, దీన్ని గురించి మాట్లాడేవాళ్ళు నేపాల్‌లోని పరిస్థితులు, భారత దేశంలోని పరిస్థితులు పూర్తిగా భిన్నమైనవనే విషయాన్ని మరచిపోయారు. నేపాల్‌లో రాజరికానికి వ్యతిరేకంగా పోరాడటం నేపాలీ ప్రజలందరి ముందున్న తక్షణ రాజకీయ కర్తవ్యం. ఇది వివిధ పార్లమెంటరీ పార్టీల మధ్య, ప్రజల్లోని విస్తృత సెక్షన్ల మధ్య ఐక్యతను తీసుకురాగల కర్తవ్యం. రాజు అమెరికా సామ్రాజ్యవాద ప్రత్యక్ష మార్గదర్శకత్వంలో అన్ని శక్తులూ తమ శ్రేణులతో కలిసి ప్రజాస్వామ్యం కొరకు పోరాడవలసిన పరిస్థితిని సృష్టించాడు. 2008 సర్వే రిపోర్టు ప్రకారం, నేపాల్‌లో ఎక్కువకెక్కువ రెండు శాతం ప్రజలు రాజరికానికి మద్దతిస్తున్నారు. దీన్నిబట్టి నేపాలీ ప్రజలు, సి.పి.ఎన్ (మావోయిస్టు) ఈ పరిస్థితిని వుపయోగించుకుని ఐక్యంగా పోరాటం చేయడానికి గల పునాది కన్పిస్తుంది. భారతదేశంలో అది పార్లమెంటరీ వ్యవస్థ, అర్ధవలస - అర్ధ భూస్వామ్య వ్యవస్థలు విడదీయరానిదిగా కలిసివున్న సామాజిక వ్యవస్థకు వ్యతిరేకంగా చేయవలసిన పోరాటం. ప్రధాన పార్లమెంటరీ పార్టీలన్నీ దళారీ-భూస్వామ్య వర్గాల ప్రతినిధులుగా సామ్రాజ్యవాదుల ఆజ్ఞలను శిరసావహిస్తూ, ప్రతీఘాతుక విప్లవ క్యాంపులో వున్నాయి. ఇక్కడ భూమి, జీవనాధారం, విశాల ప్రజానీకపు విముక్తి కొరకు పోరాటం తక్షణ కర్తవ్యం.

రెండవది, ఏచూరి ఇంకా ఇతరులు తమ పార్లమెంటరీ పంథా గురించి గొప్పగా స్తుతిస్తూ, చిలీ, ఎల్‌సాల్వడార్, నికరాగువా మొదలైన దేశాల అనుభవాలను ఉద్దేశపూర్వకంగానే దాచిపెడుతున్నాడు. ఈ సందర్భంగా నికరాగువా అనుభవాన్ని ఉటంకించటం మరింత సందర్భోచితంగా వుంటుంది. నికరాగువాలో శాండినిస్టాలు 1979లో ప్రజా తిరుగుబాటు ద్వారా సోమోజా కుటుంబం సుదీర్ఘ కాలం సాగించిన నిరంకుశ పాలనను కూలదోసి అధికారాన్ని చేజిక్కించుకున్నారు. శాండినిస్టాలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో పెద్ద ఎత్తున మార్పులు తీసుకొచ్చారు. భూ సంస్కరణలు, అక్షరాస్యత, ప్రజారోగ్యం మొదలైన కార్యక్రమాలలో చెప్పుకోదగిన విజయాలు సాధించారు. రోనాల్డ్ రీగన్ పాలనలో అమెరికా సామ్రాజ్యవాదులు శాండినిస్టాల మీద పోరాడటానికి కాంట్రాలు అనే కిరాయి సైనికులకు ఆయుధాలు, శిక్షణతో పాటు అన్నిరకాల సహాయాన్ని అందించారు. నికరాగువా మీద వాణిజ్య పరమైన దిగ్బంధాన్ని విధించి, ఆర్థిక సమస్యల్ని సృష్టించారు. 1990లో ఐక్యరాజ్య సమితితో శాంతి చర్చల తర్వాత ఎన్నికలు నిర్వహించటానికి శాండినిస్టాలు అంగీకరించారు. కానీ 14 ప్రతిపక్ష పార్టీల మితవాద

కూటమి అధికారాన్ని చేజిక్కించుకుంది. శాండినిస్టాలు తమ పాలనలో నిరుపేద, పీడిత ప్రజానీకానికి అనుకూలంగా అనేక విప్లవాత్మక, ప్రగతిశీలమైన మార్పుల్ని తీసుకొచ్చినప్పటికీ, ఒకపక్క వాణిజ్య దిగ్బంధనంతో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం సృష్టించి, నికరాగువా సమాజంలోని అభివృద్ధి నిరోధక వర్గాలకు అమెరికా పెద్దయెత్తున నిధులు, మద్దతు అందించి శాండినిస్టాలను ఓటమికి గురిచేసింది. అలా పార్లమెంటరీ వ్యవస్థ నరేంద్రమోడి వంటి వున్మాద నరహంతకుడిని అధికారంలోకి తీసుకురాగల్గుతుంది. ఇది చాలు అధికారంలోకి రావడానికి పార్లమెంటరీ పంథాకున్న పరిమితులను అర్థం చేసుకోవడానికి.

చివరిగా, సి.పి.ఎన్ (మావోయిస్టు) విజయానికి దారితీసి, నేపాల్ ప్రజల చైతన్యంపై, జీవితాలపై మహత్తర ప్రభావాన్ని కలిగించిన నేపాల్‌లోని దశాబ్దకాలపు ప్రజాయుద్ధం యొక్క విశిష్టతను కూడా ఈ సోషల్ డెమోక్రాట్లు తక్కువచేసి చూపే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికలకు కొద్దిరోజుల ముందుగా మార్చి 2008లో సి.పి.ఎన్ (మావోయిస్టు) తన రాజ్యాంగ సభ నిబద్ధతా పత్రాన్ని విడుదల చేసింది. అందులో *"మావోయిస్టు ప్రజా యుద్ధ తోడ్పాటు లేకుండా నేటి రాజకీయ పరిణామాన్ని ఊహించలేం. ఈనాడు దేశంలో పెరిగిన వర్గ, జాతి, ప్రాంతీయ, లింగపరమైన, దళిత చైతన్యం దేశాన్ని రాజ్యాంగపరంగా సమాఖ్య గణతంత్ర రాజ్యంగా ప్రకటించింది. ఈ కీర్తి పది సంవత్సరాల ప్రజాయుద్ధానిది. ప్రజాయుద్ధ క్రమంలో 20 వేల ప్రజాసైన్యం అభివృద్ధి కాకుంటే రాజరికాన్ని ఇంత తేలికగా కూలదోయటం ఊహించలేనిది."* అని చెప్పింది.

ఏచూరీలకు, కారత్‌లకు, బుద్ధదేవ్‌లకు పార్లమెంటు పందుల దొడ్డిలో 40 సంవత్సరాలకు పైగా అనుభవముంది. మరి వాళ్ళు ఈ వ్యవస్థలో ఏ ప్రాథమిక మార్పులు తీసుకొచ్చారు? వాళ్ల పార్లమెంటరీ సంకుచిత రాజకీయాలు ప్రజలకు చేసిన మేలు ఏమీలేదు. ఈ రివిజనిస్టులు అధికారంలో వున్న రాష్ట్రాల్లో కూడా ధనికులు మరింత ధనికులుగా, పేదలు మరింత పేదలుగా తయారయ్యారు. వీరి మద్దతు లేకుండా మన్మోహన్‌సింగ్ నాయకత్వంలోని యు.పి.ఎ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను చేపట్టే ధైర్యం చేయదు. "అరిచే కుక్క కరవదని" సరిగ్గా నిరూపించుకున్నారు. **తమ పత్రికా ప్రతినిధి ఒకరు అన్నట్లు, కేంద్రంలోని యు.పి.ఎ. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక దాడి మార్గంలో తాము స్పీడు బ్రేకర్లమని, అంతకంటే ఎక్కువ ఏమీ చేయడానికి తమకు అధికారం లేదనీ ఒప్పుకున్నారు. వాళ్లు స్పీడుబ్రేకర్లు కాదనేది వాస్తవం. నిజానికి వాళ్లుఅభివృద్ధి నిరోధక పాలకులకు, విశాల ప్రజానీకానికి మధ్య రాజకీయ దళారులుగా మధ్య వర్తిత్వం నెరపుతూ, వర్గపోరాట స్థానంలో వర్గ సామరస్యాన్ని తీసుకురావటానికి ప్రయత్నిస్తున్నారు.** వాళ్ళు ప్రత్యక్షంగా అధికారంలో వున్న రాష్ట్రాల్లో కాంగ్రెస్, బి.జె.పిల కంటే దోపిడీ, పీడకులుగా తక్కువ తినలేదు. సింగూరు, నందిగ్రామ్‌లు తమ సామ్రాజ్యవాదానుకూల, దళారీ నిరంకుశ బూర్జువానుకూల విధానాలకు ప్రయోగ శాలలయ్యాయి. ఇందుకోసం పెద్ద ఎత్తున సోషల్ ఫాసిస్టు గూండా సైన్యాన్ని దింపిన క్రూరులుగా తయారయ్యారు. ఈ రాజకీయ వ్యభిచారులు కేంద్రంలో అధికారంలోకి వచ్చి, ఒకసారి కాంగ్రెస్‌లో ఇంకొకసారి టి.డి.పితో పెట్టుకునే సిగ్గులేని పొత్తులను సమర్థించుకోవడానికి దేశవ్యాప్తంగా ఎస్.ఇ.జడ్.లను ఆపటానికి తమ చేతిలో అధికారం లేదని, పెద్ద తప్పిదం కంటే చిన్న తప్పిదం నయం లాంటి సిద్ధాంతాలను ఒకదాని తర్వాత ఒకటి వల్లిస్తున్నారు. కానీ అదే గొంతుతో ఎస్.ఇ.జడ్.లు, ప్రయివేటీకరణ, విదేశీ పెట్టుబడి మొదలైనవి లేకుండా పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాలలో పారిశ్రామికీకరణ తదితర కార్యక్రమాలను ముందుకు తీసుకుపోలేవని నయవంచక మాటలు మాట్లాడుతున్నారు.

భారత "వామపక్షం" యొక్క సేవకు సామ్రాజ్యవాద, దళారీ పెట్టుబడిదారీ వర్గం చాలా సంతోషించిందనే దాంట్లో ఆశ్చర్యం లేదు. సింగూరులో విడి భాగాల ఫ్యాక్టరీ పెట్టిన కపాలో గ్రూప్ ఛైర్మన్, ప్రముఖ ప్రవాస భారతీయ పారిశ్రామిక వేత్త స్వరాజ్‌పాల్ కామన్వెల్త్ పార్లమెంటరీ సంఘానికి చెందిన యునైటెడ్ కింగ్‌డమ్ శాఖ ప్రతినిధుల పెద్దగా పశ్చిమ బెంగాల్‌కు వచ్చినపుడు సి.పి.ఐ (ఎం)నూ, దాని నాయకుడు బుద్ధదేవ్‌నూ ప్రశంసించాడు. **ఈ సోషల్ ఫాసిస్టులు ఇప్పుడు ప్రపంచ బ్యాంకూ, టాటాల, సలీంల, స్వరాజ్‌పాల్‌ల తైనాతీలుగా తయారయ్యారు. కేంద్రంలోని సి.పి.ఐ (ఎం) పొత్తుతో కొనసాగుతున్న ప్రభుత్వంతో భారత ప్రజలకు పెద్దగా దక్కేదేమీలేదు.**

భారతదేశంలో మావోయిస్టులుకూడా దీన్ని అనుసరించాలని మాట్లాడటం కొంత ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. పార్లమెంటరీ పంథాలో వ్యవస్థలో మౌలికమైన మార్పు సాధించలేమనీ, వర్గపోరాటం ద్వారానే సాధ్యమని మా పార్టీ దృఢంగా నమ్ముతోంది. మన దేశంలో ఇది సాయుధ వ్యవసాయ విప్లవ రూపాన్ని తీసుకుంది. సాయుధ పోరాటం, సాయుధ నిర్మాణం అని మేము చెవుతున్నా, ఇతర పోరాట, నిర్మాణ రూపాలను తిరస్కరించటంలేదు. మా ఉద్యమాన్ని నిశితంగా పరిశీలిస్తే, మీరే దీన్ని గుర్తిస్తారు. పాలకవర్గ పార్టీలన్నింటిలానే పార్లమెంటులో సీట్ల గురించి కలలుగనే మన ఏచూరి గారికి దీని గురించి పట్టదు.

మేం అలాకాదు. బేరగాళ్లుగా, అధికార దళారులుగా పనికిమాలిన ప్రజా వ్యతిరేక పార్లమెంటు గురించి సమయాన్ని వృధా చేసేబదులు, సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్యాన్ని, దళారీ నిరంకుశ పెట్టుబడిని, అభివృద్ధి నిరోధక భారత పాలకవర్గాల నయా వుదారవాద విధానాలను వ్యతిరేకించి, సమైక్య సమరశీల పోరాటాన్ని నిర్మించేందుకు ముందుకు రావాలని ప్రతి ఒక్కరినీ ఆహ్వానిస్తున్నాం. బూర్జువాలతో బేరసారాల్లో పార్లమెంటరీ బురద గుంటలో పీకల దాకా మునిగిన ఏచూరి లాంటి రివిజనిస్టు నాయకులకు అటువంటి విప్లవ ప్రత్యామ్నాయంలో చోటులేదు.

ఇప్పుడున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక సంస్థలన్నీ ఎటువంటి మౌలిక సంస్కరణను కూడా అడ్డుకుని, యధాతథ స్థితిని నిలబెట్టేవే. వీటన్నింటిని ధ్వంసం చేసి, పునర్నిర్మించే కర్తవ్యం విప్లవకారుల ముందుంది. అధికారంలోకి వచ్చినంత మాత్రాన పార్లమెంటు ద్వారా ఈ వ్యవస్థను పునర్నిర్మించలేం. స్వతంత్ర సంస్థలుగా పిలిచే న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం, సామ్రాజ్యవాదుల ప్రోత్సాహం వున్న మానవ హక్కుల సంఘం, మీడియా, ఇంకా వివిధ కళా, సాంస్కృతిక, మత సంస్థలూ, స్వచ్ఛంద సంస్థలూ ఇంకా అటువంటి అనేక సంస్థలున్నాయి. వీటిని ప్రజా విప్లవం ద్వారానే తప్ప, పార్లమెంటరీ సంస్కరణల ద్వారా మార్చలేం.

**ప్రశ్న:** గణతంత్ర నేపాల్ రాజ్యానికి మొట్ట మొదటి రాష్ట్రపతిని తానేనని ప్రచండ ప్రారంభంలో చెప్పాడు. కానీ, తర్వాత మంత్రి వర్గ అధిపతి (ప్రధానమంత్రి)గా వుంటానని ప్రకటించాడు. కమ్యూనిస్టు పార్టీలో ఎవరైనా ప్రభుత్వాధినేతగా, పార్టీకి, సైన్యానికి అధినాయకుడుగా ఒక్కరే ఇన్ని పదవులు నిర్వహించటం సరైందేననుకుంటున్నారా?

**ఆజాద్:** దీనికి సంబంధించి ఆయన ప్రకటనలను మేము కూడా చూశాం. రాజకీయంగా అందరూ ఏకీభవిస్తే రాష్ట్రపతిగా వుండాలనుకుంటున్నట్లు ఇప్పటికీ చెపుతున్నాడు. ప్రస్తుత నేపాల్ రాజ్యాంగంలో అటువంటి కార్యనిర్వాహక రాష్ట్రపతికి సంబంధించిన ఏర్పాటు లేదు. రాజ్యాంగ సభ నూతన ముసాయిదా రాజ్యాంగాన్ని అమలుచేసి, దానిపై తుది నిర్ణయానికి రావడానికి మరో రెండు సంవత్సరాలు పడుతుంది. అందువల్ల ప్రచండ తన మునుపటి నిర్ణయాన్ని పునఃపరిశీలించుకుని ప్రధాన మంత్రిగా వుండటానికి నిర్ణయించుకున్నాడు.

పార్టీ అధినేత రాష్ట్రపతిగా వుంటాడా లేక ప్రధానమంత్రిగా వుంటాడా అనేది కాదిప్పుడు ప్రశ్న. ప్రభుత్వానికి గానీ మరొకదానికి గాని ఎవరు నాయకత్వం వహించాలనేది వాళ్ల పార్టీ నిర్ణయిస్తుంది. కానీ మా అభిప్రాయం వీటన్నింటికీ భిన్నమైనది. పార్టీ అధినేత, ముఖ్య నాయకత్వం వర్గ పోరాటాన్ని అభివృద్ధి చేయటంపై ప్రధానంగా కేంద్రీకరించాలిగానీ, ప్రభుత్వ పరిపాలనలో కూరుకుపోకూడదనేది మా అభిప్రాయం. అంతిమంగా కమ్యూనిజాన్ని సాధించేవరకు వర్గపోరాటాన్ని కొనసాగించటమే పార్టీ యొక్క పాత్ర అని నమ్ముతున్నాం. ఈ దృక్పథానికి మేం కట్టుబడి వున్నాం. అంతిమ విజయం వరకు పార్టీ విప్లవానికి నాయకత్వం వహించినపుడు, పార్టీలోను ప్రభుత్వంలోను పెత్తందారులకు సంబంధించిన ఒక నూతన వర్గం తలెత్తడానికి అది పునాదిని ఏర్పరుస్తుంది అని చారిత్రక విప్లవానుభవాల నుండి, మరీ ముఖ్యంగా మహత్తర సాంస్కృతిక విప్లవ పాఠాల నుండి గుణపాఠాన్ని తీసుకున్నాం. పార్టీ, ప్రభుత్వమూ పూర్తిగా కలిసిపోయినప్పుడు, తలెత్తిన పెత్తందారీ వర్గానికి వ్యతిరేకంగా పోరాడటం, ప్రభుత్వం చేసే తప్పులకు వ్యతిరేకంగా ప్రజల్ని కదిలించటం అత్యంత అవసరం. వారు ప్రజలతో మమేకమై, దోపిడీ, పీడనలు ఏ రూపంలో ఎదురైనా, వాటికి వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టి, వారికి మార్గదర్శకత్వం వహించాలి. నేపాల్‌లో మావోయిస్టులు దళారీ-భూస్వామ్య వర్గాలకు సంబంధించిన ఒక సెక్షన్‌తో అధికారంలో భాగస్వాములైనందున ఈ కర్తవ్యం మరింత కీలకంగా తయారైంది.

**ప్రశ్న:** ప్రచండ, భట్టారాయ్‌లు నేపాల్‌లోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆహ్వానించడానికి, వ్యాపారరంగ స్నేహపూర్వక వాతావరణం కల్పించడానికి తాము సుముఖమని ప్రకటించారు. పెట్టుబడిదారీ విధానాన్ని ప్రోత్సహిస్తామని కూడా అన్నారు. ఒక మావోయిస్టు పార్టీ విదేశీ పెట్టుబడులను ఆహ్వానించడం, పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి చేయడం సరైనదేనా?

**ఆజాద్:** మొట్ట మొదటిది, నేపాల్ వాస్తవాన్ని మేము అర్థం చేసుకోగలం. అది కనీస మౌలిక సౌకర్యాలు, పారిశ్రామిక ఉత్పత్తి కొరవడినటువంటి బాగా వెనుకబడిన, అర్ధ భూస్వామ్య దేశం. చెప్పాలంటే అది నాల్గవ ప్రపంచ దేశం. ఐక్యరాజ్య సమితి దాన్ని కనీస అభివృద్ధి దేశాల (ఎల్.డి.సి.ల) శ్రేణిలో చేర్చింది. కనుక నేపాల్‌లో విశాల ప్రజానీకాన్ని భూస్వామ్య కబంధ హస్తాల నుండి విముక్తి చేసి, ఆ పునాదిపై పరిశ్రమలను అభివృద్ధి చేయటం మొట్ట మొదటి కర్తవ్యం. నేపాల్‌లో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్నదంటే, అది దేశీయ పెట్టుబడిదారీ విధానంగా వున్నంతకాలం, ప్రజల అవసరాలను తీర్చడానికి సరిగ్గా నియంత్రించబడి, సామ్రాజ్యవాద సేవలకు, ఎగుమతులకుకాక,

అంతర్గత ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయడంవైపు నిర్దేశించినంత కాలం విప్లవకారులకు ఎలాంటి అభ్యంతరం వుండాల్సిన అవసరం లేదు. **కానీ దేశంలోకి విదేశీ పెట్టుబడి ప్రవాహాన్ని ప్రోత్సహిస్తే, సుదీర్ఘ కాలంలో అది దేశ ప్రయోజనాలకు నష్టాన్ని కలిగిస్తుంది. మావోయిస్టులు ప్రభుత్వంలో ప్రధాన భాగస్వాములైనా, విదేశీ పెట్టుబడి ఇప్పటి వరకూ ఏమి చేసిందో, అదే విధంగా నేపాల్ ఆర్థిక వ్యవస్థను అదుపు చేయటం ప్రారంభిస్తుంది. మావోయిస్టులు దేశీయ పెట్టుబడిని ప్రోత్సహించి, దాని ఎదుగుదలకు సహాయపడి, విదేశీ పెట్టుబడిని క్రమంగా బయటికి నెట్టివేయాలి.** ప్రచండ, భట్టారాయ్‌లు నేపాలీ వాణిజ్య మండలి పరిశ్రమల సమాఖ్య (ఎఫ్.ఎన్.సి.సి.ఐ) ఆధ్వర్యంలోని వ్యాపారవేత్తలతో సమావేశమయ్యారు. త్వరలో దాని ఫలితాలు స్పష్టమవుతాయి. పెట్టుబడి అనుకూల వాతావరణం, లాభాల పెంపుదల, పన్నుల సంస్కరణలు, పట్టువిడుపులతో కూడిన నూతన కార్మిక చట్టాలు, దానికనుకూలమైన పారిశ్రామిక విధానం కొరకు వ్యాపారవేత్తలు ఒత్తిడి చేస్తున్నారు.

గతంలో మావోయిస్టులు విద్య, వైద్య రంగాల్లో ప్రయివేటు సంస్థల్ని వ్యతిరేకించారు. కానీ ఇప్పుడు విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తామని ప్రచండ వాగ్దానం చేశాడు. ప్రయివేటు రంగంలో తలెత్తిన అడ్డంకులను తొలగిస్తామని భట్టారాయ్ వాగ్దానం చేశాడు. ప్రపంచబ్యాంకు అధికారులకు, మావోయిస్టు నాయకులకు మధ్య చర్చలు జరిగాయని రిపోర్టులు వింటున్నాం. ఇదే నిజమైతే, నేపాల్ భవిష్యత్తు మీద ప్రమాదకరమైన పరిణామాలుంటాయి. దేశ ఆర్థిక వెనుకబాటును అధిగమించే పేరుతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి మీద ఆధారపడి, దీనికనుకూలమైన విధానాన్ని నేపాల్ పారిశ్రామికీకరణలో అమలుచేస్తే, అది వ్యతిరేక ఫలితాలకు దారితీసి, సామ్రాజ్యవాదుల పట్టును బలోపేతం చేస్తుందీ, ఇప్పుడున్న వెనుకబాటును అలాగే కొనసాగిస్తుంది. ఏ వెనుకబడిన దేశంలోనైనా పెట్టుబడిని మదుపు పెట్టడమే అభివృద్ధికి కీలకాంశం కాదు. దేశీయ మార్కెట్‌ను విస్తరించటమే అభివృద్ధికి కీలకాంశం. ప్రజల కొనుగోలు శక్తిని పెంచటం వల్లనే ఇది సాధ్యమవుతుంది. ఒకసారి ప్రజల కొనుగోలు శక్తి పెరిగితే, ఇక అది దేశ పారిశ్రామికాభివృద్ధికి ప్రేరకంగా పని చేస్తుంది.

**ప్రశ్న:** మీ పార్టీకి, సి.పి.ఎన్ (మావోయిస్టు)కు మధ్య భవిష్యత్ సౌహార్ధక సంబంధాలు ఎలా వుండాలనుకుంటున్నారు? భారత ప్రభుత్వానికి నేపాల్ మావోయిస్టులు భారత మావోయిస్టులతో సంబంధాలు కొనసాగించటం ఇష్టం లేదనేది వాస్తవం. ఈ విషయంలో మధేసి జనాధికార ఫోరం (ఎం.జె.ఎఫ్) చేస్తున్న డిమాండ్లు భారత్ పెంచుతున్న ఒత్తిడికి స్పష్టమైన నిదర్శనం. మరి మీ ఇరు పార్టీల మధ్య సౌహార్ధ్ర సంబంధాలు మునుపటిలా కొనసాగుతాయా?

**ఆజాద్:** సి.పి.ఐ (మావోయిస్టు), సి.పి.ఎన్ (మావోయిస్టు)ల మధ్య మునుపటిలా సౌహార్ధ్ర సంబంధాలు కొనసాగుతాయని ఆశిస్తున్నాం, విశ్వసిస్తున్నాం. ఇరు పార్టీలు కార్మికవర్గ అంతర్జాతీయతకు కట్టుబడి వున్నంతకాలం, అంతర్జాతీయ ఒత్తిడులూ, అంతర్గత ఒత్తిడులూ అడ్డురావు.

ఇతర మావోయిస్టు పార్టీలతో సంబంధాలు తెంచుకోవాలని నేపాల్ మావోయిస్టులపై అనేక దిశల నుంచి ఒత్తిడి పెరగవచ్చు. ఈ విషయంలో భారత్, అమెరికాలు తీవ్రమైన ఒత్తిడి తీసుకొస్తాయి. ఇటువంటి సంక్లిష్ట పరిస్థితిని మేము అర్థం చేసుకోగలం. అయినప్పటికీ, ప్రతి కమ్యూనిస్టు పార్టీ ప్రపంచ కార్మికవర్గానికి సంబంధించిన విభాగమేనని మేము తప్పక దృష్టిలో వుంచుకుంటాం. ప్రతి కార్మికవర్గ పార్టీ దేశ ప్రయోజనాలను ప్రపంచ కార్మికవర్గ ప్రయోజనాలకు లోబడే వుంచుతుంది. కామ్రేడ్ ప్రచండ ఇరు పార్టీల మధ్య సైద్ధాంతిక సంబంధాలు చెక్కు చెదరలేదని ఖచ్చితంగా చెప్పాడు. సైద్ధాంతిక చర్చలూ, వాదోపవాదాలూ కొనసాగుతాయని మేము విశ్వసిస్తున్నాం. సీకంపోసా లాంటి వివిధ అంతర్జాతీయ వేదికలు నూతన పరిస్థితి తలెత్తినా తమ లక్ష్యాలు, కార్యకలాపాలతో కొనసాగుతాయి.

అంతేగాక, మా రెండు దేశాల ప్రజల మధ్య లోతైన సంబంధాలను కొనసాగిస్తాం. నేపాల్‌పై భారత విస్తరణవాదుల జోక్యం, ఆధిపత్యం ఏ రూపంలో వున్నా వ్యతిరేకిస్తాం. నేపాల్ ప్రజల సార్వభౌమత్వానికి, విప్లవానికి భారత ప్రజల్లో విస్తృతమైన సంఘీభావాన్ని కూడగడతాం. కార్మికవర్గ అంతర్జాతీయ వాదులుగా ఇది మా బాధ్యత. మా నేపాల్ కామ్రేడ్స్ గురించి కూడా మేము ఇదే ఆశిస్తున్నాం.

**ప్రశ్న:** కామ్రేడ్ ప్రచండ ది హిందూ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో *"మా కృషి భారత మావోయిస్టు పార్టీకి, దాని నాయకులకు, క్యాడర్‌కు అధ్యయనం చేయడానికి, ఆలోచించి నూతన మార్గంలో ప్రయాణించడానికి నూతన వస్తువును (అధ్యయనాంశాన్ని) అందించింది. మా కృషి పరిశీలనాంశాన్ని అందించింది"* అని చేసిన వ్యాఖ్య గురించి మీరేమంటారు?

**ఆజాద్:** మార్క్సిస్టులుగా మేము ఏ దృగ్విషయాన్నైనా, ప్రత్యేకించి నూతన అనుభవాలను తప్పకుండా విమర్శనాత్మకంగా

అధ్యయనం చేస్తాం. ఇక మేము తొందరపాటు నిర్ణయాలకు రాకుండా, ఆ కృషి యొక్క ఫలితాన్ని తప్పక శ్రద్ధగా పరిశీలిస్తాం. వర్గ దృక్పథంతో ఒక అంచనాకు రావడానికి ఇవన్నీ అవసరం. మార్క్సిజం ఒక శాస్త్రం. సామాజిక దృగ్విషయాలన్నింటిని శాస్త్రీయంగా విశ్లేషించటానికి అది సాధనాలనందిస్తుంది. నేపాల్‌లోగానీ, మరెక్కడైనాగాని వీటిని కూడా పరిగణనలోకి తీసుకుంటాం. నేపాల్ అనుభవాన్ని ఇందులో భాగంగానే చూస్తున్నాం తప్ప విడిగాకాదు.

**ప్రశ్న:** చివరిగా, నేపాల్ ప్రజలకూ, సి.పి.ఎన్ (మావోయిస్టు)కు మీరేమైనా చెప్పదలుచుకుంటున్నారా?

**ఆజాద్:** రాజ్యాంగ సభకు జరిగిన ఎన్నికల ద్వారా రాచరిక పాలననూ, దళారీ భూస్వామ్య పార్టీలను నేపాల్ ప్రజలు స్పష్టంగా తిరస్కరించినందుకు మా సి.పి.ఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ తరపున, పార్టీ శ్రేణులన్నింటి తరపున, భారత ప్రజల తరపున వారికి విప్లవాభినందనలు పంపింది. నేపాల్‌లో మా సోదర మావోయిస్టు పార్టీ ఎదుర్కొంటున్న హిమాలయ కర్తవ్యాన్ని మేము అర్థం చేసుకోగలం. అది సంపూర్ణ విప్లవ విజయం వైపు వర్గ పోరాటం పురోగమిస్తుండగా, అభివృద్ధి నిరోధక రాజ్య యంత్రాంగాన్ని నడుపుతూ, సంస్కరించ పూనుకుంటున్న జంట కర్తవ్యంగా వుంది.

నేపాల్ ప్రజల జీవితాలు, నేపాల్ ఆర్థిక-సామాజిక-రాజకీయ వ్యవస్థల పరివర్తనకు అనలైన యుద్ధం ఇప్పుడు ప్రారంభమైనందుకు వారిని అభినందిస్తున్నాం. వుద్యమం పట్ల జాగరూకత కొరవడితే, దేశం లోపలా బయట మావోయిస్టులకూ అదే విధంగా నేపాల్ ప్రజలకు సన్నిహితులైన వాళ్లే, ఉనికిలో వున్న సామాజిక వ్యవస్థను యథాతథంగా నిలవటానికి విజయాలన్నింటిని ధ్వంసం చేయటానికి ప్రేరేపిస్తూ రాబందులుగా రుజువవుతారు. తాత్కాలిక ప్రభుత్వంలో భాగస్వాములు కావాలని నిర్ణయించుకున్నపుడు 2006 నవంబర్‌లో మేము చేసిన హెచ్చరిక గురించి సి.పి.ఎన్ (ఎం)కూ, నేపాల్ ప్రజలకూ ఈ సందర్భంగా గుర్తు చేయాలనుకుంటున్నాం. అప్పుడు మేము చెప్పినదాన్ని మరొకసారి చెపుతాను. *"తాత్కాలిక ప్రభుత్వంలో భాగస్వాములు కావటానికి మావోయిస్టులు చేసుకున్న ఒప్పందం సామ్రాజ్యవాదుల, దోపిడీ పాలకవర్గాల సేవచేసే రాజ్యయంత్రాంగపు స్వభావాన్ని మార్చదు. దోపిడి వర్గాల చేతుల్లోగానీ లేక శ్రామిక వర్గం చేతుల్లోగానీ రాజ్యం సాధనంగా వుంటుంది. కానీ, అది తీవ్రంగా సంఘర్షిస్తున్న ఈ రెండు వర్గాల ప్రయోజనాలను నెరవేర్చదు. రాజ్య యంత్రాంగాన్ని ధ్వంసం చేయకుండా సామాజిక వ్యవస్థలో మౌలికమైన మార్పు రాదనేది మార్క్సిజం యొక్క మూల సూత్రం. నూతన రాజ్యాంగం ఎంత ప్రజాస్వామికంగా కన్పిస్తున్నా, మావోయిస్టులు ప్రభుత్వంలో ముఖ్యమైన భాగమైనా, పైన స్థితి చెప్పిన అమలుచేసే సంస్కరణలు దోపిడీ వ్యవస్థలో ఎటువంటి గుణాత్మకమైన మార్పునూ తీసుకురావు. వునికిలో వున్న రాజ్యాన్ని ధ్వంసం చేయకుండా నూతన నేపాల్‌ను నిర్మించాలనుకోవటం ఒట్టి భ్రమ."*

నేపాల్ ప్రస్తుత చారిత్రక దశలో సైన్యానికి సంబంధించిన నియంత్రణ చాలా కీలకం. సైన్యానికి ప్రభు వర్గం నుంచి, సామ్రాజ్యవాదుల తొత్తుల నుంచి అభివృద్ధి నిరోధక శక్తుల నుంచి స్వేచ్ఛను కల్పించి ప్రజల నియంత్రణలో వుంచకపోతే, అమెరికా సామ్రాజ్యవాదులా, భారత విస్తరణవాదుల ప్రత్యక్ష సహాయంతో తక్షణం దాడి (ప్రతీఘాతుక విప్లవకుట్ర) చేయగల ప్రమాదం వుంది. ప్రజల్ని సంఘటితం చేసి, దోపిడి పీడకుల దాడుల నుండి ప్రజలను రక్షించే విస్తృత ప్రజా మిలీషియాను నిర్మించటం, నేపాల్ విప్లవాన్ని తదుపరి దశకు పురోగమింపజేసే చోదక శక్తిగా పనిచేసే ప్రజల అంతర్గత శక్తిని పెద్ద యెత్తున బయటికి తీసుకురాగల ప్రజానుకూల ప్రజాస్వామిక ఒరవడితో సైన్యాన్ని తర్ఫీదు చేయటమనే తక్షణ కర్తవ్యం సి.పి.ఎన్ (మావోయిస్టు) ముందుంది.

సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, భారత విస్తరణవాదాల నుంచి నేపాల్‌కు నిజమైన విముక్తిని సాధించి, సోషలిజం, కమ్యూనిజంవైపు పురోగమించేందుకు వర్గ పోరాటాన్ని కొనసాగించే కర్తవ్యాలను సి.పి.ఎన్ (మావోయిస్టు) పరిపూర్తి చేస్తుందని మేము హృదయపూర్వకంగా ఆశిస్తున్నాం.

నేపాల్‌లో భారత పాలకవర్గాల విధ్వంసక చర్యలకూ, అంతర్గత జోక్యం, వేధింపులతో కూడిన విస్తరణవాద కార్యక్రమాలకు, కుట్రలకూ వ్యతిరేకంగా మా పార్టీ రాజీలేని పోరాటాన్ని నిర్మిస్తుంది. నిజమైన స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకొరకు నేపాల్ ప్రజలు, సి.పి.ఎన్ (మావోయిస్టు) చేస్తున్న పోరాటంలో వారికి అండగా నిలిచి, దృఢంగా నిలబడతామని హామీనిస్తున్నాం. భారత విప్లవ విజయం మాత్రమే సుదీర్ఘకాలంలో ఇరు దేశాల మధ్య పరస్పర గౌరవం, నిజమైన సమానత్వాన్ని నెలకొల్పగలదు. అంతిమ విజయం కొరకు దేశంలో విప్లవాన్ని పురోగమింపజేసేందుకు మా పార్టీ మరింత తీవ్రంగా కృషి చేస్తుంది. ★

**మేడే, అంతర్జాతీయ కార్మిక పోరాట దినం వర్ధిల్లాలి!**

# అమరుల జీవిత చరిత్రలు

## ఎ.పి. అమరులు

### కా॥మేడ్ ఎల్లయ్య (రాము)

నల్గొండ జిల్లా పెద్ద అడిశర్ల పల్లి మండలం తిరుమలగిరి గ్రామంలో మధ్య తరగతి కుటుంబంలో పుట్టాడు. తండ్రి చిన్నతనంలోనే చనిపోయి చదువుకునే అవకాశంలేక గొర్రెలు మేపుతూ కుటుంబ పోషణలో తన అన్నలకు చేదోడు వాదోడుగా వుండేవాడు. చిన్నతనం నుండి కా॥మేడ్ రాముకు సి.పి.ఐ. రాజకీయాలతో మంచి పరిచయం వుంది. సి.పి.ఐ పార్టీలో తిరుగుతూనే 1995లో అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ పరిచయాల్లోకి వచ్చాడు. ఆ తర్వాత గ్రామంలో వుంటూ చురుకుగా పని చేసేవాడు. జీతగాళ్ల సంఘాలు పెట్టి, జీతాల పోరాటం చేశాడు. చుట్టుపక్కల గ్రామాల్లో కూడా జీతగాళ్ల సంఘాలు పెట్టి చురుకుగా పని చేయించాడు. గ్రామంలోని భూస్వాముల ఆధిపత్యానికి వ్యతిరేకంగా నిలబడ్డాడు. భూస్వామ్యాన్ని అంతమొందించాలని ఎంతో కసిని ప్రదర్శించేవాడు. 1998లో పావురాల గట్టు కోవర్టు హత్యాకాండలో కమాండర్‌తో సహా ముగ్గురు కా॥మేడ్స్ అమరులుకాగా, మిగిలిన కా॥మేడ్స్ కా॥మేడ్ రాము ఆధ్వర్యంలో షెల్టర్ తీసుకున్నారు. ఈ విషయం గ్రామ భూస్వామి సుధాకర్ రెడ్డి ద్వారా తెలుసుకున్న పోలీసులు దాడి చేయడానికి వస్తున్నారని తెలిసి కా॥మేడ్ రాము దళాన్ని సురక్షితంగా తప్పించాడు. ఈ విధంగా గ్రామానికి వచ్చిన దళాన్ని కంటికి రెప్పలా కాపాడేవాడు. దళాన్ని నిర్మూలించడానికి పథకాలు పన్నిన భూస్వాములను హతమార్చటంలో దాడులు చేయటంలో చురుకుగా పాల్గొన్నాడు. దీంతో నిర్బంధం పెరిగి అనేకసార్లు జైలు కెళ్లాడు. పదుల కొద్దీ కేసులు పెట్టినా, ఎన్ని సార్లు జైళ్లపాలు చేసినా శత్రువుకు లొంగలేదు. పార్టీని వీడలేదు. భూస్వామిపై దాడి కేసులో అరెస్టు చేసి ఆరు నెలలపాటు కోర్టుకు హాజరుపరచకుండా చిత్రహింసలు పెట్టినా మొక్కవోని ధైర్యంతో నిలబడ్డాడు. కా॥మేడ్ రామును కోర్టుకు హాజరు పరచాలని ప్రజలంతా ఆందోళన చేసి హాజరుపరిచేలా చేశారు. 2004 చర్చల కాలంలో అనేక గ్రామాల్లో సభలు పెట్టి, పార్టీ రాజకీయాలను విస్తృతంగా ప్రచారం చేశాడు. చర్చల అనంతరం పెరగనున్న నిర్బంధాన్ని దృష్టిలో వుంచుకొని పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు దళంలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చాడు. దళంలో చురుకుగా పని చేస్తూ, ఎదుగుతున్న క్రమంలో కా॥మేడ్ గిరితో కలిసి తుపాకులు ఇచ్చి రావాల్సిన పని మీద నల్గొండ కాంటాక్టుకు వెళ్తుండగా బక్కలింగాయపల్లి వద్ద పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్లో కా॥మేడ్ రాము (ఎల్లయ్య) అమరుడయ్యాడు.

కా॥మేడ్ రాము దృఢ దీక్ష, పట్టుదల, మొక్కవోని ధైర్యం, నిర్బంధంలో కూడా ప్రజలనంటిపెట్టుకుని పని చేయగల నేర్పు మనకెంతో ఆదర్శం.

### కా॥మేడ్ శాంత (లక్ష్మి)

కా॥మేడ్ శాంతది కూడా తిరుమలగిరి గ్రామమే. పేద కుటుంబంలో పుట్టింది. చిన్న తనంలోనే పెండ్లి చేయగా తాగుబోతు భర్త వేధింపులు భరించలేక విడాకులు తీసుకుని గ్రామంలోనే వుంటూ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవించేది. కా॥మేడ్ శాంత, కా॥మేడ్ రాము ఇద్దరూ ప్రేమించి పెండ్లి చేసుకున్నారు. కులాలు వేరైనందున కుటుంబ పెద్దలు ఒప్పుకోకపోయినా ధైర్యంగా నిలబడి పెండ్లి చేసుకున్నారు. తర్వాత ఇద్దరూ కలిసి పూర్తికాలం పని చేయడానికి చర్చల కాలంలో పార్టీలోకి వచ్చారు. కా॥మేడ్ శాంత కనగల్ దళంలో తిరుగుతూ గ్రామాల్లో ప్రచార క్యాంపెయిన్, సారా బంద్ వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంది. కొంతకాలం తర్వాత నల్లమలకు వెళ్లి ప్రొటెక్షన్ దళంలో రాముతో కలిసి పని చేసింది. కా॥మేడ్ శాంతను కనగల్ ప్రాంతంలో మళ్లీ పి.ఆర్.గా పని చేయించాలని పార్టీ నిర్ణయించి నల్గొండకు పంపుతున్న క్రమంలో బక్క లింగాయపల్లి వద్ద కాంటాక్టు స్థలానికి దగ్గరలో మాటు గాసిన శత్రు దాడిలో అమరురాలైంది.

కా॥మేడ్ శాంత కా॥మేడ్స్ పట్ల ఎనలేని ప్రేమాభిమానాలు చూపిస్తూ కలగలిసిపోయేది. నల్లమల్లకు వచ్చి కొద్దిరోజులే అయినా అప్పటి వరకూ కలిసివున్న కా॥మేడ్స్‌ను వీడిపోతున్నందుకు ఎంతగానో శోకించి, వీడ్కోలు చెప్పి వెళ్లింది. అదే ఆమె చివరి వీడ్కోలు కావటం ఎంతో బాధాకరం.

కా॥మేడ్ శాంత పనిలో చురుకుదనం, పోరాటతత్వం, తోటి కా॥మేడ్స్‌ను ప్రేమించేతత్వం, అప్పగించిన పనిని నెరవేర్చాలనే పట్టుదల మన కెల్లప్పుడూ ఆదర్శంగా నిలుస్తాయి.

### కా॥మేడ్ రఘు (బేగరి నర్సింహ)

మహబూబ్‌నగర్ జిల్లా కొందుర్గు మండలం మహదేవపూర్ గ్రామంలోని ఒక పేద దళిత కుటుంబంలో కా॥మేడ్ రఘు జన్మించాడు. బంధుత్వ సంబంధాలతో హైదరాబాద్‌కు చేరి అక్కడే

10వ తరగతి వరకు చదువుకున్నాడు. బంధువుల కుటుంబం విప్లవ సంబంధాలు కలిగినది కావటంతో కామ్రేడ్ రఘులో కూడా ప్రారంభం నుండే విప్లవభావాలు మొలకెత్తాయి. అదే కాలంలో 1990ల వెసులుబాటు సందర్భంగా విస్తృతంగా జరుగుతున్న విప్లవ రాజకీయాల ప్రచారం, సభలు కూడా కామ్రేడ్ రఘుపై బలమైన ప్రభావాన్ని వేశాయి. 10వ తరగతిలోనే చదువు ఆపివేసి, 1991లో పార్టీతో సంబంధాలు ఏర్పరచుకుని కంపెనీ కార్మికుడుగా వుంటూ, పార్టీ కొరియర్‌గా పని ప్రారంభించాడు. కొద్ది రోజులకే పార్టీ సంబంధాలు తెగిపోయి, కొంతకాలం అక్కడే తిరిగి తర్వాత స్వగ్రామం చేరుకున్నాడు. కామ్రేడ్ రఘులోని విప్లవతత్వం తనను ఇంటివద్ద నిలవనీయక మళ్లీ హైదరాబాద్‌కే చేర్చింది. 1992 చివరి నుండి తిరిగి పార్టీ సంబంధాలు సంపాదించి, మళ్లీ కొరియర్ వృత్తినే చేపట్టి 1996 వరకు నిర్విరామంగా కొనసాగించాడు. అనంతరం కొరియర్ వృత్తి వదిలి, గ్రామీణ ప్రాంత విప్లవోద్యమంలోకి వెళ్లాలనే తన నిర్ణయాన్ని పార్టీ ముందుంచి, 1997 మధ్య నుండి మొదటిసారిగా దళ జీవితాన్ని ప్రారంభించాడు.

అనేక నష్టాల తర్వాత 1997లో పునరుద్ధరించిన దక్షిణ తెలంగాణ స్పెషల్ గెరిల్లా దళంలో చేరి సంవత్సర కాలం పని చేశాడు. అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా కమిటీ కింద నల్లమల ఆదివాసీ ప్రాంతాల్లో పని చేయడానికి ఏర్పరచిన ఎల్.ఒ.ఎస్.లో భాగమయ్యాడు. అందులో పార్టీ సభ్యులతో ఏర్పరచిన సెల్‌లో కూడా భాగమయ్యాడు. మరొక సంవత్సరం తర్వాత రాష్ట్ర కమిటీ నిర్ణయంలో భాగంగా కర్ణాటక రాష్ట్రానికి పంపించాలని నిశ్చయమైంది. ఇది కామ్రేడ్ రఘు శక్తికి మించినదే అయినప్పటికీ నిస్సందేహంగా బాధ్యతలను స్వీకరించి 1998 చివరలో కర్ణాటక ఉద్యమంలోకి అడుగుపెట్టాడు.

కామ్రేడ్ రఘులోని చొరవ, గ్రామీణ, పట్టణోద్యమాల్లోని అనుభవాన్ని దృష్టిలో వుంచుకుని కర్ణాటక రాష్ట్ర కమిటీ అతడికి రాయచూర్ జిల్లాలోని చంద్రబండ దళంలో ఎ.సి సభ్యునిగా బాధ్యతలు అప్పగించింది. అక్కడి భాషను నేర్చుకుంటూ, కామ్రేడ్లతో కలిసిపోతూ కామ్రేడ్ రఘు ప్రజలకు చేరువై, ఏరియా ఉద్యమంపై కూడా త్వరలోనే పట్టు సాధించాడు. ఈ క్రమంలో ద్రోహి ఇచ్చిన సమాచారంతో తన దళంపై దాడి జరగ్గా చిన్న ఆయుధాలతోనే ప్రతిఘటిస్తూ, తనతోపాటు కొందరిని బయటకు తీసుకురాగలిగాడు. అదే ఎన్‌కౌంటర్లో తనకు అతిసన్నిహితుడైన కామ్రేడ్ భాస్కర్ శత్రు తూటాలకు నేలకొరిగినా, కామ్రేడ్ రఘు మరింత నిబ్బరంగా నిలిచి ఆంధ్రరాష్ట్ర అనుభవాలను అక్కడి కామ్రేడ్లకు అందిస్తూ తోడుగా నిలబడ్డాడు.

అక్కడి ప్రజా శత్రువులను ఏరివేయనిదే ఉద్యమం నిలదొక్కుకోదని అక్కడి రాష్ట్ర కమిటీతో చర్చించి, రాయచూర్ కేంద్రం చేసుకుని వుంటున్న విప్లవ వ్యతిరేకుల్ని తుదముట్టించేందుకు సిద్ధం అయ్యాడు. ఇందులో భాగంగా 1999 మేలో మిలిటరీ క్యాంపు పూర్తి చేసుకుని చంద్రబండ ఏరియాలో పేరుమోసిన గూండా, రాజకీయ నాయకుడైన వ్యక్తిని తుదముట్టించే యాక్షన్ టీంలో సెలెక్టయి పట్టణం నడిబొడ్డున వాడిని మట్టికరిపించాడు. ఈ యాక్షన్‌లో కామ్రేడ్ రఘు ప్రధాన పాత్ర వహించాడు. అనంతరం పెచ్చరిల్లిన నిర్బంధంలో కూడా నిబ్బరంగా నిలబడ్డాడు. చంద్రబండ ఏరియా ఉద్యమంపై కామ్రేడ్ రఘుకు కొన్ని భిన్నాభిప్రాయాలున్నాయి. అది మైదాన ప్రాంతమని, ప్రజల్లో చైతన్యం తగినంత లేదని మాట్లాడుతూ, తిరిగి ఎ.పి. వుద్యమంలోనే పని చేయాలనే తన ప్రతిపాదనను కూడా రాష్ట్ర కమిటీ ముందుంచాడు. కామ్రేడ్ రఘు అభిప్రాయాలను నివృత్తి చేస్తూనే అక్కడి రాష్ట్ర కమిటీ తిరిగి 2002లో ఎ.పి. ఉద్యమానికి పంపించింది.

ఉద్యమంలో ప్రొటక్షన్ ప్లటూన్‌లో పి.పి.సి.లో భాగమై నాయకత్వ రక్షణలో, అనేక క్యాంపు నిర్వహణలో బాధ్యతగా ఎంతో శ్రమకోర్చి పని చేశాడు. కామ్రేడ్ రఘులో పెంపొందిన నిబద్ధతను దృష్టిలో వుంచుకుని 2003 డిసెంబర్‌లో మహబూబ్‌నగర్ జిల్లాలో ఆర్గనైజేషన్ బాధ్యతలు అప్పగించటం జరిగింది. తన స్వంత జిల్లా, అందునా రాష్ట్రంలో తీవ్ర కరువు సమస్య నెదుర్కొంటున్న పాలమూరు ప్రజలకు సేవ చేయడం కంటే గొప్ప పనేముంటుందన్న భావనతో 2004 ప్రారంభం నుండి 2005 ప్రారంభం వరకు అప్పర్ ప్లాట్ దళ కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించి తన శక్తి కొలది పని చేశాడు. చాలా త్వరగా అప్పర్ ప్లాట్ ప్రజలకు చిరపరిచయస్తుడుగా మారాడు. ప్రజల నుండి నేర్చుకుంటూ, ప్రజలకు నాయకత్వం వహిస్తూ, చర్చల కాలమంతటా అప్పర్ ప్లాట్ ఏరియాను పెద్ద రిక్రూట్‌మెంటు కేంద్రంగా అభివృద్ధి చేశాడు. ఎంతో ఓపికగా సమస్యలను పరిష్కరిస్తూ, క్యాడర్‌లో, ప్రజల్లో ఆదరాభిమానాలను చూరగొన్నాడు.

మిలిటరీ పరంగా కూడా తోటి కామ్రేడ్స్‌కు గొప్ప మానసికస్థైర్యాన్ని కలిగించేవాడు. 2005 మార్చిలో ఉడుమిళ్ల అటవీ ప్రాంతంలో ఎదురుపడిన శత్రువును ధీటుగా ప్రతిఘటించి తన బలగాన్ని క్షేమంగా రిట్రీట్ చేసుకుని వచ్చాడు. 2005 ఫిబ్రవరిలో జరిగిన జిల్లా ప్లీనం కామ్రేడ్ రఘును జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నుకుంది. కామ్రేడ్ రఘును ఎలాగైనా దెబ్బ తీయాలని శత్రువు పన్నిన మోసపుటెత్తులను చిత్తుచేస్తూ, అనేకసార్లు శత్రుకండ్లుగప్పి

బయటపడ్డాడు. అందరినీ మనవారేనని నమ్మే కామ్రేడ్ రఘు ప్రజల్లో అంతర్గతంగా వుంటున్న ప్రజా శత్రువులను విమర్శనాత్మకంగా చూడకపోవడాన్ని పసిగట్టిన శత్రువు అదే వలపన్నాడు.

2005 మార్చి నెలలో శత్రువును ప్రతిఘటించేందుకు తనతోపాటు 9 మంది టీంను తీసుకుని వెళుతూ మార్గమధ్యలో 25వ తేదీ రాత్రి అమ్రాబాద్ మండలం బి.కె. ఉప్పునుంతల గ్రామం దగ్గర ఆగారు. సంఘంలో పని చేస్తూ, చోటే అనే వ్యక్తి, కోవర్టుగా మారినది గుర్తించక, ప్రజల్ని కలిసేందుకు చోటే వెంట ఒంటరిగా గ్రామంలోకి వెళ్లాడు. కామ్రేడ్ రఘును ఒక ఇంటిలో వుంచి, అప్పటికే గ్రామంలో మాటుగాసి వున్న పోలీసులను కోవర్టు చోటే తీసుకొచ్చాడు. ఇంటిని చుట్టుముడుతున్న పోలీసులను గమనించిన కామ్రేడ్ రఘు ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుని తన దగ్గరున్న తపంచాతో కాల్పులు ప్రారంభించాడు. లొంగిపొమ్మని కేకలు వేస్తున్న శత్రువుకు బొందిలో ప్రాణం వున్నంత వరకు లొంగిపోయే ప్రసక్తే లేదని సవాల్ విసురుతూ తూటాలతో జవాబిస్తూ, రాత్రి 9 గంటల నుండి తెల్లవారి 5 గంటల వరకు శత్రువును ఇంట్లోకి రాకుండా ప్రతిఘటిస్తూ పోరాడాడు. దిక్కుతోచని శత్రువు తెల్లవారి అదనపు బలగాలను రప్పించుకుని ఇంటిని ధ్వంసం చేసి, పిరికిపందలా కామ్రేడ్ రఘును కాల్చిచంపాడు.

8 గంటలు శత్రువుతో హోరా హోరీగా తలపడి కామ్రేడ్ మోరంపూడి వెంకన్న, పడ్కల్ వీరుల, సింగరేణి సింహం సమ్మన్నల గొప్ప పోరాట సాంప్రదాయాన్ని కొనసాగించిన వీర గెరిల్లా యోధుడు కామ్రేడ్ రఘు. కామ్రేడ్ రఘు పోరాటతత్వాన్నీ, నిబద్ధతను, ప్రజలకు పంచే ప్రేమ, సహనాలను పుణికి పుచ్చుకుని ఆయన ఆశయ సాధనకై అంకితమవుదాం.

### కామ్రేడ్ అవుట చెన్నయ్య

మహబూబ్‌నగర్ జిల్లా అమ్రాబాద్ మండలం, తుర్కపల్లి కామ్రేడ్ చెంచయ్య స్వగ్రామం. వీరి కుటుంబం పార్టీకి బలమైన సానుభూతిపరుల కుటుంబం. అమరుడు కామ్రేడ్ మహేష్

---

## విజ్ఞప్తి

ప్రియమైన కామ్రేడ్స్,

'క్రాంతి'కి పంపుతున్న అమరవీరుల చరిత్రలు చాలా అసమగ్రంగా ఉంటున్నాయి. కనుక మీరు అమరవీరుల చరిత్రలు రాసేటప్పుడు కింది అంశాలు దృష్టిలో పెట్టుకోగలరు.

అమరుల సొంత పేరు, పార్టీ పేరు; వయసు; జిల్లా, గ్రామం; గ్రామ, ప్రాంత రాజకీయ నేపథ్యం; కుటుంబ ఆర్థిక, రాజకీయ, సామాజిక నేపథ్యం; చదువు, వృత్తి; పార్టీకి పరిచయమైన, రిక్రూట్ అయిన సంవత్సరం, రిక్రూట్ అయిన రంగం; ఉద్యమంలోకి రావడానికి దోహదం చేసిన నేపథ్యం; పార్టీ సభ్యత్వం పొందిన సంవత్సరం; ఏయే సంవత్సరం, ఏయే దళాల్లో, ప్రాంతంలో, బాధ్యతల్లో, స్థాయిల్లో పని చేసినది; పోరాటాలూ, ప్రతిఘటన, ఎన్‌కౌంటర్లలో నిర్వహించిన పాత్ర; రాజకీయ రంగంలో కృషి; అధ్యయనం, బోధన వంటి అంశాల్లో వున్న సామర్థ్యాలు; కళా, సాహితీ, టెక్నికల్ వంటి రంగాల్లో అభిరుచీ, కృషి; వ్యక్తిగత జీవితం, స్వభావం; అమరత్వపు తేదీ, నెల, సంవత్సరం; అమరత్వపు ఘటన వివరాలు వంటి అంశాలు వచ్చే విధంగా క్లుప్తంగా రాయగలరు.

అమరుల చరిత్రతో పాటు ఫోటో (వుంటే) తప్పక జత చేయండి. ఫోటో వెనుక పేరు రాయాలి.

**గమనిక:** ఈ విజ్ఞప్తిని ఎల్లప్పుడూ మీ వద్ద భద్రపరుచుకోగలరు.

సోదరుడు అవుట చెన్నయ్య. 2005 అక్టోబర్‌లో నల్లదండు ముఠా హత్య చేసింది.

## కామ్రేడ్ గోవిందు

కామ్రేడ్ గోవిందు నల్లమల అటవీ ప్రాంతంలోని ఈర్లపెంట గ్రామానికి చెందిన ఆదివాసీ కుటుంబంలో పుట్టాడు. పార్టీ నల్లమలలో పని ప్రారంభించినప్పటి నుండి గోవిందు కుటుంబం పార్టీని సొంతం చేసుకుంది. సంఘంలో క్రియాశీలంగా పనిచేసి కామ్రేడ్ గోవిందు పార్టీ సభ్యత్వం పొందాడు. ఆదివాసుల సమస్యలపై జరిగిన అనేక పోరాటాల్లో, సహకార సంఘంలో చురుకుగా పని చేశాడు. నల్లమల అటవీ ప్రాంతంలో ఈర్లపెంట గ్రామస్తులు పార్టీకి బలమైన పునాదిగా వుంటున్నారని యెంచి, 2005 అక్టోబర్‌లో బస్సులో ప్రయాణిస్తున్న గోవిందును పోలీసులు కిడ్నాప్‌చేసి తీవ్రంగా చిత్రహింసలు పెట్టి కాల్చిచంపారు.

సుదీర్ఘకాలం పార్టీనంటిపెట్టుకుని, గొప్ప విశ్వాసంతో పార్టీ అప్పగించిన పనులు, బాధ్యతగా నిర్వర్తించిన కా. గోవిందు మనకెంతో ఆదర్శనీయుడు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోయేందుకు అంకితమై, కామ్రేడ్ గోవిందు స్మృతిలో నివాళ్లర్పిద్దాం.

## కామ్రేడ్ జాల లింగయ్య

కామ్రేడ్ లింగయ్య మహబూబ్‌నగర్ జిల్లా అమ్రాబాద్ మండలం సార్లపల్లిలోని యాదవ కుటుంబానికి చెందినవాడు. వీరి కుటుంబం పార్టీకి బలమైన సానుభూతిపరుల కుటుంబం. ప్రజల్లో భయభ్రాంతులు సృష్టించడానికి నల్లదండు ముఠా అక్టోబర్ 2005లో కామ్రేడ్ లింగయ్యను హత్య చేసింది.

## కామ్రేడ్ మల్లేష్

కామ్రేడ్ మల్లేష్ మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ మండల కేంద్రంలోని పేద దళిత కుటుంబంలో పుట్టాడు. మైదాన ప్రాంత ఉద్యమ ప్రభావంతో 10వ తరగతి నుండే విప్లవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నాడు. నిబద్ధతతో పని చేసి సి.ఒ. స్థాయికి ఎదిగాడు. 2005 ఆగస్టులో ఎం.ఎల్.ఎ. చిట్టెం నర్సిరెడ్డిని

## విజ్ఞప్తి

ప్రియమైన కామ్రేడ్స్,

'క్రాంతి'కి పంపుతున్న పోరాట/ప్రతిఘటన/ఆందోళన/సభలూ-సమావేశాల నివేదికలు చాలా అసమగ్రంగా ఉంటున్నాయి. కనుక ఒక్కోసారి అవి ప్రచురణ సాధ్యం కావడం లేదు.

కనుక నివేదికలలో పోరాటం/ప్రతిఘటన/ఆందోళన/సభలూ-సమావేశాలు జరిగిన తేదీ, నెల, సంవత్సరం; జిల్లా, గ్రామాల పేర్లు; ఏ దళ ఆధ్వర్యంలో జరిగినదీ రాయాలి (దళ, ప్రాంతాల పేర్లు పొడి అక్షరాల్లో రాయవద్దు). ఈ పోరాటాల సందర్భంగా చేపట్టిన కరపత్రాలూ, పోస్టర్లూ, పత్రికా ప్రకటనలు వంటి ప్రచార రూపాలను కూడా పేర్కొనాలి. వీటిల్లో పాల్గొన్న ప్రజల సంఖ్యనూ, వారిలోనూ మహిళల సంఖ్యను ప్రత్యేకంగా పేర్కొనాలి. ప్రజల పాత్రను నిర్దిష్టంగా పేర్కొనాలి. ప్రజా వ్యతిరేకులపై భౌతిక చర్యలు తీసుకున్న నివేదికలు రాస్తున్నప్పుడు, ఆ చర్యలకంటే ముందు వారిపై చేసిన హెచ్చరికల వంటి పోరాట రూపాలను పేర్కొనాలి. వీటిలోనూ ప్రజల పాత్రను పేర్కొనాలి.

నివేదికలతో పాటు ఫోటోలు (వుంటే) తప్పక జత చేయగలరు. ఫోటో వెనుక వివరాలు రాయగలరు.

**గమనిక:** ఈ విజ్ఞప్తిని ఎల్లప్పుడూ మీ వద్ద భద్రపరుచుకోగలరు.

నిర్మూలించిన తర్వాత పోలీసులు అనుమానంతో కామ్రేడ్ మల్లేష్‌ను అరెస్ట్ చేసి కేసులు పెట్టి జైల్లో వేశారు. ఆ తర్వాత విద్యార్థి ఆర్గనైజర్ అని అర్థమయిన శత్రువు నర్సిరెడ్డి, భరతసింహా రెడ్డి కుటుంబాల ఒత్తిడితో మల్లేష్‌ను భౌతికంగా నిర్మూలించాలని కుట్రపన్నారు. కొంతకాలం తర్వాత జైలు నుండి విడుదలై కుటుంబ సభ్యులతో ఇంటికి వస్తున్న మల్లేష్‌ను మార్గ మధ్యలో పోలీసులు అరెస్టు చేసి, ఎత్తుకుపోయి మాయం చేశారు. పట్టణోద్యమాలు జిల్లాలో పూర్తిగా లేని స్థితిలో కామ్రేడ్ మల్లేష్ నిబద్ధతతో, పట్టుదలతో పని చేసి పట్టణోద్యమం నిర్మించడానికి కృషి చేశాడు.

## కామ్రేడ్ మనోహర్

మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ మండలం అల్వాల గ్రామంలోని పేద దళిత కుటుంబంలో జన్మించాడు కామ్రేడ్ మనోహర్. మక్తల్‌లో ఇంటర్మీడియట్ చదువు పూర్తి చేసి, ఆర్.ఎస్.యు.లో భాగం అవుతూ పూర్తికాలం కార్యకర్తగా ఎదిగాడు. అనంతరం పార్టీ కామ్రేడ్ మనోహర్‌కు నారాయణపేట పట్టణ ఆర్గనైజేషన్ బాధ్యతలు అప్పగించింది. కామ్రేడ్ మనోహర్‌ను కూడా నర్సిరెడ్డి సంఘటనలో అనుమానం కింద అరెస్టు చేసి జైల్లో పెట్టారు. జైలు నుండి విడుదలై వస్తుండగా కుటుంబ సభ్యుల కళ్ల ముందే కామ్రేడ్ మల్లేష్‌తో సహా ఎత్తుకుపోయి మాయం చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా ఆర్.ఎస్.యు. ఉద్యమం పుంజుకుంటున్న దశలో విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న కామ్రేడ్స్ మనోహర్, మల్లేష్‌లను శత్రువు అతిపాశవికంగా పొట్టనబెట్టుకున్నాడు.

నిప్పులు చెరిగే నిర్బంధంలో మళ్లీ ఆర్.ఎస్.యు, పట్టణోద్యమాలకు ఊపిరులూదుతూ తమ తుది శ్వాస వరకు విప్లవానికే అంకితమైన కామ్రేడ్స్ మల్లేష్, మనోహర్‌లు మనకెంతో ఆదర్శనీయం. ఆర్.ఎస్.యు., పట్టణోద్యమాలను బలోపేతం చేయడానికి పునరంకితమై, కామ్రేడ్స్ మల్లేష్, మనోహర్‌ల కర్తవ్య సాధనలో దృఢంగా ముందుకు సాగుదాం.

## కామ్రేడ్స్ వెంకటేష్, రాజు, ఆనంద్

2005, నవంబర్ 10న అమరచింత ఎస్.ఐ. మొయినుద్దీన్‌ను ఆత్మకూరు పోలీసు స్టేషన్ ముందు యాక్షన్ టీం ఖతం చేసి పిస్టల్‌ను స్వాధీనం చేసుకుంది. ఈ సంఘటనతో పిచ్చెత్తి వున్మాదుల్లా మారిన పోలీసులు నారాయణపేటలో ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుకుంటూ ఆర్.ఎస్.యు. సానుభూతిపరులుగా వుంటున్న విద్యార్థుల్ని రాత్రికి రాత్రి దొంగల్లా ఎత్తుకెళ్లి కాల్చిచంపారు.

చిట్టెం నర్సిరెడ్డి కుటుంబ యాజమాన్యంలో నడుస్తున్న నారాయణపేటలోని సూర్యలక్ష్మి డిగ్రీ కళాశాలలో చదువుకుంటూ ఆర్.ఎస్.యు. ఆర్గనైజర్, పి.ఆర్.లుగా పని చేసిన కామ్రేడ్స్ మల్లేష్, మనోహర్‌లను నర్సిరెడ్డి యాక్షన్‌కు ప్రతీకారంగా శత్రువు మాయం చేశాడు. వీరు పార్టీ కార్యకర్తలని తెలిసిన తర్వాత ఈ కళాశాలలో చదువుకుంటున్న చాలా మంది విద్యార్థులను యాజమాన్యం నక్సలైట్లుగా భావించింది. ఇందులో భాగంగానే కామ్రేడ్స్ వెంకటేష్, రాజు, ఆనంద్‌లను పోలీసులు పొట్టనపెట్టుకున్నారు.

కామ్రేడ్స్ వెంకటేష్, రాజు, ఆనంద్‌లు పేద దళిత కుటుంబాల నుంచి వచ్చి, కష్టపడి చదువుకుంటూ పార్టీకి బలమైన సానుభూతిపరులుగా వున్నారు. ఈ విద్యార్థులు ఏనాడూ బహిరంగ విప్లవ కార్యక్రమాల్లో పాల్గొనకపోయినా పార్టీ సానుభూతిపరులుగా వుండటాన్ని కాలేజీ యాజమాన్యం, పోలీసులు జీర్ణించుకోలేపోయారు. అవకాశం కోసం ఎదురుచూస్తున్న ఖాకీ కుక్కలు ఎస్.ఐ. మొయినొద్దీన్ యాక్షన్‌కు ప్రతీకారంగా కామ్రేడ్స్ వెంకటేష్, రాజు, ఆనంద్‌లను కబళించాయి. నవంబర్ 11న రాత్రి తోటి విద్యార్థుల ముందే ఎత్తుకొచ్చి కొత్తకోట మండలంలోని రామన్‌పాడు రిజర్వాయర్ వద్ద కాల్చిచంపి ఎస్.ఐ. మొయినొద్దీన్‌ను చంపిన యాక్షన్ టీం హతమైందని ఎప్పటిలాగే కట్టు కథను అల్లారు. ఈ కట్టు కథల్ని నమ్మని నారాయణపేట విద్యార్థులు పోలీసుల దుర్మార్గానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున కదిలి నిరసన తెలిపారు.

## కామ్రేడ్ గోవర్ధన్ రెడ్డి

2005, నవంబర్ 11న జిల్లాలో ఒకపక్కన ముగ్గురు విద్యార్థుల్ని కబళించిన ఖాకీ తోడేళ్లు అదే రోజు మరో పక్క ఊరుకొండపేట గుట్టల్లో కామ్రేడ్ గోవర్ధన్ రెడ్డిని పొట్టనబెట్టుకున్నాయి. బాలానగర్ మండల కేంద్రంలో టెలిఫోన్ బూత్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న గోవర్ధన్ రెడ్డిని శత్రువు రాత్రి 8 గంటలకు టెలిఫోన్ బూత్ నుండే కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లి ఊరుకొండ పేట గుట్టల్లో అతి కిరాతకంగా కాల్చిచంపి ఎన్‌కౌంటర్ కట్టు కథ అల్లాడు. కామ్రేడ్ గోవర్ధన్ రెడ్డి 1992లో అమరుడైన కామ్రేడ్ గోపాల్ రెడ్డి సోదరుడు. సుదీర్ఘకాలం బలమైన విప్లవ సానుభూతిపరుడిగా వుంటూ ఎన్నో విధాలుగా పార్టీకి సహకారం అందించినవాడు కామ్రేడ్ గోవర్ధన్ రెడ్డి.

తన సోదరుని విప్లవతత్వాన్ని తనలో నింపుకుని, పార్టీ పట్ల గొప్ప విశ్వాసంతో సుదీర్ఘకాలంగా పార్టీకి తన సహాయ, సహకారాలందించిన కామ్రేడ్ గోవర్ధన్ రెడ్డి ప్రజల స్మృతిలో సదా చిరస్మరణీయుడు.

డి.కె. అమరులు

# సాహసిక గెరిల్లా, కంపెనీ కమాండర్ కామ్రేడ్ మధు (కేశరాజు అంజన్న) సదా చిరస్మరణీయుడు!

2008, ఫిబ్రవరి 18న పశ్చిమ బస్తర్ జిల్లా (బీజాపూర్) మిర్తూల్ పోలీసు స్టేషన్ పరిధిలోని తడికేల్ గ్రామం వద్ద గాలింపు కోసం వచ్చిన సిఆర్‌పిఎఫ్, జిల్లా పోలీసులు, ఎస్‌పిఒ బలగాల సంయుక్త పోలీసు బలగాలపై పిఎల్‌జిఎ (కంపెనీ-2, 13వ ప్లటూన్, ఎల్‌జిఎస్) బలగాలు ఆంబుష్ చేశాయి. ఈ ఆంబుష్‌లో పిఎల్‌జిఏ వీరోచితంగా పోరాడి 6 గురు సిఆర్‌పిఎఫ్ పోలీసుల్ని మట్టికరిపించి మరో ముగ్గురిని గాయపర్చి ఆరు అధునాతన ఆయుధాల్ని (ఏకెలు-3, ఇన్‌సాస్-1, ఎస్ఎల్ఆర్-1, 2'' మోర్టార్ -1) స్వాధీనం చేసుకున్నాయి. ఈ దాడికి నాయకత్వం వహించి అత్యంత సాహసోపేతంగా శత్రువు పైకి దూసుకుపోయిన కంపెనీ-2 కమాండర్ కా.మధు (కేశరాజు అంజన్న) శత్రువు జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందాడు. ఈ కామ్రేడ్‌తో పాటు కామ్రేడ్స్ బద్రు, నందు, శాంతి, పవన్, ఐతులు కూడా తమ ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పించారు. ఈ కామ్రేడ్స్‌కు వినమ్రంగా జోహార్లర్పిద్దాం. వారి త్యాగాన్ని ఎత్తిపడుదాం.



కా.మధు 28 సంవత్సరాల క్రితం వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపురం మండలం మీదికొండ గ్రామంలో నిరుపేద కష్టజీవుల కుటుంబంలో జన్మించాడు. గుంటెడు భూమి కూడా లేని మధు తల్లిదండ్రులు తమ రజక వృత్తి మీదనే ఆధారపడి పిల్లల్ని పోషించారు. పిల్లలు ఎదిగే క్రమంలో కేవలం వృత్తి పని పైనే ఆధారపడి కుటుంబాన్ని పోషించడం సాధ్యం కాకపోవడంతో కొడుకులిద్దర్ని ఊరి దొరల (భూస్వాముల) వద్ద జీతం వుంచారు. అలా చిన్నప్పటి నుండి మధు కష్టాల్ని భుజాల నెత్తుకునే పెరిగాడు. తల్లిదండ్రుల్తో పాటు ఊరిలోని మురికి బట్టలన్నీ జమ చేసి చెరువులో ఉతికి సాపు చేసి సాయంత్రానికి ఎవరి బట్టలు వాళ్ల ఇండ్లకు చేరవేసి ఇంటింటికి పిడికెడు మెతుకులు అడుక్కొని పొట్ట నింపుకునే వాళ్ల కడుపున పుట్టి వృత్తి విప్లవకారుడిగా మారినవాడు మధు. మీదికొండ గ్రామం భూస్వాములకు పెట్టని కోట. కరుడు గట్టిన భూస్వాములకు గొడ్డు చాకిరి చేస్తూ కూడా కడుపునిండా తిండి దొరకని మధు తన కుంటుంబంలోని కష్టాల్ని, తాను జీతమున్న దొరల కుటుంబాల్లోని సుఖవంతమైన జీవితాన్ని పోల్చి చూసుకొని ఈ అంతరానికి కారణం ఏమిటని ఆలోచించేవాడు. కుటుంబంలోని పేదరికం మూలంగా మధు చదువు సంధ్యకు కూడా నోచుకోలేదు. 1990లో వరంగల్‌లో జరిగిన రైతుకూలీ సంఘం మహాసభల ప్రభావంతో వెల్లువలా సాగిన భూస్వాముల భూ ఆక్రమణ పోరాటాల ప్రభావం మీదికొండ గ్రామంపై పడింది. మీదికొండలో కూడా రాడికల్ యువజన సంఘం ఏర్పడి భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో గట్టిగా నిలబడింది. ఈ పోరాటాల్తో ప్రభావితుడైన కా.మధు 1994లో ఆర్‌వైఎల్‌లో చేరి భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో ముందు నిలిచి గుర్తింపు పొందిన సంఘ నాయకుడిగా ఎదిగాడు.

1994 చివరలో గ్రామ సంఘంపై తీవ్రమైన నిర్బంధం విరుచుకుపడింది. సంగాన్ని దెబ్బ తీయాలనుకున్న భూస్వాముల మాటపై గ్రామంలోని సంఘ కార్యకర్తలను 92 మందిని పోలీసులు అరెస్టు చేసి తీవ్ర చిత్రహింసలకు గురిచేసి అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారు. కా.కేశరాజు అంజన్న (మధు) ఈ అరెస్టుల నుండి తప్పుకొని రహస్యంగా తిరుగుతూ మిగిలిపోయిన సంఘ సభ్యులను కూడగట్టి తిరిగి సంగాన్ని పునర్నిర్మాణం చేసే కృషి చేశాడు.

మీదికొండకు వచ్చే గెరిల్లా దళానికి తానే పెద్ద దిక్కుగా నిలిచి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేవాడు. మధు కోసం శత్రువు వేటాడటం ఎక్కువైంది. ఒకవైపు పెరిగిన నిర్బంధం, మరోవైపు అంజన్నలో పెరిగిన రాజకీయ చైతన్యం అతన్ని పూర్తికాలం విప్లవ కార్యకర్తగా మలిచాయి. ఊరిలోని మురికి బట్టల్ని సాపు చేసే అంజన్న దేశానికి పట్టిన దోపిడీ అనే మురికిని రూపుమాపాలనే చైతన్యంతో పార్టీలో వృత్తి విప్లవకారుడయ్యాడు. 1995లో 10 గ్రామాల్ని ఆర్గనైజ్ చేసే ఆర్‌వైఎల్ పిఆర్‌గా పనిచేశాడు. 1996లో పాలకుర్తి ఏరియా ఆర్‌వైఎల్ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించాడు. 1997లో గెరిల్లా దళం సభ్యుడిగా నర్సంపేట దళంలో చేరాడు. 1998లో రక్షణ అవసరాలరీత్యా ఉత్తర

తెలంగాణలోని ఫస్ట్ ప్లటూన్‌తో పాటు మొదటిసారి దండకారణ్యంలోకి అడుగుపెట్టాడు. తెలియని ప్రాంతం, భాష అయినప్పటికీ డికెలోని కామ్రేడ్స్‌తో కలిసిపోయి డికె పోరాటాల గురించి అనేక విషయాలు తెలుసుకొని ఉత్తేజం పొంది 'పార్టీ పంపిస్తే డికె ఉద్యమంలో పనిచేస్తానని' తన మనసులోని మాట చెప్పాడు. కొద్ది రోజుల తర్వాత పార్టీ అతన్ని డికెకు బదిలీ చేసింది. ఆరు నెలలు ఒక దళంలో పనిచేసాక 1999 జూన్‌లో కా.మధును ప్లటూన్-2లో సభ్యుడిగా నియమించారు. అది మొదలు తడికేల్ ఆంబుష్‌లో అమరత్వం చెందే వరకు మిలటరీ రంగంలోనే పనిచేసాడు.

1999 ఫిబ్రవరిలో మాడ్ డివిజన్‌లోని వాకుల్‌వాయి ఆంబుష్‌లో మధు పాల్గొన్నాడు. కా.మధుకు ఈ ఆంబుష్ మొదటి అనుభవం. ఈ ఆంబుష్‌లో 24 మంది పోలీసులు ఖతం అయ్యారు. దేశంలో ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో పోలీసులను హతమార్చి చరిత్రలో నిలిచిపోయిన ఆంబుష్ ఇది. సోమన్‌పల్లి ఆంబుష్, చేరేపల్లిలో పోలీసులపై చేసిన ఆంబుష్, బస్సులో పోతున్న పోలీసులపై ముర్దొండ వద్ద చేసిన ఆంబుష్, మోదక్‌పాల్ వద్ద రాజేంద్ర పాంబోయి కాన్వాయిపై చేసిన ఆంబుష్ తదితర అనేక ఆంబుష్‌ల్లో సభ్యుడిగా, డిప్యూటీగా, కమాండర్‌గా కా.మధు పలు ముఖ్యమైన బాధ్యతలు నిర్వర్తించాడు.

కా.మధులో పెరుగుతున్న శక్తిసామర్థ్యాల్ని చూసి పార్టీ 2001 జూన్‌లో పిఎల్-2లో సెక్షన్ కమాండర్‌గా బాధ్యతలనిచ్చింది. 2002 మధ్యలో పిఎల్-2 కమాండర్‌గా నియమించబడ్డాడు. 2005లో కంపెనీ-2 నిర్మించాలనీ తీర్మానం జరిగినప్పుడు అందులో ప్లటూన్ కమాండర్‌గానూ, కంపెనీ పార్టీ కమిటీ (సీవై పిసి) సభ్యునిగాను బాధ్యతలు స్వీకరించాడు. 2006 చివరలో కా.మధు కంపెనీ-2కు కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించాడు.

పీడిత ప్రజల్ని హింసించే దోపిడీదారులన్నా, వారి కావలికుక్కలైన పోలీసులన్నా మధు మండిపడేవాడు. సల్వాజుడుం విధ్వంసకాండ కొనసాగిన ఈ మూడు సంవత్సరాల కాలమంతా కా.మధు బీజాపూర్ జిల్లాలోనే గడిపాడు. పోలీసులు, సల్వాజుడుం గుండాలచే కాల్చివేయబడిన వందలాది ఇండ్లు, ఆస్తులు, అత్యాచారానికి గురైన మహిళలు, సజీవ దహనాలు, ముక్కలు ముక్కలుగా నరికి చంపబడిన ప్రజలు, వాళ్ల కుటుంబాల్ని, బాధల్ని ప్రత్యక్షంగా చూసాడు. వాళ్ళను గుండెకు హత్తుకొని ఓదార్చాడు. శత్రువుపై ప్రతీకారం తీర్చుకోవడానికి ప్రజల్ని సిద్ధం చేశాడు. జుడుంను ఓడించడానికి చేసిన అనేక దాడుల్లో కా.మధు శత్రువును చీల్చి చెండాడేవాడు.

గీదం రెయిడ్, ఎన్ఎండిసి రెయిడ్, మురికినార్‌లో ఉదయం పూట చేసిన రెయిడ్‌తో పాటు చారిత్రాత్మకమైన రానీబోదిలి రెయిడ్ మొదలగు అనేక రెయిడ్స్‌లో ఎలాంటి శషబిషలు లేకుండా అసాల్ట్ పార్టీలో వుంటూ రెయిడ్స్‌ను సఫలం చేయడంలో కీలకమైన పాత్ర పోషించాడు. ఎన్ఎండిసి, మురికినార్ రెయిడ్లల్లో మొదటి అసాల్ట్‌లో వుండి మొదటి తూటా పేల్చిన వాడు కా.మధుయే.

రానీబోదిలీ రెయిడ్‌లో టోటల్ డిప్యూటి బాధ్యతలు నిర్వహించిన కా.మధు అసాల్ట్ టీములతో పాటు స్టేషన్‌లోకి దూసుకువెళ్లి అసాల్ట్ పార్టీల్ని చొరవతో నడిపిస్తూ 55 మంది శత్రు మూకలను మట్టుబెట్టడంలో తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించాడు. 2007 నవంబర్‌లో పాములవాయి-1, పాములవాయి -2 ఆంబుష్‌ల్లో కూడా కా.మధు ఆంబుష్ పార్టీ కమాండర్‌గా వుంటూ రెండు ఆంబుషుల్ని విజయవంతం చేశాడు. మొత్తంగా తన 11 ఏండ్ల మిలటరీ జీవితంలో కా.మధు సుమారు 30 ఘటనల్లో పాల్గొన్నాడు.

పేదరికం మూలంగా ఇంటివద్ద చదువు సంధ్యలకు నోచుకోనప్పటికీ పార్టీలోకి వచ్చాక చాలా పట్టుదలతో చదువు నేర్చుకొని పార్టీ సాహిత్యాన్ని చదవడం, అర్థం చేసుకునే స్థాయీ పెంచుకున్నాడు. ఏమాత్రం సమయం చిక్కినా రాజకీయ అధ్యయనంపై కేంద్రీకరించేవాడు. హిందీ భాష కూడా అర్థం చేసుకోవడం, దినపత్రికలు చదవడం, దేవనాగరి లిపితో కోయలో సభ్యులకు ఉత్తరాలు రాయడం వరకు నేర్చుకున్నాడు.

తాను ఏ విషయంలో బలహీనంగా ఉన్నాడో, వెనుకబడి వున్నాడో ఆ విషయంలో తగినంత పట్టు సాధించే వరకు నిరంతర కృషి చేసేవాడు. చదువు రానప్పటికీ డాక్టర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని కంపెనీకి పెద్ద డాక్టర్‌గా నిలిచాడు. ఇంగ్లీషు అక్షరాలు కూడా నేర్చుకొని మందుల పేర్లను గుర్తించి రోగులకు వైద్యం చేయడం వరకు నేర్చుకోగలిగాడు.

తప్పుల్ని అంగీకరించడంలో నిజాయితీగా వుండేవాడు. తన నుండి జరిగిన లోపాల్ని ఒప్పుకోవడం, తనలోని బలహీనమైన అంశాలు ఏమిటో చెప్పుకోవడం, వాటి నుండి బైటపడేందుకు సీరియస్‌గా కృషి చేసేవాడు.

తన 10 సంవత్సరాల దండకారణ్య విప్లవ జీవితంలో ఆదివాసీ ప్రజల్ని, క్యాడర్లను ఎంతగానో ప్రేమించాడు. వాళ్లతో కలసిపోయి ప్రజల, క్యాడర్ల ఎనలేని విశ్వాసాన్ని చూరగొన్నాడు.

అందరినీ ఆప్యాయంగా పలుకరించడం, గలగలా నవ్వడం, అందరికీ అప్పుడిగా వుండడం అతని ప్రత్యేకత.

పెండ్లి విషయంలో కూడా కా.మధు ఎలాంటి తొందరపాటుకు గురికాకుండా ముందు తాను రాజకీయంగా, మిలటరీపరంగా, నిర్మాణపరంగా ఎదగడం, శక్తి సామర్థ్యాల్ని సమకూర్చుకోవడంపై పట్టుదలతో కృషి చేస్తూ తన ఎదుగుదలను ఓపికగా పరిశీలించుకొన్న మధు తనకు నచ్చిన కామ్రేడ్‌ను ఎంచుకొని పార్టీ అనుమతితో, పార్టీ పద్ధతుల్లో వివాహం చేసుకున్నాడు. విప్లవోద్యమంలోకి వచ్చిన కొంత కాలానికే పెండ్లి సమస్యల్లో కూరుకుపోయే కామ్రేడ్స్‌కు కా.మధు వైవాహిక జీవితం ఒక ఆదర్శంగా నిలుస్తుంది. మార్గదర్శిగా ఉంటుంది.

అనేక సుగుణాలు కల్గి ఎదుగుతున్న కా.మధు అమరత్వం పిఎల్‌జిఏకు ఒక పెద్ద లోటు. అట్టడుగు వర్గంలో పుట్టిన ఒక అమాయక జీవిని వర్గపోరాటం ఎంత గొప్ప సాహసిక యోధుడిగా తీర్చిదిద్దుతుందో కామ్రేడ్ మధు జీవితం ఒక సజీవ ఉదాహరణ. తడ్‌కేల్‌లో అమరులు చిందించిన నెత్తురులోంచి వేనవేల మధుల్ని సృష్టించుకుందాం. కా.మధు కలలుగన్న స్వప్నాన్ని నిజం చేసేందుకు తుదివరకు పోరాడుదాం. కా.మధు విప్లవ చరిత్ర, అమరత్వం సదా చిరస్మరణీయంగా, ప్రేరణగా నిలుస్తుంది.

## మద్దేడ్ పోరుబిడ్డ కామ్రేడ్ బద్రు అమర్ రహే!

తడికేల్ ఆంబుష్‌లో శత్రువుతో వీరోచితంగా పోరాడి అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చడంలోనూ ఆయుధాలను అందుకోవడంలోనూ తమ జీవితాలనే త్యాగం చేసిన కామ్రేడ్స్ మధు, ఐతు, పవన్, శాంతి, నందులతో పాటు, అమరుడు బద్రు కూడ ఉన్నాడు.

తాను పనిచేస్తున్న ఏరియాలో బద్రు, ఆనంద్ పేర్లతో ప్రజలకు పరిచయం అయిన ఈ కామ్రేడ్ అసలు పేరు కుర్సం సీతారాం. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా భూపాల్‌పట్నం తహసీల్‌కు చెందిన కొత్తపల్లి గ్రామస్థుడు కా.బద్రు. కడు నిరుపేద కుటుంబంలో కన్నవారికి కల్గిన మొదటి బిడ్డ బద్రు. తనకో చెల్లెలు ఉంది.

కా.బద్రుకి జ్ఞానం తెలిసిననాటికే తల్లితండ్రులు కన్ను మూశారు. దానితో ఆ ఇంటి భారమంతా కా.బద్రుపై పడింది. రెక్కాడితే గానీ డొక్కాడని (కడుపు నిండని) కుటుంబం కావడంతో జీవనం కోసం మద్దేడ్ పెత్తందార్లు-షావుకార్ల వద్ద పశువుల కాపరిగా పనిచేసాడు. మద్దేడ్ ఏరియాలో వర్షాకాలం పొలాలన్ని వడ్లు అలుకుతుండడంతో పశువులను మేపడానికి స్థలం ఉండేది కాదు. కనుక వాటిని మేపుతూ వరికోతలు అయిపోయే వరకు నెలల తరబడి కర్రెగుట్టల(ఆంధ్ర సరిహద్దు)లోనే గడిపేవాడు. అలా చిన్నప్పట్నుంచీ తిప్పలు పడ్డాడు.

క్రమంగా అతనికి విప్లవోద్యమం పరిచయమైంది. సంగంలో చేరి పార్టీ అప్పగించిన పనులు చేస్తుండేవాడు.

1997లో దళంలోకి భర్తీ అయ్యాడు. ప్రారంభంలో ఊసూర్ ఆర్గనైజర్‌గా పనిచేస్తూ ప్రజలకు కా.ఆనంద్ పేరుతో పరిచయమయ్యాడు. దళంలో కొత్తవాడైనప్పటికీ పనిలో హుషారుతనం, మిలిటెన్సీని ప్రదర్శించేవాడు. అది చూసి 1998లో స్పెషల్ గెరిల్లా దళం (ఎస్‌జిఎస్)లోకి బదిలీ చేశారు. అక్కడి నుండి 1998 డిసెంబర్‌లో మొదటి ప్లాటూన్‌లోకి బదిలీ అయ్యాడు. 2001 నాటికి దండకారణ్యంలో రెండే రెండు ప్లాటూన్‌లు పనిచేస్తున్నాయి. ప్రజావిముక్తి గెరిల్లా సైన్యం (పిఎల్‌జిఏ) యూనిట్లను పెంచుతూ, డివిజన్‌కు ఒక్కొక్క ప్లాటూన్ నిర్మాణం చేయాలనే ఎస్‌జడ్‌సి తీర్మానం వెలుగులో, ఉత్తర బస్తర్‌లో నిర్మాణం చేసిన 5వ ప్లాటూన్‌కు కా. బద్రు బదిలీ అయ్యాడు. అక్కడ నుండి, తిరిగి 2004 జులైలో డికెలో మొట్టమొదటగా ఏర్పాటుచేసిన మొదటి కంపెనీలో సెక్షన్ కమాండర్‌గా చేరాడు. కా.బద్రు రాజకీయంగా, మిలటరీపరంగా ఎదుగుతూ కంపెనీ పార్టీ కమిటీ సభ్యుడిగా ఎదిగాడు.

2007 వరకు మొదటి కంపెనీలో పనిచేసి పార్టీకి ఒక కొత్త అనుభవాన్ని అందించిన వారిలో కా.బద్రు ఒకరు. 2007 మార్చి 15న రాణిబోదిలీ వీరోచిత ఘటన జరిగింది. ఆ విజయవంతమైన దాడిలో రెండవ కంపెనీకి చెందిన నాయకత్వ కామ్రేడ్స్‌ను కోల్పోయాం. ఆ లోటును పూడ్చడానికి ఎస్‌జడ్‌సి 2007 సెప్టెంబర్‌లో కా. బద్రును 2వ కంపెనీకి బదిలీ చేసింది. పార్టీ చేసిన ఆ నిర్ణయాన్ని తు.చ.తప్పకుండా పాటించి వెళ్లిన కామ్రేడ్ బద్రు, అక్కడికి వెళ్లిన 5 నెలల కాలంలో మూడు దాడుల్లో పాల్గొన్నాడు. ఆఖరిది తడికేల్ దాడి.

కా.బద్రు తాళ్లగూడెం, గీదం, బాందే,కోరాపుట్, దైలా దాడుల్లో పాల్గొన్నాడు. అలాగే ఆంబుష్‌ల్లో నయితే చిన్నవి, పెద్దవి కలిపి 20పైగానే ఉంటాయి. వాటిలో దేవ్‌గావ్, ఆలూర్, ఆలేనార్, బోదిలి (డౌలా), మూడుపాల్లు, జారఘాటీ, కుదురు, పాములవాయి-2, తడికేల్‌లు ముఖ్యమైనవి.

కా.బద్రు దేవ్‌గావ్ ఆంబుష్‌లో కా.సుఖ్‌దేవ్ (ఎస్‌జడ్‌సిఎమ్) అమరుడైనా శత్రువును తిప్పికొడుతూ తుపాకుల స్వాధీనంలో పాల్గొన్నాడు. జారఘాట్ ఆంబుష్‌లో శత్రువును ఫైర్ అండ్ మూవ్‌మెంట్‌లో హతమారుస్తూ మిగిలిన వారిని అక్కడి నుండి

గెదిమి తుపాకులను స్వాధీనం చేసుకున్న వారిలో ఒక అసాల్ట్ టీం బాధ్యుడైన కా.బద్రు కూడ ఉన్నాడు. కుదురు ఆంబుష్‌లో సైకిల్ మోటర్లపై వస్తున్న శత్రువుకి అడ్డం తిరిగి అతి సమీపం నుండి మొదటి తూటా కాల్చి ఆంబుష్ ప్రారంభించిన వాడు కా.బద్రు. ఇంకా ఫైర్ అండ్ మూవ్‌మెంట్‌లో శత్రువు వెంటబడి నిర్మూలించి, తుపాకులు స్వాధీనం చేసుకోవడంలో ప్రముఖ పాత్ర వహించాడు. ఇలా జారఘాటీలో గానీ కుదురులో గానీ ఫైర్ అండ్ మూవ్‌మెంట్స్ డ్రిల్స్‌ను ఉపయోగించి పార్టీకి, పిఎల్‌జిఏకి కొత్త అనుభవాన్ని చేకూర్చినవారిలో కా.బద్రు ఒకడు. కా.బద్రు వీటిలో పాల్గొనడమే గాక అనేక మంది ప్రజాశత్రువులను(పెత్తందార్లు, భూస్వాములను) శిక్షించడంలోనూ సిఐడిలను, ఇన్‌ఫార్మర్లను ఏరివేయడంలోనూ అలాగే శత్రు ఆస్తుల విధ్వంస కార్యకలాపాల్లోనూ పాల్గొన్నాడు.

తాను దళంలోకి కొత్తగా వచ్చి పాల్గొన్న తాళ్లగూడెం రెయిడ్‌లో పెద్దెత్తున నాయకత్వంను కోల్పోయినపుడు గుండె నిబ్బరంతో నిలబడటం, కా.సుఖ్‌దేవ్(ఎస్‌జడ్‌సిఎమ్) అమరుడైనా దేవ్‌గావ్ ఆంబుష్‌లో తుపాకుల స్వాధీనంలో పాల్గొనడం, డౌలా రెయిడ్ విఫలమై చాల నష్టాలు సంభవించినా ఎలాంటి భయానికి లోనుగాక నిలబడ్డం, తడికేల్ ఆంబుష్‌లో కూడా టోటల్ కమాండర్ కా.మధు అమరుడైనప్పటికీ మొక్కవోని దీక్షతో తుపాకుల స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తూ అమరుడు కావడం... ఈ అన్నింటిలో పార్టీ అప్పగించిన సైనిక కర్తవ్యాలను నిర్వర్తించడంలో కా.బద్రుకు గల అకుంఠిత దీక్ష, పట్టుదలలు ప్రస్ఫుటంగా కనబడతాయి. అవి ప్రజాయుద్ధంలోని కామ్రేడ్స్ అందరికీ ఆదర్శంగా నిలుస్తాయి.

కామ్రేడ్ బద్రు కిట్లు, పోచ్‌లు, రేడియో కవర్లు, సెట్స్ కవర్లు సరైన కొలతలతో అందంగా కుడుతుండేవాడు. రాని వారికి తోడ్పడుతూ నేర్పించేవాడు. తను మంచి డ్యాన్సర్ (నృత్యగాడు). డోలు మోగిందంటే చాలు భుజాలు ఎగరేస్తూ సామూహిక (సాంస్కృతిక) నృత్యంలో పాల్గొనడానికి పరుగెత్తేవాడు. ఎగురలేని వారిని ఉత్సాహపర్చి దరువుతో ఢాకా నేర్పుతూ వారిని కూడా సామూహిక నృత్యంలో భాగం చేసేవాడు.

కా.బద్రు 2వ కంపెనీకి బదిలీ అవుతున్నపుడు "పార్టీ నన్ను ఎక్కడికి (బీహార్‌కు కూడా) పంపినా నేను సిద్ధమే కాని నేను ప్రధాన బలగాల్లోనే పనిచేస్తాను. మన పార్టీ బెటాలియన్ నిర్మాణం చేస్తే తప్పనిసరిగా నన్ను పంపాలని పదే పదే కోరుతున్నాను. నా బలహీనతలు ఏమైనా వుంటే వెంట వెంట తెలియజేయండి. నన్ను ఎదిగించండి. కాని నాకు మాత్రం బెటాలియన్‌లో పనిచేసే అవకాశం కల్పించాలని కోరుతున్నాను'' అని అన్నాడు. గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా మార్చాలనే పార్టీ పిలుపును ఆచరణలో పెట్టడంలోనూ, విప్లవ విజయానికై యుద్ధాన్ని కొనసాగించడంలోనూ కా.బద్రు ఆశాజీవి. పిఎల్‌జిఏ బలగాలు బెటాలియన్ రూపం తీసుకోవాలనీ శత్రువును తుదముట్టించాలనీ కా.బద్రుకు గల బలమైన ఆశయాన్ని నెరవేర్చాల్సిన కర్తవ్యం మనందరిపై వదలి వెళ్లాడు. కా.బద్రు ఆశయాన్ని నెరవేర్చుదామని శపథం చేద్దాం.

# కంచాల్లో ఒరిగిన వీరయోధులకు అరుణారుణ జోహార్లు!

*2008, మార్చి 18న జరిగిన కంచాల్ హత్యాకాండలో కామ్రేడ్స్ సాగర్, రఘు, భాస్కర్, ఛూటే, సుదర్శన్, ఇడుమాల్, మడకం బాయక్క, కారం ఉంగాల్, పూనెం జోగి, మడకం బుద్రి, రామ్సూ, ముసాకీ మూకాల్, రవ్వా సన్ని, మాడివి లింగాల్, విమల, మాడివి మాడాల్, మాడివి అడమాల్, సల్వం లచ్చి యాయెలు అమరులయిన విషయం తెల్సిందే. మార్చి-ఏప్రిల్ సంచికలో కామ్రేడ్స్ సాగర్, రఘు, భాస్కర్, ఇడుమాల్, ముసాకి సన్నాల్‌ల జీవిత చరిత్రలు ప్రచురించాం. మిగితా కామ్రేడ్స్ చరిత్రలన్నీ ఈ సంచికలో ప్రచురిస్తున్నాం. - సం.*

## సాహసిక యువ గెరిల్లాయోధుడు
## కామ్రేడ్ కోవాసి పొజ్జాల్ (ఛూటే)



ఇరవై సంవత్సరాల వయస్సు గల కామ్రేడ్ కోవాసి పొజ్జాల్ దక్షిణ బస్తర్ దంతెవాడ జిల్లా, కుంట తాలూకా, కిష్టారం ఏరియా బెట్టమడుగు గ్రామంలో పేద ఆదివాసీ కోవాసి కుటుంబంలో పుట్టి పెరిగినాడు. తండ్రి చిన్న వయస్సులోనే చనిపోవటంతో తల్లే ఇతన్ని పెంచి పెద్ద చేసింది. అన్న అనారోగ్యంతో చనిపోగా కామ్రేడ్ ఛూటేకు తమ్ముడు మాత్రమే వున్నాడు.

పొజ్జాల్ చిన్న వయస్సు నుండే బాలల సంఘంలో పనిచేస్తూ అన్ని కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. పార్టీలోకి వస్తానని చిన్న వయసులోనే ప్రతిపాదన పెట్టాడు. అయితే చిన్న వయసు కాబట్టి కొంత కాలం మిలీషియాలో పనిచేసి అనుభవం సంపాదించుకొని రావాలని పార్టీ అర్థం చేయించింది. ఆ తర్వాత

2001లో కిష్టారం ఏరియా కమిటీ తనను రిక్రూట్ చేసుకుంది. తర్వాత పార్టీ అవసరాల రీత్యా కా. పొజ్జాల్‌ను ఎ.ఒ.బి.కి బదిలీ చేయగా ఎలాంటి శషభిషలు లేకుండా ఎ.ఒ.బి. జోన్‌కు వెళ్లాడు.

ఎ.ఒ.బి.లో కొత్త ప్రాంతం, భాష వేరైనా పట్టుదలగా నేర్చుకుంటూ అందరిలో కలిసిపోయేవాడు. అతి కొద్ది కాలంలోనే అక్కడి ప్రజలతో కలిసిపోయి స్థానికవాసిగా అయ్యాడు. అప్పుడు ఆనాడు ఎ.ఒ.బి. జోన్ కార్యదర్శిగా వున్న కా. బి.కె.కు గార్డ్‌గా తనను పార్టీ ఎంపిక చేసింది. గార్డుగా వుంటూ క్రమశిక్షణగా తన బాధ్యతల్ని నిర్వర్తించాడు. రాజకీయ, మిలిటరీ అనుభవాన్ని సంపాదించుకుంటూ కోరాపుట్, ఉదయగిరి లాంటి చారిత్రక దాడుల్లో కా. బికెకి గార్డుగా వుంటూ నాయకత్వ రక్షణ, దాడుల్లో చురుకైన పాత్రను నిర్వహించాడు. అలాగే తెలుగు చదువుకోవడం, రాయడం నేర్చుకున్నాడు. కామ్రేడ్ బికెతో ఛూటేకున్న కామ్రేడ్లీ అనుబంధం మరువరానిది. కా. బికె అమరుడయ్యాక కామ్రేడ్ ఛూటే దక్షిణ బస్తర్ డివిజన్‌కు బదిలీ అయ్యాడు.

2007 ఏప్రిల్‌లో దక్షిణ బస్తర్ డివిజన్ పామేడ్ ఏరియాలో 9వ ప్లాటూన్‌లో సెక్షన్ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు. ప్లాటూన్‌కు వచ్చిన కొద్ది కాలంలోనే ప్లాటూన్‌లో సభ్యులందరి మన్ననలను పొందాడు. 2007 సెప్టెంబర్‌లో మిలిటరీ శిక్షణ, రాజకీయ తరగతులు, చర్చల్లో, గ్రౌండ్‌లో వుత్సాహంగా పాల్గొనేవాడు. దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతం చేయాలనే పార్టీ లక్ష్యాన్ని పట్టుదలగా, బాధ్యతగా తీసుకొని పనిచేస్తూ ఎదిగి వస్తున్న గెరిల్లా మన కామ్రేడ్ ఛూటే.

2008 మార్చి 18 నాడు కంచాల్ గ్రామంలో కోవర్టుల ద్రోహంతో ఎ.పి. గ్రేహౌండ్స్ బలగాలు చేసిన దాడిలో ప్రతిఘటించడంతో తన 9వ ప్లాటూన్ మొదటి సెక్షన్‌కు నాయకత్వం వహిస్తూ కామ్రేడ్ ఛూటే శత్రువుకు జవాబుగా తీవ్ర ప్రతిఘటన ఇస్తూ ఆఖరి తూటా వరకు పోరాడుతూ అమరుడైనాడు. భారత నూతన ప్రజాస్వామిక విప్లవ విజయం కోసం పోరులో ప్రాణాలొడ్డిన కామ్రేడ్ ఛూటే అమరత్వం మన గెరిల్లా యోధులందరికీ ఆదర్శం.

## కామ్రేడ్ మాడివి లింగా (కిరణ్)

దక్షిణ బస్తర్ డివిజన్‌లోని పామేడ్ ఏరియా, ఊసూర్ ఎల్ఓఎస్ ఏరియా తుమ్మరిగూడెం గ్రామంలో 24 సంవత్సరాల క్రితం కా. మాడివి లింగా జన్మించాడు. ఈ గ్రామం బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్‌లో వుంది. చిన్ననాటి నుండే బాలల సంఘంలో పనిచేస్తూ విప్లవ పాటలు పాడుతుండేవాడు. తర్వాత డి.ఎ.కె.ఎం.ఎస్.లో పనిచేస్తూ సల్వాజుడుం సర్వం విధ్వంసం అభియాన్ తమ ఏరియాలో ప్రవేశించిన తర్వాత గ్రామంలో ఏర్పడిన కోయ భూంకాల్ మిలీషియాలో చేరి కమాండర్ బాధ్యతలు నిర్వర్తించాడు. ప్రజల మాన ప్రాణాల రక్షణలో తన వంతు పాత్రను నిర్వర్తించాడు. సంవత్సరం పాటు కోయ భూంకాల్ మిలీషియాలో పనిచేసి 2006లో పూర్తికాలం పి.ఎల్.జి.ఎ. సభ్యునిగా భర్తీ అయ్యాడు. కొంతకాలం ఊసూర్ ప్రాంతంలో జన మిలీషియాలో డిప్యూటీ కమాండర్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. కా. లింగా పి.ఎల్.జి.ఎ.లో భర్తీ అయిన పిదప కిరణ్‌గా పేరు మార్చుకొని ప్రజల్లో పనిచేశాడు. తనకు ఇంటి వద్దనే పెళ్లయింది. చిన్న పాపను, జీవిత భాగస్వామిని విడిచి విప్లవోద్యమంలో పూర్తికాలం కార్యకర్తగా పని చేశాడు. తన రాజకీయ చైతన్యం పెంచుకునేందుకు చదువు శ్రద్ధగా నేర్చుకునేవాడు. ప్రతిఘటనా చర్యల్లో చురుగ్గా వుండేవాడు. బాసగూడెం దగ్గర పెట్రోలింగ్ చేసే పోలీసులపై చేసిన దాడుల్లో బాసగూడెం ఠానా బంకర్‌పై పి.ఎల్.జి.ఎ. దాడిచేసి పోలీసుల్ని మట్టుబెట్టి ఆయుధాలను స్వాధీనం చేసుకుంది. ఈ దాడిలో కా. కిరణ్ డాక్టర్ టీంలో సభ్యునిగా వున్నాడు. ఆ తర్వాత మారేడుబాక వైపు గస్తీకి వచ్చిన పోలీసు బృందంపై చేసిన దాడిలో పాల్గొన్నాడు. కంబాట్ బలగాల్లో, 9వ ప్లాటూన్ సభ్యునిగా గెరిల్లా యుద్ధంలో పాల్గొంటూ క్రమశిక్షణతో మెలిగేవాడు. తోటి కామ్రేడ్స్‌తో, ప్రజలతో కలిసిమెలిసి పని చేసేవాడు. మిలిటరీ స్కిల్స్ నేర్చుకోవడం కోసం పి.టి., డ్రిల్స్‌లో చురుగ్గా వుండేవాడు. శత్రువు అంటే భయంలేని పోరాటతత్వం కామ్రేడ్ కిరణ్‌లో వుండేది. మార్చి 18న గ్రేహౌండ్స్‌తో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలర్పించిన ఎర్రమందారం కామ్రేడ్ కిరణ్. గెరిల్లా యోధుడైన కామ్రేడ్ కిరణ్ కన్న కలల్ని దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా మార్చి నిజం చేద్దాం.

## కామ్రేడ్ మడ్కం బుద్రి

దక్షిణ బస్తర్ డివిజన్‌లోని పామేడ్ ఏరియా గామాపాడు గ్రామంలో మధ్య తరగతి రైతాంగ కుటుంబంలో కామ్రేడ్ బుద్రి 23 సంవత్సరాల క్రితం జన్మించింది. తనకు ఇద్దరు అన్నలు, అక్క వున్నారు. ఇంట్లో తనే చిన్నది. గారాబంగా పెరిగింది. గ్రామ కె.ఎ.ఎం.ఎస్. సంఘంలో సభ్యురాలిగా పని చేస్తూ, మహిళల్ని సంఘటితం చేయడంలోనూ, పితృస్వామ్య కట్టుబాట్లకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలోనూ పాల్గొన్నది. తర్వాత గ్రామ సి.ఎన్.ఎం. టీంకు నాయకురాలిగా పనిచేస్తూ సాంస్కృతిక కార్యకర్తగా పని చేసింది. మార్చి 8 అంతర్‌రాష్ట్రీయ మహిళా

దివస్, జూలై 28 అమరవీరుల స్మృతి దినం, అలాగే వివిధ రాజకీయ, ప్రచార, ఆందోళనల సందర్భంగా జరిగే ప్రజా సభలలో పాట, ఢాక (నృత్యం) చేయడానికి తన బృందానికి నాయకత్వం వహిస్తూ, ప్రజల హృదయాల్లో నిలిచేది. గ్రామాల్లో ప్రచార క్యాంపెయిన్‌కు వెళ్లేది. కామ్రేడ్ బుద్రి 2005 సెప్టెంబర్‌లో పూర్తికాలం కార్యకర్తగా దళంలో భర్తీ అయ్యింది. పార్టీ అవసరాలు చూసి ఎల్‌జిఎస్‌లో సభ్యురాలిగా బాధ్యతలు ఇచ్చారు. తను సి.ఎన్.ఎం. రంగంలో పని చేసినప్పటికీ, కంబాట్ బలగాల్లో పని చేయడానికి వుత్సాహంగా వెళ్లింది. గ్రౌండ్‌లో ఎక్సర్‌సైజులు చేయడం, డ్రిల్స్ చేయడంలో చురుగ్గా పాల్గొని మిలిటరీ స్కిల్స్ నేర్చుకునేందుకు శ్రద్ధ పెట్టి పని చేసేది. తన రాజకీయ చైతన్యాన్ని పెంచుకునేది. కామ్రేడ్ బుద్రిని పి.ఎల్.జి.ఎ.లోకి బదిలీ చేసిన తర్వాత పార్టీ సభ్యురాలిగా బ్రాంచి సమావేశాలలో క్రమశిక్షణ వుల్లంఘించిన సభ్యులపై సూటిగా విమర్శలు పెట్టేది. ప్రతిఘటనలో దృఢంగా నిలిచేది. విరామ సమయంలో పాటలు పాడి గెరిల్లాలకు ఉత్సాహం కల్గించేది. నవ్వు ముఖంతోటి కామ్రేడ్స్‌తో కలిసిపోయే మెత్తని మనసు కామ్రేడ్ బుద్రిది.

కా. బుద్రి మార్చి 18న జరిగిన ఎన్‌కౌంటర్‌లో నేలకొరిగింది. ప్రజల కోసం ప్రాణాలు అర్పించింది. తన మాట, పాట, గొంతు, కాలు సవ్వడి, తన ఆదర్శాలు ప్రజల మనసుల్లో పదిలంగా వుంటాయి. కామ్రేడ్ బుద్రి ఆశయాలను పరిపూర్తి చేద్దాం.

## కామ్రేడ్ ముచాకి మూఖా

దక్షిణ బస్తర్ డివిజన్‌లోని బీజాపూర్ జిల్లా పామేడ్ ఏరియాకు చెందిన టేకుమెట్ల గ్రామంలో కామ్రేడ్ ముచాకి మూఖా జన్మించాడు. వయస్సు 20 సంవత్సరాలు. పేద కుటుంబంలో పుట్టిన మూఖా వ్యవసాయ పనుల్లో తన తల్లిదండ్రులతోపాటు పాల్గొనేవాడు. కష్టపడి పనిచేసేవాడు. చిన్నప్పటి నుంచి బాలల సంఘంలో పని చేశాడు. పెరిగి పెద్దవాడై గ్రామ మిలీషియాలో సభ్యుడై ప్రజల రక్షణకు గ్రామంలో సెంట్రీ చేయడం, పెత్తందార్లను అణచడంలో పాలుపంచుకునేవాడు. 2006లో ఊసూర్ ఏరియాలో శత్రువు తలపెట్టిన క్రూర పాశవిక దమనకాండ అయిన సల్వాజుడుం అభియాన్‌లో పోలీసులు, గూండాలు టేకుమట్ల గ్రామంపై దాడి చేసి గ్రామాన్ని కాలబెట్టి, ప్రజల ఆస్తుల్ని ధ్వంసం చేశారు. కోళ్లను, మేకల్ని తిన్నారు. తన గ్రామంలో పెత్తందారైన ఊరాల్ సల్వాజుడుంలో కలిసి గ్రామంపై దాడులు చేయించాడు. ఇతన్ని పట్టుకొని నిర్మూలించడంలో కామ్రేడ్ మూఖా చురుగ్గా పాల్గొన్నాడు. టేకుమట్ల గ్రామంపై ఎస్.పి.ఒ.లు, సి.ఆర్.పి.ఎఫ్. బలగాలు సంయుక్తంగా దాడి చేసినప్పుడు గ్రామంలోని కొందరు ప్రజలు శత్రువుకు దొరికారు. అందులో కామ్రేడ్ మూఖా పట్టుబడి, రాహత్ శిబిరంలో తీవ్ర చిత్రహింసలకు గురిచేయబడ్డాడు. అయినప్పటికీ పార్టీ రహస్యాలు చెప్పకుండా ఐదు రోజుల తర్వాత శత్రు శిబిరంలోని బలహీనతల్ని గమనించి అక్కడి నుండి తప్పించుకొని వచ్చి మిలీషియాతో కలిసి ప్రతిఘటనలో పాల్గొన్నాడు. తనను, ప్రజల్ని చిత్రహింసలకు గురిచేసిన జుడుం గూండాలపై, పోలీసులపై దాడులు చేయాలనే వర్గ కసిని పెంచుకున్నాడు. కామ్రేడ్ మూఖా 2006 మధ్యలో దళంలోకి భర్తీ అయ్యాడు. కొన్ని రోజులు ఎల్.ఒ.ఎస్.లో సభ్యుడిగా వుండి, ఆ తర్వాత 9వ ప్లాటూన్‌లో సభ్యునిగా బదిలీ అయ్యాడు. తను ఇంటివద్ద చదువుకోలేదు. అందుకని ప్లాటూన్‌లో ప్రతిరోజు చదువుకోవటం, కంబాట్ స్కిల్స్ శ్రద్ధగా నేర్చుకోవడం చేసేవాడు. మార్చి 18న శత్రువు దొంగచాటుగా పన్నిన వలలో చిక్కుకొని, చివరి వరకూ శత్రువుతో పోరాడుతూ నేలకొరిగాడు. కామ్రేడ్ మూఖా జీవితం యువతకు ఆదర్శం. అతని కలలను నిజం చేద్దాం.

## కామ్రేడ్ రవ్వ సన్ని

కామ్రేడ్ రవ్వ సన్ని బీజాపూర్ జిల్లా ఊసురు బ్లాక్, పామేడ్ స్టేషన్ పరిధిలోని ఎర్రపాడు గ్రామంలో పుట్టి పెరిగింది. బాలల సంఘంలో వుంటూ చిన్నప్పటి నుండే పార్టీతో అనుబంధం పెంచుకుంది. బాలల సంఘం నుండి మిలీషియాలో కొంత కాలం పనిచేసి ఆ తర్వాత మిలీషియాకు డిప్యూటీ కమాండర్‌గా ఎదిగింది.

గ్రామంలో సెంట్రీల ఏర్పాటు, శత్రువు ఆచూకీ తెల్సుకోవడం, మిలీషియా శిక్షణలో పాల్గొనడం, దళానికి, పార్టీకి అవసరమైన పనులు చేసిపెట్టడం, ప్రతిఘటన సమయాల్లో అందరితో పాటుగా పాల్గొనడం చేసేది. తల్లిదండ్రులు తమ బిడ్డ తమకు దక్కకుండా పార్టీలోకి వెళుతుందని అర్థం చేసుకొని పెళ్లి చేయాలనుకున్నారు. కానీ కామ్రేడ్ సన్ని వారి ప్రతిపాదనను తిరస్కరించి పార్టీలోకి వెళ్తాననీ, పని చేస్తానని స్పష్టంగా చెప్పింది.

దళం వచ్చినప్పుడు తను పూర్తికాలం పార్టీలోకి వస్తానని చెప్పగా పార్టీ గ్రామ సర్కార్‌లో చర్చించి, 2007 మార్చిలో పామేడ్ ఎల్.ఒ.ఎస్.లోకి రిక్రూట్ చేసుకుంది. కామ్రేడ్ సన్ని వచ్చిన ఒక సంవత్సర కాలంలోనే దళ క్రమశిక్షణను, పద్ధతులను, చదువును నేర్చుకుంటూ అభివృద్ధి అవుతున్న కామ్రేడ్.

కంచాల్ దాడిలో తను ఎ సెక్షన్‌లో వుండి గ్రేహౌండ్స్‌తో పోరాడుతూ వెనక్కి ఏమాత్రం వెళ్లకుండా కమాండర్

చూయించిన కవర్‌లో వుంటూ పోరాడి నేలకొరిగిన చిన్నారి ముద్దుబిడ్డ మన కామ్రేడ్ సన్ని. ఈ మిలీషియా వారసురాలి త్యాగాన్ని ఎత్తిపడుదాం.

## కామ్రేడ్ పూనెం జోగి



దక్షిణ బస్తర్ డివిజన్‌లోని పామేడ్ ఏరియా గూడెం గ్రామంలో 18 సంవత్సరాల క్రితం కామ్రేడ్ జోగి జన్మించింది.

ఈ గ్రామం బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ పరిధిలోని గ్రామం. తన తండ్రి పూనెం చన్ను డి.ఎ.కె.ఎం.ఎస్. రేంజి కమిటీ నాయకుడిగా పనిచేశాడు. చిన్నప్పటి నుండి విప్లవ వాతావరణంలో, వుద్యమ ప్రభావంలో వున్న కామ్రేడ్ జోగి చిన్ననాటి నుండే బాలల సంఘంలో పని చేసింది.

చిన్నప్పటి నుండే పి.ఎల్.జి.ఎ.లో భర్తీ అయ్యి, గెరిల్లాగా పని చేయాలనే ఆలోచించేది. అందుకని మిలీషియాలో సభ్యురాలిగా చేరి సెంట్రీ చేయడం, శత్రు అనుపానులు తెలుసుకోవడం కోసం పెట్రోలింగ్ చేయడం, ప్రతిఘటనలో చురుగ్గా పాల్గొనేది. దళంలో భర్తీ అయిన పిదప పామేడ్ ఎ.సి, కామ్రేడ్ జోగిని 9వ ప్లాటూన్‌కు బదిలీ చేసింది. గెరిల్లా యుద్ధంలో కంబాట్ బలగాలలో పని చేయడానికి సంతోషంగా బదిలీని స్వీకరించి తన చైతన్యాన్ని పెంచుకుంటూ పని చేసింది. శత్రువు అంటే భయపడకుండా ప్రతిఘటనలో పాల్గొనేది. కంచాల్ దాడిలో ఆఖరి శ్వాస వరకు పోరాడి నేలకొరిగింది. లేత వయస్సులోనే ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన విప్లవ యోధురాలు కామ్రేడ్ జోగి.

## కామ్రేడ్ బాయి అమర్‌హై!

21 సంవత్సరాల వయస్సు గల కామ్రేడ్ బాయి దంతెవాడ జిల్లా, కుంట తాలూకా, జేగురుగొండ రేంజి, రాయిగూడెం గ్రామంలో జన్మించింది. ఆదివాసీ దొర్ల కుటుంబంలో పేద వర్గంలో పుట్టింది. ఈమె తండ్రి వూరి సంఘంలో పని చేయడం, అన్న దళంలోకి రావడం, సి.ఎన్.ఎం. పాటలు వినడం ఆ ఏరియాలోనూ, గ్రామంలోనూ పార్టీ చేపట్టిన అనేక ఆర్థిక, రాజకీయ, సామాజిక పోరాటాల్లో పాల్గొనడం... వీటన్నింటితో ప్రేరణపొంది చిన్న వయస్సులోనే పార్టీలోకి వచ్చింది.

తన వయస్సుతోపాటుగా పార్టీపై, వర్గ రాజకీయాలపై నమ్మకాన్ని పెంచుకుంటూ 2006 అక్టోబర్‌లో పామేడ్ దళంలోకి రిక్రూట్ అయ్యింది. పార్టీలోకి వచ్చిన తర్వాత మిలిటరీ శిక్షణ పొందుతూ ఎల్లప్పుడూ వుత్సాహంగా అన్ని పనుల్లోనూ పాలుపంచుకునేది. కామ్రేడ్ బాయి చురుకుదనాన్ని గమనించిన ఏరియా కమిటీ ఈ కామ్రేడ్‌ను 9వ ప్లాటూన్‌లోకి బదిలీ చేసింది. ప్లాటూన్‌లో తనకు ఇచ్చిన బాధ్యతను పట్టుదలతో నిర్వహించేది. తన అన్న పార్టీ నుండి ఇంటికి వెళ్లిపోయినప్పుడు అన్నను విమర్శిస్తూ పార్టీ, ప్రజల పట్ల నమ్మకంతో తాను వుద్యమంలోనే కొనసాగుతానని స్పష్టం చేసింది. కామ్రేడ్ బాయి 2007లో పార్టీ సభ్యత్వాన్ని పొందింది.

2008 మార్చి 18 నాడు కంచాల్‌లో జరిగిన కోవర్ట్ ఆపరేషన్‌లో కా. బాయి తన సెక్షన్‌లోనే వుండి కవర్ తీసుకొని ఫైరింగ్ చేస్తూ ఒక్క అడుగు వెనక్కి వేయకుండా చివరి వరకూ పోరాడి నేలకొరిగింది. పేద వర్గం నుండి వచ్చి ప్రజాయుద్ధంలో పేదల రాజ్యంకై కలలుగంటూ అమరురాలైన కామ్రేడ్ బాయి ఆశయాలను కొనసాగిద్దాం.

## కామ్రేడ్ కారామి ఉంగాల్‌కు కళాంజలి

బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ బట్టుం గ్రామంలో కామ్రేడ్ కారామి ఉంగాల్ పుట్టి పెరిగాడు. ఆదివాసీ కుటుంబమే అయినా కమ్మరి (కొలసనోరు) పనులు చేస్తూ జీవించేవాడు. కత్తులు, కొడీలు తయారు చేయటంలో నేర్పరి. వయస్సు 23 సంవత్సరాలు వుంటుంది. భార్య, ఒక కూతురును ఒదిలిపెట్టి 2006 సెప్టెంబర్‌లో పార్టీలోకి రిక్రూట్ అయ్యాడు.

కామ్రేడ్ ఉంగాల్ కుటుంబం ముందుగా జేగురుగొండకు ఒక కిలోమీటర్ దూరంలోని కమ్మర్‌గూడెం అనే వూరిలో బతికేది. భూమి సరిపోక బట్టుం గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. చిన్న వయస్సు నుండే బాలల సంఘంలో పనిచేశాడు. పెరుగుతున్న వయస్సుతో సి.ఎన్.ఎం. సభ్యునిగా మారి పంచాయితీ స్థాయిలో సి.ఎన్.ఎం. కార్యక్రమాలు ఇచ్చాడు. పాటలు, ఢాకలు, సాంస్కృతిక శిక్షణ వగైరా నేర్చుకున్నాడు. క్రమశిక్షణగా వుంటూ ప్రజల్లోకి విస్తృతంగా చొచ్చుకుపోయాడు. ఊసూర్ ఎల్.ఒ.ఎస్. ఏరియాలో సి.ఎన్.ఎం. బాధ్యతలు చూసేందుకు కామ్రేడ్ ఉంగాల్‌ను బదిలీ చేయడంతో తన బాధ్యతను స్వీకరించి తీవ్ర నిర్బంధంలో కూడా అన్ని గ్రామాలు తిరుగుతూ ప్రజల్లో ఒకడైనాడు. తన తోటి సభ్యులతోనూ, ప్రజల్లోనూ కామ్రేడ్ ఉంగాల్ ఎంతో ఆదరణ పొందాడు.

పార్టీలోకి వచ్చిన తర్వాత చదువు నేర్చుకొని రాజకీయాలను

అర్థం చేసుకోవడం, సాంస్కృతిక రంగంలో సాధిస్తున్న అభివృద్ధిని చూసి పామేడ్ ఎ.సి ఇతన్ని 2007 అక్టోబర్‌లో జరిగిన కాన్ఫరెన్స్‌లో ఏరియా సి.ఎన్.ఎం. కమిటీలోకి ప్రతిపాదించగా, ఏకగ్రీవంగా ఎన్నుకోబడి ఏరియా సి.ఎన్.ఎం. అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించాడు. ఆ తర్వాత డివిజన్ సి.ఎన్.ఎం. మహాసభలో డివిజన్ సి.ఎన్.ఎం. కమిటీ సభ్యునిగా కూడా ఎన్నుకోబడినాడు.

సల్వాజుడుం నిర్బంధం, గ్రేహౌండ్స్ దొంగ దాడులకు వ్యతిరేకంగా సాంస్కృతిక ప్రచారం చేస్తూ ప్రజల్లో చైతన్యాన్ని పెంచే విధంగా పాటలు, నృత్య నాటికలను ప్రదర్శించేవాడు. గ్రామాల్లోని సి.ఎన్.ఎం.ను, ఏరియా సి.ఎన్.ఎం.ను అభివృద్ధి చేయడంలోనూ, ఫంక్షనింగ్ చేయించడంలోనూ చాలా కృషి చేసేవాడు. శత్రువు వచ్చాడని తెలిస్తే ప్రతిఘటనలోనూ పాల్గొనేవాడు. ఇలా ఒక పేద వర్గం నుండి వచ్చి, ఆ వర్గపోరాటాన్ని అర్థం చేసుకొని దానికి అనుగుణంగా సి.ఎన్.ఎంను, ప్రజలను చైతన్యపరుస్తూ కష్టపడి పనిచేసే కార్మికవర్గ పుత్రునిగా, ఒక కళాకారునిగా కామ్రేడ్ ఉంగాల్‌ను ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారు.

2008, మార్చి 18న తన కార్యక్రమంలో భాగంగా కంచాల్ గ్రామంలో వుండి, 9వ ప్లాటూన్‌తో కలిసి ఎ.పి. గ్రేహౌండ్స్‌ని ప్రతిఘటించేందుకు తయారై వెళ్లాడు. ఆ పోరాటంలో అమరుడైనాడు. యువ కళాకారుడు, కార్మికవర్గ పుత్రునికి కళాభివందనాలతో జోహార్లు అర్పిద్దాం. ఆ అమరవీరుని ఆశయాలను కొనసాగిద్దాం.

## కామ్రేడ్ కోవాసి విమలకు జోహార్లు

పశ్చిమ బస్తర్ డివిజన్ బీజాపూర్ జిల్లా, భైరాంగఢ్ బ్లాక్ జాంగ్లా గ్రామంలో కామ్రేడ్ విమల పుట్టింది. విమల చిన్న వయసులో వున్నప్పుడే ఆమె తల్లి అనారోగ్యంతో చనిపోయింది. ఒక తమ్ముడు, తండ్రి, తను మాత్రమే కుటుంబంలో మిగిలారు. తల్లిలేని పిల్ల అయినా చిన్న వయస్సు నుండే తన తమ్మునికి, తండ్రికి తనే తల్లి అయి అన్ని పనులు కష్టపడి చేసేది. చిన్న వయస్సులోనే కష్టాలలో పెరిగిన విమలకు పార్టీ పరిచయంతో ఎంతో ధైర్యం వచ్చింది. కె.ఎ.ఎం.ఎస్. సంఘంలో సభ్యురాలిగా చేరి సంఘ కార్యకలాపాల్లో పాల్గొనేది.

2005లో సల్వాజుడుం ప్రారంభం కాగానే గ్రామస్థులు మొత్తం గ్రామాన్ని ఖాళీ చేసి అడవిలో రక్షణ తీసుకున్నారు. అందులో విమల కుటుంబం కూడా వుంది. శత్రు దాడుల్ని తట్టుకోలేక కొన్ని కుటుంబాలు జుడూం శిబిరాలకు వెళ్లగా కామ్రేడ్ విమల కుటుంబం మాత్రం దాన్ని వ్యతిరేకిస్తూ సంఘంతో కల్సి మిలీషియా ప్రతిఘటనలో పి.ఎల్.జి.ఎ.కి వేగురాలిగా పాల్గొంది. ఆ తర్వాత 2006 జనవరిలో పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా వచ్చింది.

2007లో కామ్రేడ్ విమల దక్షిణ బస్తర్ డివిజన్‌లోని పామేడ్ ఏరియా కమిటీ కింద పనిచేస్తూ రాజకీయాలు, చదువు నేర్చుకుంటూ కష్టపడి పని చేసేది. 2007లో పార్టీ సభ్యత్వం తీసుకొని తన ఆచరణను ఇంకా అభివృద్ధి చేసుకుంటూ ఎదిగి వస్తున్న కామ్రేడ్ విమల పామేడ్ ఎల్.ఒ.ఎస్. దళ సభ్యురాలిగా ఏరియాలో అందరికీ సహకరించేది. ప్రజల్లోనూ కల్సి వారి కష్టసుఖాలను అర్థం చేసుకొని సమావేశాల్లో వాటి గురించి చర్చించేది.

పెరిగిన నిర్బంధంతో తండ్రి, తమ్ముడు జాంగ్లా శిబిరంలో తలదాచుకున్నారు. 2007 ఫిబ్రవరిలో తండ్రిని, తమ్ముడిని శిబిరం నుండి పిలిపించుకొని ఒక గంట మాత్రమే మాట్లాడుకొని విడిపోయి వచ్చింది. తన కుటుంబం లాంటి ఎన్నో కుటుంబాల బాధల్ని అర్థం చేసుకొన్న విమల శత్రువుపై కసిని పెంచుకుంది. ప్రజల జీవితాలను అల్లకల్లోలం చేసిన జుడుంను ఓడించే ప్రతి ప్రతిఘటనకు సిద్ధమయ్యేది.

2008, మార్చి 18 నాడు కంచాల్‌లో తన దళాన్ని కలిసేందుకు వెళ్లగా ఎ.పి. గ్రేహౌండ్స్ వచ్చి దాడి చేశారు. సివిల్‌లో వున్న కామ్రేడ్ విమలను గ్రేహౌండ్స్ మూకలు పట్టుకొని డ్రెస్ తొడిగించి చిత్రహింసలు పెట్టినా శత్రువుకు భయపడలేదు, లొంగిపోలేదు. దానితో శత్రువు పాశవికంగా ఆమెను కాల్చి చంపారు. ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన కామ్రేడ్ విమల వయస్సు 21 సంవత్సరాలు మాత్రమే. పేద ప్రజల కోసం నేలకొరిగిన కామ్రేడ్ విమల చిరస్మరణీయురాలు.

## కామ్రేడ్ రాంసూ అమర్‌హై!

కామ్రేడ్ రాంసూ బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ రేంగమ్ గ్రామంలో పుట్టి పెరిగాడు. కామ్రేడ్ రాంసూ వయస్సు 20 సంవత్సరాలు. పేద గొల్ల (రావూత్) కుటుంబంలో పుట్టాడు. వ్యవసాయం చేసుకొని బతికే కుటుంబం వీరిది. చిన్న వయస్సులోనే బాలల సంఘంలో వుంటూ పార్టీతో అనుబంధం ఏర్పర్చుకున్నాడు. పని చేసుకుంటూ, పశువులను మేపుకుంటూ పాటలు పాడటం, పిల్లలకు నేర్పడం చేసేవాడు. 16 సంవత్సరాల వయస్సులో మిలీషియాలో సభ్యునిగా చేరాడు. శత్రువును ప్రతిఘటించేందుకు ఇచ్చే మిలిటరీ శిక్షణలో వుత్సాహంగా పాల్గొని

నేర్చుకునేవాడు. 2007 జనవరిలో దళంలోకి భర్తీ అయ్యాడు.

పామేడ్ ఏరియా కమిటీ కామ్రేడ్ రాంసూను అదే ఏరియాలోని 9వ ప్లాటూన్‌లోకి బదిలీ చేసింది. ప్లాటూన్‌లోను వుత్సాహంగా అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ క్రమశిక్షణతో మెలిగేవాడు. పోలీసులు టేకుమెట్ల అనే గ్రామానికి ఒక రాత్రి వచ్చి ఆగిన సమయంలో వారిని ప్రతిఘటించేందుకు ప్లాటూన్‌తో పాటు తాను కూడా ఆ ప్రతిఘటనలో పాల్గొన్నాడు. 2008 మార్చి 18 నాడు కంచాల్‌లో తన ప్లాటూన్‌తోపాటు గ్రేహౌండ్స్ బలగాల్ని ఎదుర్కొంటూ తన ప్రాణాలు ధారపోశాడు. తన వర్గ ప్రజారాజ్యాధికారానికై పోరాటమే మార్గం అని నమ్మి, ఆ వున్నతాశయం కోసం త్యాగాల బాటలో నడిచి ప్రాణాలర్పించిన కామ్రేడ్ రాంసూ ఆశయ పరిపూర్తికై పోరాడుదాం.

## కామ్రేడ్ కర్‌టామ్ అడ్మాల్

బీజాపూర్ జిల్లా వూసూర్ బ్లాక్, పామేడ్ స్టేషన్ పరిధిలో కంచాల్ గ్రామంలో కర్‌టమ్ అడ్మాల్ ఆదివాసీ ధనిక రైతు. వ్యవసాయం చేసుకొని బతికే కుటుంబం వీరిది. పార్టీతో, ప్రజలతో కలిసిమెలిసి వుండేవాడు. వయస్సు 34 సంవత్సరాలు. 2008 మార్చి 18న గ్రేహౌండ్స్ మూకలు కోవర్టుల ఇన్‌ఫర్మేషన్‌తో ఇతన్ని అదే గ్రామంలో పట్టుకొని గెరిల్లా డ్రెస్ తొడిగించి కాల్చి చంపి నక్సలైట్ అని చెప్పి ఎన్‌కౌంటర్ కథ అల్లాయి.

ప్రజాయుద్ధం నడుస్తున్న చోట శత్రువు అమలు జరిపే క్రూరత్వం ఫలితంగా ప్రతి పౌరుడు ఒక గెరిల్లాగా మారక తప్పదు. సాధారణ రైతు అయిన కామ్రేడ్ కర్‌టమ్ అడ్మాల్ అలా ప్రజల కోసం ప్రజాయుద్ధంలో తన ప్రాణాలను అర్పించి చిరస్మరణీయుడైనాడు.

## కామ్రేడ్ మాడివి మాడాల్

40 ఏళ్ల వయస్సున్న కామ్రేడ్ మాడివి మాడాల్ పామేడ్ ఏరియా కంచాల్ గ్రామస్తుడు. ఇతనికి భార్య, ఇద్దరు కూతుళ్లు వున్నారు. వ్యవసాయం చేసుకుంటూ డి.ఎ.కె.ఎం.ఎస్. సంఘ కమిటీలో పని చేసేవాడు. దళం గ్రామానికి వచ్చినప్పుడు అన్నం, నీళ్లు వంటివి ఏర్పాటు చేయడంలో చురుగ్గా పాల్గొనేవాడు. గ్రామంలో జరిగే ప్రజా సభలకు, జూలై 28 లాంటి అమరవీరుల సభలకు ప్రజల్ని కదిలించడంలో చురుగ్గా పాల్గొనేవాడు. ఇల్లు, కుటుంబ పోషణే కాకుండా పార్టీ ఏ పని అప్పజెప్పినా చేసేవాడు. వుద్యమంలో పాల్గొనేవాడు. ఆంధ్ర గ్రేహౌండ్స్ కుక్కలు గ్రామంలో వున్న కోవర్టు ద్రోహులు ఇచ్చిన సమాచారంతో మాడాల్‌ని నిరాయుధంగా పట్టుకొని కాల్చిచంపి ఎన్‌కౌంటర్ కథ అల్లారు. కామ్రేడ్ మాడాల్ ప్రజల కోసం ప్రాణాలర్పించిన అమరజీవి.

## కామ్రేడ్ సల్వమ్ లచ్చి యాయో (అవ్వ)కు జోహార్లు

బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్ పామేడ్ ఏరియా పాలగూడెం గ్రామంలో 60 సంవత్సరాల ముసలి అమ్మ కొడుకుల దగ్గర బతుకుతూ చేతనైన పని చేస్తూ వాళ్లకు సహకరించేది. తన కొడుకులు సంఘంలో పనిచేస్తే తను ఎప్పుడూ కాదనేది కాదు. మధ్య తరగతి వర్గం కావడంతో మనం చేపట్టే పోరాటాల్లోనూ తను సహకరించేది. ఈమె ఒక సాధారణ వృద్ధ మహిళ.

మార్చిలో ఆదివాసీ ప్రజలు గడ్డి కోయడం చేస్తారు. ఆ పనిలో భాగంగా కొడలితోపాటు గడ్డి కోయడానికి వెళ్లి పొంచి వున్న గ్రేహౌండ్స్ మూకలను చూడలేదు. అమాయకంగా తన పని తాను చేసుకుంటోంది. ఒక్కసారిగా ఆటో ఫైరింగ్‌ల చప్పుడు రావడంతో పాలుపోక, పరుగెత్తలేక పోలీసుల వలయంలో చిక్కుకుంది. అదే అదనుగా రక్తం మరిగిన ఎ.పి. గ్రేహౌండ్స్ పోలీసులు అవ్వను పట్టుకొని గెరిల్లాల డ్రెస్ తొడిగించి, తుపాకీ చేతికిచ్చి పరుగెత్తమని చెప్పి ఫోటో తీసుకొని కాల్చి చంపి నక్సలైట్ అని ప్రకటించారు.

ఇలాంటి అమాయక వృద్ధురాళ్లు - వృద్ధులు ఎందరో ఈ ఫాసిస్టు దమనకాండలో పేద ప్రజల కోసం ప్రజాయుద్ధంలో ప్రాణాలు ఇస్తున్నారు. ఆ వృద్ధులందరిదీ ఒకే లక్ష్యం - పేదల న్యాయమైన పోరాటాలు గెలవాలనేదే. వారి ఆశయాలను పూరించడమే మనం ఆ అవ్వకు అర్పించే నిజమైన నివాళి.

## *'నయాగఢ్' అమరులకు ఎర్రెర్రని జోహార్లు*

*చారిత్రాత్మక నయాగఢ్ దాడిని విజయవంతం చేయడంలో భాగంగా కామ్రేడ్స్ కమల, రాంబత్తి, ఇక్బాల్, అర్జున్‌లు అమరులయ్యారు. వీరిలో కామ్రేడ్ కమల దాడి సన్నాహాల్లో భాగంగా బాశధార డివిజన్‌కు వెళ్లినపుడు డిసెంబర్ 18న జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరురాలయింది. దాడి విజయవంతం అయిన తర్వాత గోసామా పర్వత ప్రాంతంలో హోరా హోరీగా తలపడి ఎన్.ఒ.జి. పోలీసులను తరిమికొట్టిన పోరులో వీరోచితంగా పోరాడుతూ కామ్రేడ్స్ రాంబత్తి, ఇక్బాల్‌లు అమరులయ్యారు. నయాగఢ్ విజయ విశేషాలనూ, ఆయుధాలనూ మోసుకొని డి.కె.కు వెళ్తున్న క్రమంలో నదిలో ప్రయాణిస్తున్నప్పుడు పడవ మునిగి కామ్రేడ్ అర్జున్ అమరుడయ్యాడు. ఈ నల్గురు కామ్రేడ్సూ దండకారణ్యం పోరు*

*బిడ్డలు. రాష్ట్ర సరిహద్దులను దాటి దండకారణ్యపు ప్రతిఘటన విస్తరిస్తున్న విషయాన్ని ఈ నల్గురు కామ్రేడ్స్ తమ అమరత్వపు సాక్షిగా సగర్వంగా చాటిచెప్పారు. శత్రు గుండెల్లో ప్రకంపనలు సృష్టించిన చారిత్రాత్మక, సాహసిక నయాగఢ్ దాడికి ఊపిరులిచ్చిన వీరి అమరత్వానికి వినమ్రంగా తలవంచి జోహార్లర్పిద్దాం. వారి అమరత్వాన్ని ఎత్తిపడుదాం. వాళ్ల ఆశయాల బాటలో మరెన్నో 'నయాగఢ్'లను విజయవంతం చేద్దాం.*

## కామ్రేడ్ కమల



2007, డిసెంబర్ 18వ తేదీన ఒడిస్సా రాష్ట్రం బాశధర డివిజన్‌లోని గుడారి సమీపంలో నీర్‌పల్లి వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో కామ్రేడ్ కమల అమరురాలయింది. అమరత్వం నాటికి ఆమె దండకారణ్యంలోని 6వ ప్లటూన్‌లో సెక్షన్ కమాండర్ బాధ్యతలను నిర్వహిస్తూ వుండింది. నయాగఢ్ దాడి అవసరాల కోసం ఆమె ఒడిస్సా రాష్ట్రానికి వెళ్లి, అక్కడే అమరురాలయింది.

కామ్రేడ్ కమల దండకారణ్యంలోని ఇంద్రావతి నదీ తీరాన వున్న డుంగ గ్రామంలో ఒక మధ్యతరగతి ఆదివాసీ రైతు కుటుంబంలో 24 సంవత్సరాల క్రితం పుట్టింది. తల్లిదండ్రులు ఆమెకు మంగ్లో అని పేరు పెట్టుకున్నారు. గ్రామంలో వున్న ప్రభుత్వ పాఠశాలలో ఆమె 8వ తరగతి వరకూ చదువుకుంది.

ఆదివాసీ మహిళల విముక్తి కోసం తమ గ్రామంలో ఏర్పడిన క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్‌లో కా. కమల సభ్యురాలయింది. క్రమంగా తన కార్యాచరణను విస్తృత పరుచుకుంటూ సంఘం ఉపాధ్యక్షురాలయింది. త్వరలోనే సాయుధ విప్లవం ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని గుర్తించి 2000లో పూర్తికాలం విప్లవకారిణిగా మారింది. ప్రజలను సంఘటితపర్చడంలో చురుకైన పాత్ర వహించింది. ఈ క్రమంలో 2001లో పార్టీ సభ్యురాలైంది. ఆ తర్వాత 2002లో పార్టీ ఆమెను వైద్య విభాగానికి బదిలీ చేస్తూ తీర్మానం చేసింది. మొదట కామ్రేడ్ కమల ఆ తీర్మానాన్ని ఒప్పుకోలేదు. కానీ చైనా లాంగ్‌మార్చ్ కథలు చదివాక తన తప్పును గ్రహించింది. వెంటనే స్వయం విమర్శ చేసుకుంటూ, తీర్మానాన్ని ఆమోదిస్తూ పార్టీకి ఉత్తరం రాసింది. ఆ తర్వాత డాక్టర్ టీంలో వుంటూ రాత్రింబగళ్లు రోగులకు సేవ చేసింది.

2004లో కా. కమల ప్లటూన్‌కు బదిలీ అయింది. ప్లటూన్లో డాక్టర్‌గా వుంటూ టీచర్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తించింది. తోటి కామ్రేడ్స్‌తోనూ, ప్రజలతోనూ అత్యంత ఆత్మీయంగా వ్యవహరించేది.

క్రూరమైన సల్వాజుడూం అభియాన్‌లో భాగంగా పోలీసులూ, గూండాలు కామ్రేడ్ కమల సొంత గ్రామాన్ని తగలబెట్టారు. అందులో భాగంగా కామ్రేడ్ కమల తల్లిదండ్రుల ఇంటిని కూడా కాలబెట్టారు. ఆ సమయంలో కా. కమల కమ్యూనిస్ట్ దృఢత్వంతో తల్లిదండ్రులకు ధైర్యం చెప్పింది. అలాగే 2006 జనవరి నుండి జూన్ వరకు జరిగిన సల్వాజుడూం వ్యతిరేక ప్రతిఘటనలో చురుగ్గా పాల్గొంది. సల్వాజుడూం గూండాలను అంతం చేయడంలో ముందు వుంది. వందలాది మందికి నాయకత్వం వహిస్తూ నూంగుర్, బక్కా, పేంట గ్రామాలకు చెందిన ఎస్.పి.ఒ.లనూ, ఉద్యమ నిరోధకులను శిక్షించింది.

2007లో నయాగఢ్ దాడి కోసం ఎ.ఒ.బి. వెళ్లాలని పార్టీ నిర్ణయించినప్పుడు, ఆమె చాలా సంతోషంగా వెళ్లింది. ఇతర రాష్ట్రం, కొత్త భాష, పరిచయంలేని ప్రజలు, సంస్కృతి... ఇలా ఏ విషయానికి సంబంధించీ ఆమె వెనుకాముందాడలేదు. ఆమె ఆలోచనలు ఎప్పుడూ చైతన్యపూరితంగా వుండేవి.

ఎ.ఒ.బి.కి వెళ్లిన తర్వాత తన ఆచరణ ద్వారా కామ్రేడ్ కమల అక్కడి నాయకత్వ, శ్రేణుల, ప్రజల అభిమానాన్ని, విశ్వాసాన్ని చూరగొని అందరి మనస్సుల్లోనూ చెరిగిపోని ముద్రను వేసుకుంది. తన కర్తవ్య నిర్వహణలో నిమగ్నమై అమరురాలయింది.

కామ్రేడ్ కమల డి.కె., ఎ.ఒ.బి. ఉద్యమ స్మృతుల్లో చిరకాలం సజీవంగా వుంటుంది. ఆమె అందించిన స్ఫూర్తి కొనసాగుతూనే వుంటుంది.

## కామ్రేడ్ రాంబత్తి

పశ్చిమ బస్తర్, తోయ్‌నార్ గ్రామంలో మధ్య తరగతి కుటుంబంలో కా. రాంబత్తి పుట్టింది. తన అన్న పోలీసులలో వున్నప్పటికీ తను విప్లవోద్యమానికి అంకితమై పని చేసింది. వుద్యమ అవసరాల రీత్యా కంపెనీతోపాటు వచ్చి మల్కన్‌గిరిలో ఒక సంవత్సరం పాటు పని చేసింది. కంపెనీలో పార్టీ సభ్యురాలిగా పని చేస్తూ నయాగఢ్ దాడిలో పాల్గొని, రిట్రీట్ అయి వస్తున్న క్రమంలో, గోసామ పర్వత ప్రాంతంలో పోలీసులను నిలువరిస్తూ, అత్యంత ధైర్య సాహసాలతో పోరాడుతూ తూటా తగిలి

***(తరువాయి 27 వ పేజీలో...)***

# టిబెట్ ప్రజలు తమ భవిష్యత్‌ను తామే నిర్ణయించుకుంటారు

1959 నాటి తిరుగుబాటును గుర్తుచేస్తూ అదే తారీఖున టిబెట్‌లోనూ, భారత్‌లోనూ, ప్రపంచవ్యాప్తంగానూ ఒకేసారి ప్రదర్శనలు, ధ్వంసం కార్యక్రమాలు మొదలయ్యాయి. లాసాలో ఆందోళనకారులు చైనా దుకాణాలపై, చైనా పౌరులు, పోలీసులపై దాడులు చేశారు. వారి వాహనాలకు నిప్పుపెట్టారు. ఈ ఆందోళనపై చైనా ప్రభుత్వం అణచివేతను అమలుజరిపింది. హింస ప్రజ్వరిల్లగానే నగరం చుట్టూ సైన్యాన్ని మోహరించింది. టిబెట్‌లో ఇటీవల ప్రజ్వరిల్లిన ఆందోళనను చైనా అధికారవర్గం క్రూరంగా అణచివేసింది. గత 20 సంవత్సరాల కాలంలో ఇదే పెద్ద ఆందోళన. దీనిలో 80 మంది టిబెట్ పౌరులను చైనా అధికార యంత్రాంగం చంపివేసింది. ప్రదర్శనలు ప్రపంచవ్యాపితంగా ఒకేసారి మొదలయ్యాయి. భారత్‌లోను మొదలయ్యాయి. బీజింగ్ ఒలంపిక్స్ ఆటల ప్రారంభంకు ముందు ఇవి మొదలయ్యాయి. టిబెట్‌లో లామాల నిరంకుశ పాలన కాలంలో, చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం వున్నప్పుడు, టిబెట్ ప్రజలకు స్వేచ్ఛను ఇచ్చింది. వారి సంస్కృతిని కాపాడింది. వారికి స్వతంత్ర ప్రతిపత్తిని ఇచ్చింది. ప్రజాస్వామిక మార్పులను తీసుకొని రావటం కోసం ప్రయత్నించింది. 1952లో చైనా ప్రభుత్వం 17 సూత్రాల ఒప్పందాన్ని చేసుకుంది. నిరంకుశత్వాన్ని రద్దు చేస్తూ, టిబెట్ ప్రజల స్వయం ప్రతిపత్తిని కాపాడుతూ, బౌద్ధ మతాన్ని గౌరవిస్తూ ఆ ఒప్పందాన్ని చేసుకున్నది. 1959లో దలైలామా నాయకత్వంలో భూస్వామ్య శక్తులు, అమెరికా, ఇండియా మద్దతుతో నాటకీయ ఆందోళనలు మొదలయ్యాయి. దీనిని అణచివేసినపుడు దలైలామా తన 80 వేల మంది అనుచరులతో భారత్‌కు పారిపోయి వచ్చాడు. భారత్, అమెరికాలు ఇచ్చిన నిధులతో 'ప్రవాస టిబెట్ ప్రభుత్వాన్ని' ఏర్పరచాడు.

చైనాలో నూతన బూర్జువా వర్గం అధికారాన్ని హస్తగతం చేసుకున్న తర్వాత టిబెట్ ప్రజలను మెజారిటీ 'హాన్' జాతిలో కలిపివేసుకునే ప్రయత్నాలు మొదలయ్యాయి. తామర తంపరగా చైనా ప్రజలు టిబెట్‌లో స్థిరపడి టిబెట్టు ప్రజలను మైనారిటీలుగా మార్చారు. టిబెటన్లు వారి మాతృభూమిలో మైనారిటీలయ్యారు.

1985లో 60 వేల మంది కార్మికులు టిబెట్‌లో స్థిరపడినారు. 1991లో మూడు లక్షల మంది వచ్చి చేరారు.

క్విన్‌హాయి రాష్ట్రంలో, 8 లక్షల మంది టిబెటన్లు వుండగా, 25 లక్షల మంది చైనావారు వున్నారు. నేడు టిబెట్‌ను నడిపిస్తున్న అతను చైనా పౌరుడైన జాంగ్‌జింగ్. అయిఘర్ జాతిని అణచివేసిన చరిత్ర ఇతనికుంది. గతంలో అయిఘర్ జాతి స్వయం ప్రతిపత్తి కోసం చేసిన పోరాటాన్ని అణచివేసినపుడు ఇతను ఒక పారామిలిటరీ బలగానికి అధిపతిగా వున్నాడు.

టిబెట్ ప్రజల స్వయం ప్రతిపత్తిని మనం గౌరవించాలి. అదే సమయంలో అమెరికా ప్రత్యక్షంగానూ, తన ఏజంట్ల (దలైలామా) ద్వారా చేస్తున్న జోక్యందారీ పద్ధతులను తీవ్రంగా ఖండించాలి. ఇంతకు ముందు 1959 కమ్యూనిస్టు పరిపాలనలో భూస్వామ్య శక్తులను కదిలించి దలైలామా నాయకత్వంలో నాటకీయ ఆందోళనను చేసేలా ప్రోత్సహించింది. ఈ శక్తులను వుపయోగించి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని చూసింది. దానిలో భాగంగానే భారత్, అమెరికాలు ఇచ్చిన నిధులతో 'ప్రవాసంలో టిబెట్' ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేలా చేసింది. ఈ శక్తులు కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూశాయి.

1970ల తర్వాత చైనాలో పెట్టుబడిదారీ శక్తులు అధికారానికి వచ్చిన తర్వాత అమెరికా, తన ఏజెంటైన దలైలామా తమ పల్లవిని మార్చారు. ప్రపంచంలో సామ్రాజ్యవాదుల మధ్య మార్కెట్ల కోసం పోటీ తీవ్రమైన నేటి పరిస్థితిలో మరల మరోసారి ఈ పాట వూపందుకుంది. ప్రపంచవ్యాపితంగా మార్కెట్లను చైనా ఆక్రమించుకోవడం, అమెరికా తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో వుండడం వలన ఈ నాటకాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు. అమెరికా దర్శకత్వంలో దలైలామాకు సత్కారాలు మొదలయ్యాయి. మొదట జర్మనీ ఛాన్సలర్, అమెరికా అధ్యక్షుడు, హాలీవుడ్ నటులు డోలు వాయించడం మొదలుపెట్టారు. అమెరికా ప్రజాప్రతినిధుల సభ స్పీకరు భారత్ వచ్చి దలైలామాను కలుసుకున్నాడు. మార్చి 21న ధర్మశాలలో వీరిరువురు కలిశారు. తరువాత భారత ప్రధానమంత్రిని కూడా కలిశాడు. అమెరికా పథకాన్ని టిబెట్‌లో అమలు జరుపటం ప్రారంభించారు. చైనా బూర్జువా వర్గం ఒలంపిక్స్ ఆటల ద్వారా తన వ్యాపారాన్ని పెంచుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించగా, హాలీవుడ్ నటులు ఒలంపిక్స్ క్రీడలను బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

భారత్‌లోని ధర్మశాలలో విదేశీ నిధులతో నడిచే వందల ఎన్.జి.ఒ.లున్నాయి. భారత్ ఎల్లప్పుడూ టిబెట్ కుట్రలను అమలుజరుపుటకు మంచి అనువైన స్థలం. దలైలామాను

# ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్న టి.ఆర్.ఎస్.

తెలంగాణాలో జరిగిన ఉప ఎన్నికల్లో టి.ఆర్.ఎస్ ఘోరంగా దెబ్బతిన్నది. ఈ ఎన్నికలు ఒక రిఫరెండం వంటివని టి.ఆర్.ఎస్ ఎంతగా ప్రచారం చేసినప్పటికీ ఉప ఎన్నికలు జరిగిన 16 అసెంబ్లీ స్థానాల్లో అది సగం స్థానాలను చేజార్చుకుంది. మరో సగం స్థానాలను మాత్రమే నిలబెట్టుకోగల్గింది. అది కోల్పోయిన ఆ స్థానాలను తెలంగాణా వ్యతిరేక పార్టీలైన కాంగ్రెస్, తె.దే.పా.లు చెరో నాలుగు గెల్చుకున్నాయి. టి.ఆర్.ఎస్. పొందిన ఈ పరాజయాన్ని ఆసరా చేసుకొని తెలంగాణా ఆకాంక్ష అంత బలంగా లేదనే పాత వాదనలు మళ్లీ ముందుకొచ్చాయి. ఇక పచ్చి తెలంగాణా వ్యతిరేకి అయిన వై.ఎస్.ఆర్. తన అభివృద్ధి నమూనాను తెలంగాణ ప్రజలు ఆమోదిస్తున్నారని ప్రచారం మొదలుపెట్టాడు. ఇది నిజమేనా? కాకుంటే తెలంగాణా రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యం అని చెప్పుకుంటున్న టి.ఆర్.ఎస్. ఎందుకు ఓడిపోయింది?

దీనికి సమాధానం చెప్పుకోవాలంటే మనం టి.ఆర్.ఎస్. ఇన్నాళ్ల ఆచరణను కొంచెమన్న గుర్తుకు తెచ్చుకోవాలి.

కాంగ్రెస్ పార్టీ పచ్చి తెలంగాణా వ్యతిరేక పార్టీ అన్నది తెలంగాణా ప్రజలందరికీ బాగా తెల్సిన విషయమే. తెలంగాణా సాయుధ పోరాటాన్ని నెత్తుటేరుల్లో ముంచడం, తెలంగాణా ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం, 1968-71 నాటి తెలంగాణా ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేయడం... ఇవన్నీ తెలంగాణ ప్రజల మనసుల్లో నిరంతరం రగిలే విషయాలే. కానీ టిఆర్ఎస్ అటువంటి పార్టీతో కల్సి ప్రత్యేక తెలంగాణ నినాదంతో 2004 ఎన్నికల్లో బరిలోకి దిగింది. ప్రజల్లో కూడా కాంగ్రెస్ తెలంగాణాను ఇస్తుందనే భ్రమలను కల్పించింది. టి.ఆర్.ఎస్. కల్పించిన ఈ భ్రమలకుతోడు చంద్రబాబు నాయుడి ఏడేళ్ల క్రూర పాలన పట్ల ప్రజల్లో ఏర్పడిన వ్యతిరేకత వల్ల కూడా కాంగ్రెస్, టి.ఆర్.ఎస్.ల కూటమి గెలిచింది. టి.ఆర్.ఎస్. కేంద్ర, రాష్ట్రాల్లో మంత్రి పదవులు పొంది, ప్రభుత్వాల్లో భాగస్వామి అయింది. ఆ తర్వాత అది తెలంగాణా నినాదాన్ని మరిచిపోయింది. అప్పుడప్పుడు నిద్రలో కలవరించినట్టుగా 'సోనియా తెలంగాణాను ఇస్తుంది' అని మాత్రం చెప్తూ వచ్చింది. 2006లో వచ్చిన పంచాయితీ ఎన్నికల్లో దెబ్బతినేప్పటికి దానికి కొంచెం కళ్లుతెరుచుకున్నట్టయింది. దానితో కెసిఆర్ సోనియా చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ వేడుకోళ్లు, అలకలూ, బెదిరింపులూ మొదలుపెట్టాడు. ఒకరోజు నిరాహార దీక్షవంటి హాస్యాస్పదమైన 'ఆందోళనా' రూపాలూ చేపట్టాడు. అయినప్పటికీ సోనియా పట్టించుకోకపోవడంతో కె.సి.ఆర్., నరేంద్రలు మంత్రి పదవులకు రాజీనామా చేశారు. తర్వాత రాష్ట్రంలోనూ టి.ఆర్.ఎస్. సభ్యులు మంత్రి పదవులను వదులుకున్నారు. ఆ తర్వాత మరో బెదిరింపుగా కె.సి.ఆర్. పార్లమెంట్ సభ్యత్వానికీ రాజీనామా చేశాడు. ఫలితంగా వుప ఎన్నిక జరిగింది. ఆ ఉప ఎన్నికను రిఫరెండంగా ప్రచారం చేశాడు. అందులో కె.సి.ఆర్. ఓడిపోతే తెలంగాణా ప్రజల ఆకాంక్షే ఓడిపోతుందని జరిగిన ప్రచారం ప్రజలపై పని చేసింది. ఫలితంగా కె.సి.ఆర్. రెండు లక్షలకు పైగా ఆధిక్యతతో గెలిచాడు, గానీ ప్రజల ఆకాంక్షలు మాత్రం గెలువలేదు. ఇక మరోసారి బెదిరింపుగా డెడ్‌లైన్ పెట్టి పార్లమెంట్ అసెంబ్లీ సభ్యత్వాలకు టి.ఆర్.ఎస్. రాజీనామా చేసింది. ఫలితంగా ప్రజల నెత్తిమీదికి మళ్లీ ఉప ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికలను రిఫరెండంగా టి.ఆర్.ఎస్. విపరీతంగా ప్రచారం చేసింది. రిఫరెండంగా ప్రచారం జరిగిన కరీంనగర్ ఎన్నికల్లో టి.ఆర్.ఎస్.ను గెలిపిస్తే ఒరిగిందేంటి? ఈ ఎన్నికల్లో మళ్లీ గెలిపిస్తే మాత్రం ఒరిగేదేంటనే సందేహం ప్రజలకు రావడం సమంజసం కాదా?

---

గౌరవిస్తూ టిబెట్ ప్రజల ఏకైక ప్రతినిధి అని పొగడ్తలు ఇస్తుంది. భారత్ పార్లమెంటరీ పార్టీలన్నీ, వామపక్షాలు తప్ప చైనా వైఖరిని ఖండించాయి. టిబెట్‌లోని అశాంతికి కారణం చైనాయేనని వీరి ఆరోపణ. మన దేశంలో వార్తా పత్రికలు చైనాకు వ్యతిరేకంగా ప్రచారం చేయటం మొదలుపెట్టాయి. మన దేశంలోని పెట్టుబడిదారీ శక్తులతో వ్యాపార ఒప్పందాలు కుదిరాయి కాబట్టి, మన దేశ ప్రభుత్వం ఇటువంటి వైఖరిని తీసుకోలేదు. పార్లమెంటరీ వామపక్షాలు టిబెట్ ప్రజల స్వయం ప్రతిపత్తిని వ్యతిరేకించాయి. నాగాలాండ్, కాశ్మీర్, మణిపూర్, అసోంల స్వతంత్ర్య పోరాటాలను వ్యతిరేకిస్తున్నట్లుగానే టిబెట్ ప్రజల పోరాటాన్ని వ్యతిరేకిస్తున్నాయి.

భారత ప్రజలు, చైనా పాలకవర్గాల క్రూర అణచివేతను వ్యతిరేకించాలి. భారత్, అమెరికాల జోక్యందారీ కుట్రలను వ్యతిరేకించాలి. టిబెట్ ప్రజల స్వయం ప్రతిపత్తిని, పోరాటాన్ని సమర్థించాలి. అమెరికా రాజకీయ - భౌగోళిక ఎత్తులకు భారత్ విడిది స్థలం కాకుండా చూడాలి. అమెరికా ఏజెంటైన దలైలామాకు ఇచ్చిన ప్రత్యేక సౌకర్యాలు రద్దు చేసి, మన దేశం నుండి తన్ని తరమాలి. ఏ జాతి ప్రజలైనా, టిబెట్ ప్రజలైనా వారి భవిష్యత్‌ను వారే నిర్ణయించుకునే హక్కు వారికున్నది. ★

ఈ కాలమంతా టి.ఆర్.ఎస్. ఎన్నడూ ఉద్యమాల జోలికి పోలేదు. అసలు దానికి పుట్టుకతోనే ఆ లక్షణం లేదు. అది కేవలం లాబీయింగ్‌ను మాత్రమే నమ్ముకుంది. కానీ ప్రజలల్లో లాబీయింగ్ మీద టి.ఆర్.ఎస్. రుద్దిన భ్రమలు పోయాయనడానికి ఈ వుప ఎన్నికలు ఒక తార్కాణం.

గత నాలుగేళ్ల దాని ఆచరణను చూసిన ప్రజలకు టి.ఆర్.ఎస్.పై భ్రమలు పోతున్నాయని చెప్పవచ్చు. ముఖ్యంగా తెలంగాణా వాదినని చెప్పుకునే టి.ఆర్.ఎస్.లో నిజమైన తెలంగాణా వాదం ప్రజలకు కనబడలేదు. ఎందుకంటే తెలంగాణా ప్రజలకు తీవ్రంగా అన్యాయం చేసే వలసవాదుల ప్రయోజనాలను నెరవేర్చే పోలవరం, పులిచింతల, పోతిరెడ్డిపాడు వంటి ప్రాజెక్టులను, సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనులనూ ప్రారంభించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పుడు, టి.ఆర్.ఎస్. అధికార పక్షంలో భాగస్వామిగా ఉంది. 610 జీవోను అమలు చేయాలని గానీ, బాబ్లీ ప్రాజెక్టును ఆపాలని గానీ ఎటువంటి ఉద్యమాలు చేయలేదు. తెలంగాణాలో వలసవాదులు ఆక్రమించుకున్న భూముల స్వాధీనం కోసంగానీ, వలసవాద పెట్టుబడిదారుల దోపిడీకి వ్యతిరేకంగా గానీ ఎటువంటి పోరాటాలు చేయలేదు. పేద రైతాంగపు పంట భూములను మింగుతున్న సెజ్‌లకు వ్యతిరేకంగానూ తెలంగాణాలో అమలవుతున్న ప్రపంచబ్యాంకు విధానాలకు వ్యతిరేకంగానూ ఎక్కడా చిన్న నిరసనను కూడా వ్యక్తం చేయలేదు. ఇలా వలసవాదంతో ఏమాత్రం తలపడకుండా వీరు తెలంగాణను సాధించగలరని ప్రజలు ఎలా నమ్ముతారు? ఒకవేళ సాధిస్తే కూడా వలసవాదంతో కుమ్మక్కు కాకుండా ఉండగలరని ఎలా నమ్ముతారు?

ప్రజల దైనందిన సమస్యల కోసం కూడా అది ఎన్నడూ వుద్యమాలను చేపట్టలేదు. ఈ నాలుగేళ్లలో ప్రజలు అధిక ధరలు, వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, కరెంటు, నీరు, ఆకలి, అనారోగ్యాలు వంటి ఎన్నో సమస్యలతో సతమతమయ్యారు. ఈ సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తే, రాజ్యహింస మరింత పెద్ద సమస్యగా మారి ప్రజలను పీడించింది. ఈ రాజ్యహింసకు వ్యతిరేకంగా కూడా ప్రజలకు మద్దతునివ్వలేదు. మరి టి.ఆర్.ఎస్. వెనుక ప్రజలు ఎందుకు నిలబడాలి?

గత ఎన్నికల్లో గెలిచిన టి.ఆర్.ఎస్. శాసన సభ్యులు తమ నియోజకవర్గాల్లో ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. ఈ నాలుగేళ్ల కాలంలో వీళ్లు తమ నియోజక వర్గ అభివృద్ధి గురించి పట్టించుకున్నది ఏం లేదు. నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించడానికి ఎటువంటి కృషి చేయలేదు. అయితే అవినీతిలో మాత్రం కాంగ్రెస్, తెలుగుదేశం నాయకులతో పోటీపడ్డారు. ఇటువంటి వారిని ప్రజలు మళ్లీ ఎలా గెలిపించాలనుకుంటారు?

ఆ మధ్య కాలంలో కెసిఆర్ నిజాంను పొగుడుతూ వ్యాఖ్యలు చేశాడు. నిజాం వంటి నిరంకుశుడినీ, కరడుగట్టిన భూస్వామ్య వ్యవస్థకు ప్రజలను బలిచేసిన వాడినీ, అభివృద్ధిని తొక్కిపెట్టిన వాడినీ, ప్రజల భాషా, సంస్కృతులపై ఆధిపత్యం వహించిన వాడినీ, రజాకార్ల వంటి సైన్యాన్ని సృష్టించి ప్రజలపై ఘోరమైన అకృత్యాలు చేయించినవాడినీ పొగడడాన్ని సాధారణ తెలంగాణా ప్రజలెవ్వరూ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించలేరు. కాబట్టి సహజంగా ప్రజలంతా వ్యతిరేకించారు. మేధావులూ, రచయితలూ, కళాకారులు తమ గళాల ద్వారా, కలాల ద్వారా శక్తివంతంగా తమ వాదనలు వినిపించారు. నిజాంను పొగిడిన కెసిఆర్ నేతృత్వంలోని టి.ఆర్.ఎస్. ఎటువంటి తెలంగాణాను సాధించాలనుకుంటున్నది? తెలంగాణాలో వీళ్లు అధికారంలోకి వస్తే ఎటువంటి పాలనను అందిస్తారు? ఈ ప్రశ్నలు ప్రజలకు రావడమనేది సహజం. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే చాలు, అధికారంలో నిజాం భక్తులు వున్నా, ఆ పాలన నిజాం పాలనను తలపించినా ఫర్వాలేదు అని ప్రజలు అనుకోవడం లేదు. తెలంగాణా ప్రజలు ఇన్నాళ్లు ఏ ప్రజాస్వామిక హక్కులకు దూరంగా వున్నారో ఆ ప్రజాస్వామిక హక్కులకు హామీనిచ్చే ప్రజాస్వామిక తెలంగాణాను కోరుకుంటున్నారు. టి.ఆర్.ఎస్. సాధించాలనుకుంటున్నది ఇటువంటి తెలంగాణను కాదని ఈ వ్యాఖ్యల ద్వారా ప్రజలు మరింత స్పష్టంగా అర్థం చేసుకున్నారు.

ఇక నిర్మాణపరమైన సమస్యలను కూడా టి.ఆర్.ఎస్. బాగా ఎదుర్కొంటోంది. అది గ్రామ స్థాయి నుంచి పైకి పటిష్టమైన నిర్మాణంగా లేదు. పార్టీలో అంతర్గత వైరుధ్యాలు బోలెడు వున్నాయి. కెసిఆర్ నియంతృత్వ వైఖరి మూలంగా పార్టీ శ్రేణుల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొని వుంది. ఈ మధ్య కాలంలో కెసిఆర్ కొడుకుకూ, సమీప బంధువులకూ పార్టీలో స్థానం పెరుగుతుండడం కూడా పార్టీ శ్రేణుల్లో అసంతృప్తికి దారితీస్తోంది. వారసత్వ రాజకీయాలను వ్యతిరేకించే ప్రజలకు కూడా ఇది నచ్చని విషయమే. ఈ అన్ని కారణాల రీత్యా టి.ఆర్.ఎస్. నిర్మాణపరంగా బలహీనంగా వుంది.

టి.ఆర్.ఎస్. రాజీనామా చేసి ఇప్పటికైనా ఉద్యమబాట పట్టి వుంటే ప్రజలు కొంచెమన్నా హర్షించేవారు. కానీ అది మళ్లీ ప్రజలను బ్యాలెట్ వైపుకే నెట్టింది. దానితో ప్రజలు విసిగిపోయారు. మాటి మాటికీ ఎన్నికలకు లాగే పార్టీలను ప్రజలు పెద్దగా

హర్షించరు. ఎందుకంటే ఎన్నికల భారమంతా ఆర్థికంగా ప్రజలపైనే పడుతుంది. అంతేకాదు ఆ సమయాల్లో జరిగే గొడవలూ, చెలరేగే హింస, మైకుల హోరుతో చేసే ప్రచారం సామాజికంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తాయి. అందుకని మాటి మాటికీ రాజీనామాలు చేసి ఎన్నికలకు లాగుతున్న టి.ఆర్.ఎస్. పట్ల ప్రజల్లో వ్యతిరేకత వచ్చి వుంటుంది. పైగా రాజీనామా చేసి తిరిగి ఎన్నికలకు వెళ్లడం ద్వారా అది ఏం నిరూపించదలిచింది? ప్రజల్లోని తెలంగాణా ఆకాంక్షనా? దాన్నిపుడు కొత్తగా నిరూపించాల్సింది ఏముంది? 1968-71 ఉద్యమంలోనూ, 1972లో 14 లోక్‌సభ స్థానాలకుగాను 11 స్థానాల్లో తెలంగాణ ప్రజాసమితిని గెలిపించి, ప్రజలు తమ బలమైన ఆకాంక్షను వెల్లడించారు. ఆ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లోనూ వెల్లడించారు. మళ్లీ మళ్లీ ప్రజల్లోని ఆకాంక్షకు పరీక్షలు పెడ్తూ టి.ఆర్.ఎస్. ప్రజల అసహనానికి గురయిందనుకోవచ్చు.

టి.ఆర్.ఎస్. ఓటమికి పైవన్నీ కారణాలు. టి.ఆర్.ఎస్.పై ప్రజలు భ్రమలు కోల్పోతున్నారనడానికి ఈ ఎన్నికల ఫలితాలు ప్రబల నిదర్శనం.

మరి కాంగ్రెస్, టి.డి.పి.లు మెరుగుదల సాధించడానికి కారణమేంటి? ఎన్నికల బహిష్కరణ అనేది ఒక బలమైన పోరాట రూపంగా ముందుకు రాలేని పరిస్థితిలో, విప్లవ రాజ్యాధికారాన్ని తక్షణ ప్రత్యామ్నాయంగా ఎంచుకోలేని పరిస్థితిలో ఒక బూర్జువా పార్టీపై వ్యతిరేకత మరొక బూర్జువా పార్టీపై అనుకూలంగా మారుతోంది. అంతేకాక ఈ ఎన్నికల పట్ల ప్రజలు పెద్ద ఆసక్తిని చూపలేదు. కనుక సాంప్రదాయక ఓటింగ్ సరళినే అనుసరించారు. కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత బాగానే వున్నప్పటికీ ఇదింకా పూర్తిగా బహిర్గతం కాకపోవడం కూడా దాని గెలుపుకు ఒక కారణమే.

టి.ఆర్.ఎస్. ఓటమికి ఇన్ని కారణాలుంటే ప్రజల్లో తెలంగాణా సెంటిమెంట్ లేదని కొందరు కొట్టిపడేస్తున్నారు. అసలు తెలంగాణా పోరాటాన్ని సెంట్‌మెంట్ స్థాయికి దిగజార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలి. తెలంగాణా అనేది ఒక సెంట్‌మెంట్ కాదు. దీన్ని టి.ఆర్.ఎస్ సెంటిమెంట్ స్థాయికి దిగజార్చింది. భౌగోళిక తెలంగాణాకే కట్టుబడి వున్న పార్టీలు దీన్ని సెంట్‌మెంట్‌గానే చూడ్డంలో ఆశ్చర్యంలేదు. అది తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక హక్కు; సాధికార పోరాటం; స్వాభిమాన ప్రకటన. తమ వనరులన్నింటినీ దోచుకుంటూ తమను ఆకలి చావులవైపుకు నెడుతున్న వలసవాదులను తన్ని తరిమేయాలని కోరుకోవడం సెంటిమెంట్ కాదు, తమ వనరులపై తమకున్న హక్కును రక్షించుకోవాలనే చైతన్యమది.

ఎన్నికల ద్వారా, ఎన్నికల పార్టీల ద్వారా 'తెలంగాణ' రాదు. సమరశీల పోరాటాలే దానికి మార్గం. ★

పొరబడిన కామ్రేడ్స్‌కు సంబంధించి, వారు తమ తప్పులను సరిదిద్దుకోబోతున్నారా లేదా అని వారిని మనం తప్పనిసరిగా పరిశీలించి చూడాలని కొందరంటారు. వారిని వూరికే పరిశీలిస్తే చాలదనీ, తప్పులను సరిదిద్దుకోవడంలో మనం తప్పకుండా వారికి సహాయపడాలని నేనంటాను. అంటే, మొదట మనం తప్పకుండా పరిశీలించాలి. రెండవది మనం తప్పకుండా సహాయపడాలి. ప్రతి వొక్కరికి సహాయం అవసరమవుతుంది; తప్పు చేయని వారికి అది అవసరం. తప్పు చేసిన వారికి అది మరింతగా అవసరమవుతుంది. బహుశా, తప్పులు చేయని వాళ్లు ఏ వొక్కరూ వుండరు. కేవలం, కొందరు తక్కువ తప్పులు చేస్తారు. మరి కొందరు ఎక్కువ తప్పులు చేస్తారు. అంతే; ఒకసారి తప్పు చేయగానే వారికి సహాయం అవసరమవుతుంది. వూరికే పరిశీలించడం అంటే, అది క్రియా శూన్యత్వం. తప్పులు చేసినవారు తమ పద్ధతులను చక్కదిద్దుకోవడంలో సహాయపడడానికి గాను తప్పనిసరిగా పరిస్థితులు కల్పించబడాలి. తప్పుకు, ఒప్పుకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం తప్పక పాటించబడాలి; ఎందుకంటే, పార్టీలోని సూత్రపరమైన అంతరంగిక వివాదాలు, పార్టీ లోపల, సమాజంలోని వర్గపోరాటపు ఒక ప్రతిబింబమే. ఏ సందిగ్ధత సహించబడరాదు. పొరబడిన కామ్రేడ్స్‌కు, ఆ సందర్భపు గుణదోషాలకు అనుగుణంగా సముచితమైన, పకడ్బందీ అయిన విమర్శను అందించడం వారికి వ్యతిరేకంగా అవసరమైన పోరాటాన్ని నిర్వహించడం కూడా సహజమైనదే. ఇది వారి తప్పులను సరిదిద్దుకోవడంలో వారికి సహాయపడడానికే; వారికి సహాయాన్ని నిరాకరించడమూ అంతకంటే ఘోరంగా వారి తప్పులను చూసి సంతోషించడమూ, ఒంటెత్తు పోకడ అవుతుంది.

- మావో

సిద్ధాంత వ్యాసం

# ప్రజలకు సేవ చేయండి

సెప్టెంబర్ 8, 1944

- మావో

మన కమ్యూనిస్టు పార్టీ, పార్టీ నడుపుతున్న ఎనిమిదవ మార్గసైన్యం, కొత్త నాల్గవ సైన్యాలు విప్లవం యొక్క దళాలు. మన ఈ దళాలు ప్రజల్ని విముక్తం చేయడానికి పూర్తిగా అంకితమయ్యాయి. అవి ప్రజల శ్రేయస్సు కోసమే పూర్తిగా పని చేస్తాయి. కామ్రేడ్ చాంగ్ జూ-తె[1] ఈ దళ శ్రేణుల్లో ఒకరు.

ప్రతి వ్యక్తీ ఎప్పుడో ఒకనాడు మరణించక తప్పదు కానీ ఒకరి చావుకూ మరొకరి చావుకూ తేడా వుంటుంది. దాని ప్రాముఖ్యత కూడా వేరు విధంగానే వుంటుంది. పురాతన చైనా గ్రంథకర్త జూమాచిన్ ఇలా అన్నాడు, "చావు అందరికీ సమానమే. కానీ కొందరి మృత్యువు థాయి కొండకంటే బరువుగాను, మరి కొందరి మృత్యువు ఈకకంటే తేలికగానూ వుంటుంది."[2] ప్రజల కొరకు మరణించడం థాయి కొండకంటే బరువైంది; కానీ ఫాసిస్టుల కోసం పని చేయడం, దోపిడీగాళ్లు, ప్రజలనణిచే వారి తరపున చావడం ఈక కంటే తేలికైనది. కామ్రేడ్ చాంగ్ జూ-తె ప్రజల కోసం మరణించారు. అందుకు ఆయన మరణం థాయికొండ కన్నా బరువైనదే.

మనం ప్రజలకి సేవ చేస్తున్నాం కాబట్టి, మన లోపాలను ఎత్తి చూపినా, విమర్శించిన మనం భయపడం. మన లోపాలను ఎవరైనా ఎత్తి చూపవచ్చు. అది సరైన విమర్శ అయితే మనం తప్పుల్ని దిద్దుకుంటాం. అతను ప్రతిపాదించింది ప్రజలకు మేలు చేస్తే, మనం అందుకు అనుగుణంగా చర్య తీసుకుంటాం. "సమర్థవంతమైన సైనిక దళాలు, సామాన్య పరిపాలన," అన్న భావాన్ని కమ్యూనిస్టు కాని లీ తింగ్-మింగ్[3] ప్రతిపాదించారు. ఆయన ప్రజలకు మేలు చేసే మంచి సలహానిచ్చారు. దాన్ని అనుసరించాం. ప్రజల శ్రేయస్సును దృష్టిలో వుంచుకుని, మనం సరైన దాన్ని ఆచరిస్తూ, తప్పుల్ని సరిదిద్దుకుంటే మన శ్రేణులు తప్పకుండా నిలదొక్కుకుంటాయి.

మనం సమిష్టి విప్లవ లక్ష్యం కోసం దేశం నలుమూలల నుండీ వచ్చి కలిసాం. ఈ లక్ష్యాన్ని సాధించే మార్గంలో మనకు అశేష ప్రజానీకం యొక్క సహకారం అవసరం. ఈనాడు మనం 91 మిలియన్ల[4] జనాభా గల స్థావర ప్రాంతాలకు నాయకత్వం వహిస్తున్నాం. కానీ ఇది సరిపోదు, దేశం మొత్తాన్ని విముక్తం చేయాలంటే మరెన్నో అవసరం. కష్ట సమయాల్లో మనం మన విజయాలను మర్చిపోకూడదు. మనం ఉజ్వల భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకొని, ధైర్యాన్ని పుంజుకోవాలి. చైనా ప్రజలు కష్టాలు పడుతున్నారు. వారిని మనం రక్షించాలి. పోరాటంలోకి దూకాలి. పోరాటం అన్న తర్వాత త్యాగం వుంటుంది. మరణం సర్వసాధారణ ఘటన. కానీ మనం ప్రజల ప్రయోజనాల కోసం పోరాడుతున్నాం. మెజారిటీ ప్రజల బాధల నివృత్తికి పోరాడుతున్నాం. అలాంటప్పుడు ప్రజల కొరకు మరణించడం అభినందించవలసిన విషయం. అయినా వీలైనమేరకు అనవసరమైన త్యాగాలు చేయకుండా జాగ్రత్తపడాలి. మన క్యాడరు ప్రతి సైనికుడికి సహాయపడాలి. విప్లవ శ్రేణుల్లోని ప్రతివారు పరస్పరం సహకరించుకోవాలి, ప్రేమించుకోవాలి.

ఇప్పటి నుండీ మన శ్రేణుల్లోని వారెవరైనా సరే, అతను సైనికుడే కానివ్వండి, వంటవాడే కానివ్వండి, అతను మంచి పనిచేసి మరణిస్తే, మనం అతని అంతిమయాత్రను, అతని గౌరవార్థం సంస్మరణ సభను నిర్వహించాలి. ఇది ఒక నియమం కావాలి. దీన్ని ప్రజల్లో కూడా ప్రవేశపెట్టాలి. పల్లెలో ఎవరైనా మరణిస్తే స్మారక సభను నిర్వహించండి. అలా మనం మరణించిన వారిపట్ల మన బాధని వ్యక్తం చేసి, ప్రజలందరినీ ఐక్యం చేయగల్గుతాం.

**వివరణలు**

1. కామ్రేడ్ చాంగ్ జూ-తె చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ గార్డ్స్ రెజిమెంట్ సైనికుడు. కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా అతను ప్రజల ప్రయోజనాల కోసం విశ్వాసపాత్రంగా సేవ చేశాడు. అతను 1933లో విప్లవంలో చేరి, లాంగ్‌మార్చ్‌లో పాల్గొని, సర్వీసులో వుండగానే గాయపడ్డాడు. 1944 సెప్టెంబరు

(తరువాయి 13 వ పేజీలో...)